# అడిగి తెలుసుకోండి

## డా॥ త్రిపురనేని హనుమాన్ చౌదరి

**CTMS వారి ప్రచురణ**

**డిసెంబర్, 2008**

అడిగి తెలుసుకోండి

డా॥ త్రిపురనేని హనుమాన్ చౌదరి

మొదటి ముద్రణ : డిసెంబర్, 2008

సర్వహక్కులు రచయితవి

వెల : రూ॥ 60/-
$ 5

ప్రచురణ కర్త : డా॥ త్రిపురనేని హనుమాన్ చౌదరి
సెంటర్ ఫర్ టెలికాం మేనేజ్‌మెంట్ & స్టడీస్,
ఫ్లాట్.నెం. 8, పి అండ్ టి కాలనీ,
కార్ఖానా (సికింద్రాబాద్),
హైదరాబాద్ - 500 009.
ఫోన్ : +91 (40) 6667 1191
ఫ్యాక్స్ : +91 (40) 6667 1111
email : thc@satyam.com

ముద్రణ : బాబు ప్రింటర్స్, హైదరాబాద్.
ఫోన్ : +91 98 667 74499

# సాధువాదం

అర్ధశతాబ్ధికిపైగా విద్యార్థి లోకానికి సేవచేస్తున్న **“తెలుగు విద్యార్థి”** పత్రికలో నాటికీ నేటికీ వెలుగుతగ్గక, విలువ క్షీణించక, ఆకర్షణ కోల్పోలేదని భావిస్తున్న శీర్షిక “ప్రశ్నలు–సమాధానాలు”. ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్య గారు సమాధానాలు వ్రాసిన కాలం నుంచి ఈ శీర్షికను మెచ్చి, అభిమానించిన వేలాది మందిలో నేనూ ఒకడిని. వెంకట రంగయ్యగారి తరువాత తిరిగి అంత సమర్ధవంతంగా ఈ శీర్షికను నిర్వహించినవారు న్యాయమూర్తి ఆవుల సాంబశివరావుగారు. వెంకట రంగయ్యగారు గొప్ప చరిత్ర పరిశోధకుల. ఐనా, సమకాలీన లౌకిక విషయాల మీద సాధికారంగా సమాధానాలు ఇస్తుండేవారు. సాంబశివరావుగారు న్యాయ శాస్త్రకోవిదులు. రాష్ట్రంలో అత్యున్నత న్యాయ పీఠాధ్యక్షస్థానాన్ని అలంకరించినవారు. ఆయన కూడా ప్రాపంచికమైన బహు విధ ప్రశ్నలకు ప్రామాణికత కలిగిన సమాధానాలు ఇస్తుండేవారు. సాంబశివరావుగారి తరువాత మళ్ళీ అంతటివారు “తెలుగు విద్యార్థి”కి ఎవరు లభిస్తారని నాలాంటి వాళ్ళు అనుకొంటున్న సమయంలో, డాక్టర్ త్రిపురనేని హనుమార్ చౌదరిగారు ఆ బాధ్యతను స్వీకరించి శీర్షికకు వన్నె తగ్గకుండా నిర్వహిస్తున్నారు. అదే “తెలుగు విద్యార్థి” అదృష్టం. ఇంతకు పూర్వం శీర్షికను విస్తరించిన ఇద్దరికంటె భిన్నంగా చౌదరిగారు విజ్ఞానశాస్త్రవేత్త. సమాచార ప్రసార రంగంలో జాతీయ స్థాయిలో ఉన్నత పదవులను నిర్వహించి గొప్ప కీర్తి గడించినవారు. ఐతే, ఆయన వైజ్ఞానిక రంగాన్ని గురించి మాత్రమే తెలిసినవారు కావచ్చునని ఎవరైనా అనుకొంటే అది సరికాదని ‘‘ప్రశ్నలు–సమాధానాలు’’ శీర్షిక నిరూపిస్తున్నది. బహుముఖమైన ఆయన జ్ఞాన సంపదకు ఈ శీర్షికను ఆయన సమర్ధవంతంగా నిర్వహిస్తుండడమే ప్రశంసాపత్రం.

పత్రికా సంపాదకుడికి కేవలం రచనా సామర్థ్యం ఉంటే చాలదు, ఎవరు ఏ విషయం మీద ఎలా వ్రాయగలరని అంచనా వేయగల నైపుణ్యం తప్పనిసరి. “తెలుగు విద్యార్థి” సంపాదకులు మాన్యశ్రీ కొల్లూరి కోటేశ్వరరావు గారికి రచనా సామర్థ్యంతోపాటు ఇతరుల రచనా సామర్థ్యాన్ని గుర్తించి, ఉపయోగించుకొనగల ప్రతిభ, నేర్పు పుష్కలంగా ఉన్నాయి. ఎక్కడైనా ఒక మంచి రచనను గమనిస్తే వెంటనే స్పందించే హృదయం ఉంది “మా పత్రికలో వ్రాయండి” అని ఆహ్వానించే మంచి మనస్సు ఉంది. అర్థ శతాబ్ధికి పైగా **“తెలుగు విద్యార్థి”** విజయవంతంగా నడవడము ఆంధ్రప్రజలు ఆయనకు ఇచ్చిన “అవార్డు”. **“ప్రశ్నలు–సమాధానాలు”** శీర్షికను మరెవరికైనా అప్పగించి ఉంటే ఇంత మంచి పేరు ఈ శీర్షికకు వచ్చి ఉండేదా అనిపిస్తుంది. సమాధానాలను ప్రతిభావంతంగా వ్రాసేవారిని ఎంపిక చేసిన కీర్తి కోటేశ్వరరావుగారిది ఒక్కరిదే.

వివిధ రంగాలలో అపారమైన అనుభవం గడించిన ప్రతిభా మూర్తుల భావ సంపద జన బాహుళ్యానికి ముఖ్యంగా కొత్త తరాలకు అందటానికి పత్రికలు మంచి మాధ్యమాలు. ప్రత్యేకించి, “ప్రశ్నలు–సమాధానాలు” శీర్షిక ఇందుకు ఉపయోగపడే గొప్ప వేదిక. ఈ శీర్షికన ఇంతవరకు వచ్చిన ప్రశ్నా వైవిధ్యం ఆశ్చర్యాన్నీ, ఆనందాన్ని కలిగిస్తున్నాయి. ప్రశ్నలను బట్టే సమాధానాలు!

**డాక్టర్ హనుమాన్ చౌదరి గారు** జ్ఞాన ధనులేకాదు, భారతీయ ఆధ్యాత్మిక, సాహిత్య, సాంస్కృతిక వారసత్వాలను గురించి సమగ్రమైన అవగాహన కలిగినవారు కూడా. అంతర్జాతీయ స్థాయిలో వైజ్ఞానికరంగం పరిణామాలను గురించి ఎంత సాధికారంగా రాయగలరో, వేల సంవత్సరాలుగా భారతీయుల నైతిక జీవితాన్ని తీర్చిదిద్దుతూ వచ్చిన జ్ఞాన సంపదను గురించి సైతం అంతే ప్రామాణికంగా వ్రాయగలరు, మాట్లాడగలరు. నిజాయితీ, ఉత్తమ సంస్కారం, నిష్కల్మష చరిత్ర కలిగిన హనుమాన్ చౌదరిగారు విశ్రాంతి తీసుకోవలసిన వయస్సులో ఉన్నప్పటికీ ప్రజా బాహుళ్యానికి సేవ చేయాలనే తపనతో దేశభక్తి పూరితమైన అనేక కార్యక్రమాలకు చేయూతను ఇస్తున్నారు. ఆంధ్ర, ఆంగ్ల భాషలలో ఆయన రచనలు అనేకం ఇప్పటికే వెలువడ్డాయి. తన జ్ఞానానీ, అనుభవాన్నీ విద్యార్థిలోకానికి అందించాలనే ఏకైక లక్ష్యంతోనే చౌదరిగారు **“తెలుగు విద్యార్థి”** లో ఈ శీర్షికను నిర్వహిస్తున్నారనడం సుస్పష్టం. ఆయన ఈ శీర్షికలో అలరిస్తున్న సమాచారం ఎంత విలువైనదో, సందర్భవశాత్తు ఆయన వెలువరించే అభిప్రాయాలు సైతం అంతే విలువైనవి. కనుక **“ప్రశ్నలు–సమాధానాలు”** పుస్తకంగా వెలువడటం స్వాగతించవలసిన విషయం. ఎప్పుడైనా ఎవరైనా చదివి జ్ఞానం పొందడానికి తగిన సమాచారం, భావజాలం సాధువాదం ఈ పుస్తకంలో ఉన్నాయి. చెప్పదలచుకొన్న విషయాన్ని సూటిగా, సులభశైలిలో చెప్పడం, అనదలచుకొన్న మాటను నిర్మొహమాటంగా అనడం చౌదరిగారి సమాధానాలలో కనిపిస్తుంది.

“క్రెడిట్ కార్డును కనుగొన్నదెవరు? “మే డే” ఎప్పుడు ఎలా మొదలైనది? పత్రికలో తరచు తటస్థపడే “ఎస్మా” “పొలిట్‌బ్యూరో” “ఫ్యాబ్‌సిటీ”, “బి.ఫారం” అనే పదాలకు అర్థం ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానాలు విషయ పరిజ్ఞానాన్ని పెంచుతాయి. ఇలాంటివి అనేకం ఈ పుస్తకంలో కనిపిస్తాయి. విద్యా విషయాలు ఎన్నయనా ఉన్నాయి. కోచింగ్ సెంటర్లను గురించి ప్రస్తావించి అవి పెట్టినవాళ్ళు విద్యావేత్తలు కాదనీ, వాళ్ళు చేస్తున్నది విద్యా వ్యాపారమేనని చెప్పారు ఒక ప్రశ్నకు సమాధానంగా. మరో చోట “ప్రగల్భానికే, వాచాలత్వానికే మన దేశంలో సంపూర్ణ స్వాతంత్ర్యం ఉంది” అన్నారు. “మన దేశంలో చచ్చిపోయేదాకా పదవిలో ఉండాలనే కాంక్ష పెరిగిపోతూ ఉంది” అని ఒకచోట వృద్ధనాయకుల మీద ఒక విసురు ఉంది. “మేనిఫెస్టోలో ప్రకటించి, అధికారంలోకి వచ్చిన తరువాత అమలుచేయకపోవడం చెల్లని చెక్కులు ఇవ్వడం లాంటి నేరం” అని ఆయన చేసిన వ్యాఖ్య ఆలోచింపచేస్తుంది. ఇలా చెప్పాలంటే ప్రతి పేజీలోనూ విశేషాలు కనిపిస్తాయి.

“తెలుగు విద్యార్థి”లో డాక్టర్ త్రిపురనేని హనుమాన్ చౌదరి గారు నిర్వహిస్తున్న “ప్రశ్నలు–సమాధానాలు” పుస్తకంగా రావడం అభినందనీయం.

**– పొత్తూరి వెంకటేశ్వర రావు**

30–11–2008

# ముందుమాట

**భా**రతదేశంలో, భారతీయ భాషల్లో చదువుకునే వారిని విద్యార్థి అంటాము. అనగా విద్యను, జ్ఞానాన్ని కాంక్షించి, కృషి చేసేవాడని అర్థం. ఇంగ్లీషులో "స్టూడెంట్" అంటాం. అంటే పరీక్షల కోసం, పట్టంకోసం పాఠ్య పుస్తకాలు చదివే వాడని; పంతులుగారు చదవమన్నది చదివేవాడని. విద్యార్థికీ, స్టూడెంట్‌కూ అంత తేడా ఉంటుంది. తెలుసుకోవాలనే కోరికతో తెలిసిన వారినాశ్రయించి పరిప్రశ్నల ద్వారా, అభ్యాసం ద్వారా, పఠనం ద్వారా, అనుభవం ద్వారా, సత్సాంగత్యం ద్వారా, జీవితాంతం పరిపరి విషయాలను గురించి తెలుసుకోవాలనే కుతూహలం, శ్రమ విద్యార్థి లక్షణం. బాల్యంలో అమ్మవడిలో, కిశోరావస్థలో బడిలో, జీవితాంతం గుడిలో జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని, నీతి నియమాలను నేర్చుకుంటాం. ఒడి, బడి, గుడులకు తోడుగా గ్రంథాలయాలు, పత్రికలు సక్రమంగా సమాజ ప్రయోజనం కోసం నడుపబడుతున్న రేడియో, దూరదర్శన్‌ల ద్వారా కూడా ఈ కాలంలో మనం జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని నేర్చుకోవచ్చు. అన్ని మాధ్యమాలూ, పద్ధతులకన్నా తెలిసిన వారితో ముఖాముఖిన ప్రశ్నోత్తరాల ద్వారా సమగ్రంగా విషయ జ్ఞానాన్ని పొందవచ్చు. అలా వీలు కానప్పుడు, పత్రికా ప్రచురణ కర్తలకు ప్రశ్నలు పంపి వివిధ విషయ జ్ఞానమున్న వారిద్వారా, జవాబులు పొంది, వాటిని గురించి ఆలోచించి, తమ జ్ఞాన సంపదను పెంచుకోవచ్చు.

తెలుగునాట విద్యార్థులకు వరంగా, అపర ఉపాధ్యాయునిగా, **'తెలుగు విద్యార్థి'** మాస పత్రికను స్థాపించి (1953) విద్వన్మణి, ఆదర్శ గురువు, సమాజ హితైషి, విద్య ప్రమాణాల, ప్రసారాల కోసం అరవై సంవత్సరాలుగా కృషి చేస్తున్నారు, శ్రీ కొల్లూరి కోటేశ్వరరావు గారు. కొంతకాలం నుంచి వారి సుపుత్రుడు శ్రీ కొల్లూరు రమణ వారికి తోడయి, పత్రికను విద్యార్థి, ఉపాధ్యాయలోకానికి, అధికారిక ఉపయోగకారిగా తీర్చిదిద్దుచున్నారు. ఈ 'తెలుగు విద్యార్థి' లోని ఒక ప్రత్యేకాంశం **ప్రశ్నలు-జవాబులు.**

కీర్తిశేషులు, ప్రజ్ఞాశాలి ఆచార్య మామిడిపూడి వెంకట రంగయ్య, న్యాయమూర్తులు ఆవుల సాంబశివరావు వంటివారు ఈ శీర్షికకు వన్నె, వాసి తెచ్చారు. సాంబశివరావు గారు దివంగతులయిన తరువాత విద్యార్థి లోకానికి ఈ శీర్షిక ద్వారా సంభోదించే అవకాశాన్ని కోటీశ్వరరావుగారు సహృదయంతో 2003 సంవత్సరం నవంబర్ నుంచి నాకిచ్చారు. ప్రశ్నల వివిధత విశాలమయినది. చదువరుల జిజ్ఞాస, ఆతురత, ప్రగాఢత ప్రశ్నల ద్వారా ప్రతిబింబిస్తున్నాయి. కొన్ని సమయాల్లో నేను ప్రామాణిక గ్రంథాలను చదివి, జవాబివ్వవలసి వచ్చింది. అందుకు సంతోషించాను.

మూడు సంవత్సరాల పైచిలుకు ప్రశ్నోత్తరాలను సంకలనం చేసి, పుస్తక రూపంలో ముద్రిస్తే, అవి గ్రంథాలయాల్లో, పాఠశాలల్లో, విద్యార్థుల, ఉపాధ్యాయుల వద్ద పుస్తకంగా వుంటే, ఎక్కువ ఉపయోగకారిగా యుంటాయని, ఈ ప్రచురణను అందిస్తున్నాం.

మిత్రులు, ప్రఖ్యాత పాత్రికేయులు, శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు గారు, 'సాధువాదం' అనే పరిచయ వాక్యాలు వ్రాసినందుకు, ఎంతయూ కృతజ్ఞుడను. తెలుగు వారిని, తమ సంపాదకీయాల ద్వారా, వ్యాసాల ద్వారా, ప్రసంగాల ద్వారా శ్రీ వెంకటేశ్వరరావు గారు ఎంతగానో ప్రభావితం చేశారు. వారి సాంగత్యం, సహృదయత, తులనాత్మక అభిప్రాయాలు నాకెంతో స్ఫూర్తిదాయకాలు. వారికి నా ధన్యవాదాలు.

ప్రశ్నోత్తరాల వ్యాసంగంలో, ఈ సంకలన ప్రచురణలో శ్రీమతి పైళ్ళ పారిజాతగారి పాత్ర ఎంతో వుంది. ఎన్నోసార్లు, ఎన్నో విషయాలను గురించి, రీసెర్చి, రిఫరెన్సింగ్ చేయవలసి వచ్చేది. ఆ కృషి అంతా పారిజాత గారిదే.

'తెలుగు విద్యార్థి' సంపాదకులు శ్రీ కోటీశ్వరరావు గారి, ప్రచురణ భారం వహిస్తున్న వారి సుపుత్రుడు రమణగారి ప్రోత్సాహం లేకపోతే ఈ ప్రచురణ సాధ్యమయ్యేది కాదు. ఈ పుస్తకాన్ని, నా మరికొన్ని పుస్తకాలనూ, పత్రికలనూ ముద్రిస్తున్న శ్రీ అట్లూరి హర్షవర్ధన్, వారి సతీమణి శ్రీమతి కృష్ణకుమారి గారికి కూడా ధన్యవాదాలు.

విద్యార్థులకూ, ఉపాధ్యాయులకూ, జిజ్ఞాసులకు తేలికగా అందుబాటులో ఉండటానికి ఈ పుస్తకం యొక్క వెల ప్రతి ప్రతికయిన ఖర్చు కన్నా తక్కువగా మాత్రమే ఉంచాము. విద్యకు, జ్ఞానానికి వెలగట్టడం, లాభదాయకంగా చేయడం మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు కావు గదా!

భాగ్యనగరం
(హైదరాబాద్)

**డా॥ త్రిపురనేని హనుమాన్ చౌదరి**
22, నవంబర్ 2008

# అడిగి తెలుసుకోండి

## నవంబరు 2003

**1. విద్యావ్యవస్థలో సమూల మార్పులు రావలసిన అవసరం ఉందా?**

కె.ప్రియ, విశాఖపట్నం

జ. మార్పులు రావలసిన అవసరం ఎంతైనా ఉంది. ఆత్మస్థైర్యము, స్వదేశీ సంస్కృతి పట్ల విశ్వాసము, గౌరవం, గర్వము మన సాహిత్యంలో అభిరుచి తీసుకువచ్చేటటువంటి విద్య మనక్కావాలి. కేవలం విషయంలో విశేషజ్ఞత వున్నంత మాత్రాన సరిపోదు. చదువుకున్న దాని ఆధారంగా స్వంతంగా ఆలోచించే శక్తిని, సరాసద్వివేకత, సృజనాత్మకత, సమస్యను విశ్లేషించి, పరిష్కార మార్గాన్ని సూచించగలిగేటటువంటి గుణాలు మన విద్యలో వుండాలి. ప్రస్తుత పరీక్షలు పాసయ్యేంత మాత్రానికే చదువులు పరిమితమవుతున్నాయి. స్వయం నిర్భరత, స్వయం ఉపాధి కల్పన, సహచరులతోకూడి సాధించేశక్తి, ఇవన్నీ ప్రసాదించేదిగా విద్య ఉండాలి. ఈ దిశలో గురువులు యొక్క భాధ్యత కూడా ఎంతో ఉంది.

**2. భారతీయ విద్యా విధానానికి, విదేశీ విద్యా విధానానికి ఉన్న తేడా ఏమిటి?**

జ. ఒకప్పుడు భారతీయ విద్యా విధానం అత్యుత్తమమైనది. 11వ శతాబ్ధము నుంచి, విశేషించి మనకు స్వాతంత్ర్యము వచ్చేవరకు భారతదేశం ఇతరదేశాల నుంచి వచ్చిన దురాక్రమణదారులతో యుద్ధం చేస్తూ, పరపాలనకు లోబడటం మూలాన మన విద్యా విధానంలో ఎన్నో లోపాలు వచ్చాయి. విశేషంగా శాస్త్ర, సాంకేతికత యొక్క ప్రాముఖ్యత మనలో తగ్గుతూ వచ్చాయి. 18వ శతాబ్ధం మధ్యనుంచి పాశ్చాత్య దేశాల్లో శాస్త్రీయ సాంకేతికత విప్లవం రావడానికి కారణం సైన్స్ అధ్యయన వ్యాప్తి. అందువలన ఎన్నో పరికరాలను కనిపెట్టడం జరిగింది. క్లుప్తంగా చెప్పాలంటే సైన్స్ & టెక్నాలజీలో విదేశీ విద్యా విధానం ప్రాధాన్యత



సంతరించుకొంది. మన విద్యా విధానంలో పరీక్షల్లో ఉత్తీర్ణతకు మాత్రమే ప్రాధాన్యత నిచ్చాము. ఇందులో మార్పుతేవలసిన అవసరం ఉంది.

**3. రాష్ట్ర ముఖ్యమంత్రికి భద్రత కల్పించలేని వారు సామాన్య మానవునికి ఏమి రక్షణ కల్పించగలరు?**

ఎమ్. రామకృష్ణ, గన్నవరం

జ. ఉగ్రవాదులు ఎప్పుడు, ఎవరిని, ఏ విధంగా చంపాలనుకుంటారో వారికి స్వేచ్ఛ ఉంది. అటువంటి వారి నుంచి రక్షణ కల్పించడంలో ఎప్పుడూ ఏ ప్రభుత్వానికీ ఏ దేశానికి సంపూర్ణ సాఫల్యత లభించలేదు. అమెరికాలో President Linclon, Kennedy లు చంపబడ్డారు. ఇంగ్లాండ్‌లో Mount Batten చంపబడ్డాడు. ప్రెసిడెంట్ సాదత్, ఈజిప్ట్, President, SDRD Bandaru Naike of Srilanka Mujibir Rahman, BD Mynman's Aungsan Israel's Itzhak Robin..... Austria, Hungary లో యువరాజు చంపబడ్డారు. మన దేశంలో గాంధీజీ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలు చంపబడ్డారు. వీరందరికీ అనన్యసామాన్యమైన రక్షణ ఏర్పాట్లు ఉండేవి. సాధ్యమైనంత అధునాతనమైన సాంకేతిక పరికరాలతో ముందు జాగ్రత్త తీసుకోబడింది. అయినప్పటికీ కూడా ఉగ్రవాదులనుండి (100%) నూటికి భద్రత అసంభవము. అయినప్పటికీ మనం నిరాశపడగూడదు. ప్రతి మనిషికి ప్రభుత్వం ప్రతిక్షణం భద్రత కల్పించలేదు.

**4. లోక్ సత్తావారు "మళ్ళీ స్వరాజ్యం" కోసం కోటిమంది నుంచి సంతకాలు తీసుకున్నారు కదా! అంటే మనం స్వరాజ్యం కోసం మరలా ఉద్యమించాలా?**

జ. మనకి బ్రిటీష్ వారి నుంచి స్వరాజ్యం వచ్చింది. కాని మనం సురాజ్యాన్ని నిర్మాణం చేయలేకపోతున్నాము. దీనికి నాయకుల్లో నైతికత క్రమేణా క్షీణించటం, స్వార్ధం ఎక్కువవటం ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించుకుని అందినంత దండుకోవడం. పార్టీ వివక్షత లేకుండా అందరిలో సామాన్యమైపోతూ వస్తుంది. దోపిడీని ఇతరులు కాక స్వదేశీయులు చేయటం స్వరాజ్యం యొక్క లక్ష్యం కాదు. ఈ అన్యాయం అక్రమార్జన లేని ప్రభుత్వాన్ని స్థాపించడానికి లోక్‌సత్తావారు చేపట్టిన స్వరాజ్య సురాజ్య ఉద్యమం ఎంతో అభినందనీయమైనది.

"మా కొద్దీ తెల్లదొరతనం" అని మన ప్రజలు బ్రిటీష్ వారి మీద ఎదురు తిరిగారు. అదే విధంగా "మాకొద్దీ నల్లదొరతనం" అని మనం ఉద్యమించాల్సిందే.

ఎల్లకాలం 'ఏ నాయకుడో వచ్చి ఉద్యమిస్తే' కాని బాగుపడదు అనుకోవడం కన్నా ప్రతి పౌరుడు ధైర్యంతో అన్యాయాన్ని ఎదుర్కొంటూ, తాను న్యాయంగా ప్రవర్తిస్తే నీతికి, ధర్మానికి, నిజాయితీకి, కట్టుబడి ఉంటే మనం స్వరాజ్యంలో, సురాజ్యం స్థాపించుకొన్న వాళ్ళమవుతాం.

**5. రామజన్మభూమి వివాదానికి పరిష్కార మార్గం లేదా?**

**పి. నర్సింహారావు, కనిగరి.**

జ. వుంది. అదే స్థానంలో మర్యాద పురుషోత్తముడు శ్రీరామచంద్రులకు ఆలయం కట్టవలసిందే. మందిరాల్నీ, చర్చిలను పడగొట్టి అదే స్థలాల్లో మసీదులు కట్టడం ఒక చారిత్రక సత్యం. ఉదా॥ స్పెయిన్‌లో వందలాది చర్చిలను కూలగొట్టి అదే స్థానంలో ఇస్లామీయుల మసీదులు కట్టారు. ఇస్లామీయులను ఓడించి క్రిస్టియన్లు స్వరాజ్యం స్థాపించినపుడు మసీదులను కూలగొట్టి తిరిగి చర్చిలను కట్టారు. స్వతంత్ర్యం తెచ్చుకున్న జాతీయతా భావం ఉన్న ప్రతిదేశం కూడా, ఆ దేశాన్ని, ఆ ప్రజలను అవమానించే కట్టడాలను, పేర్లను సరిచేస్తూ వచ్చాయి. అపచారం, అన్యాయం, దౌర్జన్యం, దురాక్రమణ చేసిన వాళ్ళు తమ పూర్వుల యొక్క నేరాన్ని ఒప్పుకోకపోతే చట్టాన్ని తీసుకువచ్చి అయినా రామ మందిరాన్ని రామ జన్మభూమిలో పునర్నిర్మించటమే సరియైన పరిష్కారం. రాముని యొక్క విగ్రహము వుంది. ఆ రామునికి పూజ జన్మస్థానంలో జరుగుతూనే వుంది. 1992 నుంచి కాదు, 1949 నుంచే, పోతే దివ్యమైన మందిర నిర్మాణమే జాగు అవుతుంది.

**6. లోకాయుక్త పరిధిలోకి ముఖ్యమంత్రిని తీసుకుని రావాల్సిన అవసరం ఉందా?**

జ. ఎంతైనా అవసరముంది. ఏ రాజైనా సరే చట్టానికి అతీతుడు కాకూడదు. నీతి నియమాలకు లోబడి వుండాలి. శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో ఇదే సందేశాన్ని ఇచ్చాడు.

"ఏ ధర్మాన్నైతే నేను స్థాపించానో, ఆ ధర్మానికి నేను కూడా బద్ధుడనే"



**7. మన రాష్ట్రంలో ఇంజనీరింగ్ కళాశాలలో సీట్లు మిగిలిపోతుంటే ఇంకా ఎమ్‌సెట్ అవసరమా?**

జ. ఎంసెట్ అవసరం కించిత్తు కూడా లేదు. సీట్లు మిగిలిపోవటం మూలానేకాదు. ఇంతకుముందు కూడా ఉచితమైన కారణాలు లేవు. ట్యూషన్ దారులకు, కార్పొరేట్ కాలేజీలకు, లంచగొండి అధికారులకు ఈ పద్ధతి చాలా లాభదాయకంగా మారింది. ఇంటర్మీడియట్ ఫలితాల ఆధారం మీదనే ఇంజనీరింగ్ తదితర వృత్తి కళాశాలలో ప్రవేశం వుండాలి.

**8. సెల్‌ఫోన్ రంగంలో చాలా కంపెనీలు వినియోగదారులకు ఆకర్షించటానికి చాలా చవకగా తమ సేవలు అంటున్నారు? కాని తరువాత రేట్లు పెంచుతారనే వాదన ఉంది? దీనిలో నిజాలేమిటి?**

జ. టెలికమ్యూనికేషన్ రంగంలో, విశేషించి సెల్‌ఫోను సేవలో పెరుగుతున్న పోటీ ప్రజలకు ప్రయోజనకారి. రేట్లు తగ్గటానికి ముఖ్యమైన కారణం మోబైల్ నెట్‌వర్క్ టెక్నాలజీలో విప్లవాత్మకమైన అభివృద్ధి రావటం మూలాన, కావాల్సిన పెట్టుబడి తగ్గిపోతుంది. కంపెనీలు లాభాలను ఎక్కువ చేసుకోవడానికి ప్రయత్నించడం సహజమే. పోటీని, కాపాడటం, కంపెనీలు పరస్పరం కుమ్మక్కై ధరలను పెంచడకుండా ఉండేటట్లు చూడవలసిన బాధ్యత టెలికాం రెగ్యులేటరీ ఆఫ్ ఇండియాపై వుంది. అన్నిటిని మించి, వినియోగదారులు సంఘటితమై జాగరూకతతో పోటీ తగ్గించే శక్తులకు వ్యతిరేకంగా కలుగజేసుకోవాలి.

**9. బి.జె.పి ప్రభుత్వం కేంద్రంలో నాలుగు సంవత్సరాల పరిపాలనతో ప్రజలకు అందించిందేమిటి?**

వై.వి.రావ్, నంద్యాల

జ. ఏటేటా ప్రభుత్వం పడిపోవటం, ఎంతో ఖర్చుతో ఎల్లక్షన్లు పెట్టకుండా వుండటం, ఒక ఆర్థిక, పారిశ్రామిక విధానాల్లో ప్రభుత్వం తక్కువగా కలుగచేసుకోవటం మూలాన, పారిశ్రామికులు, వ్యాపారులు, ఉత్సాహవంతులై తమ చొరవను, పాటవాన్ని చూపించి దేశం యొక్క స్థూల వుత్పత్తిలో

అభినందనీయమైన (5.5%, 7%) అభివృద్ధిని సాధించగల్గారు. దేశ విచ్ఛిన్నకరమైన ఉగ్రవాదాన్ని, మత మౌఢ్యాన్ని తగినంత అదుపులోకి మాత్రం తీసుకురాలేకపోయారు. కాని మతకలహాలు మాత్రం తగ్గాయి. 6 లక్షల కోట్ల రూపాయల వ్యయంతో 15000 కిలోమీటర్ల పైగా నేషనల్ హైవే స్కీమును, ఎన్.డి.ఏ. ప్రభుత్వము మొదలుపెట్టింది. ఇదొక ఘనకార్యం. దీనితోపాటు దేశంలోని నదులన్నిటినీ కూడా అనుసంధానం చేయడానికి ఒక బృహత్ప్రణాళికను తయారుచేస్తూ వుండటం ఒక మంచి పని.

**10. సైబర్ యూనివర్సిటీ అంటే ఏమిటి? ప్రపంచంలో ఎక్కడైనా ఉందా?**

జ. ఇంటర్‌నెట్ ద్వారా విద్యాబోధన, కంప్యూటర్స్ ద్వారా పరీక్షలు, ఒక పట్టణానికి, ఒక దేశానికి పరిమితం కాకుండా, నిర్వహింపబడే విశ్వవిద్యాలయాన్ని సైబర్ యూనివర్సిటీ అంటారు. ఈ విధంగా ఎన్నో సబ్జెక్టుల్లో విద్యా బోధన పరీక్ష, పట్టభద్రత, ఎన్నో చోట్ల జరుగుతోంది. దేశ పరిమితమైన ఎల్లలు లేవు. అమెరికా, ఆస్ట్రేలియా, ఇండియాల నుంచి సైబర్ విద్యాబోధన జరుగుతుంది.

**11. ప్రైవేటు బళ్ళల్లో వాళ్ళ చిత్తం వచ్చిన రీతి ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం ఎంత వసూలు చేయాలో తల్లితండ్రులకు తెలియదు. విద్యాశాఖవారు దానికి సంబంధించిన సర్కులర్ ఇవ్వమంటే ఇవ్వరు, ఏదోసాకులు చెబుతారు. మీరు ఫీజుల పట్టిక హైస్కూల్ వరకు పత్రికల్లో ప్రకటన విద్యాశాఖా వారిచే ఇప్పించగలరా? దీని వలన ఎందరికో మేలు కలుగుతుంది.**

కె.రామారావు, హైదరాబాద్.

జ. ప్రభుత్వ పాఠశాలలో ఫీజులు తదితర చెల్లింపులు నిర్ధారిత ప్రకారమే వుంటాయి. ప్రైవేటు విద్యాలయాలు, ఎన్నో రకాలుగా వున్నాయి. అందులోని సదుపాయాలు, ఉపాధ్యాయుల క్షమత, ప్రయోగశాలలు, క్రీడాస్థలాలు, గ్రంథాలయాలు వేరు, వేరు ప్రమాణాల్లో వుంటున్నాయి. అందువలన నిర్ధారణ చేయటం తగదు. అందుకనే ప్రభుత్వం తరపున ఎటువంటి ఆర్డర్సులేవు.



**12. డార్విన్ సిద్ధాంతాన్ని వివరిస్తారా?**

ఏ. దేవేందర్, ఆముదాలవలస

జ. సూక్ష్మంగా చెప్పాలంటే ఈ భూమిపైన వున్న జీవరాసులన్నీ భగవంతుడు ఏ క్షణంలోనో సృష్టించినవి కావు. కాని కాలక్రమేణా పరిణామ క్రమంలో Lowest form నిమ్నతమ జీవరాసుల నుంచి మానవుని వరకు పరిణతి చెందిన జీవరాసులు ఉద్భవించినవని, ప్రకృతిలోవచ్చిన మార్పులకు అనుగుణంగా మార్పు చెందని జీవరాసులు నశించిపోయాయని డార్విన్ యొక్క సిద్ధాంతము. మన పురాణాల్లో దశావతారాలను గురించి వ్రాయబడింది. ప్రాణం వున్న జీవరాసులు, ముందు నీటిలో మత్స్యరూపంలో, తర్వాత నీటిమీద భూమి మీద ఉండగలిగే కూర్మాలు, భూమిమీద మాత్రమే ఉండగల్గే వరాహం, సగం జంతువు సగం మానవుడు అయిన నృసింహం, తదుపరి వామనావతారం కూడా పరిణామ క్రమాన్ని సూచిస్తుంది.

## డిసెంబరు 2003

**1. ముందస్తు ఎన్నికలు రాజ్యాంగ బద్ధమేనా?**

కె.వి.ప్రసాద్, కరీంనగర్

జ. పూర్తిగా రాజ్యాంగ బద్ధమే, కాని ఏ ప్రయోజనాన్ని ఆశించి ఎంతో ఖర్చుతో ఈ ఎన్నికలను ముందస్తుగా నిర్వహిస్తున్నారో అని చెప్పవలసిన నైతిక బాధ్యత తెలుగు దేశం పార్టీమీద ఉంది.

**2. పత్రికలపై తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత కొరడా ఝుళిపించటము న్యాయమా? పత్రికా స్వేచ్ఛకు భంగము కదా?**

జ. న్యాయంకాదు కాని, పత్రికలు కూడా తమ స్వేచ్ఛను దుర్వినియోగం చేయకూడదు. అసభ్యమైన, వ్యక్తిగతమైన విమర్శలను చేయకూడదు. 'తాము

మాత్రం నీతినియమాలకు కట్టుబడి ఉన్నాం కాని, విమర్శితులు దుష్టు'లని తిట్టడం, సభ్యప్రవర్తన కాదు.

**3. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రభుత్వ ఉద్యోగులలో కొంత వ్యతిరేకత ఏర్పడింది? వనరులు లేకుండా అన్ని పనులు చేయాలని ప్రభుత్వం ఒత్తిడి తెస్తుందని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అభిప్రాయ పడుతున్నారు. ఇది నిజమేనా?**

జి. అశోక్, ఇబ్రహీంపట్నం

జ. భారతదేశంలో ఏ రాష్ట్రంలో కూడా ప్రభుత్వోద్యోగులు ప్రభుత్వంతో సంతృప్తి చెందిన దాఖలాలు లేవు. పనిభారమనీ, పదోన్నతులు కావాలని, Over Time ఇవ్వాలని, ఎక్కువ జీతాలు ఇవ్వాలని, ఇచ్చిన జీతమేతర సౌకర్యాలు చాలవని, అధికారులు వేధిస్తున్నారని అనడం ఆనవాయితీ అయిపోయింది. మన రాష్ట్రంలో 12 లక్షల ఉద్యోగస్తులతో దాదాపు 3 లక్షల మంది అవసరానికన్నా ఎక్కువ మంది ఉన్నారని నిష్ణాతుల అధ్యయనం తేల్చి చూపించింది. ప్రభుత్వ కార్యాలయం లోకి వెళ్ళిన ప్రతి పౌరుని అనుభవాన్ని బట్టి ఉద్యోగులకు తగినంత పని ఉందా లేదా, పన్నులు చెల్లించే ప్రజలకు సేవకుడుగా ప్రవర్తిస్తున్నాడా లేక వారి మీద పెత్తందారుగా వుంటున్నాడా అనేది వ్యక్తమౌతుంది.

**4. "వ్యత్యాసాలను పెంచుతున్న విద్యా వ్యవస్థ" అని మన ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయిగారి మాటలలో నిజం ఎంత వరకు ఉంది?**

ఎన్. రామకృష్ణ, ఒంగోలు

జ. చాలాకాలం నుండి అమలులో ఉన్న మన విద్యా వ్యవస్థ నిస్సందేహంగా వ్యత్యాసాలను పెంచుతోంది. ప్రభుత్వంచే నడుపబడుతున్న సహాయం చేయబడుతున్న విద్యాసంస్థలలో బోధన ఎంత మూల్యరహితంగా వుందంటే వర్గపు ప్రభుత్వ మున్సిపల్ ఉద్యోగికూడా తన పిల్లల్ని ఏదో విధంగా డబ్బులు కూడ బెట్టుకుని ప్రైవేటు కాన్వెంటులకు, పబ్లిక్‌స్కూళ్ళకి పంపాలనుకుంటున్నాడు. ప్రైవేటు స్కూళ్ళల్లో ఉపాధ్యాయులకు తక్కువ జీతాలు ఇచ్చినా ఆ స్కూళ్ళల్లో పరీక్షా ఫలితాలు ఎక్కువ.



ఎక్కువ జీతం పొందుతున్న ప్రభుత్వ విద్యాలయాలలో కన్నా మిన్నగా వుంటున్నాయి. కాబట్టి డబ్బున్న వారికి మంచి స్కూళ్ళు మంచి విద్య. డబ్బులేని వారికి నిరుపయోగమైన విద్య, ఇందువల్ల వ్యత్యాసాలు పెరుగుతున్నాయి.

**5. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల చరిత్ర చెప్పాలని లోక్‌సత్తా ప్రతిపాదనలు పంపించి, దాని సాధనకై సుధీర్ఘ ప్రయాణం చేసి సంబంధిత యంత్రాంగాన్ని కలుసుకుంది. దీనిపై న్యాయస్థానాలు సైతం అభ్యర్థుల వివరాలు వెల్లడించాలని స్పష్టం చేశాయి. అయితే ఈ నూతన విధానాన్ని తాజాగా జరుగుతున్న ఎన్నికల్లో దేశమంతటా ఖచ్చితంగా అమలు చేస్తున్నారా?**

జి. ప్రశాంత్, నాగార్జున సాగర్

జ. ఈ విషయంలో లోక్‌సత్తా అద్భుతమైన విజయాన్ని సాధించింది. జరుగుతున్న ఎన్నికల్లో, ఎన్నికల సంఘం అమలు చేసేటట్లు కనిపించడం లేదు. ఏ రాజకీయ పార్టీకూడా ఇటువంటి పారదర్శకతను చిత్తశుద్ధితో ఒప్పుకోవడం లేదు. కనుక లోక్‌సత్తాతోపాటు మనం అందరం కూడా ఇది వెంటనే అమలు చేయాలని ఒత్తిడి తీసుకురావాలి. అభ్యర్థులను మనం ప్రశ్నించాలి.

**6. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు విశేష అధికారాలు కల్పించాలని సంకల్పించినది కదా! అవి ఏమిటి?**

పి. రమాదేవి, నాగర్ కర్నూలు

జ. లోక్‌సత్తా వారు నవంబరు 5వ తారీఖున రాష్ట్ర మంత్రుల సమితిని కలిశారు. మంత్రివర్గం మన రాజ్యాంగంలోని 11,12 షెడ్యూల్స్‌లో వున్న విషయాలన్నింటికీ స్థానిక ప్రభుత్వ సంస్థలకు (జిల్లాపరిషత్, మునిసిపాలిటీ, మండలం) అప్పగించడానికి ఒప్పుకున్నారు. వీటన్నింటికీ వేరే బడ్జెట్‌ను కేటాయిస్తామన్నారు. దాదాపు 20 విషయాలలో లోక్‌సత్తా నిర్దుష్టమైన సూచనలు చేసింది. నవంబరు 8వ తారీఖున మంత్రివర్గ సమావేశంలో లోక్‌సత్తావారి సూచనలను చర్చించారు. ఎన్నో అధికారాలను, గవర్నమెంటు ఉద్యోగులను స్థానిక

సంస్థలకు అప్పగించడానికి నిర్ణయం తీసుకున్నారట కాని ఇది ఇంకా ప్రకటించలేదు. లోక్‌సత్తా వారు ఒక సుదీర్ఘమైన ప్రకటనను విడుదల చేశారు. దీన్ని మీరు వారి వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. లేక వారికి వ్రాసి తెప్పించుకోవచ్చు.

**T:+91(040) 2335-0778 URL : WWW. LOKSATTA. ORG**

**7. బాలికల చదువే.... లింగ వివక్షకు పరిష్కారం అని కేంద్ర మానవ వనరుల శాఖా మంత్రి మురళీ మనోహర్ జోషి అంటున్నారు కదా? లింగ వివక్షతకు కారణాలు ఏమిటి?**

ఆర్. లలితా, మెదక్

జ. బాలికల చదువు, లింగ వివక్షతను చాలా వరకు తగ్గించగలదు. బుద్ధినీ, నీతి, నియమితనూ ఉద్బోదించని చదువుల వల్ల ప్రయోజనం లేదు. చదువుకాకుండా, తల్లితండ్రులు బాల బాలికల మధ్య వివక్షతను చూపకుండా సత్సంప్రదాయంతో, విద్యాబుద్ధులను నేర్పినట్లైతే, లింగ న్యూనతకు ఆస్కారం వుండదు.

**8. నేటి తరం విద్యార్థులలో క్రమ శిక్షణ లోపించటానికి నైతిక బోధన లోపించటమే ప్రధాన కారణమా?**

జ. ఔను, ఒక్క నైతిక బోధనేకాదు. విద్యార్థులను సచ్ఛీలురుగా, బుద్ధిమంతులుగా, సాధకులుగా, ఉత్తేజపరచగల భారత, భాగవత, రామాయణాది గ్రంథాలలోని కథలను, అందులోని పాత్రలను గురించి గురువులు సమకాలీన విషయాలకు, సమస్యలకు, ఆగాథలలోని సజ్ఞానాన్ని ఏ విధంగా ఉపయోగించగలమో, చెప్పినట్లైతే, విద్యార్థులలో దీక్ష, క్రమశిక్షణ, నైతికత, ఆత్మస్థైర్యము లక్ష్య సాధనాశక్తి ఏర్పడుతాయి.

**9. ప్రతి సంవత్సరము కొన్ని వేల మంది టీచరు ట్రయినింగు సీట్లు దొరకక కనీసం బడిపంతులు పనిచేసుకుని అయినా బ్రతకలేని పరిస్థితి వచ్చింది. అందుకని కరస్పాండెన్సు కోర్సు ప్రవేశపెట్టడంలో అభ్యంతరము ఏమిటి?**

కె. రామారావు, హైదరాబాదు



జ. ఇప్పటికే మనరాష్ట్రంలో దాదాపు, లక్షమంది B.Ed. పట్టభద్రులు నిరుద్యోగులై ఉన్నారు వీరంతా ప్రభుత్వోద్యోగం కావాలని కోరుకుంటున్నారు. ప్రభుత్వం దగ్గర సొమ్ములు లేవు. మన రాష్ట్రంలో 35% ప్రజలు నిరక్షరాస్యులు. B.Ed. తదితర పట్టభద్రులు తమ తమ గ్రామాలలో నిరక్షరాస్యులకు, బోధనా తరగతులు నిర్వహించి 5వ తరగతి, SSLC పరీక్షలకు బాలబాలికలను కూర్చుండబెట్టి, అందులో ఉత్తీర్ణులయిన ప్రతి వ్యక్తికి రూ. 1000/- చొప్పున ప్రభుత్వం నుండి పొందేటటువంటి వ్యవస్థను మనం తెచ్చుకుంటే, ప్రస్తుతం ఉన్న లక్ష B.Ed. లకే కాదు ఇంకా ఎంత మందికో స్వయం పోషకత్వం ఏర్పడుతుంది.

కాలేజీలలో చదువుకున్న వాళ్ళ యొక్క స్థాయియే ఆశాజనకంగా లేనప్పుడు, **Correspondence Course** ల ద్వారా డిగ్రీ తెచ్చుకున్న వాళ్ళ స్థాయి సామాన్యంగా, ఆశావహముగా ఉండదు.

**10. పశ్చిమ బెంగాల్‌లోని పార్టీ వారు బంగ్లాదేశ్ నుండి చొరబాటుదార్లుగా వస్తున్న ముస్లిం ఓట్లుతోనే గెలిచి పార్లమెంట్ సీనియర్ సభ్యుడు శ్రీసోమనాథ్ చటర్జీ అలా నిర్లజ్జగా గెలుస్తూ పార్లమెంట్‌లో తానేదో గొప్ప మేధావిలాగా అధిక ప్రగల్భాలు పలుకుతుంటారు. ఈ విషయాన్ని సామాన్య జనానికి తెలియ చేయడం ఎట్లా? అతని ప్రగల్భాలను నిరోధించేది ఎలా?**

రాజనాల లక్ష్మీనారయణ, మచిలిపట్నం

జ. సోమనాథ్ చటర్జీ గారి అసలు సంగతి మీరు తెలుసుకున్నారు కాబట్టి అలా తెలుసుకున్న వారందరూ మౌనం వహించకుండా నిర్భయంగా అటువంటి వారి గురించి ప్రజలందరికి చెప్పడమే సరియైన మందు. ప్రగల్భాలకి, వాచలత్వానికి మన దేశంలో సంపూర్ణ స్వాతంత్ర్యం ఉంది. సత్యం చేత అసత్యాన్ని గెలవాలి.

**11. లౌకికవాదం, కులతత్వం ఒకే నాణానికి రెండు వైపులని ఒకసారి శ్రీ అద్వానీ గారు అన్నారు. దీన్ని నిజం చేస్తూ లోక్‌సభలో శ్రీ ములాయంసింగ్ యాదవ్, శ్రీసోమనాథ్ చటర్జీ ఒకే చోట కూర్చుంటారు. అద్వానీ గారి వ్యాఖ్యసబబేనని అనిపిస్తున్నది కదూ?**

జ. ఔను. అద్వానిగారి వ్యాఖ్య తూ.చ. తప్పకుండా సబబే. భారతదేశంలో లౌకికవాదం అనబడేది ప్రపంచంలో మరెక్కడా సామ్యం లేనిది. హిందూ వ్యతిరేకత, భారతదేశపు న్యూనతలకు, మారుపేరు లౌకిక వాదం అనే చెప్పబడేది.

**12. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎడాపెడా అప్పులు చేసుకుంటూ పోతే చివరకు జరిగే పరిణామాలు ఏమిటి?**

జి. శైలజ, గోదూర్

జ. ప్రభుత్వాలలాగా వ్యక్తులు కూడా ఎడాపెడా అప్పులు చేస్తే దివాళా తీస్తారు. బిక్షకులుగా తయారవుతారు. కాని ప్రభుత్వాలు అప్పులు చేస్తే ప్రజలమీద పన్నుల భారం పెరుగుతుంది. దేశం యొక్క సార్యభౌమత్వానికి శక్తి సామర్థ్యాలకే ఎంతో ముప్పు వాటిల్లుతుంది. అందుకనే విజ్ఞులు ప్రభుత్వం ప్రజలదగ్గరనుండి, ఇతర దేశాల నుండి తీసుకునే అప్పు మీద, పన్నుల మీద ఒక హద్దు ఉండేట్లు శాసనం ఉండాలని కోరుతున్నారు. అదే విధంగా ప్రభుత్వోద్యోగులమీద అయ్యే వ్యయం కూడా రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో ఒక నిర్దిష్ట శాతాన్ని మించి ఉండకూడదు అనే చట్టం ఉండాలని అంటున్నారు.

**13. మన దేశం అంతరిక్షంలోనికి ఎన్నో ఉపగ్రహాలు ప్రవేశపెడుతోంది కదా! ఆర్థికంగా చితికియున్న ఇండియా సర్కారు అన్నేసి కోట్లు ఖర్చుచేసి ఉపగ్రహాలు పంపటం అవసరమంటారా?**

జ. ఉపగ్రహాలు తదితర శాస్త్రీయ సాంకేతిక ప్రయోగాల ద్వారా దేశంలో విజ్ఞానం పెంపొందుతుంది. ఈ పరికరాల ద్వారా దేశ ఆర్థిక, ప్రగతి రక్షా పాటవాలను పెంపొందించుకోగలం. ఉదాహరణకు మన దేశం ప్రయోగించిన ఉపగ్రహాల ద్వారా భూగర్భంలో నిక్షిప్తమైన వనరులు, ఖనిజాలు, జలం తదితర సంపత్తిని కనిపెట్టగలుగుతున్నాము, దేశంలో సంచార వ్యవస్థను, వాతావరణ సూచనను ఎంతో మెరుగు పరుచుకుంటున్నాం. దీనికి కావలసిన వివిధ పరికరాలను తయారు చేయడానికి ఎంతో మంది శాస్త్రజ్ఞులు కృషి చేస్తున్నారు, ఎన్నో పరిశ్రమలు ఉద్భవించాయి.



## జనవరి 2004

**1. మద్యపాన నిషేదం, వాంఛనీయ మంటారా? ఇది ఆచరణలో సాధ్యమంటారా?**

వి. ఎల్. సత్యనారాయణ, కరీంనగర్

జ. వాంఛనీయమే కానీ ఇది ఆచరణ సాధ్యం కాదు. అమెరికా అటువంటి గట్టి ప్రభుత్వం ఉన్న దేశంలో మద్యపానాన్ని నిషేధించి అమలు చేయలేక నిషేధాన్ని ఉపసంహరించారు. మన దేశంలో రాజగోపాలచారిగారు ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో 1937-29 కాలంలో నిషేధించారు. అమలులో వైఫల్యం చెందారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా నిషేధించి అమలు చేయలేక ఉపసంహరించారు. శుక్రాచార్యులు సురాపానాన్ని శపించారు. ఆ కథను (కచ,జీవయాని) మీరు భారతంలో చదవచ్చు. కుటుంబంలో తల్లి దండ్రులు సక్రమజీవనా సరళిని పిల్లలకు నేర్పినట్లయితే ఆత్మ సంయమనం ద్వారా సామాజిక ఒత్తిడి ద్వారా మద్యపాన సేవనాన్ని తగ్గించవచ్చు.

**2. ఉద్యోగం చేస్తే స్త్రీ తన గృహధర్మం సక్రమముగా నెరవేర్చగలదంటారా?**

జ. కష్టమైనప్పటికీ ఉద్యోగం చేసే స్త్రీ తన గృహధర్మాన్ని నెరవేర్చగలదు. భర్త, పిల్లలయొక్క అవగాహన, సహకారము అవసరము. ప్రధాన మంత్రిగా ఉండి ఉత్తమ పదవులను నిర్వహించిన స్త్రీలు ఎందరో ఉన్నారు. బ్రిటన్ యొక్క ప్రధానమంత్రి మార్గరెట్ థాచర్, అమెరికా యొక్క విదేశాంగ మంత్రి మాండలిన్ ఆల్‌బ్రైట్, మన రాష్ట్రంలో కడప రామసుబ్బమ్మ గారు, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్‌గారు, శ్రీమతి అమ్మన్న రాజాగారు తమ గృహధర్మాన్ని, ప్రజా సేవాధర్మాన్ని చక్కగా నిర్వహించారు.

**3. మొన్నటి శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయాన్ని పొందటానికి కారణాలేమిటి?**

సి. .సీతారామయ్య, తుని

జ. కాంగ్రెసులో ఏమాత్రమూ విలువల్లేవు. అందులోని భారతీయులకు, ఆత్మ విశ్వాసం గాని ఆత్మ గౌరవంగాని, ఆత్మస్థైర్యం గాని చాలా వరకు మృగ్యమయ్యాయి. నెహ్రూ వంశజులకు వారితో సంబంధం పొందిన వారికి భజన ఎక్కువైంది. వందేళ్ళకుపైగా చరిత్ర ఉన్న పార్టీకి ఒక్క భారతీయుడు కూడా నాయకుడు కాలేక ఎవరినో ఎరువు తెచ్చుకున్నారు. భారతీయ భాష, సంస్కృతి, చరిత్ర, జీవన సరళి తెలియని నాయకురాలు ఏ విధంగా ప్రజలను ఉత్తేజ పరచి వారి విశ్వాసాన్ని పొందగలిగారు.

నాయకురాలి పూర్వ చరిత్ర, విద్య తదితర అర్హతలు ఎవ్వరికీ తెలియవు. నాయకురాలు పదవిని ఆక్రమించక ముందు ప్రజాసేవ అనే వూసేలేదు. అనుచర భజనపరులను "హైకమాండ్" అంటారు. వాస్తవంగా అది? శ్రేయస్సు, పేదరిక నిర్మూలన, వెనుకబడిన వారికి, క్రింద పడిన వారికి, ఎక్కడికీ వెళ్ళలేని వారికి మేలు చేస్తాం అనే అబద్ధాలు ఎన్నో దశాబ్దాలుగా చెప్తూ వచ్చారు కాని, చిత్తశుద్ధిలేదు. భారతీయ జనతా పార్టీ రెండవ తరం నాయకులు వెంకయ్యనాయుడు, ఆరుణ్ జేట్లీ, వసుంధర, ఉమ, మహాజన్‌లు ఎంతో స్ఫూర్తితో నవీన వ్యూహంతో భజన పారాయణ కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించగలిగారు.

**4. మధ్యప్రదేశ్‌లో ముఖ్యమంత్రి దిగ్విజయ్‌సింగ్ ఓటమికి కారణాలేమిటి?**

జ. దిగ్విజయ్‌సింగ్ మచ్చలేని నాయకుడు. విద్యావంతుడు. ఇంజనీరు. చంద్రబాబులాగా ఎన్నో కొత్త ప్రణాళికలను ప్రజోపయోగం కోసం ప్రవేశ పెట్టారుగాని, సహవాసదోషం వల్ల, భజన పరుల నాయకత్వం మూలాన వారి పార్టీ ఓడిపోయిందని నా అభిప్రాయము. ఆయనే గనక చంద్రబాబులాగా వేరే పార్టీని పెట్టి **'I command'** తో సంబంధం లేకుండా పోటీ చేసి నట్లయితే బాబులాగానే గెలిచే వారనుకుంటాను.



**5. మన రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ప్రణాళికా సంఘాలు నియమించారుకదా? దానిలో సభ్యులు ఎవరు? ప్రణాళికా సంఘము ఆశయం ఏమిటి?**

అర్. అనురాధ, తెనాలి

జ. జిల్లా ప్రణాళికా సంఘ ఆశయం జిల్లాలో అభివృద్ధి పథకాలను రూపొందించడం దానికి కావలసిన ఆర్థిక వనరులు ఏ విధంగా సమకూరాలో, ప్రణాళికా ప్రగతిని నిరీక్షించడం ఇంత వరకు ఉన్నటువంటి Development Review Committee లను రద్దుచేసి వాటి స్థానంలో District Planning Committee లను నియమిస్తున్నారు. ఇందులో 25 మంది సభ్యులుంటారు. దీనికి Chairman cabinet Rank Mimister 20 మంది సభ్యులను జిల్లా పరిషత్ సభ్యులు, జిల్లాలోనిమున్సిపాలిటీల కౌన్సిలర్లు, అందరు కలసి ఎన్నుకుంటారు. జిల్లాలోని ఐదుగురు విశిష్ట వ్యక్తులను ప్రభుత్వం నామినేట్ చేస్తుంది. జిల్లా కలెక్టరుగారు, మెంబరు, కన్వీనరుగా ఉంటారు. ఇందుకు సంబంధించిన GO కొద్ది రోజుల్లో విడుదల అవుతుంది. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలు చేసిన ప్రణాళికలన్నిటిని సమీక్షించి సమన్వయపరచి జిల్లా మొత్తానికి సమగ్ర ప్రణాళికలను ప్రభుత్వానికి సమర్పించడం ఈ కమిటీ పని. ఈ కమిటీలో జిల్లాలోని M.L.A లు MP లు కూడా Ex. Officio సభ్యులుగా ఉంటారు. ప్రభుత్వ శాఖలు చేసిన ప్రణాళికను ఈ కమిటీ మార్పులు చేర్పులు చేయగలుగుతుందా అనేది ప్రస్తుతానికి ప్రశ్నార్థకమే.

**6. ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజి అభివృద్ధి ఎంతవరకు జరిగింది.**

జ. ఐ.టి. అభివృద్ధికి పరిధులు లేవు. ప్రభుత్వేతర రంగంలో ఒక్క హైద్రాబాద్‌లోనే 800లకు పైగా కంపెనీలు ఉన్నాయి. సాఫ్ట్‌వేర్, IT Enabled services లో 1.5 లక్షల మందికిపైగా ఉద్యోగం పొందారు. పరోక్షంగా ఇంకొక 1.5 లక్షల మందికి ఉపాధి కల్గింది. ప్రభుత్వంలో ఎలక్ట్రానిక్ గవర్నెన్స్ ప్రణాళిక క్రింద మరే ఇతర రాష్ట్రంలో లేనంత ప్రగతి జరిగింది. ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడేవి. E-Seva, Document Registraion, E-Tendering, Driving Licence, Registration.

**7. విశ్వవిద్యాలయాలలో వైస్ ఛాన్సలర్స్ పదవీకాలము ముగిసిన వెంటనే వైస్ ఛాన్సలర్స్‌లను నియమించకుండా ఆక్టింగ్ వైస్ ఛాన్సలర్‌గా ఎవరినో ఒకరిని నియమించడం ఎంత వరకు మంచిది?**

ఆర్. సాయిబాబు, నంద్యాల

జ. Acting వైస్ చాన్సలర్‌ల నియామకాలు ఇసుమంతైనా మంచిది కాదు. విశేషించి ఎవరో ఒక IAS Officer ను వేయడం మహాఘోరం. పదవీకాలం ఇదమిత్థంగా తెలిసి కూడా 5/6 నెలల ముందే నిర్ణయం తీసుకోలేకపోవడం సమర్ధవంతమైన నిర్ణయాత్మకమైన ప్రభుత్వమని అనిపించుకోదు.

**8. ఒకనాడు గ్రంథాలయోద్యమములో భారతావనికి తలమానికమైన ఆంధ్రప్రదేశ్ నేడు నిస్తేజమై, నిర్వీర్యమై "ఎవరికి పుట్టిన బిడ్డవు ఎక్కెక్కి ఏడుస్తున్నావు" అన్నట్లు తయారైన గ్రంథాలయాలు ప్రభుత్వ ఆదరణలేక వెలవెలపోతున్నాయి కదా? దీనికి మీరు సూచించే పరిష్కార మార్గాలేమిటండి?**

జ. ఏ సంస్థ అయినా ప్రభుత్వ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడినట్లయితే దానికి ఒకానొకప్పుడైనా క్షీణ దశ తప్పదు. Property Tax మీద ప్రతి Municipality లో Library సెస్ ఉన్నది. అది సేకరించ బడుచున్నది. కాని ఇతర ఖర్చులకై దుర్వినియోగించబడుచున్నది. ఆ ధనం గ్రంథాలయానికి రావాలంటే ప్రతిసారి ముఖ్యమంత్రి గారి ప్రసన్నత మీద ఆధారపడి ఉంటుంది. ఎన్నో పద్దుల కింద తక్కువలు ఉండడం మూలాన Library Cess కూడా జీతభత్యాలో, మరే ఖర్చుకో వినియోగింపబడి, కేవలం ఒక అంశం మాత్రం గ్రంథాలయాలకు చేరుతున్నది. వీటిని పటిష్ఠం చేయాలంటే, ప్రజోపకారిణిగా మార్చాలంటే ప్రతి గ్రంథాలయానికి ఒక ట్రస్ట్‌ను తయారుచేసి ఉదార పురుషుల నుండి ధన సేకరణ చేయాలి. ఉపయోగించుకునే వారి నుంచి, వారి అంతస్థుకు అనుకూలమైన రుసుమును కూడా వసూలుచేయాలి. ఈ విధంగా స్వయం ప్రతిపత్తిని సంతరించుకోవాలి.



**9. ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వ విద్యాశాఖ పదవతరగతి ఉత్తీర్ణతాశాతం విషయంలో "టార్గెట్స్" పెట్టి బెదిరిస్తూ ఒకవైపు, అవార్డుల ఆశ చూపి మరొకవైపు ఆజ్ఞలు జారీ చేస్తుంటే, వాటి వలన భయం, అశ్లీల ప్రధానోపాధ్యాపకులు ఎంతటి నీచానికైనా పాల్పడుతున్నారు. దీని వలన విద్యావిధానం ఎంత నష్టపోతోంది? దీన్ని ఎలా నిరోధించాలి?**

రాజనాల లక్ష్మీనారాయణ, మచిలీపట్నం

జ. మన విద్యా విధానం గుణ రహితంగా తయారవటానికి సరియైన కారణాన్ని మీరు ఉదహరించారు. స్వాతంత్ర్యం రాక పూర్వం ఉపాధ్యాయులు విద్య ద్వారా సచ్ఛీలురను, దేశభక్తులను, నిజమైన విద్యావంతులను తీర్చి దిద్దేవారు.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రాను రాను ఉపాధ్యాయుల ఎంపిక నియామకం, పోస్టింగ్, ట్రాన్స్‌ఫర్స్ ఇవన్నీ నాయకుల యొక్క ఇష్టానుసారంగా జరుగుతున్నాయి. ఉపాధ్యాయులలో మన రాష్ట్రంలో ఒకదానితో ఒకటి పోటీపడే ఏడెనిమిది సంఘాలున్నాయి. జీతభత్యాలకు, పదోన్నతికి స్థాన చలన నిరోధకానికి ఎంత ప్రాధాన్యత నిస్తున్నాయో విద్యా బోధనకు అంత తక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాయి. అందుకనే ప్రభుత్వ రంగ పాఠశాలలకు గ్రేడ్ 'డి' ఉద్యోగులు కూడా తమ పిల్లలను పంపడానికి ఇష్టపడడం లేదు. ప్రభుత్వరంగ పాఠశాలల ఉపాధ్యాయులు కూడా తమ పిల్లలను తాము చదువు చెప్పే స్కూళ్ళకు పంపకుండా కాన్వెంటు స్కూళ్ళకు పంపుతున్నారు. ముందుగా ఈ రెంటిని మనం అమలు చేయాలి.

1) ఉపాధ్యాయులు తాము పనిచేసే స్కూలున్న గ్రామంలోనే నివసించాలి.

2) తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలి.

**10. నాకు స్వచ్ఛంద సేవా సంస్థ యన్.జి.వో. ను స్థాపించాలని ఉన్నది. ఎవరిని సంప్రదించాలి? ఏ విధంగా నిర్వహించాలి? ప్రభుత్వ ప్రభుత్వేతర, విదేశీ సంస్థల నుంచి నిధులు సేకరించడం ఎలా? కావల్సిన అర్హతలు, నియమ నిబంధనలు ఏమిటి?**

ఎం.వి.వి.పి.రావు, పార్వతీపురం

జ.  మన రాష్ట్రంలో వేలాది స్వచ్ఛంద సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి అందినచోట నుంచి డబ్బులు సేకరించి చాలా వరకు స్వాహా చేస్తున్నాయి. ప్రభుత్వంలో అవినీతి ఎక్కువైందని స్వచ్ఛంద సంస్థలను ప్రోత్సహిస్తే అవి ప్రభుత్వం నుంచి, విదేశీయుల నుంచి డబ్బు గుంజుకుని తమ 'అభివృద్ధి'కొరకు ఉపయోగించుకుంటున్నారు. వీటిల్లో మైనార్టీలు స్థాపించిన ముష్కర సంస్థలు ఎన్నో ఉన్నాయి. చిన్న పిల్లలనుకొని అమ్మే ముష్కర  సంస్థలు కూడా ఎన్నో ఉన్నాయి. చిన్న పిల్లలను కొని మతం మార్చి విదేశీయులకు దత్తత కోసం అమ్మేవి,  ప్రజాహితమని చెప్పి, పేదరిక నిర్మూలనమని విదేశీయులకు చెప్పి, వారి డబ్బు తీసుకుని, కొంత మత మార్పిడులకు, కొంత స్వయం సమృద్ధికి పనిచేసేవి ఎన్నో ఉన్నాయి.

మరో NGO స్థాపించకుండా మీ వివేకాన్ని ఉపయోగించి మీ ప్రాంతంలోని మంచి స్వచ్ఛంద సంస్థలో కలిసి పనిచేయండి.

**11. మన దేశపు Foreign Exchange నిల్వలు ఎచ్చట, ఎవరి దగ్గర ఉంటాయి?**

కె.వి. సుబ్బారావు, పెడన

జ.  మన దేశపు విదేశీ ముద్ర నిల్వలు ఎక్కువగా డాలర్ కరెన్సీలో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా అదుపాజ్ఞల్లో ఉంటాయి.

## ఫిబ్రవరి 2004

**1. పత్రికలలో జమిలి ఎన్నికలు అని రాస్తున్నారు కదా? అంటే ఏమిటి?**

ఎ. నళినీ కుమారి, నూజువీడు



జ.  మీ ద్వారానే డెబ్బైఏళ్ళ జీవితంలో మొట్టమొదటిగా 'జమిలి' అనే పదాన్ని వింటున్నాను. ఈ జమిలి ఏభాషో నాకు తెలియటం లేదు. కాని సందర్భాన్ని బట్టి శాసన సభకు, లోక్‌సభకు ఎన్నికలను జరపడం 'జమిలి' ఎన్నికలని అర్థమవుతుంది.

**2. భారతీయ జనతా పార్టీ పార్లమెంట్‌ను రద్దుచేసి ఎన్నికలను నిర్వహించాలనుకోటం న్యాయమేనా?**

జ.  చట్టపరంగా భారతీయ జనతా పార్టీ నిర్ణయం ఒప్పే. కాని ఎంత వరకు నీతిబద్దమో అనేది ప్రశ్నార్థకమే. గతంలో కాలపరిమితి ముగియక ముందే శాసన సభలను, లోక్‌సభలను రద్దుచేసి ఎన్నికలు జరిపినందుకు భారతీయ జనతా పార్టీ కాంగ్రెస్‌ను తూర్పార బట్టింది. ఈనాడు రాజకీయ పక్షాలు నీతి నియమబద్ధతకన్నా పార్టీ ప్రయోజనాలకే ఎక్కువ ప్రాముఖ్యత నిస్తున్నాయి.

**3. మాంటిస్సోరి, ఫ్రొబెల్, గాంధీజీలాంటి వాళ్ళు విద్యావేత్తలు ఎందుకంటె వారు విద్యావిధానంలో కొత్తపద్ధతులు కనిపెట్టారు. కాని కోచింగ్ సెంటర్లు నడిపేవాళ్ళు – పాఠాలు చెప్పే వాళ్ళు విద్యావేత్తలవుతారా? వారిని అలాపిలవటం భావ్యమా? నిర్మొహమాటంగా చెప్పండి.**

ఆర్. కె. రావ్, హైదరాబాద్

జ.  కోచింగ్ సెంటర్లు, ట్యూటోరియల్ కాలేజీ పెట్టే వాళ్ళు విద్యావేత్తలు కాదు. విద్యావ్యాప్తికి ప్రయత్నించే వాళ్ళు అంతకన్నా కాదు. ఇంజనీరింగ్, మెడికల్ MBA తదితర వృత్తిపరమైన కాలేజీల్లో ప్రవేశార్హత కోసం, పరీక్షల్లో రాంకులు సంపాదించుట కోసం, IAS, IPS కోచింగ్ సెంటర్ పెట్టేవాళ్ళు విద్యా వ్యాపార వేత్తలు. అంతేకాని సచ్ఛీలురను, విద్య అంటే నీతి నియమాలంటే గౌరవం ఉన్న వ్యక్తులనుతయారుచేసే వాళ్ళు మాత్రం కాదు. మన రాష్ట్రంలో ఈ కోచింగ్ వ్యాపారం వందలకోట్ల రూపాయల్లో ఉంది. ఇతర వ్యాపారంలో నష్టం రావచ్చుగాని ఈ విద్యావ్యాపారంలో మాత్రం నష్టాలురావు.

**4. మోర్స్‌కోడ్ ఆంగ్లంలో ఉన్నది కదా. ఆంగ్లంరాని దేశస్థులు (జపాన్ లాంటివారు) దీనిని ఎట్లా ఉపయోగిస్తున్నారు? మనం మోర్స్‌కోడ్‌లో జపానుకు సమాచారం పంపుట ఎట్లు? లేక వారు మనకు పంపుట ఎట్లు? లేదా కంపల్సరిగా దీని కోసం ఆంగ్లం నేర్చుకోవలెనా? ముఖ్యంగా జపాన్ హమ్ రేడియో ఆపరేటర్లు ఎలా వ్యవహరిస్తున్నారు. కమ్యూనికేషన్ ఇంత అభివృద్ధి చెందినాక మోర్స్ అవసరమా? వివరంగా దయచేసి తెలపగలరు.**

జ. ప్రపంచంలో మోర్స్‌కోడ్‌ఉపయోగించే టెలిగ్రాఫ్ వ్యవస్థ ఎన్నో దేశాల్లో విరమించబడింది. ప్రస్తుతం టెలిగ్రాఫ్ యొక్కగాని, మెర్స్‌కోడ్ యొక్కగాని అవసరం లేదు. టెలెక్స్ రావటం మూలాన టెలిగ్రాఫ్ తగ్గిపోయింది. ఫ్యాసిమైల్ రావడం మూలాన టెలెక్స్ అంతమైపోతోంది. ఎలక్ట్రానిక్ మేల్ రావడం మూలానా ఫ్యాసిమైల్ కూడా అంతమవుతోంది.

దీనితోపాటు తపాలాసేవ అవసరం కూడా తగ్గిపోతోంది. Voice-mail ద్వారా మన సందేశాలను ఎక్కడికైనా పంపవచ్చు.

**5. జనాభా పెరుగుదల రేటును లెక్కించే విషయంలో 2001 సెన్సెస్ ప్రకారం గ్రోత్ రేట్ 1. 95% అని ఒక రకంగాను 2.1% అని మరోరకంగాను లెక్కిస్తారు. ఇందులో ఒకటి Expenditure growth రెండవదాన్ని ఏమంటారు. వీటిని వివరించండి**

సూరపనేని రామలక్ష్మి, హైదరాబాద్

జ. జనాభా పుట్టుక రేటు జనాభా మరణించే రేటు, ఈ రెంటిమధ్య తేడా జనాభా పెరుగుదల రేటు. మరొక గణాంకం Fertility rates అంటారు. అంటే సగటున ఒక స్త్రీ కెంత మంది బిడ్డలు పుట్టుతున్నారు అనేది. దీన్లోంచి శిశుమరణాలరేటు తీసేస్తే మరొక గణాంకం వస్తుంది.

**6. 5వ వేతన సంఘం మూలంగా (అమలు మూలంగా) 80 వేల కోట్ల రూపాయల భారం పడింది. ఈ మొత్తం కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఒక సంవత్సరానికి భరించాల్సిన మొత్తమూ లేక ఒక సంవత్సరం కేంద్ర ప్రభుత్వం మీద పడిన భారమా?**



జ. ఈ 80,000 కోట్ల రూపాయల భారం ప్రతి సంవత్సరం ఉండేదికాదు. మొదటి సంవత్సరంలో బాకీలు కలుపుకుని ఇంత భారమైంది. గవర్నమెంట్ ఒక నిర్ణయం తీసుకున్నప్పుడు, ఇది ఫలానా తేదీ నుంచి అమలులోనికి వస్తుందని చెప్తారు. ఈ తేది భవిష్యత్తులో కాకుండా భూతకాలంలో ఉండటం మూలాన బాకీలు పేరుకు పోయి ఉంటాయి. ఇంత డబ్బుని నగదుగా ఇవ్వలేకపోవడం మూలాన అందులో గణనీయమైన మొత్తాన్ని Provident fund లో జమ చేస్తారు. అంటే ఇప్పటి ప్రభుత్వం కాకుండా, కొన్నేళ్ళ తరువాత వచ్చే ప్రభుత్వాలకి ఇది గుదిబండగా అవుతుంది.

**7. "వృద్ధాప్యంలో జ్ఞాపకశక్తి లోపించడం, చురుకుదనం తగ్గిపోవడంతోపాటు ఇతర అనారోగ్య కారణాలు చుట్టుముడతాయి కదా! అటువంటప్పుడు భారతదేశ భవిష్యత్తుని వృద్ధనాయకుల చేతుల్లో పెట్టడం ఎంత వరకు సమంజసం?"**

శిఖా సునీల్ కుమార్, వినుకోండ

జ. ఇసుమంతైనా సమంజసం కాదు, మన దేశంలో చచ్చిపోయే దాకా పదవిలో ఉండాలనే కాంక్ష పెరిగిపోతూ ఉంది. బలవంతంగా ప్రజలు ఎన్నికల్లో ఓడించి, గెంటితేగాని రాజకీయ నాయకులు నాయకత్వంలోంచి తప్పుకోవడం లేదు. ప్రభుత్వాధికారులకు కంపెనీల్లో పనిచేసేవారికి ఏ విధంగా అయితే వయో పరిమితి ఉన్నదో, అదే విధంగా యమ్.ఎల్.ఏ,లుగా, సి.యమ్.గా, యమ్.పిలుగా, పి.యమ్‌లుగా ఉండే వాళ్ళకి వయో పరిమితి ఉంటే మంచిది. ఇటువంటి చట్టం తీసుకురావాలంటే ఈ నాయకులే చేయాలి కాబట్టి వారలాంటి చట్టాన్ని తీసుకురారు.

**8. సంస్కృతి అనే దానికినిర్వచనం ఏమిటి?**

పి. కృష్ణ ప్రసాద్, ఖమ్మం

జ. సంస్కృతిని ఒక వాక్యంలో నిర్వచించుట కన్నా కొన్ని వాక్యాల్లో వర్ణిస్తేనే విశదమవుతుంది. ఇతరులను నొప్పించే విధంగా మాట్లాడకుండా ఉండటం, కోపాన్ని అదుపులో ఉంచుకోవడం, సంతోషసంపదను పెంచడం, అమలు చేయడానికి వీలుపడని చట్టాలను స్వచ్ఛందంగా లోబడిపనిచేయడం, పెద్దలను

గౌరవించడం, వీలైనంత వరకు ఇతరులకు సాయం చేయడం మొదలగునవి సంస్కృతికి చిహ్నాలు. వేమన, సుమతీశతకాల్లో ఈ గుణాలు ఎంతో విశదంగా వర్ణించబడ్డాయి.

ఉపకారము చేయడం ....
అధరము కదలీ కదలక
మధురములగు భాషలుడిగి
మౌనవ్రతుడై అధికారరోగ
పూరిత బదిరాంధకశము
కాకుండా ఉండటము,
అల్పుడెపుడుపల్కు ఆడంబరముగాను
సజ్జనుండు పల్కు చల్లగాను....
బలవంతుడ నాకేమని
పలువురితో నిగ్రహించి
పలుకుట మేలా...
నవ్వకుమీ సభలోపల
నవ్వకుమీ పరసతితో...
భూతలనాధులకు తాడవుచొంకమి...
కలకంఠిని కన్నీరొలకించమి...

**9. పెండ్లి అన్న పదానికి పూర్తి నిర్వచనం అది హైందవ సంప్రదాయానికి ఎంత వరకు అనుసరిస్తున్నది తెలియచేస్తారా?**

జ. పెళ్ళంటే:

కళంకరహితంగా దంపతులిద్దరూ తమ మనస్సులను ఒకరికొకరు అర్పణ చేసుకోవడం

– లక్ష్మీనారాయణ స్వరూపునిగా వరుని పూజించుట



– జీవితగమనంలో వధువును అతిక్రమించి సంచరించనని వరుని నుండి వాగ్దానము గ్రహించి, వరుని పితరుల తరింపచేయుటకై వధువును దానమిచ్చుట

– తన జీవన కారణంగా భావించి వధువుకు దీర్ఘాయుష్షు కోరుతూ వరుడు కట్టేదే మంగళసూత్రం

– ఒకరి క్షేమం ఇంకొకరు కోరుతూ వధూవరులిద్దరూ సమాన గౌరవంతో తలంబ్రాలతో ఒకరినొకరు జరుపుకొనే సన్మానం

– దేవతల సాక్షిగా తన దాంపత్య సామ్రాజ్యంలోకి యజమానురాలిగా రమ్మని వధువును వరుడు ఆహ్వానించడానికి చిహ్నమే బ్రహ్మముడి.

– సత్సంతానం కోరుతూ వధువు చేతిని వరుడు గ్రహించటమే పాణిగ్రహణం.

– ఆ జీవన సఖ్యత ప్రమాణాన్ని అగ్ని సాక్షిగా సప్తపదితో నమోదు చేసుకుంటారు దంపతులు. తమ తమ దేవ, పితృ, ఋషి ఋణాలు తీర్చుకోవడానికై యువతీ యువకులిద్దరూ ధర్మ బద్ధంగా కలసి జీవించే విధానమే హిందూ వివాహ వ్యవస్థ.

– వధూవరులిద్దరూ పరస్పర జీవితసమసహభాగస్వాములుగా సాగటమే ఆదర్శదాంపత్యము.

**10. నేతాజీ భారత సమాజంలో ఎలాంటి మార్పులు తేవాలనుకున్నారు, ఈ సమాజాన్ని ఎలా మార్చాలనుకున్నారు, సామాజిక ధృక్పథాన్ని వివరించండి?**

ఎస్. క్రిష్ణారావ్ హైద్రాబాద్

జ. నేతాజీ భారతదేశం యొక్క స్వతంత్ర్య సముపార్జనకే ప్రాథమికతను ఇచ్చారు.

మతాలు భిన్నమైనా, ఒక జాతిగా అందరినీ భారత పౌరులుగా తీర్చిదిద్దాలని అనుకున్నారు. సామాజిక న్యాయాన్ని పెంచాలనుకున్నారు. బలవంతులు, సంపన్నులు ఇతరులను శోషణ చేయకుండా ఉండే విధానం తెలుసుకున్నారు.

**11. ముందస్తు ఎన్నికలు ప్రజలపై భారం కాదా? ఎందుకు ముందస్తుగా ఎన్నికలు నిర్వహించాలి.**

జ. ఎన్నికలు ఐదేళ్ళ కోసారి జరగాలి. ముందస్తు ఎన్నికలు జరిగితే ఐదు ఏళ్ళ తరువాత చేయాల్సిన ఖర్చు ముందుగానే చేస్తున్నామన్నమాట. అంత మాత్రాన ఇది నీతి సమ్మతమైనదిగా ఎంచుకోలేము. ప్రభుత్వ విధానంలో, నీతిలో ఏవో విప్లవాత్మకమైన మార్పుని తీసుకురావడానికో, లేక సామాజిక వ్యవస్థలో వినూత్న పద్ధతిని తీసుకురావడానికో ప్రజలు తీర్పును కోరడం కోసం ముందస్తు ఎన్నికలు జరపడం భావ్యమవుతుంది. లేకపోతే కేవలం చట్టసమ్మతం మాత్రంగానే మిగిలిపోతుంది.

## మార్చి 2004

**1. నేటి రాజకీయాలలో విద్యావంతులు ఇమడగలరా? ఎన్నికల సంఘం మాజీ ప్రధానాధికారి లింగ్డో ఎన్నికల రంగంలోకి విద్యావంతులు ముందుకు రావాలి అంటున్నారు కదా! ఇది నేడు ఆచరణ సాధ్యమా?**

ఎన్. గిరిజ, హైదరాబాద్

జ. రాజకీయాల్లోకి నేరస్థులు, నల్ల బజార్‌లో వ్యాపారం చేసేవాళ్ళు, మరే ఉద్యోగం దొరకక పోవడం మూలాన ఇందులో ప్రవేశించే వాళ్ళు, నీతి నిజాయితీలంటే గౌరవం లేనివాళ్ళు, ఎక్కువ సంఖ్యలో ప్రవేశించడం మూలాన రాజకీయాల్లో ఉన్న కొద్దిమందివిద్యావంతులు కూడా పార్టీలచేత వారి ప్రభుత్వాలచేత, దేశానికి, ప్రజలకి నిజంగా శ్రేయస్కరమైన ప్రణాళికలను అమలు చేయలేకపోతున్నారు. అలా అనుకుని విద్యావంతులు, గుణవంతులు దేశక్షేమం కోరేవాళ్ళు, రాజకీయాలకి దూరంగా ఉంటే మరీ నేరమయమైపోయి దేశము, ప్రజలు కూడా నష్టపోతారు. మరో విచారకమైన విషయం. బాగా ధనం వెచ్చించకపోతే ఎంత విద్యావంతుడైనా రాజకీయాల్లో సామాన్య సభ్యుడుగానే ఉండగలడు. కాని యమ్.ఎల్.ఏ., యమ్.పి. కాలేడు. లింగ్డో గారు కూడా అంతమంచి సలహా ఇచ్చినా రాజకీయాలకి దూరంగానే ఉంటున్నారు.



**2. రామకృష్ణ పరమహంస, వివేకానందుల వారిబోధనలలో ప్రముఖాంశాలేవి?**

టి. ఎన్. రాజు, భీమవరం

జ. ప్రతి భారతీయుడు సచ్ఛీలుడు కావాలని, దేశభక్తి పెంపొందించుకోవాలనీ, తోటిమానవులను ప్రేమించి, వారికి సేవ చేయాలనీ భారతదేశం ఒక జగద్గురువుగా ఎదగాలని బోధించారు. విశేషించి వివేకానందులు హిందువులను తెగనాడుతున్న మత మార్పుడులకు పూనుకున్న క్రిస్టియన్, ముస్లింలను ధైర్యంగా, సహేతుకంగా ఖండించి, హిందువులనందరినీ మతమార్పిడికి అమ్ముడు పోవద్దని ఉద్బోధించారు.

**3. ఓటు విలువు తెలియని ఓటర్లు అధికముగా గల దేశములో ప్రజాస్వామ్యానికి అర్థం కలదా?**

పి.వి. రామశర్మ, విశాఖపట్నం

జ. ఓటు ఉండకూడదని, కొంత కాలం అయిన తరువాత మాత్రమే అందరి వయోజనులకు పెట్టడం మంచిదని, రాజేంద్రప్రసాద్, రాజగోపాలచారి వంటి దూరదృష్టి కల దేశ భక్తులు మనం రాజ్యాంగాన్ని ఏర్పరచుకొనే సమయంలో చెప్పారు. కాని, జవహర్‌లాల్ నెహ్రూ గారు వారందర్నీ తిరోగమన వాదులుగా లెక్కించి వయోజన ఓటింగును అమలు పరిచారు. 50 ఏళ్ళు పైన అయినప్పటికి అక్షరాస్యులు 63%, SSLC పాసయినవారు 20% కన్నా తక్కువగా వున్న మన దేశంలో బుర్ర ఓటు చాలా అనర్ధకంగా పరిణమిస్తోంది. కాని దీన్ని రద్దు చేసే సమర్ధత ఎవరికీ లేదు.

**4. కాశ్మీరుకు పరిష్కారం లేదా?**

ఆర్.ఎల్. కుమార్, సూర్యాపేట

జ. కాశ్మీరు సమస్యకు పరిష్కారం ఉంది. ఆర్టికల్ 370ని మనం రాజ్యాంగంలో తాత్కాలిక అంశంగా పేర్కొన్నాం. కాని దీన్ని శాశ్వతం చేయడం మూలాన ముస్లింలు ఎక్కువగా ఉన్నారు. కాబట్టి భారతదేశం యొక్క అవిభాజ్య భాగం కాదని దానికొక ప్రత్యేకత ఉందని, పదే పదే విభాజక శక్తులకు మనం

స్ఫూర్తిని ఇస్తున్నాం. భారతదేశం యొక్క రాష్ట్రాలు ఎన్నిసార్లు పునర్ఘటితమై కొత్త రాష్ట్రాలు : ఉత్తరాంచల్, జార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్, హిమాచల్ ప్రదేశ్ ఇత్యాదిగా ఏర్పరచబడ్డాయి. అదే విధంగా 370 అధికరణ తీసేసి జమ్మూను ఒక రాష్ట్రంగా లడఖ్‌ని కేంద్రపాలిత ప్రాంతంగా పునర్ఘటితం చేసి ఇతర రాష్ట్రాలతో ఉన్న వ్యత్యాసాలను తీసివేసినట్లైతే సమస్య పరిష్కృతం అయ్యేది. చిత్తశుద్ధి, ప్రగాఢ దేశభక్తి, భారతీయత యందు విశ్వాసం ఉన్న రాజకీయ పార్టీలు మన దేశాన్ని ఏలినప్పుడే రావణ కాష్టంలా కాలుతున్న కాశ్మీర్ సమస్య అంతమౌతుంది.

**5. ఎన్నికల సమయంలో "సెక్యులరిజం" అనే మాట వినపడుతున్నది కదా? "సెక్యులరిజం" అంటే ఏమిటి?**

**ఎల్. రాజశేఖర్, కరీంనగర్ ఎల్.**

రాజశేఖర్, కరీంనగర్

జ. ఇతర దేశాల్లో సెక్యులరిజం అంటే ప్రభుత్వం ఏ ఒక్క మతాన్ని పోషించకూడదని, మతం చెప్పిన ప్రకారం పాలన చెయ్యకుండా వుండటం అని అర్థం. కాని మన దేశంలో హిందూమతానికి వ్యతిరేకంగా ఉండటం, క్రిస్టియన్‌లకు, ముస్లింలకు బుజ్జగించే విధంగా ప్రభుత్వ ధనాన్ని ఖర్చుపెట్టడం అనే ఆచరణని సెక్యులరిజం అంటున్నాం.

ఉదా : హిందువులకి కొన్ని చట్టాలు వర్తిస్తాయి కాని, ఆ చట్టాలు ముస్లింలకు వర్తించవు. ముస్లింలు మక్కాకి తీర్థయాత్రకై ప్రభుత్వంచే వందలాది కోట్లు సబ్సిడీగా పొందుతున్నారు. కాని హిందువులు తమ తీర్థయాత్రలకు ప్రభుత్వం సబ్సిడీ పొందకుండా ఉండటమే కాక వారి మీద ట్యాక్స్‌కూడా (ఉదా : వెస్ట్‌బెంగాల్‌లోని గంగా సాగర్ తీర్థయాత్రికులపైన ట్యాక్స్ వేయబడుతోంది.) వేయబడుతోంది. ముస్లింల యొక్క, క్రిస్టియన్‌ల యొక్క ప్రార్థనా స్థలాలలో ప్రభుత్వ జోక్యం లేదు కాని హిందూ దేవాలయాలన్నిటినీ ప్రభుత్వ యజమాన్యంలోకి తీసుకుంది. క్రిస్టియన్‌లు, ముస్లింలు తమకి ఇష్టంవచ్చినన్ని (ఏ విషయాన్ని గురించైనా) విద్యా సంస్థలు స్థాపించుకోవచ్చు, కాని హిందువులు అలా చేసుకోవడానికి వీలులేదు. ప్రభుత్వ నిబంధనలకే కట్టుబడి ఉండాలి.



**మన దేశంలో "సెక్యులరిజం" ఏ పాళ్ళలో పాటించబడుతోంది?**

జ. పైన ఇచ్చిన సమాధానం నుండి సెక్యులరిజం అంటే హిందువులకు వ్యతిరేకతా లేక ఉదాసీనత, మైనారిటీలకు బుజ్జగింపు అని అర్థం చేసుకోవచ్చు. ఈ సెక్యులరిజం ఛాయ క్రింద ముస్లింలు 9% నుండి 15% వరకు పెరిగిపోయారని క్రిస్టియన్‌లు 2.5% నుండి 10% వరకు పెరిగిపోయారని ప్రకటిస్తూ వివిధ రాజకీయ పార్టీలను తమ జనాభా దామాషా/ నిష్పత్తిలో తమకు MLA, MP సీట్లు కేటాయించాలని గర్జన చేస్తున్నారు. ఈ విధంగా హిందువులు నిర్లక్ష్యంపబడి, కుటుంబాలు నియంత్రించుకుంటుంటే, ఇతరులు అంతులేని సంతానంతో సెక్యులరిజం, ఛత్ర ఛాయల క్రింద పెరిగి పెరిగి హిందువులను అల్ప సంఖ్యాకులుగా తయారు చేస్తారు. ఇందుకు నిదర్శనం కేరళ. ఈ క్రింది పట్టికలో కర్ణాటక ప్రభుత్వం హిందూ దేవాలయాలకు వచ్చే భక్తుల కానుకలను ముస్లింలకోసం, క్రిస్టియన్‌లకోసం ఖర్చు పెడుతుంది ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఈ విధంగానే హిందువుల దేవాలయాల రాబడినుంచి షాదిఖానాలను, ఉర్దూఘర్‌లను నిర్మించడానికి, మసీదుల, చర్చిల మరమత్తుకని ధనం వెచ్చించబడుతోంది. వివరాలు లభ్యమైనప్పుడు పేపర్లలో తెలుసుకోవచ్చు. 1947లో 86% వరకు ఉన్న హిందువులు ఈనాడు దాదాపుగా మైనారిటీ అయిపోయారు.

## HINDU TEMPLES' MONEY SPENT ON MADRASSAS & CHURCHES

**how he temple collections were spent by the government of karnatak**

| Year | Collections Revenue | Given to Madrassa/ Mosque | Given to Churches | Spenton Temples | Used for other Purposes |
|---|---|---|---|---|---|
| 1997 | 52.35 | 9.25 (17.6) | 3.00 (5.7) | 17.33 (33.1) | 22.77 (rural development) |
| 1998 | 58.35 | 14.25 (24.4) | 5.00 (8.5) | 16.50 (28.2) | 22.60 (Medical & Health) |
| 1999 | 65.35 | 27.00 (41.5) | 8.00 (12.9) | 15.0 (22.9) | 17.35 |
| 2000 | 69.96 | 35.00 (50) | 8.00 (11.4) | 13.75 (19.6) | 13.21 |

| | | | | | |
|---|---|---|---|---|---|
| 2001 | 71.60 | 45.00 (62.8) | 10.0 (14) | 11.50 (16.0) | 5.10 |
| 2002 | 72.00 | 50.00 (69.4) | 10.00 (13.8) | 10.00 (13.8) | 2.00 |

- ❖ Figures in brackets are %
- ❖ About 50,000 of the 2,54,038 temples in Karnataka are about to be closed down because Government spends nothng on them for maintenance
- ❖ Many Priests have not received salaries for more than six months; surviving on offerings dropped on Aarati plates!

**6. నిజాయితీగా బ్రతికేవారిని ఈ సమాజం అలా బ్రతక నివ్వదు ఎందుకు? వాళ్ళను బట్టి మన పద్ధతి మార్చుకోవాలా? అవసరం లేదా?**

జి.బి. అంకమ్మరావు, పాపినేనిపల్లి

జ. ప్రభుత్వం, ప్రజల యొక్క జీవితంలో అధికాధికంగా కలుగజేసుకోవడం మూలానా, శాసనాలని, నియమాలనూ ఉపయోగించుకొని భ్రష్టాచారులైన ప్రభుత్వ అధికారులూ, నీతి నియమాలను ఉల్లంఘించి ధనార్జన చేస్తున్న రాజకీయ ముసుగులో వున్న బకాసురులు, రావణాసురులు నిజాయితీగా బతికేవారికి కొంత బాధ కల్పిస్తున్నారు. కాని, సచ్ఛీలత, ధర్మనిష్ఠత, ఆత్మవిశ్వాసం ఉన్నవారు, తమ పద్ధతిని మార్చుకోకుండా సచ్ఛీలురుగానే యుండాలి.

**7. విద్య విజ్ఞానాన్ని, విజ్ఞానం సమాజ శ్రేయస్సును పెంపొందించాలి. కాని నేటి ఆధునిక యుగంలో విద్యార్థులే లంచగొండులు, అక్రమార్కులుగా తయారై సమాజ వినాశనానికి కారకులవుచున్నారు? దీనిని నిరోధించే మార్గమే లేదా? నిరోధించ వలసిన బాధ్యత ఎవరిది?**

పి. యస్. రెడ్డి, కోయరోలు

జ. మన విద్యని, రాక్షస విద్యగా మార్చడం మూలాన చదువుకున్న వారనబడే వారిలో అనైతిక, లంచగొండితనం, అక్రమార్జన ఎక్కువై సమాజానికి భయం కలిగిస్తున్నాయి. దీన్ని నిరోధించడం అందరి బాధ్యత. ఇందులో అత్యధికంగా



తల్లి, తండ్రి, గురువుల బాధ్యత ఉంది. తల్లితండ్రులు పిల్లలకు మార్గదర్శకులుగా ఉండాలి. నీతిని, దైవభక్తిని, నిజాయితీని వ్యక్తపరిచే కథలను బోధించాలి. మనం నీతి శతకాలని పిల్లలకు నేర్పి అందులోని అర్థాన్ని విలువలను వారిలో గౌరవాన్ని కలిగించాలి.

**8. మీరు నా మోర్స్‌కోడ్ ప్రశ్న మొదటి భాగానికి సమాధానం ఇవ్వలేదు. ఇప్పుడంటే కమ్యూనికేషన్ రంగంలో మార్పులు వచ్చినాయి. కాని నా ప్రశ్న కేవలం మోర్స్‌కోడ్ వ్యాప్తిలో ఉన్నప్పటిది. దయచేసి జవాబు తప్పక రాసి నా సందేహం తీర్చగలరు. ఆంగ్లంరాని దేశస్తులు ఎట్లా ప్రయోగించేవారు?**

కె. రామరావు, హైద్రాబాద

జ. మోర్స్‌కోడ్ అనేది English లిపికి సంబంధించినది. France, Italy, Spain, England మరియు English మాట్లాడే దేశాలన్నిటికీ లిపి ఒక్కటే కావడం మూలాన ఈ దేశాలన్నీ కూడా మోర్స్‌కోడ్‌ని ఉపయోగించుకున్నాయి. జపాన్, చైనా, రష్యా దేశాల్లో వారి భాష, లిపి వేరువోర్స్‌కోడ్‌ను ఉపయోగించుకోవడానికి వాళ్ళు వాళ్ళ భాషని English Phonetics ద్వారా వాడారు.

**9. కేంద్రప్రభుత్వం వారు "భారత్ వెలిగిపోతోంది" అని అంటున్నారు కదా! అందులో ఎంతవరకు నిజం వుంది?**

పి. రాంబాబు, ఏలూరు

జ. భారత్ నిజంగానే వెలిగిపోతుంది. నెహ్రూవియన్ సోషలిజం ఉన్నంత కాలం (1947 నుండి 1991 వరకు) మన దేశంలో స్థూల ఉత్పత్తి 2.5-3.5 మధ్య ఉండేది. జనాభా కూడా ఆ నిష్పత్తిలో పెరగడం మూలాన తలసరి ఆదాయం సంగకి 1% కన్నా ఎక్కువ పెరగలేదు. ప్రభుత్వం యొక్క Permit- Licence- Quata Socialism కాబట్టి ప్రజలయొక్క చొరవకు ఆస్కారం లేకపోయింది. ఇటీవల Socialism, Communism ఈ దేశానికి తోడ్పాటు చేసేదికాదు అని గుర్తించడంతో ఉదార ఆర్థిక విధానాన్ని అవలంబించడం మూలాన

విద్యావంతులైన చొరవ వున్న ఎంతోమంది వ్యక్తులు, కంపెనీలు ముందుకు వచ్చి వివిధ రంగాల్లో వాణిజ్యాన్ని విశ్లేషించి మేధాశక్తికి కావలసిన ఐ.టి. రంగంలో ప్రగతిని సాధిస్తున్నాం. అందుకనే ప్రస్తుతం స్థూల ఉత్పత్తి సాలీన 8% పెరుగుతోంది. జనాభా పెరుగుదల 2% తగ్గడం మూలాన తలసరి ఆదాయం ఇదివరలోలాగా 60 సంIIలాకి రెట్టింపుగా కాక, 10,12 సంIIల్లోనే రెట్టింపు అయ్యే అవకాశం వచ్చింది. దుర్మార్గులు Nehruvian Socialism కాలాల్లో ఉన్న అభివృద్ధి శాతాన్ని హిందువులని కించబరిచే పద్ధతుల్లో Hindu rate of Growth అన్నారు. సోషలిస్టులు పాలించినప్పుడు Hindu rate of Growth ఎలా వస్తుంది? భారతదేశంలోని హిందువులు అంటే ఏహ్యా భావం లేని ప్రస్తుత పాలనలోనే నిజమైన Hindu rate of Growth 6.5 నుండి 8.0 వరకు సాధ్యం అవుతుంది.

## ఏప్రిల్ 2004

**1. కాశ్మీర్ ప్రభుత్వం పర్మనెంట్ రెసిడెంట్ (అనర్హత) బిల్లు పూర్వాపరాలు ఏమిటండి?**

జి. కళ్యాణి, కాకినాడ

జ. భారతదేశంలో మరే రాష్ట్రానికీ లేని విధంగా కాశ్మీరుకు ప్రత్యేకమైన ప్రతిపత్తిని భారత రాజ్యాంగం యొక్క అధికరణం 370 క్రింద తాత్కాలిక ప్రాతిపదికనిచ్చినా, వెన్నులేని, ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యము భారతదేశం యొక్క అఖండత యందు గౌరవం లేని ప్రభుత్వాలు ఈ ప్రతిపత్తిని శాశ్వతీకరణం చేస్తున్నాయి. ఏ రాష్ట్రానికీ లేని విధంగా కాశ్మీరుకు ఒక రాజ్యాంగం కూడా ఏర్పరచుకోనిచ్చాం. ఇందుమూలంగానే విభజనశక్తులు కాశ్మీరియత్ ముసుగులో ముస్లింపాలన కాంక్షించే నాయకులు, పార్టీలు ఎక్కువైపోతూ వచ్చాయి. ముస్లింలు



ఆధిక్యాన్ని నిలుపుకొనడం కోసం, ఇతర ప్రాంతాల్లోని భారతీయులను అక్కడ భూమిని కొననీయరు. కాని కాశ్మీరీయులు యావత్భారతంలో ఆస్తికొనుక్కోవచ్చు. స్థిరపడవచ్చు. అనుభవించవచ్చు. పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీరు నుండి పాకిస్థాన్ యొక్క ఇతర ప్రాంతాల్నుండి శరణార్థులు ఎంతమందో కాశ్మీరుకు వచ్చారు. వారిలో ముస్లిములకు పౌరహక్కులిచ్చారు. కాని హిందువులకివ్వలేదు. కాశ్మీరీ స్త్రీలు ఇతర రాష్ట్రాలలో ఎవరినైనా వివాహము చేసుకున్నట్లయితే ఆవిడకు వారసత్వపు హక్కును తిరస్కరిస్తూ వచ్చారు. ఆ విధంగా వివాహమాడి వారసత్వాన్ని పోగొట్టుకోవడం లింగ వివక్షత, కనక ఇది భారత రాజ్యాంగానికి సమ్మతము కాదని, సుప్రీంకోర్టు నిర్ణయం చేయడం మూలాన, దాన్ని వమ్ము చేయడం కోసం పర్మనెంటు రెసిడెంట్ (అనర్హత) బిల్లును కాంగ్రెస్ వారి మద్ధతుతో ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న PDP వారు పాస్‌చేస్తారు. ఇది మహా అఘాయిత్యం. ఆశ్చర్యం ఏమిటంటే సెక్యులరిస్టులనబడేవారు, మైనారిటీలకు రక్షకులుగా వుండేవారు ఈ చట్టానికి వ్యతిరేకంగా నిరసనగా సభలు, ఉద్యమాలు నిర్వహించడంలేదు. మూడు లక్షలపై చిలుకుగా హిందువులు, ముస్లిం ఆధిక్యత గల్గిన కాశ్మీరు నుంచి వెళ్ళగొట్టబడ్డారు. వీరు దశాబ్దంపైగా ఢిల్లీ మొదలైన ప్రాంతాల్లో కాందిశీకులుగా వుంటున్నారు. అందులోని కొంతమంది స్త్రీలు స్థానికులను వివాహం చేసుకుంటున్నారు. ఇటువంటివారు ఏ పరిస్థితుల్లో కూడా కాశ్మీర్‌లో స్థిరపడకూడదనే దురుద్దేశంతో ఈ చట్టం చేసారు.

**2. బ్రిటన్ వంటి దేశాలలో ప్రతిపక్షాలు షాడో క్యాబినెట్లను నియమిస్తారని విన్నాం! అంటే ఏమిటండి?**

జ. పాలక పక్షంలో ప్రతి ప్రభుత్వం శాఖ నడవడానికి ఒక మంత్రి ఉంటారు. ప్రతిపక్షంలో వున్న పార్టీ ఊకదంపుడు ఉపన్యాసాలు, విమర్శలు చేయకుండా, ప్రతి విభాగాన్ని గూర్చి క్షుణ్ణంగా అధ్యయనం చేసి, పాలకపక్షం యొక్క ప్రణాళికలు నడవడిని, కార్యాచరణను విద్వత్తుతో విమర్శించడం కోసం విపక్షం కూడా అధికారం లేని మంత్రులను ప్రతి విభాగానికి నియమిస్తుంది. దీన్నే షాడో కాబినెట్ అంటారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్షాలు ఇలా చేయవలసిన అవసరం మనదేశంలో కూడా ఎంతో ఉంది.

**3. మన రాష్ట్రంలో నానాటికీ తెలుగు భాష, సంస్కృతి క్షీణించిపోతుంది. "మమ్మీ"ల హోరులో మన "అమ్మ" చిరునామా కొట్టుకుపోతుంది. నలుగురుకలిసిన చోట ఇంగ్లీషు రానివాడు అనాగరికుడై పోతున్నాడు. నేడు చాలా మంది విద్యార్థులకు పొట్టి శ్రీరాములు గారు ఎవరో తెలియని దౌర్భాగ్యం దాపురించింది. మన భాష, సంస్కృతి మరో దశాబ్ద కాలంలో పూర్తిగా క్షీణించుకుపోయే స్థితికి వచ్చింది. మరి దీనిపై మీ అభిప్రాయం? దీనికి కారణం ఎవరంటారు? దీనికి చర్యలేవి?**

ఆర్. శ్రీను ముదిరాజ్, హైద్రాబాద్

జ. నిజమే. తెలుగుభాష కృష్ణపక్ష చంద్రుడులాగా నానాటికి కుదించుకుపోయే పరిస్థితి ఏర్పడుతోంది. దీనికి ప్రథమకారణం తల్లితండ్రులకు తెలుగుయందు గౌరవం, విశ్వాసం లేకపోవడం, భారతీయత అంటే న్యూనతా భావం ఉండడం మొదటి కారణం. రెండవది పాలకులు, ధనవంతులు, తమ సంతతిని ఇంగ్లీషు మీడియం స్కూళ్ళలోనే చదివించడం. మూడవది ఇతర భాషల్లో వున్న విజ్ఞానానికి, తదితర అంశాలకు సంబంధించిన సాహిత్యాన్ని తెలుగులో అనువాదం చేసే ప్రణాళిక లేకపోవడం మూలాన జాతీయంగా, అంతర్జాతీయంగా పోటికి పనికి వచ్చే చదువులు ఇంగ్లీషు మాధ్యమంలోనే వున్నాయనే భావన దీనికి విరుగుడు. ఆరంభం ప్రతి ఇంట్లో తల్లితండ్రులు తెలుగు మాట్లాడడం, పిల్లలచేత తెలుగు పుస్తకాలు, పత్రికలు చదివించడం అవసరం.

**4. ఒకే వ్యక్తి ఒకసారి రెండు స్థానాల నుంచి పోటీచేయడం న్యాయమా?**

ఎల్. రవి, నిజిమాబాద్

జ. న్యాయసమ్మతమే కాని, నీతిబాహ్యం. ఇలా పోటీ చేయడం మూలాన తిరిగి ఎన్నికలు జరిపించడానికి అదనపు వృధాఖర్చు అవుతుంది. దీనికి విరుగుడు, ఆ ఖర్చంతా రెండు స్థానాల్లో పోటీచేసి, రెండుచోట్ల గెలిచి, ఒక సీటుకు రాజీనామా ఇచ్చిన ఆ అభ్యర్థిమీద వేయడమే.



**5. మన రాష్ట్రం రెండుగా విడిపోవలసిన అవసరం ఉందా?**

జ. అవసరమైతే లేదు. కాని పుర్రెలో పుట్టిన బుద్ధి పుల్లలతోనే పోతుందన్నట్లుగా, ఈ విభాజక బుద్ధులు అపుడపుడు అసంతృప్తి నాయకుల్లో రావడం, వారు తమ తమ స్వార్థ ప్రయోజనాలకొరకు ఈ ఉద్యమాలు నడపడం ఏదో ప్రయోజనం పొందగానే ఉద్యమాన్ని వదలివేయడం ఆనవాయితీ అయిపోయింది.

**6. దాదాపు 70/80 వేలు నిరుద్యోగులైన B.Ed., గ్రాడ్యుయేట్స్, మన రాష్ట్రంలో వుండగా, ఇంకా B.Ed., లను ప్రభుత్వం ఎందుకు ఒప్పుకుంటుంది? మైనారిటీ B.Ed., కాలేజీలు 30% పైన ఎందుకు అనుమతించబడ్డాయి?**

కె. శ్రీని వాస్, హైద్రాబాద్

జ. ఉద్యోగం హామీ ఇవ్వలేని ప్రభుత్వానికి ఇంకా, ఇంకా కాలేజీలు కావాలని, ఎస్సెన్షియాలిటీ సర్టిఫికెట్టు, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు ఇవ్వడం ఒక వింత. అందులోనూ 90 వేల B.Ed. Graduate లు నిరుద్యోగులుగా వుండగా, ఇంకా 90 కాలేజీలను అనుమతించడం స్వంతంగా ఆలోచించేవాళ్ళకు అర్థంకాదు. ఆంధ్రప్రదేశ్‌లో 1.4% వున్న క్రిస్టియన్లకు 30% B.Ed., కాలేజీలను అనుమతించడం, 4588 సీట్లు ఉండగా, ప్రవేశార్హతను పొందినవారు కేవలం 3830 మందే వుండగా, ఇంకా అంతులేనన్ని B.Ed., కాలేజీలనివ్వడం, మైనారిటీల బుజ్జగింపు చర్యగా అనిపిస్తోంది. అదనపు సీట్లన్ని హిందువులకు అమ్ముకొని, ఆ యజమాన్యాలు డబ్బు చేసుకోవడానికి అవకాశం ఏర్పడుతోంది. ఆ డబ్బు ఏ ప్రయోజనాలకు ఉపయోగిస్తున్నారో చూడగలిగే వారికి తేలికగా అర్థమవుతుంది. ఈ క్రింది పట్టికలు చూడండి.

## Christian B.Ed Colleges : 91

| Total Seats | Seats 15% that can be officially sold to non-minorities | Seats for Christians | Christians qualified | Ratio |
|---|---|---|---|---|
| (1) | (2) | (3) | (4) | (3) to (4) |
| 5,400 | 810 | 4,590 | 3,830 | 1.0:0:8 |

# Christian B.Ed Colleges

| Subject | Maths | Biology | Physics | Social Studies |
|---|---|---|---|---|
| Seats to be given | 1606 | 1377 | 688 | 917 |
| Christians qualified | 586 | 441 | 122 | 2,681 |

**7. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు తరతరాల ఎన్నికల్లో వేసే ఓటుపై ఆధారపడి వున్నాయి. అంతటి ప్రాముఖ్యంగల ఓటును సద్వినియోగం చేసుకునే సమయంలో మంచి నాయకులను ప్రజలు ఎలా అంచనా వేయాలి?**

జి. ఆశోక్, గోధూర్

జ. రాజకీయమనేది వీరి సంపాదనకీ, మనుగడకీ ఒక వృత్తియా లేక శాసనసభ్యుడిగా వుండి ప్రజలకుపయోగపడే ప్రణాళికలను ప్రభుత్వము చేత చేపట్టడానికి కృషి చేస్తారా; మన వూరి నుంచి ఎన్నిక అయి, రాజధానిలో భూమి సంపాదించి, ఇళ్ళుకట్టుకుని, అక్కడ వ్యాపారాలు చేసుకుంటూ, చుట్టం చూపులా మనవూరికి వస్తారా? ఎన్నిక అయిన తరువాత మనకు అందుబాటులో వుంటాడా; తన పదవిని తన కుటుంబ ప్రయోజనాలకు మాత్రమే ఉపయోగించుకుంటాడా, అధ్యయనమందు, నైపుణ్యాన్ని పెంచుకొనుటలో నీతినియమాలయందు, సాహిత్య సంస్కృతులయందు అభిరుచి వున్నవా అని అంచాన వేసుకుని, ఎవరియందు ఈ సద్గుణాలు ఎక్కువగా వున్నాయో వారికి ఓటు వేయాలి.

**8. ఎలక్షన్లలో పోటీ చేయడానికి నేరచరితులకి టిక్కెట్టు ఇవ్వద్దని అంటున్నారు నేరచరితులంటే ఎవరు? అది నిర్ణయించేది ఎవరు? అసలు అది జరిగేపనేనా?**

కె. రామారావు, హైద్రాబాద్

జ. మన రాష్ట్రంలో లోక్‌సత్తా అద్భుతమైన పని చేసింది ఎలక్షన్లలో ఎవరైతే పోటీ చేయదలుచుకున్నారో వారి గురించి, వారి మీద ఏ పోలీసుస్టేషన్‌లో అయినా ఏ కోర్టుల్లో అయినా, రిపోర్టులుగానీ, కేసులుగాని వున్నాయా అనే వివరాలు సేకరించి అలా వున్న 51 మంది వ్యక్తుల పేర్లను వారి మీదవున్న అభియోగములను బహిర్గతం చేసారు. ఇది శ్లాఘనీయమైన సాహసిక చర్య.





**9. ప్రైవేట్ రంగంలో కూడా రిజర్వేషన్లను అమలు చేయాలి అనే వాదం సరైనదేనా?**

పి. గీతా, కంకిపాడు

జ. ఈ వాదన ఇసుమంతైనా సరికాదు. ప్రభుత్వంలో, ప్రభుత్వ రంగ సంస్థల్లో, విద్యాలయాల్లో, రిజర్వేషన్లు, ఇంకెంతకాలం సాగాలి అనేది చర్చనీయాంశమవుతున్నది. ఎందుకనగా దీనివల్ల ఆశించిన మేరకు ఫలితాలు లేవని, మీదు మిక్కిలి కొన్ని దుష్పరిణామాలు వస్తున్నాయని తెలుస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా విద్యావంతులు ఉద్యోగం కోసం, కంపెనీలు విఫణవీధిలో తమ వాటాకోసం పోటీ పడవలసిన అవసరం వున్నప్పుడు, తన డబ్బును వెచ్చించి అర్హతలను సడలింపుచేసి ఉద్యోగాలిస్తే, ఆ కంపెనీలు, కుంటుపడితే, దివాళాపడితే ఎవరికినష్టం. తమ కంట్లో తామే పొడుచుకొనడానికి ఎవరు సిద్ధపడతారు. అర్హతలు సడలించే రిజర్వేషన్ల పద్ధతికన్నా, వెనుకబడిన వారికి ఉత్తమ ప్రమాణంకల్గిన విద్యనభ్యసించే పద్ధతులను మనం చేపట్టాలి. దానికి సమాజం ఎంత ఖర్చుపెట్టినా, ప్రయోజనకరమే.

**10. మేనిఫెస్టోల వలన ఉపయోగం ఏమిటి?**

జ. మానిఫెస్టోల వల్ల ఏమీ ఉపయోగం లేదు. ఇవన్నీ నీళ్ళమూటలు! పదమూడుసార్లు జరిగిన లోక్‌సభ ఎన్నికలకు పేదరికం నిర్మూలిస్తామని, కోట్లాది ఉద్యోగాలు కల్పిస్తామని, వెనుకబడినవారిని, బలహీనవర్గాలను, 'క్రింద'పడినవారిని, ప్రక్కకు తోయబడ్డవారిని, మైనారిటీలను, స్త్రీలను, వృద్ధులను బాలబాలికలను, వికలాంగులను, హిజ్రాలను ఉద్ధరిస్తామని, ఇళ్ళు కట్టిస్తామని, బట్టలిస్తామని, నీళ్ళిస్తామనే మరెన్నెన్నోవాగ్దానాలను ప్రతిపార్టీ మానిఫెస్టోలు నాటకీయంగా ప్రచురించాయి. ఎన్ని పార్టీలు ప్రభుత్వంలోకి వచ్చినా, ఈ వాగ్దానాలన్నీ భాషా ప్రయోగానికి మాత్రమే పరిమిత మయ్యాయి. చెల్లుబడికాని చెక్కులను ఇచ్చినందుకు, ఇచ్చిన వారిని నేరస్తులుగా అరెస్టుచేసి, ఈ నేరానికి శిక్షవేసే చట్టమువుంది. అదే విధంగా ఈ వాగ్దానాలను నెరవేర్చని పార్టీల అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గసభ్యులకు అధినేతలను, నేరస్థులుగా గుర్తించి, జైల్లోపెట్టి విచారించే చట్టాన్ని తీసుకువస్తే బాగుంటుంది.

# మే 2004

**1. ఈ ఎన్నికలలో వేలాదిమంది నిజమైన ఓటర్లకు ఓటుహక్కు లేకుండా పోయింది. దీనికి బాధ్యులెవరు?**

టి. వి. లక్ష్మణరాజు

జ. నిజమైన ఓటర్లకు ఓటు లేకుండా పోవడానికి ఎన్నికల కమీషన్, నాగరికులు ఇద్దరూ బాధ్యులే, ఓటర్‌లను నమోదుచేస్తున్నాం; పట్టికలను తనిఖీ చేసి మీపేరు ఉందో లేదో చూసుకోండి; లేకపోతే ఫలానా వారికి నిర్దిష్ట పద్ధతిలో సరియైన సమయంలో ఫిర్యాదుచేసి, మీ పేరును నమోదుచేసికోండని, ఎన్నికల కమీషన్ రాష్ట్రంలోని అధికారులు ప్రకటనలను చేశారు. మనం, మన విధిని నిర్వర్తించినట్లయితే ఓటు కోల్పోయే వాళ్ళం కాదు.

మరి ఎవరైతే ఇంటింటికి తిరిగి ఓటర్లను నమోదు చేశారో, వారు తమ పనిని చిత్తశుద్ధితో చేయక పోవడం మూలాన, ఎంతోమంది ఓటర్లు తమ హక్కును కోల్పోయారు. వీరిని అధికారులు గుర్తించడం కష్టం కాదు. ఓటు కోల్పోయిన ప్రతి ఒక్కరూ, సంబంధిత అధికారికి ఫిర్యాదుచేసి, నేరస్థులను శిక్షింపచేయాలి.

**2. ఓటు గుర్తింపు కార్డులు వున్నా ఓటు లేదన్నారు? ఎందువలన?**

సి. నాగేశ్వరరావు, హైద్రాబాద్

జ. ఓటరు పట్టికలో పేరులేకపోతే పోలింగ్ ఆఫీసర్లు ఎలా ఓటు చేయనీయగలరు? ఉదాహరణకు 9 ఏండ్లనాడు, నాకు ఓటరు గుర్తింపు కార్డు వచ్చింది. ఈ మధ్య తిరిగి నమోదుచేస్తున్నప్పుడు, నా నివాసం ఉద్యోగరీత్యా మరో పట్నంలో ఉన్నానుకోండి. నా పేరు తీసి వేయవచ్చు. అందుకని గుర్తింపు కార్డు ఉన్నంత మాత్రానే ఓటరు అవడం కష్టం.



**3. ఎగ్జిట్ పోల్స్ ప్రజలను ఎంత వరకు ప్రభావితం చేయగలవు?**

జ. ఎగ్జిట్ పోల్స్ కృతనిశ్చయం లేని వారిని తమంతకు తాము ఆలోచించుకోలేని వాళ్ళనూ, కొంతవరకుజరగబోయే పోల్సులో ప్రభావితం చేయవచ్చు. ఇతరులు ఎవరికి వేస్తున్నారో వాళ్ళకి నేనూ ఓటు వేస్తానసుకోకుండా, స్వతంత్ర్యంగా ఆలోచించి నిర్ణయానికి రాగలిగినవారే విజ్ఞులు.

**4. బెస్ట్ బేకరీ కేసు పూర్వాపరాలు ఏమిటండీ?**

కె. నాగమణి, నెల్లూరు

జ. బెస్ట్ బేకరీ కేసు కొంతమంది రాజకీయ వాదులూ, హిందూ ద్వేషుల చేతుల్లో పావయింది. ఒక సాక్షి ఇతరుల చేత ప్రభావితమై, ప్రలోభితురాలై సాక్ష్యాన్ని మార్చుకుంటోంది. ఆ బెడదకు "సెక్యులరిస్ట్" లనే వాళ్ళు, గుజరాత్ ప్రభుత్వాన్ని, విశేషించి, నరేంద్రమోడిని మతతత్వవాదులుగా ముద్రవేయడం కోసం, ఉపయోగించుకుంటున్నారు. హిందువులకు జరిగిన అన్యాయాలను పట్టించుకోకుండా, ఒక మతం వారికి జరిగిన ప్రతీకార అన్యాయాన్ని, ఎల్లకాలమూ, అన్ని దేశాల్లో ప్రచారం చేయడం దురుద్దేశపూరితమని తోస్తోంది.

**5. ఈ ఎన్నికలలో "ప్రజాస్వామ్యం" ఉందంటారా?**

బి. విజయమారుతి, మహబూబ్‌నగర్

జ. ఈ ఎన్నికల్లోనూ, ముందు జరిగిన ఎన్నికల్లోనూ ప్రజాస్వామ్యం పూర్తిగా లేదనడం భావ్యం కాదు. అందరికీ ఓటు ఇచ్చారు. చదువుకొని, వివేకాన్ని పెంచుకొని, ఏ పార్టీలు, ఏ పోటీదారు ఎంత నిజాయితీ పరుడూ, వాళ్ళిచ్చే వాగ్దానాలు ఆచరణీయమైనవేనా, పనిచేయకుండా లబ్దిపొందడం సాధ్యమా, ఇలా విశ్లేషించుకొని ఓటు వేయగలిగిన సమర్ధత అందరిలో లేదు. అందుచే కొందరు తాత్కాలికోపశమనలబ్దితో (మద్యం, ద్రవ్యం, చీరలు, సైకిళ్ళు.....) ఓట్లు వేస్తున్నారు. అలావేసే స్వాతంత్ర్యం, హక్కు వారికి ఉంది. మన నాయకుల వైఫల్యాలే ధీర్ఘకాలిక లోకకళ్యాణానికి ఎదురవుతున్నాయి. "ప్రజలు చెడుగైన పాలించు ప్రభునితప్పు" అనే లోకోక్తి యుంది. సరియైన విద్య, అవగాహన అందరికీ ఉంటే మన ప్రజాస్వామ్యం ఎక్కువ గుణవంతంగా ఉంటుంది.

**6. మేనిఫెస్టోలలో ప్రకటించి అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయకపోతే ఏం చేయాలి?**

పి. వెంకట రామరాజు, వికారాబద్

జ. చెల్లని చెక్కులు ఇవ్వడం నేరం. వారికి శిక్షాస్మృతి ననుసరించి శిక్షపడుతోంది. అలాగా ఇచ్చిన హామీల ద్వారా ఓట్లు దండుకొని, హామీలను నెరవేర్చని వారిని దండించే చట్టం ఎంతయినా అవసరం. ఇలా అని నేను అంటే, ఒక పార్టీ నాయకుడన్నారు. "హామీలను నెరవేర్చనందుకు, వచ్చే ఎన్నికల్లో మమ్మల్ని ఓడించి ప్రజలు శిక్షిస్తున్నారు" ఈ శిక్ష చాలుతుందా? ఆలోచించండి?

**7. విద్యార్థులు సెలవుల్లో ఏవిధంగా గడపాలి? మీరు విద్యార్థి దశలో ఏం చేసేవారు?**

ఎం. వెణుగోపాలరావు, గుంటూరు

జ. నేను వ్యవసాయదారుని పుత్రుణ్ణి. సెలవుల్లో వ్యవసాయం పనులు చేసేవాణ్ణి, చేలగట్లు మరమ్మతు, ఆకుమడులకు నీరు పెట్టడం, పొలం దున్నటం, కోతలుకొయడం, కుప్ప నూర్చడం ఇత్యాదులు, ఆ పని లేకపోతే లైబ్రరీనుండి పుస్తకాలు తెచ్చుకొని చదివేవాణ్ణి, మేం నాటకాలు వేసే వాళ్ళం. ఊళ్ళో పరిశుభ్రం చేయడానికి ఉద్యమించేవాళ్ళం. ప్రతివిద్యార్థి ఇటువంటి పనులు చేస్తే కుటుంబం, గ్రామం, దేశం బాగుపడతాయి.

**8. కార్యకర్తల పేరిట వందలకొద్ది యువతను రాజకీయ నాయకులు తమ వెంట తిప్పుకుంటూ వుంటారు. ఇది దేశ యువశక్తిని దుర్వినియోగం చేయటం కాదా? దేశ భవిష్యత్తు పై ఆసక్తి గల నాయకులు చేయదగిన పనేనా ఇది?**

కె. రామారావు, హైద్రాబాద్

జ. యువతను రాజకీయ నాయకులు తమ ప్రయోజనాలకు ఉపయోగించడం గర్హనీయం. అలాకాకుండా సెలవుల్లో వారిని, సమావేశపరచి సాంఘీక, సామాజిక, ఆర్థిక, రాజకీయ విషయాల్లో నిష్ణాతులచేత తరగతులు



నిర్వహిస్తే బాగుంటుంది. ఒకప్పుడు మనదేశంలోనే ప్రప్రథమంగా ఆచార్య ఎన్.జి.రంగా గారు నిడుబ్రోలులో రాజకీయ పాఠశాలను స్థాపించి ఎంతోమంది యువకులను చైతన్యవంతులుగా, నాయకులుగా, ప్రజాసేవకులుగా తయారు చేశారు. తరువాత పుచ్చలపల్లి సుందరయ్య గారు కూడా అటువంటి తరగతుల్ని నిర్వహించేవారు.

ఆ విధంగా ఇప్పటి రాజకీయనాయకులూ, పార్టీలు కృషిచేస్తే దేశానికి, వ్యక్తులకు ఎంతో మేలు జరుగుతుంది.

**9. బ్యాంకుల్లో ఉపయోగించే "క్రెడిట్‌కార్డు"ను ఎవరు, ఎప్పుడు కనుగొన్నారు? తొలుత ఏ దేశం కనిపెట్టింది?**

వాసాల నర్సయ్య మెట్‌పల్లి

జ. క్రెడిట్ కార్డులను ప్రప్రథమంగా డైనర్స్ క్లబ్ 1950లో ప్రవేశపెట్టింది. దాని సృష్టికర్త ఆ క్లబ్ యొక్క యజమాని ఫ్రాంక్‌మాక్‌నమారా. ఈ ప్రయోగం అమెరికాలో జరిగింది. ద్వితీయులుగా అమెరికన్ ఎక్స్‌ప్రెస్ అనే సంస్థ వాడకంలోకి వచ్చింది. 1951లో డైనర్స్ క్లబ్ న్యూయార్క్‌లో 200 మంది పెద్ద మనుషులకు 27 రెస్టారెంటుల్లో ఉపయోగయుక్తమైన క్రెడిట్ కార్డులను ఇచ్చింది. 1970లో ఇటువంటి కార్డులకు ప్రమాణాలు ఏర్పరచబడ్డాయి. దాంతో బహుళ వ్యాప్తి లభించింది.

**10. స్విస్ బ్యాంక్‌లో డబ్బు ఏ రూపంలో దాస్తారు. డాలర్ రూపంలోనా, దానికి వడ్డీ ఇస్తారా? ఇతర విషయాలు వివరించండి.**

సూరపనేని కృష్ణారావు, హైద్రాబాద్

జ. స్విస్ బ్యాంకుల్లో డాలర్ల రూపంలో గాని, మరే ఇతర కరెన్సీ రూపంలోగాని వుంచుకోవచ్చు. స్విస్ బ్యాంకులు వడ్డీ ఇవ్వవు. అకౌంటుదారుల పేర్లును చాలా గోప్యంగా వుంచుతాయి. కొన్ని దేశాలు తమ పౌరులను ఇటువంటి అకౌంట్లను పెట్టుకోనీయవు. వాటిలో మనదేశం ఒకటి!

**11. అవినీతి నిరోధక శాఖ ఇటీవల అత్యధిక సంఖ్యలో లంచగొండి అధికారులను పట్టుకుంటున్నది. అయితే చిన్నస్థాయి ఉద్యోగులను పట్టుకోగానే అవినీతి అంతం అవుతుందా? పెద్ద చేపలైన రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులను అరెస్టుచేసిన సంఘటనలు ఎ.సి.బి. చిరునామాలో కరువయ్యాయి. దీని కోసం ఎ.సి.బి. ప్రయత్నాలలో ఏమైనా మార్పులు చోటు చేసుకోవాలా?**

జి. ఆశోక్, గోధూర్

జ. తెలుగులో ఒక సామెత "గొంగళిలో తింటూ వెంట్రుకలు ఏరటం ఎందుకు" అని, ప్రధానమంత్రులు, ముఖ్యమంత్రులు, అధికారులు, వ్యాపారస్థులు, మత బోధకులు అందరిలోనూ, అవినీతి, లంచగొండితనం విలయతాండవం చేస్తున్నప్పుడు, అవినీతిని నిర్మూలించడానికి, ఏ చట్టాలను, ఏ నియమాలను చేసినా ప్రయోజనం బహు తక్కువగావుంది. ఈ చట్టాల అమలు పేరతో,ఆ అధికారులు కూడా దండుకుంటున్న వైనాలు ఎన్నో వున్నాయి. అలా అని మనం చట్టాలను చేయకుండా వుండకూడదు. లోక్‌సత్తా వంటి ప్రజా సంఘాలు మాదిరిగా సమాజ సంక్షేమం కోరి తమకు వచ్చే బాధలను కష్టాలను లెక్కచేయకుండా, అవినీతి పరుల అవినీతిని బట్టబయలు చేయగల సాహసిక యువతీయువకులు ముందుకువస్తే, కొంతవరకు అవినీతిని అదుపులో పెట్టవచ్చు.

"నేను లంచం తీసుకోను", "నేను లంచం ఇవ్వను" అని మనం నిర్ణయించుకుంటే బాగుంటుంది. ఇందులో మొదటిది తేలికేకావచ్చు. కాని రెండవ నిర్ణయం మనుగడకే ముప్పు వచ్చినపుడు పాటించడం కష్టం. "శరీర మాద్యం ఖలు ధర్మసాధనం" అన్నారు కదా!

**12. ప్రతి కమ్యూనిస్టు పాలిత దేశంలో ఒక కమ్యూనిస్టు పార్టీ కాక మరే పార్టీ ఉండదు. కాని అక్కడ కూడా ప్రజాస్వామికం ఉందని, వాక్ స్వాతంత్ర్యం అభిప్రాయ ప్రకటనకు సంఘాలను ఏర్పరచుకుంటానికి ప్రజలకు హక్కులు ఉంటాయని మన దేశంలో కమ్యూనిస్టులంటున్నారు ఇది నిజమేనా?**

బి. శ్రీనివాస్, హైద్రాబాద్



జ. కమ్యూనిస్టులు చెప్పేది పచ్చి అబద్ధం. ఏ కమ్యూనిస్టు పాలిత దేశంలోనూ కమ్యూనిస్టు పార్టీ తప్ప మరోపార్టీని పెట్టనీయలేదు. కమ్యూనిస్టులు కానివారు పత్రికలను పెట్టుకోవడంగాని, రేడియో ప్రసారం చేయడం గాని ఎన్నికల్లో పోటీలకై వేరు వేరు సంఘాలను పెట్టుకోవడానికి గాని అనుమతించరు. అంతేకాదు, అధికారం చలాయిస్తున్న కమ్యూనిస్టు పార్టీ నాయకుడికి తన బృందానికి వ్యతిరేకతను చూపించిన లక్షలాది కమ్యూనిస్టు పార్టీ సభ్యులను "ప్రజా శత్రువులని" విదేశీయుల తొత్తులని, గూఢాచారులని కాల్చి చంపేసారు. వారి సిద్ధాంతం ప్రకారమే, కమ్యూనిస్టు దేశంలో శ్రామిక వర్గం యొక్క నియంతృత్వాన్ని అమలు చేయాలని వుంది, అలాగే చేశారు! ప్రజాస్వామిక దేశాల్లో కమ్యూనిస్టులు అత్యల్ప సంఖ్యాకులుగా వుండటం మూలాన వారు అధికారం చేజిక్కించుకునే వరకు ప్రజాస్వామ్యంలో నున్న మానవహక్కులను వాక్స్వాతంత్ర్యములను, భేదాభిప్రాయ ప్రకటన అవకాశం, వనరులనూ ఉపయోగించుకుని అనేకానేక సంఘాలను సృష్టించి, నిరంతరము సమ్మెలు చేయించే స్వేచ్ఛను వీరు కోరతారు. దేశమంతటా వీరికి అధికారమొచ్చిన తదుపరి కమ్యూనిస్టు నియంతృత్వ పాలన మాత్రమే వుంటుంది. ఇది ప్రపంచ చరిత్ర చదివిన మూఢ విశ్వాసము లేని ప్రతి వివేకవంతునకు తెలిసిన – తెలిపే సత్యము.

## జూన్ 2004

**1.రాష్ట్రంలో నూతన ప్రభుత్వం విద్యారంగంలో ఎటువంటి మార్పును తీసుకురావాల్సిన అవసరం ఉంది?**

ఒ. గంగాదేవి, నెలూరు

జ. ప్రాథమికతను బట్టి ఈ క్రింది మార్పులు తీసుకురావాలి.

1. 6 సంవత్సరాల నుండి 14 సం॥ వయసున్న బాల బాలికలకు నిర్బందంగా విద్యను అభ్యసింపచేయాలి. దీనికోసం ప్రభుత్వ పాఠశాలలే కాక 80,000పై

చిలుకుగా వున్న నిరుద్యోగులైన B.Ed., పట్టభద్రులను వారు గ్రామాలలో పిల్లలకు తరగతులు నడిపి బాల బాలికలను పరీక్షలకు పంపించి ఉత్తీర్ణులైనవారి సంఖ్యను బట్టి ప్రభుత్వం నుండి ప్రతిఫలం పొందే విధానాన్ని ప్రవేశపెట్టాలి.

2. తల్లితండ్రులు పిల్లలయొక్క చదువును గురించి శ్రద్ధ తీసుకోవాలి, బాధ్యత వహించాలి అనే అవగాహనని కల్పించాలి. 10వ తరగతి వరకు పాఠ్యాంశాలన్ని తెలుగు మాధ్యమములోనే చెప్పాలి. లేనిచో మనం సంస్కృతీ విహీనులమై పోతున్నాము. ఇంగ్లీషు అత్యవసరం కాబట్టి అదొక విషయంగా 5వ తరగతి నుండి నిర్బంధాంశముగా చేయాలి. జూనియర్ కాలేజీ నుంచి డిగ్రీ కాలేజీల వరకూ ప్రభుత్వం సవ్యంగా ఎంపిక చేయబడిన ప్రైవేట్ సంస్థలను నిర్వహించమని ప్రోత్సహించాలి. వృత్తి విద్యలన్నీ చదువుకొనేవారే దానికి అయ్యే ఖర్చును, ఆ విద్యను అభ్యసించేవారే భరించాలి. ప్రభుత్వం ఒక ఎడ్యుకేషన్‌లోన్ ఫండ్‌ను 500 కోట్ల రూపాయలతో స్థాపించి, అందులోనుండి మెరిట్ వున్న బీద విద్యార్థులకు ఋణాలు ఇవ్వాలి. 100% అక్షరాస్యతను సాధించే వరకు ఈ విధానాలను అనుసరించి, తరువాత కొన్ని పట్టభద్రతనిచ్చే చదువులకు కూడా ప్రభుత్వం అందరికీ ఉచితంగా ఉండేటట్లు చూడవచ్చు. అన్నిటికన్నా ముఖ్యమైనది భారతీయ సంస్కృతిని చరిత్రను, మనందరికి అవగతం చేయడం కోసం ఒక కోర్సును తయారుచేసి ప్రతి క్లాసులోను ఈ అంశాన్ని నిర్బంధంగా చెప్పాలి. అందులో వచ్చే మార్కులను పరిగణనలోకి తీసుకోవాలి.

**3. దేశ ప్రజలు కేంద్రంలో ఏ పార్టీకి సరైన మెజార్టీ ఇవ్వలేదు ఎందువలన?**

జ. రాజకీయ సిద్ధాంతాలు ప్రపంచ వ్యాప్తంగా చేయబడతాయి. పార్టీల రాజకీయాలు దేశవ్యాప్తంగా మరియు రాష్ట్రవ్యాప్తంగా వుంటాయి. ఓటింగ్ మాత్రం నాకు ఏమి ఒరిగింది అని విమర్శించకనే చేస్తారు. ఎన్ని సిద్ధాంతాలను చెప్పినా, హామీలు ఇచ్చినా కూడా ఓటర్లు ఎవరి వల్ల లాభం పొందుతామనుకొన్నవారికే ఓటు వేశారు. అందుకని ఏ పార్టీకి మెజార్టీ రాలేదు. రాలేదు. పార్లమెంటులో 40కు పైగా పార్టీలకు ప్రాతినిధ్యం వచ్చింది. 2,3 పార్టీలు తప్పితే మిగతా అన్ని కూడా ఆ రాష్ట్రాలలో కొన్ని కులాలకు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఇందువలన ఏ ఒక్కపార్టీకి మెజారిటీ రావడం లేదు.



**4. మన రాష్ట్రంలో చంద్రబాబునాయుడు, కర్ణాటకలో క్రిష్ణగారు ప్రజలకు ఎంతో సేవ చేశారు. కాని వారిద్దరి నాయకత్వంలోని పార్టీలుఓటమి పాలవటానికి కారణాలేమిటి?**

ఎన్. ప్రకాశరావు, ఒంగోల్

జ. ప్రజాస్వామ్యంలో రెండుసార్లు కన్నా ఏ ఒక్కపార్టీకైనా వరుసగా మెజార్టీ వచ్చిందంటే ప్రజలయొక్క అవగాహనలో కాని, ఎన్నికలు జరిగిన పద్ధతిలోకాని, ఏదోలోపం ఉన్నట్టే. కమ్యూనిస్టులు పాలించిన దేశాల్లో ఒకే పార్టీ ఉండడం మూలాన ఎప్పుడూ ఆ పార్టీయే గెలుస్తుంది. కాని ప్రజలుకోరుకున్నన్ని పార్టీలు వున్నా ప్రజాస్వామ్యంలో ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు ఎంత మంచివారైనా, ఎంతకష్టపడినా పాలనలో లంచగొండితనం లేకుండా వుండడం కాని, ప్రజల యొక్క అన్ని అవసరాలను వారికి తృప్తినిచ్చే స్థాయిలో తీర్చడం కాని జరగదు. ఎన్నో హామీలు ఇచ్చి ప్రభుత్వంలోకి వచ్చిన తరువాత ఆ హామీలను నెరవేర్చలేని పార్టీలను శిక్షార్హులుగా చేసే చట్టం లేనంత వరకు నిరక్షరాస్యత, పేదరికం ఎక్కువగా వున్న మనదేశంలో పార్టీలు ఒకప్పుడు ఓడిపోవడం, మరొక్కప్పుడు ఏదో విధంగా గెలవడం జరుగుతూనే వుంటుంది.

**5. రైతులకు ఉచిత విద్యుత్ ఒక్కటే సరిపోతుందా?**

జి. వాస్, గుంటూరు

జ. రైతులు ఉచిత విద్యుత్తునుగాని, సబ్సిడి రేట్లలో గాని ఏదైనా కోరుతున్నారంటే వారి యొక్క పంటకు, కష్టానికి, ఖర్చుకు తగిన ధరలు లేకపోవడం మూలానే. ఏ విధంగా ఇతర ఉత్పత్తులకు ఉచిత మార్కెట్ ఉన్నదో, ఏవిధంగా అయితే ఋణాలు లభిస్తున్నాయో ఆ విధంగా రైతుల యొక్క ఉత్పత్తిని ఇష్టం వచ్చినచోట అమ్మడానికి, ఎగుమతి చేయడానికి తదితరు విషయాల్లో స్వేచ్ఛ ఉన్నట్లయితే వారు ఉచిత విద్యుత్తును కోరరు అని చాలామంది విశ్లేషకులు అంటున్నారు.

**6. నిరుద్యోగ సమస్య విచారణకు మీరు గావించే సూచనలు ఏమిటి?**

ఎ. రాజారావు, విశాఖపట్నం

జ. అధిక సంతానాన్ని నిరోధించనంత వరకు, అందరికి స్వయంపోషక శక్తిని ఇచ్చే విద్య లేనంత వరకు నిరుద్యోగ సమస్యను ఎవరూ పరిష్కరించలేరు. చైనా వంటి దేశాల్లో నిర్బంధంగా సంతానోత్పత్తిని ఒక్కరకు పరిమితం చేసారు. అందరికి చదువు చెప్పిస్తున్నారు. అయినప్పటికి ఎంతో కొంత నిరుద్యోగం వుంది. మరి మన దేశంలో ఎంతమందినైనా పుట్టించడానికి స్వాతంత్ర్యం వుంది. అందరికి చదువుకునే నేర్పరితనం లేదు. దశాబ్దాలుగా ఉద్యోగం అంటే ప్రభుత్వము కల్పించాలి అనే ప్రచారం సాగుతూ వచ్చింది. దేశంలో జనాభా సంవత్సరానికి 2 కోట్లుగా పెరుగుతుంది. ఒక కోటికి మించి ఉపాధి అవకాశాలు లేవు. కాబట్టి నిరుద్యోగం పెరుగుతూ వస్తోంది.

**7. 'దామాషాపద్ధతి' అంటే ఏమిటి? దయచేసి వివరంగా తెలుపగలరు?**

ఎస్.ఎస్. ప్రసాద్, వరంగల్

జ. శాసన సభలకు పార్టీపరంగా అభ్యర్థులు ఎన్నికకై పోటీ చేస్తున్నారు. ఒక్కొక్క నియోజక వర్గంలో ఎంతమంది పోటీ చేయవచ్చు అనే పరిమితిలేదు. ఇటీవల కులాల ప్రాతిపదికగా అభ్యర్థులు పార్టీపేరు చెప్పుకుని పోటీ చేస్తున్నప్పటికి ఎవరికైతే ఎక్కువ ఓట్లు వస్తాయో వారు ఎన్నిక అవుతున్నారు.

ఉదా: దాదాపుగా సమబలం కలిగిన నలుగురు అభ్యర్థులు పోటీ చేస్తే, 26% ఓట్లు వచ్చినాయన ఎన్నిక అవ్వచ్చు. 74% ఓట్లతో తిరస్కరింపబడినప్పటికిని ఎన్నిక అవుతున్నారు.

ఇలా కాకుండా పార్టీలు తమ అభ్యర్థుల యొక్క పట్టికను ప్రాథమికతను అనుసరించి చేసి, ఓటర్లను, పార్టీలకు ఓటు వేయండి అని కోరినప్పుడు ఏ పార్టీకి ఎంత శాతం ఓట్లు వచ్చినాయో మొత్తం సీట్లలో ఆ పార్టీలు గెలుపొందటమును అంతశాతం దామాషా పద్ధతి అంటారు. ఇందులో కూడా కనీస శాతం ఉదా : 5% ఓట్లురాని పార్టీలకు ప్రాతినిధ్యం వుండదు. మన ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల



అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి 35% ఓట్లు వచ్చాయి కాని సీట్లుమాత్రం 47 వచ్చాయి. మన ఎన్నికల పద్ధతి దామాషా పద్ధతిలో వుంటే టి.డి.పి.కి 99 సీట్లు వచ్చేవి. దామాషా పద్ధతికాక ఒక నియోజక వర్గంలో ఎవరికి ఓట్లు ఎక్కువ వస్తే వాళ్ళు గెలిచే ప్రస్తుత పద్ధతిలో కొన్ని పార్టీలకు ఓట్లు శాతాన్ని మించిన సీట్లు రావడం మరికొన్ని పార్టీలకు ఓట్లుశాతం కన్నా తక్కువ సీట్లు రావడం జరుగుతుంది. ఇంతవరకు అధికారంలోకి వచ్చిన పార్టీలకు ఒకటి, రెండుసార్లు ఏ ఒక్క రాష్ట్రంలోనో తప్ప ఎప్పుడూ కూడా 50% మించి ఓట్లు రాలేదు.

**8. మనదేశం స్విస్ బ్యాంకులలో ఎకౌంట్లు పెట్టుకోనివ్వదు అంటూ ఒక ప్రశ్నకు జవాబు చెప్పారు. మరి మన నాయకులు నల్లధనం స్విస్ బ్యాంకులలో పెట్టుకోవడం నిజంకాదా?**

కె. రామారావు, హైద్రాబాదు

జ. కొంతమంది భారతీయులు నల్లధనాన్ని స్విస్ బ్యాంకుల్లో పెట్టుకుంటున్నారని ఎంతోమంది విశ్వసిస్తున్నారు. కాని దానిని నిరూపించడం మన న్యాయ వ్యవస్థకు అతీతమైపోయింది. భారతదేశంలో ఎంతో నల్లధనం వుందని దాదాపు ప్రతివారి దగ్గరావుందని అందరికీ తెలుసు. అయినప్పటికి కూడా శిక్షింపబడటంలేదు. కొన్ని పనులు అసమంజసంగా, అన్యాయంగా వున్నాయి. చట్టాన్ని అమలు చేయడం అనేది ఏలినవారి యొక్క దయా దాక్షిణ్యాలపై మిదు మిక్కిలి దక్షణ. గ్రాహక దాహమై వుండటం మూలాన చట్ట వ్యతిరేకమైన ఆచరణలు కొనసాగుతున్నాయి.

**9. నేటి యువత తమ వ్యక్తిత్వాన్ని పెంచుకోవడం ఎలా?**

ఎల్. లక్ష్మి, విజయవాడ

జ. బాగా చదువుకోవాలి. పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా ఇంకా ఎన్నో విషయాలు చదువుకోవాలి. చదువుకున్న దాన్ని తమ ఆలోచన, విశ్లేషణాశక్తితో

పరిశీలించాలి. ఆత్మగౌరవం పెంపొందించుకోవాలి. భారతదేశం యొక్క సహస్రాబ్దాల చరిత్రను, సంస్కృతిని విజయాలను అవగతం చేసుకోవాలి. భాషమీద ప్రావీణ్యం సంపాదించాలి. చక్కగా రాయడం, మాట్లాడటం నేర్చుకోవాలి. వినడమే కాక, అవధరించడం, దాన్ని గురించి ఆలోచించడం తరువాత తన భావనలను ప్రకటించడం నేర్చుకోవాలి. విద్య వసగును వినయం. వినయం వలన పాత్రత వస్తుంది. పాత్రత వలన పదవులు, సంపత్తులు, కీర్తి వస్తాయి.

**10. తమిళనాడులో జయలలిత నాయకత్వంలోని కూటమి పార్లమెంటులో ఒక్క సీటును కూడా పొందలేకపోయింది. ఎందువలన?**

జి. నాగరాజు, హైద్రాబాద్

జ. జయలలితగారు మంచి నిర్ణయాలు తీసుకొని మంచి పనులు చేసినా, హక్కులు మాత్రంకావాలి. సచ్ఛీలత, సద్వర్తన కాని, విధులు కాని, చేయవలసిన బాధ్యత మాకు లేదు, అనుకున్నవాళ్ళు ఎక్కువ అవడం మూలాన వారికి వ్యతిరేకత ఎక్కువ అయింది. ఉదా : అక్రమ పద్ధతుల్లో మతం మార్చకూడదు, అని ఒక చట్టాన్ని చేసింది. దానికి వ్యతిరేకంగా ఒక మతం వారు మూకుమ్మడిగా వ్యతిరేకంగా ఓట్లు వేశారు. ప్రభుత్వోద్యోగులు నియమాల ప్రకారం పని చెయ్యాలని ఆవిడ నిర్ద్వంద్వంగా శాసించడం మూలాన జయలలిత గారి ఓటమికోసం ఎన్నో విధాల పనిచేశారని తెలుస్తోంది. ఒకప్పుడు మన రాష్ట్రంలో కూడా ప్రభుత్వ ఉద్యోగులు నియమిత సమయానికి ఆఫీసులలో వుండాలని సమయం వ్యర్థం చేయకూడదని శాసించిన ఒక అధినేత యొక్క పార్టీకి ఇటువంటి శృంగభంగమే జరిపారు.

50 ఏళ్ళ పైచిలుకుగా ప్రజారంజక సిద్ధాంతాలను ప్రచారం చేస్తూ రావడం మూలాన ప్రజలలో శ్రేయస్సుకన్నా ప్రేయస్సు మాత్రమే రంజకంగా వుంటోంది. ఈ స్థితిని మార్చినప్పుడే దేశం యొక్క నిజమైన ప్రగతి సాధ్యం అవుతుంది. లేకపోతే ఈ విధంగా మన తరువాత స్వాతంత్ర్యం వచ్చిన మలేషియా వంటి దేశాలకన్నా మనం వెనుకబడి వుండడం ఇంకా చాలా కాలం జరుగుతుంది.



## జూలై 2004

**1. మన ముఖ్యమంత్రి డా॥ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి గారునూతనంగా ప్రారంభించిన "రాజీవ్ పల్లెబాట" ప్రజలకు ఏ విధంగా మేలు చేస్తుంది.**

కె. ఆర్. శంకర్, మంగళగిరి

జ. ప్రజల యొక్క కష్టసుఖాలను, ప్రభుత్వ ఉద్యోగులు పెట్టే బాధలను, ప్రజల ఇబ్బందులను, వారికి కావలసినవి కానీ దొరకని, అందుబాటులో లేని సౌకర్యాలను గురించి, మధ్యవర్తులు, దళారీల ద్వారా గాక సూటిగా ప్రజలనుండి తెలుసుకోడానికి "రాజీవ్ పల్లెబాట" కార్యక్రమం ఉపయోగపడుతోంది. దీనితోబాటు, పరిమిత సంతానం, శుభ్రత, అందరికీ చదువు, పొదుపులను గురించి ప్రతిపనికీ ప్రభుత్వం మీద ఆధారపడకుండా సామూహిక కృషి చేయడం వంటి విషయాలను గురించి ముఖ్యమంత్రి ప్రజలను చైతన్య వంతులుగాచేస్తే ఈ పథకం శ్లాఘనీయమవుతుంది.

**2. ప్రాథమిక విద్యాస్థాయిలో బోధన మాతృభాషలో జరగాలని మీరు వాంఛిస్తున్నారా? ఆంగ్లబోధన ఏ స్థాయి నుంచి అవసరం?**

జ. అయిదవ తరగతి వరకూ విద్యాబోధన తప్పనిసరిగా మాతృభాషలోనే ఉండాలి. 10వ తరగతి వరకూ కూడా ఉండటం మంచిదే. అప్పుడే మనదేశం, మన భాష, మన సంస్కృతి, మన విలువల పట్ల మనకు అభిమానం, గర్వం, గౌరవం ఉంటాయి.

ప్రపంచ స్థాయిలో వాణిజ్య, రాజకీయ, విజ్ఞానపరంగా ఆంగ్లభాషయొక్క ఔన్నత్యం మూలాన ఆభాష మనందరకూ అత్యవసరం. 3 లేక కనీసం 5వ తరగతి నుండి దాన్ని పాఠ్యాంశంగా నిర్బంధంగా చేయాలి. ఇంటర్ నుండి మాత్రమే బోధనామాధ్యంగా ఇంగ్లీషు ఉండటం మంచిది.

**3. 50 ఏళ్ళ క్రితం భారత్– చైనా మధ్య సత్సంబంధాల ఆవశ్యకత కోసం "పంచశీల"ను ఏర్పాటు చేసుకొన్నారు కదా! పంచశీల అమలులో ఉన్నట్లా? లేదా? దానిలోని ముఖ్య అంశాలు ఏమిటి?**

ఎన్. గిరిజ, విశాఖపట్నం

జ. పంచశీలను ప్రథమంగా ప్రతిపాదించింది భారతదేశంగాని నెహ్రూగానికాదు. చైనా ప్రభుత్వం ప్రతిపాదించింది. నెహ్రూగారు తనదిగా చేసుకుని ప్రచారం చేశారు. శీలం అంటే మన దేశంలో సత్ప్రవర్తన, మంచిగుణం అని అర్థం. ఇండోనేషియాలో దీని అర్థం; సిద్ధాంతం, సూత్రం అని. ప్రతిదేశం యొక్క సార్వ భౌమత్వాన్ని గుర్తించడం; ఇతర దేశం యొక్క అంతర్గత విషయాల్లో పరులు జోక్యం చేయకుండా ఉండటం; ఉభయ దేశాలకూ హానికరంగా గాక ప్రయోజనకారిగా వాణిజ్య సాంస్కృతిక సంబంధాలను పెంచుకోవడం, దేశాలమధ్య ఉన్న సమస్యలను యుద్ధం ద్వారా గాక సంప్రదింపులు ద్వారా పరిష్కరించుకోవడం, దేశం యొక్క భౌగోళిక అఖండతను దెబ్బ తీయకుండా ఉండటం అనే ఐదు సూత్రాలను "పంచశీల" అన్నారు. భారత్– చైనాలు పంచశీలకు ఒప్పందం కుదుర్చుకున్నా, చైనా చిత్తశుద్ధితో ఈ సూత్రాలను పాటించలేదు. పైపెచ్చు మిత్రుణ్ణి అని చెబుతూనే మన భూభాగమయిన 40వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం ఉన్న లద్దాఖ్‌ను కబళించింది. 1962లో మన సరిహద్దులను దాటి మనమీద యుద్ధంచేసి మనలను అవమాన పరచింది. ఆంగ్లో అమెరికన్ల తొత్తు అని మనదేశాన్ని, నెహ్రూ ప్రభుత్వాన్ని వర్ణించింది. పొరుగు కమ్యూనిస్ట్ దేశమయిన వియత్నాం మీద కూడా 1979లో దండయాత్ర చేసింది. అయితే గత పదేళ్ళనుంచీ చైనాలో మంచి మార్పులు వస్తున్నాయ్. దురాక్రమణ, దురుసు పద్ధతులు తగ్గాయి.

**4. శత్రువుల నుంచి దేశాన్ని కాపాడాల్సిన బాధ్యత నేటి యువత మీద ఎంతవరకు వుంది?**

జ. శత్రువులు దేశంలోనూ వున్నారు. బయటా వున్నారు. ప్రజలను, మన సంపత్తిని, మన భూమిని రక్షించవలసిన భాద్యత, ఒక్క యువతమీదేకాదు;



అందరిమీదా వుంది. కాని శత్రువులెవరు, ఏపని, ఏ సిద్ధాంతాలు, ఏ వ్యవహారాలు, దేశభద్రతకు, అఖండతకు వ్యతిరేకమయినాయి. ఎటువంటి రచనలు, ఏ నీతులు దేశం యొక్క భద్రత, రక్షణ, అఖండత, అభివృద్ధి, శాంతి సమరసతలకు హానికరం అని చెప్పవలసిన బాధ్యత నాయకులది. గురువులది; తెలుసుకోవలసిన, అధ్యయనం చేయవలసిన బాధ్యత అందరిది. దేశం యొక్క స్వతంత్రత, సమృద్ధి పరదేశీ దురాక్రమణదారుల వల్ల కన్నా దేశంలో నివసిస్తూ దేశద్రోహులుగా, వంచకులుగా, పరాయివారి పంచమాంగదళంగా ప్రవర్తించే వారి వల్ల, నాశనం చేయబడుతున్నాయి. ఇది చారిత్రక సత్యం. దీన్ని అరికట్టాలంటే చురుకైన యువత, మేధావులు కూడా రాజకీయ పార్టీల్లో చేరి, లోపలనుంచే పార్టీల్లోని కుళ్ళును ప్రక్షాళనం చేయటానికి ప్రయత్నించాలి. లోక్‌సత్తా అటువంటి సంఘ చైతన్యం ఉన్న సంస్థల్లో చురుకుగా పనిచేసి, ప్రభుత్వంలో, పార్టీల్లో, బయటవున్న లంచగొండులను, అవినీతిపరులను బహిరంగంగా నిలదీయాలి.

**5. స్వాతంత్ర్యము వచ్చిన తరువాత విద్యారంగములో మార్పులు కోసం ఎన్నో కమీషన్లు వేశారు. వాటిని అమలు చేశారా? ప్రాథమిక విద్యలో మార్పులకు విద్యామంత్రి శ్రీమతి నేదురమల్లి రాజ్యలక్ష్మీ శ్రీకారం చుట్టారు కదా! ఎలాంటి మార్పులు తేవాలి?**

జి. రాజెశ్వరరావు, గుంటూరు

జ. రాధాకృష్ణన్, కొఠారీ ఇత్యాదుల ఆధ్వర్యంలో చాలా కమీషన్లు, అద్భుతమైన అధ్యయనం చేసి, ఎన్నో సంస్కరణలను, నూత్నపంథాలను, పద్ధతులను సూచించాయి, ఏలినవారు వాటిని శ్లాఘించారేకాని, అమలు చేయలేదు. రాజ్యాంగం విధించినట్లు 6–14 సంవత్సరాల మధ్య వారికి, అందరికి నిర్బంధ ఉచిత విద్యను సాధించలేకపోయాం. ఏం చేస్తే, ఏం చెబితే ఓట్లు వస్తాయో అని వ్యవహరించే పార్టీలు, నాయకులు ఎక్కువయ్యారు, నిరక్షరాస్యతే (35శాతం) కాదు, గుణంలేని చదువులు ప్రబలుతున్నాయి. మిడిమిడి చదువులున్న వారరూ విద్యామంత్రులవుతున్నారు. విద్యావిధానాన్ని సంస్కరిస్తాను. అని అనని

విద్యామంత్రి లేరు. చేసి మెఱుగు సాధించినవారులేరు. చేస్తాననే మంత్రులను "విజయీభవ" అని ఆశీర్వదిద్దాం.

**6. విద్యారంగం బాగుపడాలంటే జాతీయం చేయడం అవసరమా?**

జ. విద్యారంగం బాగుపడాలంటే జాతీయం అంటే ప్రభుత్వపరం చేయవలసిన అవసరం ఇసుమంతయినా లేదు. ఉత్తీర్ణతశాతం, గుణవత్తత ప్రభుత్వం నడిపే స్కూళ్ళల్లో ఉందో, ప్రైవేటు స్కూళ్ళలో ఉందో, తెలియడం మూలానే, గ్రూప్ "డి" ప్రభుత్వోద్యోగులు తమ పిల్లల్ని, ఫీజుల్లేని ప్రభుత్వ స్కూళ్ళకుగాక, చందాలు, ఎక్కువ ఫీజులు తీసుకునే ప్రయివేటు స్కూళ్ళకు పంపగోరుతున్నారు. ప్రభుత్వోద్యోగులమీద, ప్రభుత్వానికి పట్టులేకపోవడం మూలాన; ప్రభుత్వ సంస్థల్లో పనికీ, ప్రతిఫలానికీ సంబంధం లేకపోవడం మూలాన, విద్యను ప్రభుత్వీకరణం చేసినంతమాత్రాన, మెరుగపడదు.

**7. జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి, దీని భావమేమి?**

ఎల్. రామశర్మ, నందిగామ

జ. లంకలో రావణసంహారం తర్వాత, లక్ష్మణుడు విభీషణునితో కూడి,సర్వసంపన్నమయిన లంకలో సుఖాలను అనుభవిస్తూ అయోధ్యకు తిరిగి వెళ్ళడం మరచినట్లు జాప్యం చేస్తుంటే, శ్రీరామచంద్రులు లక్ష్మణుని పిలిచి :

"అపిస్వీర్ణమయీలంకా, నమేరోచతే లక్ష్మణ!
జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి"

అంటే అన్ని సిరిసంపదలతో స్వర్గతుల్యమయిన లంకకన్నా; మాత, మాతృభూములు మిన్న అన్నారు; అని "పద! మన అయోధ్యకుపోయి, మన దేశాన్ని ఉద్ధరిద్దాం; తల్లితండ్రులకు సేవచేద్దాం" అన్నారు. ఈ నీతిని మన పిల్లలకు బోధిస్తే; మన దేశంలోని మేధావుల వలసయుండదు, కచునివలె ఉన్నత విద్యను పరదేశాల్లో గడించి, అచ్చటి కన్యలచేత సుఖసంపదలచేత సమ్మోహితులు కాకుండా, భారతదేశానికి వచ్చి మన దేశాన్నీ, ప్రజలను ఉద్ధరిస్తారు.



**8. రాజకీయాలకు అతీతంగా విశ్వవిద్యాలయాల్ని వుంచడం వీలుకాదా?**

జ. పెండ్లి సంబంధాలు కూడా రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగపడాలనుకునే పెద్దలు పాలకులవుచున్న సమయంలో, విశ్వవిద్యాలయాలను రాజకీయాతీతంగా ఉంచడం తేలికకాదు, విద్యార్థి సంఘాలకు ఎన్నికలు కూడా రాజకీయ పక్ష చోధితమవుతున్నాయి కదా!

**9. అసలు శీలం (Character) అంటే ఏమిటి?**

బి. నళినీ కుమార్, కరీంనగర్

జ. పై జెప్పిన గుణాలన్నీ ఉన్న వానిని సచ్ఛీలుడని అంటాం. శ్రీరామచంద్రుడు, గౌతమబుద్ధుడు, లోకమాన్య బాలగంగాధర్ తిలక్, స్వామి వివేకానందులు సచ్ఛీలత మూర్తీభవించిన మహాపురుషులు.

**10. బడ్జెట్ అంటే ఏమిటి? దాని స్వరూప భావాలు సమగ్రంగా వివరిస్తారా?**

పి. రామబ్రహ్మం, మదుర

జ. ప్రభుత్వానికి ఏయే పన్నుల ద్వారా, అప్పుల ద్వారా, అనుదానాల (grants) ద్వారా ఎంతరాబడియుంది; ఏయే పద్దుల క్రింద (సిబ్బంది జీతాలు, కార్యాలయ నిర్వహణ); ఏయే ప్రణాళికలకై, విద్యకై, ఆరోగ్యసేవలకై, పోలీసు (భద్రత)పై ఇత్యాదులపై ఎంత ఖర్చువుతుంది; ఇటువంటి వివరాలతో కూడిన "ఆదాయ- వ్యయ" పట్టికను బడ్జెట్ అంటాం. వ్యయానికన్నా ఆదాయం తక్కువయితే అప్పు చేయడమో, క్రొత్త పన్నులు వేయడమో, ఉన్నవాటిని పెంచడమో జరుగుతుంది. వీటన్నిటిని శాసనసభ ఆమోదించాలి.

**11. మీ చిన్ననాటి చదువులకు- నేటి చదువులకు గల తారతమ్యం తెలియజేస్తారా?**

కె. పవన్ కుమార్, అనకాపల్లి

జ. పరీక్షలు పాసవడం, శ్రేణ్యగ్రతను సంపాదించుకోవడం కన్నా, మేధస్సును పెంచుకోవడం, విశ్లేషణ, ఆలోచనా, వివేకాశక్తులను పెంచుకోవడం, సద్బుద్ధి,

సత్ప్రవర్తన, మంచి అలవాట్లకై సాధన చేయడం; వినయ విధేయతలకు ప్రాధాన్యాన్నివడం మా గురువులు అలవరచేవారు. గురువులు, విద్యార్థులకు తండ్రిగా, స్నేహితులుగా, ప్రేమికుడుగా ఉండేవారు. ఇప్పుడు గురువుల స్థానంలో ట్యూటర్లు, కోచ్‌లు, కాపీ మాస్టార్లు ఎక్కువవుతున్నారు. విద్య ద్వారా గురువు మానవునిలో ఉన్న దైవీశక్తిని, విద్యార్థిలో రేకెత్తించే కృషిచేసేవారు. విధులను నేర్పేవారు, హక్కులు గాదు.

**12. నేటి విద్యార్థులు ఉత్తమ పౌరులుగా రూపుదిద్దుకోవడం ఎలా?**

జ. కష్టపడి చదవడం, విధులు గుర్తించి వాటిని పాలించడం, జిజ్ఞాసను పెంచుకోవడం; ద్వేషం, అసూయలు గాక ప్రేమ, సౌభ్రాతృత్వములు పెంచుకోవడం; గురువులను, తల్లితండ్రులను గౌరవించడం; దేశాభిమానాన్ని పెంచుకోవడం; మన పరంపరలను, సంప్రదాయాలను, చరిత్రను తెలుసుకొని మన్నించి, మిన్నగా ఎదగండని కోరుతున్నా.

## ఆగస్టు 2004

**1. మన రాష్ట్రపతి మన రాష్ట్రాభివృద్ధికి సూచించిన దశసూత్రాలు అమలు చేయటం సాధ్యమేనా?**

పి. సూర్యకాంతం, ఎలమంచిలి

జ. రాష్ట్రపతి గారు సూచించిన దశసూత్రాల్లో మరీ కొత్తవి ఏవీ లేవు. ఇందిరాగాంధీ గారు 1975లో 20 సూత్రాలు చెప్పి అవి అమలు చేస్తాను. దాని వల్ల పేదరికం నిర్మూలించబడుతుంది అన్నారు. ఆమె కుమారుడు సంజయ్‌గాంధీ భారతీయ యువతకై ఐదుసూత్రాల పథకం సూచించారు. పంచవర్ష ప్రణాళికలు 1951లో ప్రారంభించినప్పటినుండి, మన దేశంలో సూత్రాల కొరతలేదు. ఎందులోనూ లేకపోయినప్పటికి, సూత్రాల్లో పథకాల్లో మనం స్వయం సమృద్ధిని సాధించామని అనన్యసామాన్యమైన వ్యంగ్య చిత్రకారుడు ఆర్.కె. లక్ష్మణ్ వ్రాసి



చిత్రీకరించారు. రాష్ట్రపతి సూచించిన సూత్రాలు చాలా మంచివి. కాని పార్టీల్లో, నాయకుల్లో చిత్తశుద్ధి, వారు చెప్పిన దాన్లో విశ్వాసము లేకపోవటం వల్లనూ, ప్రభుత్వోద్యోగులు కేవలం ప్రభుత్వోద్యోగాల మీదనే వారి చేతనే అమలు చేస్తే లక్ష్యసిద్ధి జరుగుతుందనటం కల్ల, ప్రజలను ఉద్బోధించి, ఉత్తేజ పరిచి, సమీకృతం చేసినట్లయితే సూత్ర ప్రయోజనం సిద్ధిస్తుంది. లేకపోతే కాదు. ఈ మధ్య ఒక టివి చర్చలో ఓ మంత్రిగారు కూడా అంగీకరించింది మనకు నిధుల, పథకాల కొరత లేదని, పరిపాలన నాయకత్వాల్లో లోపాల వల్ల ఆశించినంతగా వ్యయానికి తగిన ఫలం దక్కడం లేదు అని.

**2. పురా అంటే ఏమిటి?**

జ. PURA పురా, అంటే Providing Urban facilities in Rural Areas. పట్టణాల్లో ఆరోగ్యానికి, చదువుకి, వ్యాపారానికి, సంచార వినిమయ ప్రసారాలకు, పరిశ్రమలకు సౌకర్యాలు గ్రామ ప్రాంతాలకన్నా ఎక్కువగా వుంటున్నాయి. ఈ సౌకర్యాలన్నీ గ్రామ ప్రాంతాలకు కూడా కలుగు జేసినట్లయితే, పట్టణాల్లో వలె, పల్లెల్లో కూడా ఉపాధి కలుగుతుంది. ప్రజలు గ్రామాలను వదలి పట్టణాలకు వెళ్ళవలసిన అవసరం ఉండదు. 'పురా' సిద్ధాంతం యొక్క లక్ష్యం ఇదే!

**3. కోవర్ట్ పూర్వాపరాలు వివరిస్తారా?**

ఎల్. శంకరయ్య, గుడివాడ

జ. నీ శత్రువులను బలహీన పరచాలంటే, మట్టుపెట్టాలంటె, వారి గుట్టు తెలుసుకోవాలి. వారి ఆలోచనా సరళి, కార్యకలాపాలు తెలుసుకోవాలి. శత్రువులతోనే చేరి, వారికి మిత్రులైనట్లు, వారి విశ్వాసపాత్రులగుటకు వారు చేయమన్న పనులు కొంతకాలం చేసిన తరువాత, ఆ శత్రుచ్ఛేదము, అందులో ఉండే చేయటం, లేక చేయించటం Covert Action అంటారు. ఎన్నో దేశాలయొక్క Intelligence

విభాగాలు తమ శత్రుదేశాలను ఈ విధంగా దెబ్బతీస్తాయి. అమెరికాలో CIA, Israel, (Mossad) మొస్సాడ్ పాకిస్తాన్‌లో ISI కమ్యూనిస్ట్ రష్యాలో KGB ఇటువంటి పనుల్లో ప్రఖ్యాతి గాంచినాయి.

**4. నదీజలాల వివాదాల పరిష్కారానికి మార్గాలులేవా? నేడు పంజాబ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేసే అవకాశం కేంద్ర ప్రభుత్వానికి లేదా?**

జ. నదీ జలాల విషయంలో దేశభక్తి, దేశము యొక్క సమగ్రత యందు, సంతులిత అభివృద్ధి యందు విశ్వాసము, శ్రద్ధ వున్నట్లయితే వివాదాలు తలెత్తవలసిన అవసరంలేదు. నదుల యొక్క పరీవాహక ప్రాంతం ఎన్నో రాష్ట్రాలకు విస్తరించి ఉంది. ఏఏ రాష్ట్రంలో ఎంతజలం ఏ నదుల్లోకి వెళుతోంది. దీన్ని ఏ వాటాల్లో ఉపయోగించుకోవాలి. అని నిర్ధారించిన ట్రిబ్యునల్స్ వున్నాయి. తృప్తి చెందని రాష్ట్రాలు, ఆ నిర్ధారణ సవ్యంగాదని, తప్పుపడుతు వివాదాలను శాశ్వతం చేస్తున్నాయి. ఎంతో అధ్యయనం తరువాత, మన దేశంలోని నదులను ప్రాంతీయ మరియు దేశస్థాయిలో అనుసంధించినట్లయితే, దేశానికి అంతటికీ, పుష్కలంగా నీరు లభ్యమవుతుంది, అని నిపుణులు నిర్ణయించారు. బలవంతమైన ప్రభుత్వం కేంద్రంలో వున్నట్లయితే ఆ అనుసంధాన పథకం 15 లేక 20 సంవత్సరాలలో పూర్తి చేయవచ్చు. పంజాబ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం, హర్యానా తీసుకుంటానన్న నిర్ణయం, కర్ణాటక ప్రభుత్వం అమలు చేస్తున్న నిర్ణయం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరుతున్న నిర్ణయం వారి వారికి సమంజసంగా కనిపిస్తున్నా సమగ్ర దృష్టితో చూస్తే, అవి అన్నీ పాక్షికంగా మాత్రమే సబబు, 15 నుంచి 23 పార్టీలతో కూడిన ప్రభుత్వాలు, వాటిలో కూడా ఏ బాధ్యతలు తీసుకోకుండా, బయటినుండి కొరడా ఝుళిపించే మరికొన్ని పార్టీలు వున్నప్పుడు అవకాశం, చట్టం వున్నప్పటికీ కూడా, ఒక నిర్ణయం తీసుకుని అమలు చేసే సత్తా లేకుండా పోయింది.

**5. మన రాజకీయ నాయకుల్లో చాలామంది ఎంతో కష్టపడి ఇంత ఉన్నత పదవులకు ఎదిగిన వారే కదా? మరి ఇప్పుడు స్వార్థపరులుగా ఎందుకు మారుతున్నారు?**

డి. కిరణ్, రాజమండ్రి



జ. స్వాతంత్ర్యానికి ముందు, స్వార్థరహితంగా మన నాయకులు కష్టపడ్డారు. దాని తరువాత ప్రభుత్వాధికారం చేతికి వచ్చిన తరువాత, అధికారాన్ని చాలావరకు దుర్వినియోగం చేసి, సంపాదన మొదలుపెట్టారు.

ఈ సంపాదన చాలా వరకు ఎన్నికలకోసమై హరించుకుపోతోంది. ఇపుడు రాజకీయం ఒక వృత్తిగా మారిపోయింది. ఏ విధంగానైతే ఇతరవృత్తుల్లో వున్నవారు ధనార్జన చేస్తున్నారో, అదే విధంగా, ఈ వృత్తి ద్వారా సంపన్నులమవచ్చునని అనుకుంటున్నారు. ఇది నిజమని ఇటీవల ఎన్నిక కోసం నుంచున్న ప్రతి ఒక్కరు, తమ ఆస్తిపాస్తులను, తెలియజేసినపుడు మనకు తెలుస్తోంది. ఆగర్భదరిద్రులు కోటీశ్వరులయ్యారని తెలుస్తోంది.

**6. హరితవిప్లవం అంటే ఏమిటి? తరచుగా మరో హరితవిప్లవం రావాలని అంటుంటారు కదా? దాని భావం ఏమి?**

ఆర్. సునిల్, నంద్యాల

జ. వ్యవసాయ ఉత్పత్తులు కొన్ని రెట్లు పెరగటం హరిత విప్లవం అంటారు. ఈ పెరుగుదల నాణ్యమైన ప్రత్యేకమైన విత్తనాలు వాడటం మూలాన, శాస్త్రీయ పద్ధతిలో నిర్ణయించిన ఎరువులను వాడటం మూలాన, పంటలకు నష్టం చేసే చీడపురుగులను చంపే మందులు వాడటం మూలాన, వ్యవసాయపు పనులను యంత్రాల చేత చేయించడం మూలాన, పంటలను సరియైన పద్ధతిలో నిలువచేసే గిడ్డంగుల మూలాన హరితవిప్లవం జరుగుతుంది. ఒక 30 ఏళ్ళ క్రితం ఇదొక పెద్ద ఉద్యమంగా ప్రభుత్వం ప్రచారం చేసి, ఆచరణ సాధ్యం చేసింది. మరోసారి అన్ని విధాల స్ఫూర్తిని, సహాయాన్ని ఇచ్చినట్లయితే, మన వ్యవసాయిక ఉత్పత్తులు చాలా పెరుగుతాయి.

**7. వ్యవసాయ రంగానికి పూర్వవైభవం తెస్తామని రాజకీయ నాయకులు ప్రకటనలు ఇస్తారు. మరి వైభవం తేవటం ఎట్లా?**

జ. ఇంతకు ముందు చెప్పినట్లు పథకాలు, ప్రకటనలు అల్పముకావు. ఆచరణేలేదు! జలసంచయం, పంటమార్పిడులు, రైతుకు కావలసిన పెట్టుబడులు,

సునాయాసం చేయగల్గినట్లయితే, వారియొక్క ఉత్పత్తిని ఎక్కడ ఎక్కువ ధరవస్తుందో, అక్కడ అమ్ముకోవడానికి, ఎగుమతి చేయడానికి స్వేచ్ఛను, సదుపాయాన్ని కలిగించునట్లయితే రైతులు తమంతట తామే తీసుకురాగలరు. మన వ్యవసాయ విశ్వ విద్యాలయాలు శాస్త్రజ్ఞానాన్ని రైతులకు అందేలా, వారెదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపేలా మెలగాలి.

**8. "శ్రీబాగ్" ఒప్పందంలోని అంశాలేమిటి? శ్రీబాగ్ రాయలసీమ అభివృద్ధి కొరకు నిర్దేశించినదేనా?**

కె. వి. ఆర్, సికింద్రాబాద్

జ. తెలుగు మాట్లాడే జిల్లాలను ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోనించి వేరుచేసి, ఆంధ్రరాష్ట్రం కావాలని, ఆంధ్రులు కోరుతుంటే, రాయలసీమ వాసులు మేము వెనుకబడిన వాళ్ళం, మాకు ఆంధ్ర రాష్ట్రంలో న్యాయం జరగదు. మేము అల్ప సంఖ్యాకులం కాబట్టి మాకు న్యాయం జరగదు అని ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర నిర్మాణానికి నిరసనను తెల్పినపుడు చెన్న పట్టణంలో దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు గారి ఇంట్లో శ్రీబాగ్‌లో రెండు ప్రాంతాల పెద్దలు కూర్చుని ఒక ఒప్పందం చేసుకున్నారు. రాజధాని ఒక ప్రాంతంలో వుండే హైకోర్టు మరో ప్రాంతంలో వుండాలని, సాగునీటి పథకాలు, ఇతర నిర్మాణాల్లో, ఉద్యోగాల్లో, సముచితమై వాటాను రాయలసీమకు ఇవ్వాలని ఇలా రాయలసీమ యొక్క వెనుబడిన తనాన్ని అంతమొందించడానికి చేసుకొన్న ఒప్పందాన్ని 'శ్రీబాగ్ పాక్ట్' అంటారు. 1956లో విశాలాంధ్ర అంటే ఆంధ్రప్రదేశ్ ఏర్పడటానికి ముందు కూడా, ఆంధ్ర, తెలంగాణా, కాంగ్రెస్ పెద్దలు ఒక ఒడంబడిక చేసుకున్నారు. "చిత్తశుద్ధిలేని శివపూజ లేలరా....." అన్నట్లు తమకు పదవులు వస్తే తమ ప్రాంతపు వెనుకబడిన తనాన్ని మరిచిపోయే ప్రబుద్ధులున్నపుడు సంతులిత సమగ్రాభివృద్ధి ఎలా జరుగుతుంది?

కొన్ని ఏళ్ళ తరబడి మన రాష్ట్రంలోని రెండు పెద్ద పార్టీలు అన్ని ప్రాంతీయులతో కూడిన మంత్రివర్గాలకు ఏర్పరచినప్పటకీ వెనుకబడిన తెలంగాణా, రాయలసీమ నాయకులు ముఖ్యమంత్రులైనప్పటికీ వెనుకబడినతనం ఇంకా ఎందుకు వుంటుందో ఆలోచించండి.



**9. ఎంసెట్‌లో ఏ విధమైన మార్పులు అవసరం?**

ఎమ్. సురేష్, చీరాల

జ. ఇప్పుడు ఇంజనీరింగ్ కాలేజీలు మన రాష్ట్రంలో కొల్లలుగా వున్నాయి. కొన్నివేల సీట్లు భర్తీ అవడం లేదు. EAMCET పరీక్షలో 25% మార్కులు రావడం సునాయాసం. ఈ పరీక్ష ఈ పరిస్థితుల్లో సంపూర్ణంగా అనవసరం. కొన్ని వర్గాలకు సంపాదన ఆయుధంగా ఎంసెట్‌పరీక్షా విధానం మారింది. విద్యార్థులకు ఇది ఒక శాపం, అనర్థము. దీనివల్ల పరీక్షపాసయ్యే కోచింగ్ తీసుకుంటున్నారే గాని, విశ్లేషణాశక్తిని, సమస్య పరిష్కార శక్తిని, విషయవిజ్ఞానాన్ని పెంచుకోవడం లేదు. ఇది తీసి వేయడం మేలు.

**10. మనం మరలా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకోడానికి సిద్ధమౌతున్నాం. స్వాతంత్ర్యానంతరం మనం సాధించిన ప్రగతి ఏ మేరకు?**

ఎ. లక్ష్మీప్రియ, గుంటూరు

జ. స్వాతంత్ర్యంతో పాటు మనదేశం విభజించబడినదని, అందులో 30% భాగాన్నుండి ముస్లిమేతరులు, హిందూ, సిఖ్, బౌద్ధ జైనులు తరిమివేయబడ్డారని మనం విస్మరిస్తున్నాం. మన యొక్క ఒక గొప్ప సాధన ఇంతవరకూ పునర్విభజన చేయబడకుండా వుండటం, ఎన్నో అవకతవకలున్నప్పటికీ ఒక్క ఎమర్జన్సీ సమయం తప్పించి, ఎన్నికలను సకాలంలో జరిపించడం, ఆహార ధాన్యోత్పత్తిని నాల్గింతలు పెంచడం, నిమ్నకులాలకు అధికారాన్ని, ప్రభుత్వంలో పెరుగుతున్న ప్రాతినిధ్యాన్నివ్వడం ఇవన్నీ ఘనవిజయాలే! ఒకానొకప్పుడు అస్పృశ్యులైనవారు, అతిపేదలైనవారు అరణ్యనివాసం చేస్తున్నవారు ముఖ్యమంత్రులుగా, దేశాధ్యక్షులుగా, న్యాయమూర్తులుగా, కోటీశ్వరులుగా, పారిశ్రామికవేత్తలుగా, ఉపకులపతులుగా, న్యాయమూర్తులుగా ఎదగటం మరింత ఘన విజయాలు. కాకపోతే కొన్ని విభాజక శక్తులు, విఘటనోద్యమాలు స్వాతంత్ర్యం రాకముందున్న స్థాయిలో పెరగడటం దేశ సమగ్రతకు సంపన్నతకు, సుస్థిరతకు హానికరాలు.

# సెప్టెంబరు 2004

**1. రాష్ట్రాల విభజనకు ఎస్సార్సీ అనుమతి అవసరమా? ఎస్సార్సీలో సభ్యులుగా ఎవరు ఉంటారు? వారి విధులు ఏమిటి?**

ఆర్. విష్ణు, నందిగామ

జ. రాజ్యాంగపరంగా గాని మరే చట్టపరంగా గాని రాష్ట్రాల విభజనకు ఎస్.ఆర్.సి (SRC) అనుమతి అవసరం లేదు. కాని, ఏ ముఖ్యమైన పని చేయాలన్నా మార్పు తేవాలన్నా నిష్ణాతుల విశ్లేషణను, వారి సూచనలను పరిగణనలోకి తీసుకోవడం ఒక సత్సంప్రదాయం. అటువంటి సమితి సూచనలను ప్రభుత్వం అంగీకరించవచ్చు. లేదా అందులో మార్పులు చేయవచ్చు. లేదా తిరస్కరించవచ్చు. 1956లో SRC చేసిన కొన్ని మొదటి సూచనలను ప్రభుత్వం అంగీకరించింది. మరి కొన్నింటిని తిరస్కరించింది. రాష్ట్ర విభజన లేక పునర్ఘటన ప్రభుత్వ నిర్ణయం ప్రకారమే జరుగుతుంది. అటువంటి సమితిలో పక్షపాతం లేని; న్యాయశాస్త్రంలో; సాంఘిక రాజకీయ శాస్త్రాల్లో మేధావులుగా పేరుపొందిన వారిని ప్రభుత్వం సభ్యులుగా నియమిస్తుంది. వారు ప్రజల, పార్టీల విన్నపాలను, సూచనలను గమనిస్తూ, రాష్ట్ర విభజన పునర్ఘటనం వల్ల కలిగే ఆర్థిక, భాషా, విషయక, సాంఘిక, భౌగోళిక, పర్యవసానాలను పరిశీలించి అధ్యయనం చేసి తమ సూచనలను అభిప్రాయాలను తెలియచేయాలి.

**2. మణిపూర్‌లో ఆందోళనకు కారణాలు ఏమిటి? ఆందోళనకు విముక్తి మార్గాలు ఏమిటి?**

జ. మణిపూర్‌లో విభాజక శక్తులకు, దేశద్రోహకరమైన అంతర్జాతీయ మత తదితర శక్తులు బోధిస్తూ కావలసిన డబ్బును, ఆయుధాలను సరఫరా చేస్తూ, భారత దేశం నుంచి ఆ భూభాగాన్ని విడగొట్టడానికి ప్రయత్నిస్తున్నాయి. అక్కడే



కాదు ప్రక్కనే ఉన్న నాగాలాండ్, మిజోరంలలో కూడా మత మార్పిడిలవల్ల భారతదేశం పట్ల గౌరవం లేకపోవడం, భారతీయులంకాము అనే అభిప్రాయం పెరగడం జరుగుతోంది. దీన్ని మన దేశంలోని కొన్ని శక్తులు పరోక్షంగా, మరికొన్ని ప్రత్యక్షంగా సమర్థిస్తున్నాయి. దేశద్రోహక శక్తుల్ని నిర్దాక్షిణ్యంగా అణచివేయడం, మతాంతరీకరణను నిషేధించడం, అభివృద్ధి పథకాలను ముమ్మరంగా చేపట్టడం, విద్యా బోధనలో భారతదేశ చరిత్రను అఖండత్వాన్ని, సంస్కృతిని విశేషించి చేర్చి చెప్పడం వల్ల విభాజకత్వం తగ్గుతుంది.

**3. చదువు పూర్తవగానే ఉపాధి అందించేందుకు ఎలాంటి ప్రణాళికలను ప్రవేశపెట్టాలి?**

జి. కవిత, హైద్రాబాద్

జ. భారతదేశంలో ప్రతి సం॥ ఒక కోటి ఎనభైలక్షల మంది జనులు పుడుతున్నారు. పట్టభద్రులయ్యే వాళ్ళు తొంభై లక్షల దాకా వున్నారు. SSC, Intermediate తో చదువు ఆపే వాళ్ళు దాదాపు కోటిన్నర మంది వున్నారు. అంటే చదువులు పూర్తి చేసే వాళ్ళు ప్రతి సం॥ రెండు కోట్ల నలభై లక్షలమంది వున్నారు. మన ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం ఎప్పుడూ కోటిమందికి కన్నా ఎక్కువ ఉపాధి కల్పించబడడంలేదు. అందుకని పనిలేమి లేక నిరుద్యోగం ఏటేటా ఎక్కువ అవుతోంది. కాని తగ్గడం లేదు.

జనాభాని నియంత్రించందే అందరికి ఉపాధి అనేది ఎండమావిగానే వుంటుంది. అందుకనే చైనాలో గత 30 ఏళ్ళ నుంచి ఏ కుటుంబంలో కూడా ఒక పిల్లాడు లేక పిల్ల కంటే ఎక్కువ ఉండకూడదని నిర్బంధ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఎప్పుడో చేయవలసిన నియంత్రణను మన దేశంలో ఇప్పుడైనా చేయకపోతే దుర్భర దుష్టపరిణామ పూర్వక నిరుద్యోగిత ఒక సాంఘీక సంక్షోభానికి దారి తీస్తుంది. మన దేశంలో చేయవలసిన పనులు ఎన్నో వున్నాయి. ఉదా : జాతీయ రాష్ట్ర రహదారులు, నదుల సంధానం, వనపోషణ, కోట్ల మందికి ఉపాధి కల్పించగలుగుతుంది. భారతదేశంలో అనాది నుంచి ఉన్న తటాక జల సేద్యం,

తటాక నిర్మాణం, వాటి నిర్వహణ ఎంతో మందికి ఉపాధి కల్పించగలదు. అన్నిటికన్నా ముఖ్యమైనది ఉపాధికల్పన ప్రభుత్వం భాధ్యతకాదు. ప్రభుత్వం దోహదకారిగా మాత్రమే ఉండగలరు. చదువుల ఉద్దేశం దేశంలోని, సహజ వనరులను ఉపయోగించి సంపదను ఉత్పత్తి చేయడం గుణం ఉన్న చదువులవల్ల ఇటువంటి సామర్థ్యం వస్తుంది. ఈ విషయాలను ప్రజలకు చెప్పవలసిన బాధ్యత తల్లితండ్రులమీద, గురువులమీద, నాయకులమీద ఉంది.

**4. లోక్‌సభ సభ్యుల ప్రవర్తన పట్ల లోక్‌సభ స్పీకర్ సోమనాథ్ చటర్జీ "మీకంటే స్కూలు పిల్లలు నయం" అని అనటంలో అర్థం ఏమిటి?**

ఎల్. నారయణ, నెల్లూరు

జ. పార్లమెంట్‌లో చరిత్ర హీనులైన, సంస్కృతి భ్రష్టులైన, నేర చరితులు ఎంతోమంది సభ్యులుగా వున్నారు. ఒక విషయాన్ని క్షుణ్ణంగా చదివి, అర్థం చేసుకుని నిర్మాణాత్మకమైన పద్ధతులు విశ్లేషించి చర్చించడం వీరితరం కాదు. మేధస్సుకు బదులు కండబలంతో, నోటి అరుపులతో, విపక్షీయులను బెదరకొట్టడం, భయపెట్టడం వీరి పనిగా వుంది. పాలక, విపక్షాల నాయకులు కూడా వీరిని నియంత్రించడం లేదు. స్కూలు పిల్లలు ఉపాధ్యాయునిచేత నియంత్రించబడి సవ్యంగా ప్రవర్తిస్తారు కాని, కొంతమంది, లోక్‌సభ, రాజ్యసభ, శాసనసభ సభ్యులు తమ నాయకులు చేతకాని సభాధ్యక్షుల చేతగాని నియంత్రణకు లోనుగాక/ లోబడక అసభ్యంగా, జుగుప్సాకరంగా, సిగ్గులేకుండా ప్రవర్తించి కాలాన్ని, ప్రజలధనాన్ని వ్యయం చేయడాన్ని సోమనాథ్ చటర్జీగారు గర్హించారు. సభ్యసమాజం వీరిని సమర్థిస్తోంది.

**5. ప్రైవేట్ రంగంలో బ్యాంకులు వెలుస్తున్నాయి కదా. వీటిని ఎందుకు అనుమతిస్తున్నట్లు? ప్రైవేటు బ్యాంకులు లాభనష్టాలపై భారత రిజర్వుబ్యాంకుకు నియంత్రణాధికారాలు లేవా?**

జి. ప్రశాంత్, నాగర్జునసాగర్



జ. సమాజ శ్రేయస్సుకు వ్యతిరేకం కాని ఏ వ్యాపారాన్నైనా చేసే స్వాతంత్ర్యం ప్రతి పౌరునకు మన రాజ్యాంగం ప్రసాదించింది. కంపెనీలకు కూడా ఇటువంటి స్వాతంత్ర్యము ఉంది. కాని, ఏ వ్యాపారికైనా కొన్ని నియమాలు వున్నాయి. వీటికి కట్టుబడిన ఎటువంటి కంపెనీకైనా ప్రభుత్వం అనుమతి ఇవ్వవలసిందే. ఒక్క ప్రైవేటు బ్యాంకులపైనే కాదు. ప్రభుత్వాధీన బ్యాంకులపై కూడా రిజర్వుబ్యాంకుకి నియంత్రణాధికారం వుంది. కాని, మన దేశంలో ఏ రంగంలో నియంత్రణాధికారం అయినా అధికారంలో ఉన్న రాజకీయ నాయకుల ఒత్తిళ్ళకు లొంగకుండా తమ విధులను నిర్వహించడం లేదు. అందుకనే స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో ఎన్నో కుంభకోణాలు జరుగుతూ వస్తున్నాయి. పట్టుబడి శిక్షించబడిన నేరగాళ్ళు 2%లేక 3% కన్నా ఎక్కువ లేరు.

**6. Contract farming లేదా Corporate farming వల్ల చిన్న రైతులు కొంత నికర ఆదాయం స్వల్పంగానైనా కలిగి (వారి పొలం కౌలుకివ్వడం మూలంగా) రైతుల ఆత్మహత్యలు తగ్గగల అవకాశం ఉందా? మెట్ట ప్రాంతాల్లో Corporate సేద్యానికి ఎవరైనా ముందుకు వస్తారా?**

ఎస్. కృష్ణారావు, హైద్రాబాద్

జ. తమకున్న కొద్దిపాటి భూములను కంపెనీలకు వ్యవసాయానికై కాంట్రాక్ట్ లేక కౌలుకు ఇవ్వడం వల్ల రైతులకు పంట పండినా, పండకపోయినా నిర్ణయించుకున్న కౌలు వస్తుంది. అందువల్ల పంటలు పండకపోవడం మూలాన, తాము అప్పుకు తెచ్చిన పెట్టుబడి వడ్డీలు చెల్లించలేకపోవడం వల్ల ఆత్మహత్యలు చేసుకోవడం ఉండదు. కాంట్రాక్టు ఫార్మింగ్ వల్ల మరికొన్ని లాభాలు వున్నాయి. చిన్న రైతులు కావలసినంత పెట్టుబడిని పెట్టి వివిధ రకమైన ఎక్కువ ఉత్పత్తులను, ఉత్పాదకతను పెంచలేరు. ఇప్పటికాలంలో వందలాది ఎకరాల్లో యంత్రాలను ఉపయోగించి, శాస్త్రీయ పద్ధతుల్లో వ్యవసాయం చేసి తమకు, రైతులకు , దేశానికి, ఎంతో మేలు చేయగలుగుతున్నారు. వ్యవసాయ రంగంలోనే కాకుండా, అన్ని రంగాల్లో జరుగుతున్న సాంకేతిక అద్భుత పరిణామాలను ఈ-టీవీ వారు రాత్రి 10.30 -11.00 గంటల మధ్య చూపిస్తున్నారు.

**7. ఇటీవల ఆర్యభట్ట యూనివర్సిటీ పేరిట చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో ప్రైవేటు యూనివర్సిటీ వెలిసింది? అందులోని సిబ్బందికి జీతభత్యాలు ఎవరిస్తారు?**

జి. విశాల్, గోదూర్

జ. ఆర్యభట్ట యూనివర్సిటీని స్థాపించినవారే అందులోని సిబ్బందికి జీతభత్యాలు ఇస్తారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు సంబంధించిన ఒక చట్టం ఉంది. కొన్ని నియమాలు, నిబంధనలు చట్టం విధిస్తోంది. ఎవరైనా కాని, ఏ సంస్థలయినాకానీ ఆ శాసనానికి కట్టుబడి విశ్వవిద్యాలయాల్ని స్థాపించవచ్చు. ఆ వ్యవస్థాపకులు చట్టానికి విరుద్ధంకాని విధివిధానాలను రూపొందించుకోవచ్చు.

## అక్టోబరు 2004

**1. "ఎడ్యుశాట్" వల్ల మనకు కలిగేటటువంటి ప్రయోజనం ఏమిటి?**

ఆర్. కవిత, హైద్రాబాద్

జ. మన దేశంలో తమ పిల్లలకు ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్యను ఇచ్చినట్లయితేనే వారికి ఉద్యోగార్హతలు, వ్యాపారం చేయగల సమర్థతను పొందగల్గుతారనే విశ్వాసము పెరుగుతోంది. అందువల్ల అధికాధిక సంఖ్యలో విద్యార్థులు వుంటున్నారు. కాని చక్కగా చెప్పగల్గిన గురువులు తగిన సంఖ్యలో లేరు. ఈ లోటును పూర్తి చేయటం కోసం సంచార ఉపగ్రహాలు ఉపయోగపడ్తాయి. మన అంతరిక్ష అనుసంధాన విభాగం నిర్మించిన ఎడ్యుశాట్ విద్య కోసమే నిర్మింపబడిన ఉపగ్రహం. దీనిలో ఎన్నో Transponders వున్నాయి. మన రాష్ట్రంలోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, ఇతర రాష్ట్రాల్లోని అటువంటి సంస్థల్లో క్లాస్‌రూమ్‌కు పనికి వచ్చే స్టూడియో నిర్మించి, అక్కడ నిష్ణాతులైన, బోధనయందు ప్రావీణ్యత కల్గిన గురువుల చేత వివిధ పాఠ్యాంశాలను బోధించటం; వీటిని రాష్ట్రం అంతటా వున్న విద్యా సంస్థల్లో వినటం, చూడటం, అక్కడనుంచే, బోధకుని



ప్రశ్నించటం జరుగుతుంది. అంటే ఒక గురువు, ఒక్క క్లాసుకు మాత్రము పరిమితం కాక, వందలు, వేలల్లో వున్న క్లాసులలో, వారి దగ్గరే వున్నట్లు పాఠాలు చెప్పగల్గుతారు. రానున్న 2/3 సంవత్సరాల్లో, దేశవ్యాప్తంగా పలు దేశ భాషల్లో దాదాపు లక్షన్నర తరగతుల్లో EDUSAT ద్వారా బోధనలు జరుగుతాయి.

**2. దేశమంతా పాఠశాల స్థాయివరకైన ఒకేవిధమైన పాఠ్యప్రణాళికను అమలు చెయ్యలేరా?**

జ. దేశమంతటా ఒకే విధమైన పాఠ్య ప్రణాళిక అంత వాంఛనీయం కాదు. గణిత, విజ్ఞాన శాస్త్రాలకు ఒకే పాఠ్య ప్రణాళిక ఉండవచ్చుకాని, ఇతర అంశాలకు ఆ ప్రాంతము యొక్క చరిత్ర, సంస్కృతి, భాష సమస్యలు, వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని పాఠ్యాంశాలు తయారు చేయాలి. చారిత్రక సత్యాలను వక్రీకరించకుండా వాటిని ప్రస్తుతం దేశ ప్రయోజనం కోసం ఏ దృష్టిలో విశ్లేషించాలి అనేది చాలా ముఖ్యం. ప్రభుత్వాలు కనుక పాఠ్యాంశాలను నిర్దేశించినట్లయితే పాలించే పార్టీ మారినపుడల్లా పుస్తకాలు తిరిగి వ్రాయబడతాయి. ఈ దుష్ట సాంప్రదాయము కమ్యూనిస్ట్ దేశాల్లో మొదలైంది. ఆ దేశ చరిత్రను నాయకుడు మారినప్పుడల్లా తిరిగి వ్రాయిస్తుండేవారు. అందుకనే నిజమైన సిసలైన బహుపక్షీయ ప్రజాతంత్ర దేశాల్లో పాఠ్యాంశాలలో ప్రభుత్వ ప్రమేయం తక్కువగా వుంటుంది.

**3. ఇంటర్ అర్హతగా "సివిల్స్" పరీక్ష నిర్వహించడటము మంచిదా?**

ఎల్. రవి, వరంగల్

జ. ముందు ఇంటర్ పరీక్షను సజావుగా నిర్వహించాలి. కాపీలు కొట్టడం, మార్కులు వేయించుకోవడం, మూల్యాంకనం సరిగ్గా జరగకపోవడం, ఇటువంటి లోపాలవల్ల ఇంటర్ పరీక్షకు మాన్యత, గౌరవంపోతోంది. దీన్ని సరిదిద్దలేక వేరే పరీక్షలు పెట్టి ప్రవేశార్హతలను, ఉద్యోగార్హతలను నిర్ణయిస్తున్నారు. ఇందువల్ల మనరాష్ట్రంలో ఒక కొత్త పరిశ్రమ ఉత్పన్నమయింది. అవే కోచింగ్ ఇనిస్టిట్యూట్స్, పర్యవసానంగా, విద్యకు, క్రియాశక్తికి, సృజనాత్మకతకు ఎనలేని నష్టం జరుగుతోంది.

**4. "మధ్యాహ్నభోజనం" రాష్ట్రాలకు ఇవ్వొద్దు అని సుప్రీంకోర్టు ఉత్తర్వు సబబేనా?**

జ. సుప్రీంకోర్టు యొక్క ఉత్తర్వు శిరోధార్యం కదా? కాని సమగ్రంగా ఆలోచించినట్లయితే ఇది సబబని తోచటంలా, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో అవక తవకలతో మధ్యాహ్న భోజన పథకము సరిగ్గా నిర్వహించడములేదు. అందుకని ఈ బాధ్యతను వారికి కాక మరొకరికి అప్పచెప్పటం సబబెలా అవుతుంది. మీ ప్రభుత్వము మేమిచ్చిన ధనాన్ని సరిగ్గా ఉపయోగించుకోవడం లేదు. కాబట్టి ఈ పథకాలను మేమే అమలు చేస్తామని వరల్డ్‌బ్యాంక్ అంటే మనం సబబని అనగలమా?

అవకతవకలను, అసమర్థతను, లంచగొండితనాన్ని ఆపడంకోసం ప్రజాసంఘాలు తమ స్థానాల్లో జాగరూకులై ప్రతిఘటించి అస్తవ్యస్త వ్యవస్థను సరిదిద్దాలి. ప్రజలు భయపడి వూరుకుంటే, నిర్లిప్తులై వుంటే భ్రష్టాచారం కొనసాగుతూనే వుంటుంది.

**4. మన రాష్ట్రపతి ఎ.పి.జె. అబ్దుల్ కలామ్‌గారు ఉగ్రవాదం అణచివేతకు అంతర్జాతీయ స్థాయిలో సరికొత్త వ్యవస్థ అవసరము అంటున్నారు కదా! ఇది ఎలా ఉండాలి అంటారు?**

కె. శ్రీరాములు, విశాఖపట్నం

జ. ఉగ్రవాదాన్ని జాతీయస్థాయిలో మనం అణచివేయలేకపోతున్నాం. కారణం ఏలే వారిలో ఉగ్రవాదాన్ని గురించి సరియైన అవగాహన లేకపోవడం, కొన్ని సందర్భాల్లో, ఉదా॥ ఎన్నికల్లో, ధనార్జనలో ఉగ్రవాదుల సహాయం పొందడం మూలాన, వారిని అణచివేయాలనే చిత్తశుద్ధి లేకపోవడం, మనం చేయగల్గింది చేయలేక, ఈ బాధ్యతను ఇతరుల మీద పెట్టడం అంత మంచిది కాదు. కాని కొన్ని ఉగ్రవాద సంస్థలు అంతర్జాతీయ స్థాయిలో పని చేస్తుండటం మూలాన ఒక దేశంలో వారిని అణిచివేయడానికి ప్రయత్నించితే,ఇతర దేశాల్లోని స్థావరాల ద్వారా వారు మనదేశంలో కూడా విధ్వంసక చర్యలు చేపడ్తారు. ఉదా॥పాకిస్తాన్, బంగ్లాదేశ్ దేశాల్లో ఉగ్రవాద సంస్థలకు వ్యక్తులకు స్థావరాలు వున్నాయని, అక్కడ



శిక్షణా సంస్థలు వున్నాయని, వారికి ఆయుధాలు కొల్లలుగా అందించబడుతున్నాయని మనకు తెలుసు. అక్కడి ప్రభుత్వాలను మనం పదే పదే సహాయం అడుగుతున్నా వారు ఇవ్వడం లేదు. ఈ పరిస్థితి దృష్ట్యా రాష్ట్రపతి గారన్నట్లు అంతర్జాతీయ అవగాహన, ఉమ్మడి చర్యలు అవసరం. అలా అని ఊరుకోక మనం చేయగలిగిన, చేయవలసిన పనిని చేస్తేనే ఇతరులు మనతో సహకరించడానికి ముందుకు వస్తారు.

**5. మన దేశంలో అధ్యక్ష తరహా ప్రభుత్వం వస్తే 3 లేక 4 పార్టీలు కూడా వుండవచ్చా? అధ్యక్ష అభ్యర్థిని ఆయా పార్టీలు ఎంపిక చేసే విధానం తెలపండి?**

సురపనేని రామలక్ష్మి, హైద్రాబాద్

జ. అధ్యక్షులను ప్రజలంతా సూటిగా ఎన్నుకుంటారు. అయినప్పటికి అక్కడ పార్లమెంట్‌లోని సభ్యులను కూడా ప్రజలే ఎన్నుకుంటారు. ఈ రెండు ఎన్నికలకీ కూడా పార్టీలు తమ అభ్యర్థులను పెట్టవచ్చు. ఎన్ని పార్టీలైనా వుండవచ్చు. మన దేశంలో అభ్యర్థులను నిర్ణయించేది, ఆయా పార్టీల హైకమాండ్ మాత్రమే. ఇవి ఒక వ్యక్తి యొక్క జేబు పార్టీలుగా తయారైనాయి. ఇవి ఏవో ఆలోచించే ప్రతి భారతీయుడికి తెలుసు. ఈ జాబితాలో ప్రాంతీయపార్టీలు, జాతీయస్థాయి పార్టీలు కూడా వున్నాయి. ఒక్క అమెరికాలోనే అధ్యక్ష పదవికి ప్రతి పార్టీలో, ప్రతిరాష్ట్రంలోనూ ఎన్నిక జరుగుతుంది. దీనినే ప్రైమరీ అంటారు. ఆ పార్టీల తరుపున టికెట్ తమకే కావాలని, ఎవరైనా బరిలోకి దిగవచ్చు. ఆ పార్టీ సభ్యులు బరిలోకి దిగిన వారిలో ఎవరికైతే అత్యధిక ఓట్లు వేస్తారో, వారిని పార్టీ యొక్క అభ్యర్థిగా నియమిస్తారు.

**6. ఉమాభారతి జాతీయపతాకాన్ని ఎగురవేసి వివాదానికి తెరదీసిన వృత్తాంతం ఏమిటి? త్రివర్ణ పతాకాన్ని హుబ్లిమైదానంలో ఎగురవేయటం నేరమవుతుందా? నిజంగా అక్కడ జరిగింది ఏమిటి?**

జి. అశోక్, గోధూర్

జ. హుబ్లీలో ఒక పెద్ద మైదానం ఒకప్పుడు ఒక క్రిస్టియన్ మిషన్ ఆస్తిగా బ్రిటీష్ పాలకులచేత ఇవ్వబడింది. ఆ మిషనరీల వద్ద నుండి హుబ్లీ నగరపాలక సంస్థ ఆ భూమిని కొన్నది. కాని ఒక మత సంస్థ ఆ మిషనరీ తమకు ఈ మైదానాన్ని 999 సంవత్సరాలకు లీజుకు ఇచ్చినట్లుగా ఒక దస్తావేజు సృష్టించింది. ప్రభుత్వం, మత సంస్థ మధ్య వున్న ఈ వివాదము సుప్రీంకోర్టు వరకూ వెళ్ళింది. ప్రతికోర్టు కూడా మతసంస్థకు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చి, మైదానం ప్రభుత్వానిదే అన్నాయి. ఇది అలా జరుగుతుండగా ఆ మతసంస్థ, కొన్ని భవనాలను కట్టి వ్యాపారస్తులకు అద్దెకు ఇచ్చింది. వాటిని బద్దలు కొట్టమని కోర్టు తీర్పు ఇచ్చినా, ప్రభుత్వం ఏ చర్యా తీసుకోలేదు. ఈ మైదానంలో కేవలం సంవత్సరానికి రెండుసార్లు మాత్రమే వారు ప్రార్థనలు జరుపుకోవచ్చు అని కోర్టు తుదినిర్ణయం. అటువంటి మైదానంలో ఆగస్టు15నగాని, జనవరి 26నగాని జాతీయ పతాకాన్ని ఎగురవేయటాన్ని ఎవరైనా ఎందుకు అభ్యంతర పెట్టాలి? అంతేకాదు. 1976లో ఇందిగాంధీగారి హయాములో ఈ రెండు జాతీయ దినాల్లో ఎవరైనా నిరాటంకంగా జాతీయ పతాకాన్ని ఎగురవేయవచ్చు అనే చట్టాన్ని చేసారు. కాని ఈ మతస్థులు జాతీయ పతాకాన్ని ఎగురవేస్తే తమకు మనస్తాపం కలుగుతుందని, తమను కించపరిచినట్లని పతాకాన్ని ఎగురనీయవద్దని ప్రభుత్వంచే నిషేధాన్ని సాధించారు. అవి కాంగ్రెసు ప్రభుత్వాలు. మన దేశపు జాతీయ పతాకాన్ని ఎగరవేయనీయకుండా మనదేశంలో మన జాతీయ దినాల్లో, ఎవరినో తృప్తిపరచడం కోసం మరో జెండా ఎగురవేస్తామా? జాతీయ పతాకావిష్కరణకు ఎవరికీ వీటో హక్కులేదు అని తెలపడం కోసం ఉమాభారతి గారు 1994లో ఆగస్టు15 నాడు స్వాతంత్ర్య దినాన జాతీయ జెండా ఎగురవేయబోతే లౌకికవాద కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిషేధించింది. దాన్ని ఉల్లంఘించబోతే ఉమాభారతిమీద ప్రభుత్వం కేసుపెట్టింది. చట్ట ప్రకారం జెండాను ఎగురవేయడానికి అడ్డుపడ్డవారిమీద కేసు పెట్టవలసింది. మన దేశంలో లౌకిక వాదం అంటే ఒక మతస్థులను తృప్తిపరిచే, రాజ్యాంగంలో చట్టంతో సంబంధంలేని హక్కులను ఇవ్వటంలా తయారయింది.



**7. మేధావులూ... రాజకీయాల్లోకి రండి అని రాజకీయ నాయకులు ఆహ్వానిస్తున్నారు కదా! వారునేటి రాజకీయాలలో ఇమడగలరా?**

సి. రామాకుమార్, రామగుండం

జ. ప్రజాస్వామ్యంలో రాజకీయం అంటే పార్టీలు వుండటం, అవి ఎన్నికల్లో పోటీచేసి, గెలిచిన పార్టీ ప్రభుత్వం నడపడం సర్వసామాన్యం. మన దేశంలో నానాటికీ రాజకీయాలు దిగజారిపోయాయి. కారణం ప్రతి పని ప్రభుత్వమే చేయాలి అనటం, ఎవరైతే ప్రభుత్వాధిపత్యాన్ని చేజిక్కించుకుంటారో, వాళ్ళే బాగుపడడం, ప్రజా సంపత్తిని కొల్లకొట్టడం జరుగుతూ వచ్చింది. చివరకు డబ్బు, కండబలం వుంటేనే ఓట్లను సంపాదించ గలగడం జరుగుతోంది. నేరచరితులు, ధనార్జనపరులు, వ్యాపారస్థులు ఒకప్పుడు పరోక్షంగా రాజకీయాల్లో పాల్గొనేవారు. రాను రాను ప్రత్యక్షంగా పాల్గొనేవారే శాసన సభ్యులుగా పార్లమెంట్ సభ్యులుగా మంత్రులుగా వెలుగుతూ, వారు చేసిన నేరాలను రద్దు చేయించుకోవడానికి, అక్రమార్జనను నియమబద్ధంగా చేసుకోవడానికి తమ పదవులను ఉపయోగించుకుంటున్నారు. మన దేశంలో నిరక్షరాస్యత, నిరుద్యోగం ఎక్కువగా ఉండటం మూలాన, ధనబలంతో కొంత మంది దుర్మార్గులు రాజ్యాధికారం చేపడుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో డబ్బులేనివాళ్ళు నిజాన్ని చెప్పేవారు, నిజాయితీ వున్నవారు, రాజకీయాల్లోకి వచ్చినా, వారికి పార్టీలు టిక్కెట్లు ఇవ్వవు. స్వతంత్ర్యంగా నిలుచుంటే, ప్రజలు ఓట్లు వేసి వారిని గెలిపించరు. ఈ పరిస్థితిని అతిక్రమించాలంటే ప్రజల్లో ఆలోచనాశక్తిని, క్రియాశీలతను ప్రజలే పెంచాలి.

## నవంబరు 2004

**1. గాంధీజీ కలలను మనం ఏమేరకు నిజం చేసాం?**

**ఎ. సుబ్రహ్మణ్య శాస్త్రి, నెల్లూరు**

జ. గాంధీగారి కొన్ని కలలు వారి జీవిత సమయంలోనే కల్లలయ్యాయి.

ఉదాహరణకు మన దేశం యొక్క విభజన, హిందూముస్లింలు సౌభ్రాతృత్వము, ఇక వారి తరువాత వారి యొక్క ప్రతి పథకాన్ని నెహ్రూగారి ఆధ్వర్యంలో వచ్చిన ప్రభుత్వాలు ప్రక్కకు పెట్టేశాయి. గాంధీగారి సిద్ధాంతాన్ని కాక, సామ్యవాద సిద్ధాంతంలో నెహ్రూగారికి ఎక్కువ విశ్వాసం వుండటం మూలాన గాంధీగారి గ్రామ స్వరాజ్యం, స్వదేశీ మొదలైన సిద్ధాంతాలను వారు త్యజించారు.

**2. "గ్రామ స్వరాజ్యం" అంటే ఏమిటి?**

జ. గ్రామానికి సంబంధించిన నిర్వహణ, అభివృద్ధి పథకాలు, అవసరాలు గ్రామస్థులే ఆలోచించి, నిర్ణయించుకుని, అమలు చేయడం, గ్రామంలోని చిన్న చిన్న వివాదాలను పంచాయితీల ద్వారా పరిష్కరించుకోవడం మొదలగునవి గ్రామస్వరాజ్యం యొక్క భాగాలు, గాంధీగారి ఆశయాల్లో ఇది ప్రప్రథమమైనది.

**3. మన రాష్ట్రపతి గారు విద్యారంగానికి నిధులు ఇవ్వవలసిందిగా పార్లమెంట్ సభ్యులను, శాసనసభ్యులను కోరుతున్నారు కదా? నేరుగా నిధులనుకేటాయించవలసినదిగా ప్రభుత్వాన్ని ఆదేశించే అధికారం రాష్ట్రపతికి లేదా?**

కె. వి. ఆర్. విజయవాడ

జ. రాష్ట్రపతిగారు ఏమిచెప్పినా మంత్రి మండలికి సలహా మేరకే ఇవ్వగలుగుతారు. సందేశాలను, సూచనలను మాత్రమే స్వేచ్ఛగా ఇవ్వవచ్చు. అందులో కూడా ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టకుండా వుండే సంయమనం చూపాలి. పార్లమెంట్, శాసన సభ్యులకు ప్రతి సం॥ తమ నియోజక వర్గంలో సామాజిక అభివృద్ధికి నిర్దిష్టమైన నిధిని కేటాయించమని సంబంధిత ప్రభుత్వ అధికారులకు సూచించే అధికారం ఉంది. అటువంటి అధికారం రాష్ట్రపతికిగాని, రాజ్యపాల్ అంటే గవర్నర్‌కి కాని లేదు.



**4. లౌకిక వాదం అంటే ఏమిటి?**

జ. లౌకిక వాదం అంటే ప్రపంచమంతటా ఒక అర్థం. మన దేశంలో మరో అర్థం. ప్రపంచమంతటా లౌకికవాదం అంటే ప్రభుత్వం ఏ మతాన్ని పోషించటంకాని, ప్రోత్సహించటం కాని, అదే విధంగా ఏ మతాన్ని గర్హించడంకాని, నిరోధించడం కాని, చేయదు అని, మత ప్రసక్తి లేకుండా పాలన చేయడం అని అర్థం. కాని మనదేశంలో హిందూ దేవాలయాలను హిందూ వివాహాలను ప్రభుత్వం నియంత్రిస్తుంది. కాని ఇతర మతాలవారిని ఏ విషయాలోనూ నియంత్రించదు. కొన్ని మతాల వారికి ప్రత్యేక హక్కులు అల్ప సంఖ్యాకులు అనే పేరుతో ఇస్తుంది. ఉదా : ముస్లింలు పరాయిదేశమైన అరేబియాలో మక్కా హాజ్ తీర్థయాత్రకు వెళుతుంటారు. వారి ప్రయాణపు ఖర్చుకు సబ్సిడి ఇస్తుంది. డాక్టర్లను వెంట పంపుతుంది. కాని హిందువులు అమరనాథ యాత్రకు, మానససరోవర్ తదితర యాత్రలకు పుష్కరాలకు, వెళుతుంటే అటువంటి సబ్సిడీలను ఇవ్వదు. పైపెచ్చు చాలా సందర్భాలలో వాళ్ళ మీద టాక్స్ వేస్తుంది. పశ్చిమ బెంగాల్‌లో గంగాసాగర్ మేలాకు వెళ్తున్న హిందువులపైన అక్కడ ప్రభుత్వం టాక్స్ వేస్తుంది. అల్ప సంఖ్యాక మతస్తులైన ముస్లింలు, క్రిస్టియన్‌లు సామాన్యనియమ నిబంధనలకు సంబంధం లేకుండా అసంఖ్యాకమైన ఇంజనీరింగ్, మెడికల్, MCA, MBA, B.Ed; College లను స్థాపించి, అందులోని కొన్ని సీట్లను ఇష్టం వచ్చిన వారికి ఇచ్చుకోవచ్చు. అటువంటి హక్కు హిందువులకు లేదు. అదే విధంగా ఇతర మత సంస్థ (ఉదా: చర్చ్) వాణిజ్య వ్యాపారాలకు అద్దెకీయబడిన సంపత్తుల మీద టాక్స్ కూడా వేయదు. సంక్షిప్తంగా చెప్పాలంటే భారతదేశంలో లౌకిక వాదం అంటే హిందూ వ్యతిరేకత, కాకపోతే ఉదాసీనత అనుకోవచ్చు. లౌకికవాదం పేరుతో దేశంలో జనాభాతో సంబంధం లేనటువంటి, జనాభా సంఖ్యతో సంబంధం లేనన్ని అసంఖ్యాకమైన ప్రార్థనాలయాలు చర్చిలు, మసీదుల కోకొల్లలుగా వెలుస్తున్నాయి. కొన్ని రాష్ట్రాలలో హిందూ దేవాలయాలకు వచ్చే ఆదాయాన్ని

చర్చిలు, మసీదులు నిర్వహించడానికి లౌకికవాద ప్రభుత్వాలు కేటాయిస్తున్నాయి. ఈ సత్యం చెప్పిన వాళ్ళని, ఇలా విమర్శించిన వారిని ఫాసిస్ట్‌లని, మతతత్వవాదులని అల్ప సంఖ్యాక వ్యతిరేకులని ముద్రవేస్తున్నారు.

**5. జాతీయగీతం వందేమాతరం సభలలో స్కూళ్ళలో పాడటానికి ముస్లింలు, అది తమ మత సిద్ధాంతాలకి వ్యతిరేకమని ఒప్పుకోవడం లేదు. స్వాతంత్ర్యం రాకపూర్వం హిందువులు ముస్లింలు కలిసికట్టుగా వందేమాతరం అంటూ నినాదాలు చేశారు. అప్పుడు లేని అభ్యంతరం ఇప్పుడెందుకు?**

**కె. రామారావు, హైద్రాబాద్**

జ. స్వాతంత్ర్యం రాకపూర్వం కూడా అప్పుడప్పుడు వందేమాతరానికి కొంతమంది ముస్లింలు అభ్యంతరం పెట్టారు. ముస్లింలు చేపట్టిన ఖిలాఫత్ ఉద్యమంలో గాంధీగారు హిందువులను, కాంగ్రెస్‌ను కూడా సౌభ్రాతృత్వ చిహ్నంగా పాల్గొనమన్నారు. ఆ సందర్భంగా విజయవాడలో ఒక సభలో ప్రజలు వందేమాతరం అని నినాదం చేస్తే ముస్లింలు అభ్యంతర తెలిపారు. దానికి సమాధానంగా వందేమాతరంతో పాటు అల్లాహో అక్బర్ అని కూడా కలిపి నినదిస్తే వారు శాంతించారు. ఇది ఇందిరాగాంధీ గారి ఆమోదంతో జరిగిన పని. ఒక మతస్థులు అభ్యంతరం చెప్పడంతోనే అది సబబు అని అంగీకరించే బుద్ధిజీవులు. లౌకికవాద పక్షీయులు వుంటే, ఆ వర్గం వారు మతం పేరిట, మనదేశంలో ఏమి చేయవద్దన్నా అంగీకరించే 'సంప్రదాయం' ఏర్పడింది. ప్రపంచంలో ఎక్కడా కూడా ఇటువంటి పరిస్థితి లేదు. వందేమాతరానికి అభ్యంతరం పూర్వం ఉంది. దాన్ని మనం అధికారికంగా ఒప్పుకోవడం మూలాన, ఈనాడు అభ్యంతరం ఒక్క వందేమాతరానికే కాదు, జాతీయ పతకాన్ని ఎగురవేయటాన్ని నిరోధించడం కూడా కొన్ని సందర్భాల్లో ఒక హక్కుగా మారింది. అదే విధంగా కొబ్బరికాయలు కొట్టడానికి, సరస్వతి వందనం చేయడానికి, దీపప్రజ్వలన చేయడానికి అభ్యంతరాలు చెప్పడం, కొంతమంది దానికి తలొగ్గడం జరుగుతోంది. ఇప్పుడు ఇది శృతి మించి సైన్యంలో బొట్టు పెట్టుకోకూడదని,



అటువంటి హైందవ సంస్కృతీపరమైన చిహ్నాలను, వస్తువులను వుంచుకోకూడదని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మధ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇక్కడ జరిగే ప్రతి వివాహాన్ని రిజిష్టరు చేయాలి అనే రూలు తీసుకువస్తే, ఈ మతస్థులు తమ మతానికి ఈ నియమం వ్యతిరేకం కాబట్టి ఈ రూలు మాకు వర్తించదని ప్రభుత్వానికి డిమాండ్ చేసి కృతకృత్యులయ్యారు. ఇలాంటి సంఘటనలు ఎన్నో వున్నాయి. ఈ విధంగా ఈ మతస్థుల డిమాండ్లను అంగీకరించే, ఒక్క ముస్లిమేతర దేశంకూడా లేదు.

**6. ఒక పేరు వున్న వ్యక్తి చనిపోయినపుడు అతనెవరో తెలియక పోయినా గవర్నరు తోటి పెద్దలు సంతాపం ప్రకటిస్తారు. ఇది "హిపోక్రసీ" కాదా?**

జ. ఔను అలా మరణించిన వ్యక్తిని గురించి ఏమీ తనకు తెలియకపోయినా గవర్నరు, ముఖ్యమంత్రులు, రాష్ట్రపతి కూడా సంతాపాన్ని తెలియపడం ఒక ఆనవాయితీ అయింది. నిజంగా ఆ సంతాప ప్రకటన వారియొక్క సిబ్బంది రాస్తారు. ఆ పెద్దలు సంతకం పెడతారు. చనిపోయినవ్యక్తి కుటుంబీకులు ఆ ప్రకటనను చూసి మురిసిపోవచ్చు. అంతకన్నా మరే ప్రయోజనం లేదు.

**7. మీ చిన్నతనంలో 70శాతం మార్కులువస్తే చాలా ఎక్కువ అని సంతోషపడేవారు నేడు 95శాతం వచ్చినా ఇంకా చాలదు అనే భావము ఎందుకు వచ్చింది?**

కె.బి.కె. హైదరాబాద్

జ. ఏ విధంగా అయితే రూపాయికి విలువ తగ్గిపోయిందో, ఏవిధంగా అయితే ప్రజలు కోరిందల్లా రాజకీయనాయకులు ఇస్తామంటున్నారో, అదే విధంగా మార్కులకు కూడా విలువ తగ్గిపోతూ, అడిగినన్ని మార్కులు ఇవ్వడం సామాజిక న్యాయమనే దృష్టి కూడా రావడం మూలాన 95 ఏమిటి 100 వచ్చినా చాలదు అనే భావం వచ్చింది. లెక్కల్లో, భౌతిక రసాయన శాస్త్రాల్లో ఇచ్చిన సమస్యల సమాధానాలకు 100కి 100 రావడం వింతకాదు. ఇతర సబ్జెక్ట్సులో 95కు

అంతకుమించి మార్కులు సంపాదించుకునేవారిని సర్వజ్ఞులు అనవచ్చును. ప్రతి ప్రవేశానికి, ఉద్యోగానికి పోటీకూడా తీవ్రమవడం మూలాన, ఎంత ఎక్కువ మార్కొలొచ్చినా తృప్తిలేదు.

**8. మీ విద్యార్థి దశకి నేటి విద్యార్థి దశకి వచ్చిన మార్పులు ఏమిటి?**

జ. పూర్వం భోదకులు గురువులుగా విద్యార్థులను బుద్ధిమంతులుగా, సంపూర్ణ మానవత్వాన్ని సంపాదించే శక్తివంతులుగా చేయాలని శ్రమించేవారు. నీతినియమబోధలకు పాఠ్యాంశాలకన్నా ఎక్కువ ప్రాధాన్యతనిచ్చేవారు. ఇప్పుడు పాసవటం మాహక్కు. ఎక్కువ మార్కులు ఇవ్వటం మీ బాధ్యత అని విద్యార్థులు సమీకరించి ఉద్యమింపజేసే రాజకీయాలు ఉండటం మూలాన చదువుయొక్క నాణ్యత తగ్గిపోయింది. తక్కువ మార్కులు వచ్చినా మాకు ఎలాగో ఉద్యోగం వస్తుంది అనే ధీమా వున్నా కొంతమంది విద్యార్జనకు విలువ నివ్వడం లేదు. ఇప్పుడు ఎన్ని మార్కులు వచ్చినా కొన్ని కారణాల వల్ల ఒక వర్గపు కళాశాలల్లోకి ప్రవేశం రాకపోవడం మూలాన, డబ్బు ఖర్చుచేసి, ఏ సీటైనా కొనుక్కునే అవకాశం వుండటము, పూర్వపు ప్రస్తుతపు విద్యార్థిదశకు బేధం, విద్యార్థులు గురువులను గౌరవించేవారు. గురువులు తమ విధులను సక్రమంగా నిర్వహించి గౌరవానికి పాత్రులయ్యారు. ఇపుడు రెండు వర్గాల వారు సంఘాలను పెట్టుకొని సంగ్రామ పథంలో వుండటం మూలాన ఇద్దరూ కూడా గౌరవం పొందలేకపోతున్నారు.

## డిసెంబర్ 2004

**1. రాష్ట్రంలో మరిన్ని విశ్వవిద్యాలయాలు అవసరమా?**

ఎ. మల్లి, నందివాడ

జ అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చిచూస్తే మనదేశంలోని 350 విశ్వవిద్యాలయాలు చాలా తక్కువ.

ఈ పట్టిక చూస్తేమనకెన్ని విశ్వవిద్యాలయాలు అవసరం ఉందో తెలుస్తుంది.



| దేశం | విశ్వవిద్యాలయాల సంఖ్య | ఆదేశంతో పోలిస్తే దేశంలో ఎన్ని విద్యాలయాలుండాలి. | జనాభా (దశలక్షలోమిలియన్లు) |
|---|---|---|---|
| కొరియా | 45 | 120 | 3,000 |
| ఇజ్రాయిలు | 6 | 10 | 1,700 |
| ఇంగ్లండ్ | 50 | 170 | 3,400 |
| అమెరికా | 280 | 1700 | 6,100 |
| ఆస్ట్రేలియా | 18 | 39 | 2,200 |
| ఇరాక్ | 16 | 22 | 1,200 |

ఒక్క కొరియాతో పోలిస్తేనే మన రాష్ట్రంలో 200 విశ్వవిద్యాలయా లుండాలన్నమాట!

**2. రాజకీయాలకు అతీతంగా మనం విశ్వవిద్యాలయాల్ని వుంచడం వీలుకాదా?**

జ ప్రస్తుత పరిస్థితుల్లో వీలుకాదు. మురలీమనోహర్‌జోషీ గారు ఇండియన్ ఇన్సిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్లతో, శ్రీ అర్జున్‌సింగ్ విద్యకు, చరిత్రకు, సంస్కృతికి సంబంధించిన ప్రతి సంస్థతో ఎలా వ్యవహరించారో చూస్తే, విద్యాలయాల రాజకీయ పార్టీలమాన్యాలు జనవరి 2005వ సంవత్సరం నుండి అంతర్జాతీయ వ్యాపార సంస్థ (**W.T.O** ) నిబంధనల ప్రకారం, ఏ విదేశీ విద్యా సంస్థ అయినా భారతదేశంతో కూడి, ఏ దేశంలోనయినా విద్యా సంస్థలను నెలకొల్పవచ్చు. కాబట్టి భారతీయ విద్యార్థులకు, విదేశాలకు వెళ్ళకుండా, ఇక్కడ నెలకొల్పబడ్డ విదేశీ విశ్వవిద్యాలయాల్లో చదివే అవకాశాలుంటాయి.

**3. అధిక ధరలు, అదనపు పన్నుల భారము నుండి సామాన్య ప్రజలు విముక్తులగుట ఎట్లు?**

జ ఎంతవరకయితే పేదలకు స్వయం నిర్భరతనిచ్చే విద్యనివ్వకుండా,

తక్కువకాలంలో పైకి రావాలంటే ఒకరిద్దరికన్నా ఎక్కువ పిల్లలను కనకుండా ఉండేటట్లు చేయలేమో, అంతవరకూ వారి ఓట్లకోసం ఉచిత విద్య, సబ్సిడీ బియ్యం, పంచదార, కిరసనాయిల్, ఇళ్ళస్థలాలూ, ఇళ్ళు, సంక్షేమ హాస్టల్లూ వగైరా ఇవ్వకతప్పదు. ప్రస్తుతం ఈ పద్దుల క్రింద ప్రభుత్వాలు సాలీనా 47,000 కోట్ల రూపాయలు ఖర్చుపెడుతున్నాయ్. దీంతోపాటు ముస్లింల మతపరమైన హజ్‌యాత్రకు రూ. 250 కోట్ల సబ్సిడీ ఇస్తున్నాం. ఈ ఖర్చులన్నీ ఏటేటా పెరుగుతున్నాయ్ కానీ తగ్గడంలా, అందుకని పన్నులు పెరగవలసిందే; కొత్త పన్నులు విధించవలసిందే (ఉదాహరణకు : సర్వీస్ టాక్స్, యూజర్ చార్జీలు, విద్యాసెస్, ఒక పెళ్ళిళ్ళ మీద, కాన్పుల మీద ఇంకా పన్నులు వేయడం లేదు; మంచి నీళ్ళు కొనుక్కుంటున్నాం, కొద్ది కాలంలో మంచిగాలిని సీసాల్లో కొనుక్కొని, నడుముకు కట్టి పీల్చుకోవడం జరగవచ్చు కూడా)

**4. మనదేశం అమెరికాలాగా అభివృద్ధి చెందిన దేశములాగా ఎప్పుడవుతుంది? అలా కావాలంటే ఏమిచేయాలి.**

పి. రమాదేవి

అమెరికాలాగా మనదేశం అభివృద్ధి చెందాలంటే అందరూ చదువుకోవాలి. ప్రతి ఒక్కరూ కనీసం **SSLC** పాస్ అవ్వాలి. 16–23 సంవత్సరాల మధ్య వయసులో ఉన్న కనీసం 20 శాతం యువకులు యువతులూ విశ్వవిద్యాలయ స్థాయి వరకూ పట్టభద్రులవ్వాలి. (ఇప్పుడు 6% మంది మాత్రమే విశ్వవిద్యాలయాల్లో ఉన్నారు) మనం నైతిక విలువలు కలిగి, ప్రతి పనిపట్ల అత్యంత నిష్టతో, బాధ్యతతో చేయాలి. ఆయా పనులు ఇంకా బాగా ఎలా చేయాలనే నిరంతర తపన కావాలి. క్రమశిక్షణ, సమయ పాలనలు కూడా ఎంతో ముఖ్యమైనవి. ప్రపంచంలో ఏ దేశస్తులు కూడా మనకంటే ఎక్కువ తెలివిగల వారేమీ కాదు. మనకన్నా సహజ వనరులు వారికి ఎక్కువేమీ లేవు. మనం పనిపట్ల "అప్రోచ్" మార్చుకున్న నాడు ఏ శక్తి మనల్ని "సూపర్ పవర్" కాకుండా ఆపలేదు. అన్నీ ప్రభుత్వమే చేయాలి అనుకోకూడదు. ఉన్న సంపదను పంచుకోవడం కన్నా అదనపు సంపదను



ఉత్పత్తిచేసి, అందరం బాగుపడుదాం అనే దృక్పథం అలవరుచుకోవాలి. పరిశ్రమలూ, వ్యాపారాలు ఎవరైనా, ఎక్కడైనా స్థాపించుకోవాడానికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వాలి. ఇవన్నీ చేస్తే మనదేశం 20 ఏళ్ళలో అభివృద్ధి చెందిన దేశాల శ్రేణిలో ఉండగలుగుతుంది. విద్యతోపాటు, పరిమిత సంతానాన్ని నిర్బంధంగా అమలుచేయాలి. చైనా చేస్తోంది కనుకనే శరవేగంతో అభివృద్ధి చెందుతోంది.

**5. ప్రపంచంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతున్న దేశం ఏది?**

జ. ప్రజాస్వామ్యం అత్యద్భుతంగా పరిఢవిల్లుతున్న దేశాలు : ఇంగ్లాండ్, స్వీడన్, నార్వే, ఫిన్‌లాండ్, డెన్మార్క్, ఇజ్రాయిల్, అమెరికాలు, మనదేశంలోనూ ప్రజాస్వామ్యం ఉంది. కాని నిరక్షరాస్యత, పేదరికం, అధికసంతానం అనే రుగ్మతలవల్ల, నిజాయితీ, దేశభక్తి, సమర్థత, చిత్తశుద్ధి ఉన్న నాయకుల కొదువ; లంచగొండితనం యొక్క సర్వవ్యాపకత మన ప్రజాస్వామ్యాన్ని నిరర్థకం చేస్తున్నాయ్.

**6. నేటి విద్యార్థి మానసికంగాను, శారీరకంగాను వృద్ధి చెందలేకపోతున్నాడు. అందుకు కారణం విద్యా విధానమూ లేక మారుతున్న సభ్యతా సంస్కారాలు ఈ లోపాన్ని సరిదిద్దడానికి మార్గాలు లేవా?**

ఎల్. రాజారావు, నగరి

జ. మన పాఠశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో, విద్యగాదు నేర్పబడుతుంది. పరీక్ష పాసవడానికి కావలసిన విషయ జ్ఞానం మాత్రమే, అందుకే విద్యాలయాలకు వెళ్ళిన, పంపబడుతున్న, చదువుకొంటున్న చాలామంది, మానసికంగా వృద్ధిచెందటంలేదు కొంతమంది మాత్రవే శారీరకంగా, గొప్ప పుష్టినిపొందుతున్నారు. విద్య విషయంలో మన బలహీనతనకు చాలా కారణాలున్నాయి. ముఖ్యమైనవి: విద్య రాజకీయ సిద్ధాంతానికి మాధ్యమంగా చేయబడటం, అర్హతతో, సమర్థతతో సంబంధంలేని మంత్రులు అన్నీ నాకు తెలుసన్నట్లుగా పాఠ్యాంశాలనూ, పరీక్షాపద్ధతిని, ఫలితాలను, ప్రవేశాలనూ, నిర్దేశించడం, మనందరిలో ధర్మం, నీతి నియమ నిరపేక్షత పెరగడం, మానసిక

వికాసం, సృజనాత్మకతకాదు, ఉద్యోగం పొందడమే చదువుల లక్ష్యం అనే భావాలు మన విద్యా దారిద్ర్యతకు మూలకారణాలు.

**7. విద్య మానవునికి మూడవ కన్ను అని ప్రముఖులెవరో సెలవిచ్చారు. మరి ప్రస్తుత సమాజంలో ఈ విద్య మానవునికి ఏ రంగంలో, ఏరకమైన అభివృద్ధికి తోడ్పడేటి మూడవ కన్ను.**

బి. నాగేష్, కర్నూల్

జ. భారతదేశంలో స్వాతంత్ర్యానంతరం విద్య యొక్క ప్రామాణికత, స్థాయి, ఉపయోగం తగ్గిపోతోంది, విద్య చెప్పే గురువులకన్నా పరీక్ష పాసుచేయించే ట్యూషన్ చెప్పేవాళ్ళు, కోచింగ్ ఇచ్చేవాళ్ళూ ఎక్కువయ్యారు. విద్యకేవలం పొట్టపోసుకునే ఉద్యోగం కోసమేనన్న భావం ఎక్కువమందిలో వచ్చింది. విద్య వల్ల వ్యక్తిలోని దివ్యత్వాన్ని కార్యాన్వితం చేయగలం అనే భావం, మన బోధనా పద్ధతిలో లేదు. ప్రశ్నించగల ధైర్యం, విశ్లేషణ చేయగల ప్రజ్ఞ, సదసద్వివేక చతురతను కల్గించే విద్య, బుద్ధి, ప్రతిభలను దీప్తించే విద్య ఉన్నట్లయితే ముక్కంటే కాదు, బ్రహ్మ, విష్ణువుల అంశగా కూడా మనం తయారవచ్చు.

**8. దేశాభివృద్ధికి విశ్వవిద్యాలయాల ఎంత వరకు సహకరిస్తున్నాయి?**

జ. మనదేశంలో దాదాపు 350 విశ్వవిద్యాలయాలున్నాయ్. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మన విశ్వవిద్యాలయాల్లో పనిచేసి, చదువు చెప్పి, అన్వేషణ (రీసెర్చ్) చేసి, నోబెల్ పురస్కారాన్ని పొందినవారు ఒక్కరూ కూడాలేరు. కాని భారతీయులు, భారతీయసంతతివారు, ఇతర దేశాల విశ్వవిద్యాలయాల్లో ఇతర రంగాలలో రాణించి, నోబెల్ బహుమతులు పొందారు. కొన్ని వ్యవసాయ విద్యాలయాలు, విశ్వవిద్యాలయ స్థాయి కలిగిన I.I.M లు I.I.S.C., B.I.T.S. వంటివి, బహురంగాల్లో గణనీయమైన సంఖ్యలో విద్యాధికులనూ, పారిశ్రామిక వేత్తలనూ, మేధావులను తయారుచేశాయి. ప్రభుత్వం రాజకీయవేత్తల భస్మాసుర



హస్తాలనుండి దూరంగా ఉన్న, ఉండగలిగిన విశ్వవిద్యాలయాల వల్లనే నేటి భారతీయ మేధాపటుత్వానికి, సంపదకూ, భౌగోళికమాన్యత వస్తోంది.

**9. మనదేశంలో తొలిసారిగా ఎన్నికలు ఎప్పుడు జరిగాయి?**

ఆర్. వరప్రసాద్

జ. వయోజనులందరు (మొదట 21ఏళ్ళు, ఇప్పుడు 18 ఏళ్ళు) ఓటు హక్కుతో ప్రప్రథమంగా, భారతరాజ్యాంగ చట్టం ప్రకారం, 1952లో రాష్ట్ర శాసన సభలకూ, లోక్‌సభకు ఎన్నికలు జరిగాయి.

బ్రిటీష్ పాలనాకాలంలో విద్య, పన్ను ఆధారంగా ఓటుహక్కుతో పురపాలకసంఘాలకూ, జిల్లాబోర్డులకు, రాష్ట్రశాసన మండలికి సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ (ఢిల్లీ)కి ఎన్నికలు 20వ శతాబ్దపు ప్రథమదశకం నుంచి క్రమంగా జరుగుతూ వచ్చాయి.

**10. ప్రజా ఉద్యమం, విప్లవం ఈ రెండింటికీ గల తేడా ఏమిటి?**

జ. విప్లవం కూడా ప్రజలతో కూడుకొందే. ఏ వ్యవస్థలోనైనా, పాత పద్ధతులూ, విధానాలూ, విస్తృతంగా, అసంఖ్యాకంగా, తీవ్రంగా అంతంజేయబడి, వినూత్న వ్యవస్థవస్తే దాన్ని విప్లవాత్మకమైన మార్పు అంటాం. అయితే హింసనుపయోగించి సుసంఘటితమైన ఒక వర్గం, అత్యల్పకాలంలో, ఏ కుట్ర ద్వారానో అత్యధిక సంఖ్యలో అన్ని వర్గాల ప్రజలనూ ఉద్బోధితులుగాజేసి, ఉత్తేజపరిచి, బహుజనయోగ్యమైన, హింసారహిత పద్ధతుల్లో విప్లవం వచ్చిందా అనేది ముఖ్యం. భారతదేశంలో అంటరానితనం చట్టవిరుద్ధం చేయబడటం, ఇంగ్లాండ్‌లో ప్రజాస్వామ్యం రావడం, పరిఢవిల్లడం, మనదేశంలో రాజులు, మహారాజులూ, నవాబులూ తొలగించబడటం ప్రజాస్వామిక విప్లవానికి ఉదాహరణలు: రష్యాలో, చైనాలో, క్యూబాలో కమ్యూనిస్ట్ విప్లవాలు రావడం, హింసనుపయోగించి ఒక వర్గం నియంతృత్వాన్ని స్థాపించడం మరోరకమైన విప్లవం.

# జనవరి 2005

**1. పేటెంట్ అంటే ఏమిటి? దాని వలన లాభమా? నష్టమా?**

ఎన్. ఉమామహేశ్వరరావు, శ్రీకాకుళం

జ. ఎవరైనా ఏ యంత్రాన్నైనా, పరికరాన్నైనా ఉత్పత్తిచేసే విధానాన్ని కనిపెట్టితే దానిని ఇతరులు కాపీ కొట్టి లాభం పొందకుండా కనిపెట్టిన వాని మేధాసంపత్తికి తూట్లు పడకుండా ఉండడం కోసం వారు కనిపెట్టిన వస్తువు, పరికరం, పద్ధతులను ఇతరులు అనుమతి లేకుండా ఉపయోగించకుండా ఉండేందుకు పొందిన హక్కునే పేటెంట్ అంటారు. ఇది కొన్ని ఏళ్ళ వరకు ఉంటుంది. ఆ తర్వాత ఎవరైనా ఉపయోగించుకోవాలంటే కనిపెట్టిన తన మేధస్సును ఉపయోగించినందుకు దానికి ప్రతిఫలం రావలసిందే. అందుకని పేటెంట్ అవసరం. లేకపోయినట్లయితే ఒకరు కష్టపడి కనిపెట్టినదాన్నే ఇతరులు ఉపయోగించుకుంటే, కనిపెట్టిన వారికి ప్రతిఫలం ఉండదు. ఇది మంచిదికాదు. కాని ప్రాణాన్ని రక్షించే మందులను ఎవరైనా కనిపెడితే వాటికి పోటీపడి ఎంతమంది తయారుచేస్తే అంత తక్కువ ధరకు రోగులకు అవి లభ్యమౌతాయి. కనుక, చాలా వరకు పేటెంట్ ఉండడం మేధస్సు ఉపయోగించే వారిని ప్రోత్సహించడం అవుతుంది. దేశమంతటా ప్రఖ్యాతి గాంచిన పోచంపల్లి డిజైను విదేశీయులు కాపీచేసి లాభం పొందకుండా, ఇటీవలనే ఈ డిజైన్స్ పేటెంట్ చేయబడినవి, ఇది మన రాష్ట్రంలోని తొలిపేటెంట్, ఇదే విధంగా పసుపును కూడా మనదేశం పేటెంట్ చేయబడింది.

**2. ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో మన దేశానికి ఇంతవరకు శాశ్వత సభ్యత్వం కల్పించలేదు ఎందువలన? వీటో అంటే ఏమిటి?**

జ. ఐక్యరాజ్యసమితిని స్థాపించినప్పుడు మూడు మహాబలవంతమైన దేశాలు ఉన్నవి. అవి అమెరికా, సోవియట్ రష్యా, ఇంగ్లాండ్. ఫ్రాన్స్‌కు కూడా సామ్రాజ్యం ఉండేది కాని, జర్మనీ చేతుల్లో అది చిత్తుగా ఓడిపోయేది. గతమంతా ఘనంగా



ఉండడం మూలానా ఫ్రాన్స్‌ను కూడా ఒక శక్తివంతమైన దేశంగా మొదటి ముగ్గురు ఒప్పుకున్నారు. వీటితోపాటు ప్రపంచంలోనే అధిక జనాభా కలిగిన చైనా కూడా అగ్రశ్రేణికి చెందిన రాజ్యంగా ఒప్పుకున్నారు. దానికి కారణం జపాన్ అంత శక్తివంతమైన దేశాన్ని చైనా ఎంత ప్రాణ, ధన నష్టం కలిగినా లొంగక పోరాడుతూ ధైర్యంగా సామ్రాజ్య జపానును ఎదుర్కొంది. ఈ ఐదింటికి సమానంగా శక్తి కలిగిన మరోదేశం లేకపోవడంతో ఈ ఐదుగురిని భద్రతామండలిలో శాశ్వతసభ్యులుగా ఉన్న దేశాలు అంగీకరించాయి. ప్రపంచంలో ఎక్కడైనా ఏ దేశాల మధ్యనైనా యుద్ధం జరుగుతుంటే దాన్ని ఆపడానికి ఐక్యరాజ్యసమితి సభ్యులయొక్క సైన్య సహాయంతో యుద్ధం చేస్తున్న దేశాల మధ్య శాంతి నెలకొల్పడం ఒక లక్ష్యం. ఈ ఐదుగురు మధ్య ఏకీభావం ఉంటేనే భద్రతా మండలి యొక్క తీర్మానం నెగ్గినట్లు. ఈ ఐదుగురిలో ఎవరైనా ఏ తీర్మానానికైనా వ్యతిరేకంగా ఓటువేస్తే దాన్ని వీటో అంటారు. అంటే 15 మంది సభ్యులున్న ఐక్యరాజ్యసమితి యొక్క భద్రతామండలిలో ఈ ఐదుగురిలో ఒక్కరు ఇతర 14 మందికి వ్యతిరేకంగా వేస్తే ఈ వీటో వల్ల తీర్మానం వీగిపోయినట్లే.

ఐక్యరాజ్యసమితి సమితి ఏర్పడినప్పుడు భారతదేశం బ్రిటీష్‌వాళ్ళ పాలనలో ఉండేది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా ఐదుగురు శాశ్వతసభ్యులకు ఉన్న సైనిక శక్తి, ఆర్థిక స్థోమత భారతదేశానికి లేకపోయింది. అందుకని మనదేశానికి శాశ్వతసభ్యతం రాలేదు.

**3. మన రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలలు, ఐ.ఐ.టీల స్థాయికి ఎదగాలి అని ముఖ్యమంత్రి అంటున్నారు కదా! ఆ ప్రమాణాలు తీసుకొని రావటానికి ఎటువంటి మార్పులు తీసుకొని రావాలో తెలియజేయండి?**

ఆర్. ప్రసాద్, విజయవాడ

జ. మన రాష్ట్రంలోని 40,50 ఇంజనీరింగ్ కాలేజీలు తప్పితే మిగిలినవి అన్నీ కూడా నాణ్యతలేనివి. తగిన అర్హతలు ఉన్న బోధనా సిబ్బంది లేరు. విద్యార్థులుండడానికి వసతి గృహాలు లేవు. ప్రయోగశాలలు అంతంత మాత్రంగా

వున్నాయి. అన్ని సదుపాయాలు విశేషించి 24గం॥లు విద్యుత్‌లేని గ్రామాలలో కూడా ఈ కాలేజీలు పెట్టారు. వీటిని మెరుగుపరచడం చాలా వరకు అసంభవం. ఇప్పుడు ఈ కాలేజీల మధ్యపోటీ పెరుగుతోంది. ఈ సంవత్సరం 25,000 సీట్లు ఖాళీగా ఉన్నాయి. మైనారిటీ కాలేజీల్లో చాలా వరకు అవినీతి, దోపిడీలు చోటు చేసుకున్నాయి. NAC (National Accredation Committee) వారు ఈ కాలేజీలను పరీక్షించి రేటింగ్ ఇవ్వబోతున్నారు. వాటిని గమనించి తల్లితండ్రులు, విద్యార్థులు, పనికిమాలిన కాలేజీలను బహిష్కరిస్తే అవి మూసుకుపోతాయి. ప్రభుత్వానికి గనక ఈ రేటింగ్‌లో ప్రమేయం ఉంటే లంచగొండితనం అవినీతి వల్ల పనికిమాలిన కాలేజీలు కూడా పెద్ద రేటింగ్ సంపాదించుకునే అవకాశం ఉంది. నిష్పక్షపాతంగా వ్యవహరించే ప్రభుత్వ ఉద్యోగులతో ప్రమేయంలేని NAC కనక ఉన్నట్లైతే కేవలం డబ్బు దండుకోవడం కోసం స్థాపించబడిన కాలేజీలు మూతపడి మిగిలిన వాటిలో ప్రమాణాలు పెరుగుతాయి.

**4. చిన్న చిన్న రాష్ట్రాల వలన కలిగే ప్రయోజనం ఏమి?**

జ. రాజకీయ నాయకుల్లో అధికార దాహం, ధనార్జన విచ్చలవిడిగా ఉన్నంత వరకు పెద్దా, చిన్నా రాష్ట్రమైన ప్రజలకు జరిగేది ఏమీలేదు. సైద్ధాంతిక రీత్యా చిన్న రాష్ట్రాలలో ప్రభుత్వంలో బాధ్యతను తీసుకురావడానికి అవకాశం ఉన్నది. రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల్లో అసమానత సహజంగానే వుంటుంది. ప్రతి రాష్ట్రంలో కూడా వనరులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలున్నాయి. లేనివి ఉన్నాయి. ఈ సాకును చూసుకొని అసంతృప్తులైన రాజకీయనాయకులు అప్పుడప్పుడు విభజన ఉద్యమాలను తీసుకువస్తూ ఉంటారు. దానివల్ల రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకి నష్టమేకాని లాభం ఉండదు. తద్దృష్ట్యా స్వాభావిక, నైసర్గిక అసమానతలు ఉన్న పెద్ద రాష్ట్రాలను చిన్న రాష్ట్రాలుగా విభజించితే పెద్ద నష్టం ఉండదని అనుకుంటున్నాం.

**5. ఉన్నత విద్యలో ఎలాంటి సంస్కరణలు అవసరము?**

సి. లక్ష్మణరావు, తిరుపతి



జ. మనదేశంలో ఉన్నత విద్యకాదు,ప్రాథమిక, మాధ్యమిక, విద్యలు కూడా నాణ్యతలేనివిగా తయారయ్యాయి. వాటికీ చాలా వరకు కారణం రాజకీయం. ఉపాధ్యాయులకు యూనియన్లు ఒకటి కాదు, ఎన్నో. విశ్వవిద్యాలయాలు ఉపకులపతులను నియమించడం, అర్హత ప్రకారంకాక కులం ప్రకారం పదోన్నతులు కల్పించడం సిఫారసుల ద్వారా ఏ ఉపకులపతైనా మంచి చేద్దామనుకుంటే (ఆంధ్రవిశ్వవిద్యాలయం) ఆయన మీద ఆందోళనచేయడం, పరీక్షల స్థాయిని కూడా రాజకీయం చేయడం, వీటన్నిటినీ అధిగమించాలంటే, ప్రైవేట్ యూనివర్సిటీలు రావలసిందే. వాటిల్లో పోటి పెరగాలి. ప్రవేశం మెరిట్ మీద ఉండాలి. సాంఘీక న్యాయంకోసం ప్రస్తుతం వున్న ప్రభుత్వంచే పోషింపబడుతున్న విశ్వవిద్యాలయాలనన్నిటినీ ప్రభుత్వం ఉపయోగించుకోవచ్చు. ప్రైవేట్ యూనివర్సిటీ ప్రభుత్వ జోక్యం చేసుకోకుండా వుంటే ఉత్కృష్ట ప్రమాణం, అంతర్జాతీయ స్థానం కలిగిన ఉన్నత విద్య మనదేశంలో కూడాలభ్యం అవుతుంది. ఉదా: హైద్రాబాద్‌లోని ఇండియన్ బిజినెస్ స్కూల్.

**6. విదేశీ విశ్వవిద్యాలయాలను మనదేశంలో స్థాపించడం వలన మన విశ్వవిద్యాలయాలకు ఏవిధమైన నష్టము కలగదా?**

జ. విదేశీ విద్యాలయాలు మనదేశంలో స్థాపించడంవల్ల పోటీ పెరుగుతుంది. ప్రమాణాలులేని కళాశాలలు విశ్వవిద్యాలయాలు నష్టపోతాయి. ప్రమాణం లేని చదువులున్నందువల్ల ఉద్యోగానికి పనికిరాని పట్టభద్రులనుకునేవారు మాత్రం అసంఖ్యాకంగా తయారవ్వచ్చు.

**7. జపాన్‌లో కుటీర పరిశ్రమల పరిస్థితి ఏమిటి? ఎంతమంది వాటిపై జీవిస్తున్నారు వివరించండి?**

సూరపనేని కృష్ణారావు, హైదరాబాద్,

జ. జపాన్‌లో మన దేశంలో ఉన్నటువంటి కుటీర పరిశ్రమలు లేవు. దాదాపుగా అన్ని పరిశ్రమలు యాంత్రీకరణం చేయబడి ఒకే కారు ఫ్యాక్టరీ

ఉంటే, దానికి 3000లకు పైగా భాగాలను తయారుచేసే చిన్న కంపెనీలు కొల్లలుగా ఉన్నాయి. అందులో విడిభాగాలు చేసేయటాన్ని మనం కుటీరపరిశ్రమలు అనలేం. అవి కూడా సైన్స్, టెక్నాలజీని ఉపయోగించి ప్రమాణం కలిగిన విడిభాగాలను తయారుచేస్తారు. మనదేశంలో లక్షలాది చిన్న తరహా పరిశ్రమలు వచ్చి, మూలబడిన కంపెనీలు కూడా లక్షల్లోనే ఉన్నాయి. జపాన్‌లో ఒక్క వ్యవసాయం మాత్రం "కుటీరపరిశ్రమ" అనుకోవచ్చు. దానికి ఎంతో సబ్సిడీ ఇస్తున్నారు. జనాభాలో 5%కన్నా తక్కువ మంది వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నారు.

**8. కేల్కర్ కమిటి సూచించిన మేరకు కూడా సబ్సిడీని రైతులకు మన ప్రభుత్వం (కేంద్రం) ఇవ్వటంలేదు. అసలు ఇప్పుడు ఇస్తున్న సబ్సిడీ శాతం ఎంత? ఇతర దేశాలతో పోలిస్తే మనం రైతులకు ఎంత శాతం ఇస్తున్నాం?**

జ. కేంద్ర ప్రభుత్వం ఏటా 48,000 కోట్ల రూ॥లు సబ్సిడీలుగా ఇస్తోంది. అందులో 28,000 కోట్ల రూ॥ల ఆహార ధాన్యాలు, పంచదార, కిరసనాయిలు ఇస్తోంది. ఎరువులకి కొన్ని వేల కోట్ల రూపాయలు ఇస్తోంది. కరెంట్‌కు రాష్ట్ర ప్రభుత్వాలు దాదాపు 30,000 కోట్ల రూ॥లు సబ్సిడీ ఇస్తున్నాయి. ఈ విధంగా వివక్షత లేకుండా ఇస్తూపోతుంటే మింగేవాళ్ళు ఎక్కువై సంపత్తి ఉత్పత్తి చేసేవాళ్ళు తక్కువై, బరువు మోయాల్సి వస్తోంది. అమెరికా, జపాన్,ఫ్రాన్స్ వంటి దేశాల్లో ఎంపిక చేయబడిన రైతులకు మన దేశంలో కన్నా ఎక్కువే వస్తోంది. మన దేశంలో రైతులకు ఇస్తున్న సబ్సిడీలు వివక్షతా రహితంగా ఉండడం మూలానా ఫలితాలు కొంత మందికి మాత్రమే దక్కుతున్నాయి.

**9. డాక్టర్లు వారి స్టైఫండ్ కోసం, వారి డిమాండ్ల కోసం సమ్మెలు చేస్తున్నారే తప్ప, హాస్పిటల్ బాగోగులు, ప్రజల విషయంలో ఒక్క సమ్మె కూడా చేయడం లేదు. సినీహీరోలు వారికి నష్టం వాటిల్లే పైరసీపై పోరాడుతున్నారు తప్ప టిక్కెట్ ధరలు తగ్గించాలనీ, బ్లాక్‌లో అమ్మవద్దని ఒక్కరైనా పోరాడటం లేదు. దీనికి కారణం ఎవరంటారు? పరిష్కారం తెల్పండి?**

రేండ్ల, శ్రీను ముదిరాజ్, హైద్రాబాద్,



జ. సమ్మె మా జన్మ హక్కు అని దాదాపు అన్ని పార్టీలు విశేషించి వామపక్షీయులు సుప్రీం కోర్టుని ధిక్కరించైనా సరే సమ్మె చేయడానికి వెనుకాడడం లేదు. ప్రతివాడు ఇది మా హక్కు అది మా హక్కు అంటున్నారే కాని ఈ విధులని మేం నిర్వహిస్తాం అని ఎవరూ అనడం లేదు. ఈ దృక్పథం మారందే దేశం బాగుపడదు. ప్రతిహక్కు కూడా తమ విధులను నిర్వహించినప్పుడే రాగలదు. ఇటువంటి మూల్యాలను చిన్నతనం నుండే మనం అందరికీ నేర్పాలి. ఇవి ఆచరణలోకి వచ్చినప్పుడు ప్రజలు, దేశం బాగుడపతారు. మన దౌర్భాగ్యానికి మూలకారణం విజ్ఞత లేని రాజకీయం. పరిష్కారం ప్రతి ఒక్కరు విజ్ఞతలు వివేకంతో తాత్కాలిక ఉపశమనం కోరడం కాక శాశ్వత శ్రేయస్సుకోసం పనిచేస్తే బాగుంటుంది.

**10. వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవడం ఎలా?**

యమ్. రవీంద్ర, రాజమండ్రి

జ. అట్టడుగు వర్గాల్లో పుట్టి, పేదరికంతో బాధపడి దీక్షతో లక్ష్యాన్ని సాధించిన వ్యక్తుల యొక్క జీవిత చరిత్రలను చదవడం, వ్యక్తిత్వం పెంచుకోవడానికి మొదటి మెట్టు. మన దేశంలో డా॥ అంబేద్కర్, లాల్ బహదూర్‌శాస్త్రి, టంగుటూరి ప్రకాశం, సర్.సి.వి. రామన్, సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి వారి జీవిత చరిత్ర చదివితే మనకి స్ఫూర్తి వస్తుంది. ఏ పని చేసినప్పుడైనా సరే అటువంటి నాయకులు ఎటువంటి దీక్షతో, ఆత్మస్థైర్యంతో పనిచేశారో, అదే విధంగా వ్యవహరించినట్లైతే వ్యక్తిత్వం పెరుగుతుంది. ప్రతీ ఒక్కరూ కూడా డేల్‌కార్నెగీ రాసిన How to win friends and Influence people అనే పుస్తకాన్ని చదవాలి. సుమతీశతకం, వేమన శతకం, భర్తృహరిశతకం, నీతిచంద్రికలోని కథలు, మహాభారత గాథలు చదివినట్లైతే వాటిలోని నీతినియమాలను, సూక్ష్మజ్ఞానాన్నీ, ధర్మనిష్ఠని అలవరచుకున్నట్లైతే వ్యక్తిత్వం వికసిస్తుంది.

## ఫిబ్రవరి 2005

**1. ఎన్నికల సమయంలో మంత్రులు రాజీనామా చేయాలి అని మన ప్రధాన ఎన్నికల అధికారి టి.ఎస్.కృష్ణమూర్తిగారు అనటం సముచితమా? ఈ పద్ధతి ఏ దేశంలోనైనా అమలులో ఉందా?**

కె.వి.ఆర్, హైదరాబాద్

జ. ఎన్నికల సమయంలో పాలక పక్షం, విశేషించి మంత్రులు పాలక యంత్రాన్ని పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి ఉపయోగిస్తున్నారనేది నిర్వివాదాంశం. జగద్విదితం. ఈ సత్యాన్నే శ్రీ కృష్ణమూర్తి గారు ప్రస్తావించారు. ఎన్నికల సమయంలో మంత్రులు చేయడం సముచితమే.కాని ఇలా చేయాలని ఏ చట్టమూఏ నిబంధనా లేదు. ఇంగ్లాండ్ పజాస్వామిక పాలనకు అమూల్యమైన ఉదాహరణ. అక్కడ ఎన్నికలు పెట్టడానికి రాజుగారిచేత అంగీకారం పొందగానే మంత్రివర్గం రాజీనామాను సమర్పిస్తుంది. మంత్రులు కేవలం 'కేర్ టేకర్' గానే ఉంటారు. ముఖ్యమైన ఏ నిర్ణయాలు తీసుకోరు.

ప్రధాన మంత్రి ప్రభుత్వ యంత్రాంగాన్ని తమ ఎన్నికల ప్రచారం కోసం వినియోగించరు. బ్రిటన్ ప్రధానమంత్రి క్లెమెంట్ అట్లీగారు ప్రధానమంత్రిగా రాజీనామాచేసి కేర్ టేకర్ ప్రధాన మంత్రిగా ఉన్నా, ఎన్నికల కోసమై తన స్వంత కారులో, తన సతీమణిని డ్రైవరుగా ఉపయోగించి ప్రచారం చేశారు. అటువంటి నిజాయితీని, నీతిని ప్రదర్శించిన ఒక మంత్రిగాని, ప్రధాన మంత్రిగాని, మన దేశంలో కనిపించరు.

**2. ఎన్నికల్లో పోటీ చేయండి అని మన ముఖ్యమంత్రిగారు మావోయిష్టులకు సూచన ఇచ్చారుకదా? అది ప్రస్తుత పరిస్థితులలో ఆచరణ సాధ్యమా?**

జ. మావోయిస్టులకు, కమ్యూనిస్టులకు మన రాజ్యాంగ చట్టమునందుగానీ, బహుపక్షీయ రాజకీయాలందుగాని సైద్ధాంతిక పరంగా నమ్మకము లేదు.



మార్క్సిజం, కమ్యూనిజం, స్టాలినిజం, మావోయిజం సిద్ధాంతాల ఆచరణ ప్రకారం కమ్యూనిష్టు పార్టీ యొక్క ఏకపక్షీయ నియంతృత్వపాలన ఉండాలి. ఆ కమ్యూనిజం ప్రకారం వారు ఏలిన దేశాలలో కమ్యూనిష్టు పార్టీతప్ప, లేక దాని తొత్తుగా ఉన్న మరో చిన్న పార్టీ దక్క, దాన్ని ఎదిరించే, కమ్యూనిజాన్ని కాదనే ఏ పార్టీ ఎక్కడా కూడా లేదు. మన మావోయిష్టులు కూడా ఎన్నో సార్లు ధైర్యంగా, నిజాయితీగా కుండ బ్రద్దలు కొట్టినట్లు పదేపదే ప్రస్తుతపు బూర్జువా ఎన్నికలలో తమకు విశ్వాసము లేదని, సాయుధపోరాటం ద్వారానే ప్రభుత్వాన్ని లోబరచుకోగలుగుతామని చెప్పారు. మార్క్సిష్టు, కమ్యూనిష్టు రైటిస్టు క్యూమ్యూనిస్టు పార్టీలు ఎన్నికల్లో పాల్గొంటున్నాయి. ప్రభుత్వాలు కూడా నడుపుతున్నాయి.(బెంగాల్ , త్రిపుర అప్పుడపుడు కేరళలో) కాని మావోయిస్టులు ఈ పార్టీలను రివిజనిస్టులుగా, చిత్తశుద్ధిలేని కమ్యూనిస్టులుగా అభివర్ణిస్తున్నారు. ముఖ్యమంత్రి కాదు, ప్రధానమంత్రి కాదు మరెవ్వరూ ఆహ్వానించినా, హితవు చెప్పినా మావోయిస్టులు ఎన్నికలలో పాల్గొని ప్రభుత్వాన్ని చేపట్టగల్గుతామని విశ్వసించరు, పాల్గొనరు.

**3. విదేశీ విశ్వవిద్యాలయాలు వద్దు అని విద్యార్థి, యువజన సంఘాల ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి కదా? నిజంగా వాటివల్ల మన విశ్వవిద్యాలయాల ఉనికిని ప్రమాదమా?**

ఏ. వేణుగోపాలరావు, ఏలూరు

జ. విదేశీ విశ్వవిద్యాలయాలు వద్దు అని ఆందోళన చేస్తున్న విద్యార్థి యువజన సంఘాలు చాలా వరకు కమ్యూనిస్టు ప్రేరితులు. విదేశీమతాలు మన దేశంలో ప్రచారం చేసుకోవచ్చు. మతమార్పిడులు చేయవచ్చు. విదేశీ రాజకీయ సిద్ధాంతాలను అనుసరించి విదేశీ ప్రోద్బలంతో మనం పార్టీలు పెట్టుకోవచ్చు. విదేశీయులు మన నాయకులుగా, అధినేతలుగా ఉండవచ్చు. విదేశీ పెట్టుబడులు రావచ్చు. విదేశీయులు కనిపెట్టిన పరికరాలు, మందులు మనకు రావచ్చు. విదేశీప్రసారాలను, సినిమాలను మనం చూడవచ్చు. వాటిని అనుకరించవచ్చు. విదేశీ విద్యాలయాల్లోకివెళ్ళి మనం చదువుకోవచ్చు. విదేశీ విద్యాలయాలు, వాళ్ళ

దేశంలో మనకు విద్యగరిపి పట్టభద్రులను చేసే బదులు, మనదేశంలో వారి కళాశాలలను నెలకొల్పి మనల్ని పట్టభద్రులను చేస్తుంటే ఎందుకు అభ్యంతరపెట్టాలి? మన విద్యా సంస్థలు, ఉదా : 50 పైగా విదేశాలలో ఇంగ్లీషు, ఫ్రెంచి, అరబిక్, చైనీస్, రష్యన్ భాషల్లో కంప్యూటర్ విద్యను నేర్పి డిప్లొమా ఇస్తోంది. ఏ విధంగా అయితే చైనాలాంటి దేశాలనుంచి వచ్చిన వస్తువులు, పరికరాలు మన దేశంలో తయారీ చేసిన వాటితో పోటీపడుతున్నాయో అదే విధంగా విదేశీ విశ్వవిద్యాలయాలు మన విశ్వవిద్యాలయాలతో పోటీపడతాయి. పోటీవల్ల నాణ్యత పెరుగుతుంది. కాకపోతే ఒక నియంత్రణ ఉండాలి. మన చరిత్ర, మన సంస్కృతి, మన వారసత్వానికి వ్యతిరేకంగా ఉండకూడదు. వారిచ్చే విద్య మనలను కించపరిచే విధంగా ఉండకూడదనే నియమము పెట్టాలి. మన విశ్వవిద్యాలయాలు కూడా నాణ్యత పెంచుకుంటే పోటీచేయటమే కాదు, విజయం కూడా సాధిస్తాయి. నాణ్యతలేని విద్యాలయాలు లేకపోయినా పరవాలేదు.

**4. 6వ తరగతి లేదా 8వ తరగతి నుంచే ఐచ్ఛిక సబ్జెక్టుల విధానాన్ని ప్రవేశపెట్టాలనే ఆలోచన ఉన్నట్లు విద్యామంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి అంటున్నారు కదా? చిన్న తరగతులలోనే ఈ విధానము అవసరమా? అలాగే ర్యాంకులు బదులు గ్రేడింగ్ అంటున్నారు?**

జ. ఎంతో మంది అర్హత, అనర్హతతో, అనుభవంతో, వివేకంతో సంబంధం లేకుండా విద్యామంత్రులు అవుతున్నారు. అవగానే మన విద్యావిధానాన్ని మరమ్మతు చేస్తామని చాటిస్తూ వస్తున్నారు. విద్యా ప్రమాణాలు నానాటికీ క్షీణిస్తూ ఉన్నాయని అందరూ ఒప్పుకుంటున్నారు. అందుకనే ప్రభుత్వ విద్యాలయాలకు కాక ప్రైవేటు సంస్థలకు ఎంత ఖర్చైనా చేసి, తల్లిదండ్రులు తమ పిల్లలను పంపుతున్నారు.

విద్య పరమావధి సృజనాత్మకతను పెంచడం, ఆలోచనాశక్తిని రేకెత్తించడం, తనంతతానుగా నిలబడే ధైర్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని, విజ్ఞానాన్ని కల్గించేదిగా ఉండాలి. చిన్నతనంలోనే ఐచ్ఛిక సబ్జెక్టులను, స్పెషలైజేషన్‌ను ప్రవేశపెడితే మన యువతీ యువకులు టెక్నీషియన్లు రిపేరర్లుగా, ఆపరేటర్లుగా,



ప్రోగ్రాం రైటర్స్‌గా తయారవుతారేగాని, విజ్ఞానాన్నీ వివేకాన్నీ సంపాదించుకుని మానవుడిగా సామాజిక స్పృహ ఉన్న వ్యక్తిగా, దేశభక్తియున్న నాగరికునిగా తయారవ్వరు. పన్ను వూడగొట్టుకోడానికి, ఏరాయి ఐతేనేం అంటారు పెద్దలు. నాణ్యతలు గుర్తించడానికి ర్యాంకులు, గ్రేడింగులు కూడా ఉపయోగపడతాయి. కాని ఒకే గ్రేడు వచ్చిన అనేక మందిలో ఎవరు మిన్న అనేది ర్యాంకు లేకపోతే ఎలా తెలుసుకుంటాము.

**5. కూంబింగ్ అంటే ఏమిటి?**

పి. అరుణకుమార్, కాకినాడ

జ. అడవుల్లో చట్ట విరుద్ధంగా ఆయుధాలను ధరించి, 'ప్రజాశత్రువులను' సంహరించాలనుకునే వ్యక్తులు, వాటి కూటములను కనిపెట్టడం కోసం వారు దాగియున్నారన్న క్షేత్రాలలో సాయుధులైన ప్రభుత్వ దళాలు తీవ్రంగా వెదకడాన్ని కూంబింగ్ అంటారు. మన తల్లో ఉండే పేలు మన రక్తం పీల్చి హాని చేస్తాయిగాబట్టి దువ్వెనతో దువ్వి వాటిని ఏరివేస్తాము. ఈ ప్రక్రియలోంచి వచ్చినమాటే "కూంబింగ్".

**6. వ్యాట్ పూర్వాపరాలు ఏమిటి?**

జ. మన రాజ్యాంగం ప్రకారం ప్రతి రాష్ట్రం కూడా వస్తువుల యొక్క కొనుగోలు, అమ్మకాలమీద సేల్స్‌టాక్స్ వేయవచ్చు. ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి ఈ అమ్మకం జరిగినప్పుడు దాని మీద కేంద్ర ప్రభుత్వం సేల్స్‌ట్యాక్స్ వేయవచ్చు. ఒక్కో రాష్ట్రంలో టాక్స్ ఒక్కో విధంగా ఉంటుంది. ఒక దేశం, ఒక ప్రపంచం, ఒక రాష్ట్రంలో సేల్స్‌టాక్స్ వేరు వేరుగా ఉండటమేమిటి? దీని వల్ల ఒక రాష్ట్రంలో ఉత్పత్తి చేసిన వస్తువులు మరో రాష్ట్రంలో అమ్మబడినప్పుడు వాటి ధరలు వేరుగా ఉంటాయి. ఈ గజిబిజిని తొలగించి, దేశమంతటా అర్థమయి అమలయ్యే ఉండే ఒకే ట్యాక్స్‌ను [Value Added Tax (VAT)] అంటారు. దీని వల్ల కొన్ని రాష్ట్రాలలో ఇప్పుడున్న రేట్లను బట్టి సేల్స్ టాక్స్ ఆదాయం

తక్కువ, ఎక్కువ అవచ్చు. అందువలన కొన్ని రాష్ట్రాలు వ్యతిరేకిస్తూ వచ్చాయి, జరుగబోయే లోటును తీర్చే విధంగా వ్యాట్‌ను అమలుచేస్తామని కేంద్రప్రభుత్వం హామీ ఇస్తోంది.

**7. ఎంసెట్‌ను నిర్వహించవలసిన అవసరము ఇంకా ఉందా? దానికి ప్రత్యమ్నాయము ఏమిటి? ఇతర రాష్ట్రాలలో ఏ పద్ధతిన ఇంజనీరింగ్ ప్రవేశాలు జరుగుతున్నాయి?**

సి. నరసింహారావు, విజయవాడ

జ. ఎంసెట్‌ను నిర్వహించవలసిన అవసరం సుంతైనా లేదు. ఎన్నోసార్లు అభిప్రాయపడినట్లుగా, ఇది ట్యూటోరియల్ వ్యాపారస్తులకు ప్రయోజనకారిగా వుంది. దీనికి ప్రత్యామ్నాయం ఇంటర్ బోధనను, పరీక్షా విధానాన్ని, ప్రమాణాన్ని పెంచటం, ఆ పరీక్షలో వచ్చిన మార్కులను బట్టి వృత్తి కళాశాలల్లో ప్రవేశం ఇవ్వడం, ఇప్పుడు అత్యధిక సంఖ్యలో వృత్తి కళాశాలలు స్థాపించబడడం మూలాన ప్రవేశం కోసం విద్యార్థులు పోటీపడకుండా, కళాశాలలు విద్యార్థులకోసం పోటీపడవలసిన దశ వచ్చింది. ఇది మంచి పరిణామం. అన్ని అనర్థాకాలు ప్రభుత్వంచే పరిమితం చేయబడిన సదుపాయాలవల్లనే వస్తాయి. ప్రభుత్వం యొక్క ప్రమేయం ప్రమాణాలను నిర్దేశించి, పర్యవేక్షించడం మాత్రమే మనదేశంలో, ఒక రాష్ట్రంలో వున్న దుష్ట సంప్రదాయం మరొక రాష్ట్రానికి అంటు రోగంగా పాకుతోంది. ఇతర రాష్ట్రాలతో పోల్చడం కన్నా ఇతర దేశాల్లో ఏ విధంగా ప్రవేశం జరుగుతోందో పర్యవేక్షించడం మంచిది.

**8. స్వాతంత్ర్య పోరాటంలో "వందేమాతరం" అంటూ నినాదాలు చేసినవారే, ఇప్పుడు దానిని వ్యతిరేకిస్తున్నారు ఎందువల్ల?**

కె. రామారావు, హైదరాబాదు

జ. స్వాతంత్ర్య పోరాటం కోసం దేశభక్తి కావాల్సి వచ్చింది. త్యాగం, స్ఫూర్తి కావల్సివచ్చింది. ఒక్కటే ధ్యేయం, అది స్వాతంత్ర్యం. అందుకని సిసలైన



భారతీయులు అందరూ "వందేమాతరం" అనే ఉత్తేజకర గీతాన్ని పాడి, నినాదాలు ఇచ్చి జైళ్ళకు వెళ్ళారు. ఉరికంబాలు ఎక్కారు. అది దేశభక్తికి, ఆత్మగౌరవానికి, ఆత్మ స్థైర్యానికి, త్యాగనిరతికి పర్యాయపదంగా ప్రతీకగా ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దిగజారిన నేతల పార్టీల ఏకైక ధ్యేయం ఓట్లు, ఓట్ల ద్వారా పరిపాలన యంత్రాంగాన్ని అదుపులోకి తెచ్చుకొని, తద్వారా బీదరికాన్నుంచి బయటపడటం. ఒకప్పుడు 'దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్' అన్నవాళ్ళు ఇప్పుడు "దేశమంటే ఓట్లోయ్ దేశమంటే కోట్లోయ్" అనుకుంటున్నారు.

వీరు గనక 'వందేమాతరం' అని పాడితే అది మా మతాలకు, మా విశ్వాసానికి వ్యతిరేకం కాబట్టి మేం మీకు ఓట్లేయం అని కొన్ని మతస్తులవారు అంటున్నారు. వారి ఓట్లకోసం పాట్లుపడేవారు సరేలే వందేమాతరం వద్దు, ఓట్లువేసే వారికి ఏది తృప్తికరంగా వుంటుందో, అదే చేద్దాం అనుకోవడం మూలాన "ఓట్లు భిక్షాందేహి" అనే వాళ్ళు వందేమాతరాన్ని వ్యతిరేకిస్తున్నారు. దేశభక్తి, స్వాతంత్ర్య సమరమందు, మన సంస్కృతీ చరిత్రల యందు ధృఢవిశ్వాసాన్ని ప్రదర్శించి, ఇప్పుడు 'వందేమాతరాన్ని' వ్యతిరేకించే వారికి మేము ఓటు వేయము అని మెజారిటీ ప్రజలు నొక్కి చెప్పగలిగితే ఈ వ్యతిరేకత మాసిపోతుంది.

## మార్చి 2005

**1. మనలో పోరాటశక్తి ఉండాలి.... పోరాటం లేకపోతే జీవితమే లేదు అంటూ తిరుపతి ప్లీనరీలో కాంగ్రెస్ శ్రేణులకు ఆనాడు పి.వి నరసింహారావు పిలుపు ఇచ్చారు. ఇది అందరికీ ఆచరణ సాధ్యమా?**

ఆర్. లలిత, చిత్తూరు

జ. పోరాటశక్తి ఉండవలసిందే. కాని ఏ లక్ష్యసాధనకు పోరాడాలి? శాసనసభ్యులై మంత్రులవడానికా? అయి, పదవీ దుర్వినియోగంతో తమ బీదరికాన్ని పోగొట్టుకొని సంపన్నులవడానికా? లేక ప్రభుత్వయంత్రాంగంలో భ్రష్టాచారాన్ని

తగ్గించి, సేవాభావాన్ని పెంపొందించి, ప్రజలను సుశిక్షితులుగా స్వయం నిర్భరతకు కావలసిన విద్య, సమర్ధతను, సామాజిక స్పృహను పెంపొందించేందుకు పాటుపడటమా? ఈ లక్ష్యాలకోసం పార్టీలు నాయకులు పరస్పరం పోటీపడి ప్రజాస్వామ్యాన్ని, ప్రజా సంక్షేమాన్ని పెంపొందించాలి. అట్టడుగు వర్గంలో, అతి బీదతనంలో పుట్టిన డా॥ అంబేద్కర్ గారికి పోరాటం ఆచరణ సాధ్యమయినపుడు, అందరికీ ఇది ఎందుకు సాధ్యం కాదు?

**2. ఇటీవల కొన్ని ప్రైవేట్ విశ్వవిద్యాలయాలను సుప్రీంకోర్టు రద్దుచేస్తూ తీర్పునిచ్చింది? మరి ఆ విశ్వవిద్యాలయాలలోని విద్యార్థుల భవిత ఏమిటి?**

ఎస్.నాగేష్, కనిగిరి

జ. ఒక రాష్ట్ర ప్రభుత్వం లొసుగులతో ప్రైవేటు యూనివర్సిటీల కోసం చట్టం చేయటం మూలాన ఆ చట్టాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. ప్రజలకు, విద్యార్థులకు ప్రమాదాలు ఎక్కువగా కలగటానికి ప్రధాన బాధ్యత ప్రభుత్వం మీదే వుంది. అదే పనిగా సరిగా ఆలోచించకుండా, ఏ పాక్షిక ప్రయోజనాన్నో దృష్టిలో పెట్టుకుని చట్టాలు చేయడం, సరియైన నియమావళిని రూపొందించకపోవడం, నియమాలను, లంచగొండితనం మూలాన వర్తింపచేయకపోవడం వల్ల విద్యార్థులు, ఇతర వర్గాలు ఇబ్బందులకు గురౌతున్నారు. ఈ లోపం భూయిష్టమైన చట్టాన్ని కాంగ్రెస్ ముఖ్యమంత్రి అజిత్‌జోగి గారు ప్రవేశపెట్టారు. సంబంధిత విద్యార్థుల యొక్క భవిష్యత్తును కాపాడటం కోసం ప్రస్తుత ముఖ్యమంత్రి త్వరలో మరో చట్టాన్ని తీసుకొస్తానని హామీ ఇచ్చారు.

**3. విశ్వవిద్యాలయ విద్య పొట్టకూటికనే భావన మారాలి అంటారు కదా! మరదెట్లా?**

జ. పొట్టకూటికి పనికిరాని ఏ విద్య అయినా పనికిమాలిందే. కాని కేవలం పొట్టకూటికి మాత్రమే పనికివచ్చే విద్యవల్ల వ్యక్తిలో, సమాజంలో, దేశంలో నీతినియమాలు నశిస్తాయి. ధనార్జనకోసం ఎటువంటి అధర్మ ప్రవర్తనకైనా



పూనుకుంటారు. వంచన, దోపిడి లంచగొండితనం అనైతిక, అసాంఘిక ప్రవర్తన, హింసా ప్రవృత్తి పొట్టకూటికి మాత్రమే పనికివచ్చే విద్యవల్ల వచ్చే అరిష్టాలు ధర్మం, నీతి నియమాలు, బాధ్యతలు సత్ప్రవర్తన, పరిమితమైన వాంఛలు పరస్పర సహకారం ఇటువంటి విలువలను కూడా విద్యయొక్క పరమావధిగా గుర్తించి వీటియందు గౌరవాన్ని అలవరిచినట్లయితే ప్రస్తుతపు లోపభూయిష్టమైన విద్య, సంపూర్ణ మానవత్వాన్ని ప్రసాదించేదిగా వుంటుంది.

**4. మంత్రులు, ఎం.ఎల్.ఏ.లు ప్రమాణ స్వీకారాలు చేస్తూ ఉంటారు కదా? ఆ ప్రమాణాలలో ఏ ఒక్కటీ నెరవేర్చరని అందరకు తెలిసిందే. అలాంటప్పుడు వారిని ఐ.పి.సి సెక్షన్ 420-409 క్రింద ప్రాసిక్యూట్ చేయవచ్చా?**

కె. రామారావు. హైదరాబాద్

జ. చెల్లని చెక్కులు ఇవ్వడం చట్ట ప్రకారం నేరం. అటువంటి వారికి శిక్షలు పడుతున్నాయి. అదే విధంగా నెరవేర్చని హామీలు ఇచ్చి వాగ్దానాలు చేసి ప్రభుత్వం చేజిక్కించుకున్న పార్టీలను, ఆ నాయకులను, ఆ ఎమ్.ఎల్.ఏలు కూడా శిక్షించవచ్చు. అనే చట్టం తీసుకురావడం అవసరం, లోక్‌సత్తా, అటువంటివారు గెలుపొందిన పార్టీ నాయకుల మీద, ఆ మంత్రుల మీద Interest Litigation ప్రజావాజ్యము వేస్తే బాగుంటుంది.

**5. బోధనా విధానాలు జిజ్ఞాసను రేకెత్తించేటట్లుగా చేయటం ఎలా?**

ఎ. వాణికుమారి, తుని

జ. కేవలం అధ్యాపకులుగా, ట్యూటర్‌లుగా కాక గురువులైన వారు తమ బోధనను పాఠ్యాంశమునకు పరిమితం చేయకుండా భారత, భాగవత ఉపనిషదాది గ్రంథాల్లోని ధర్మాన్ని, నీతిని బోధించే కథలను, వాటిలోని విశిష్ట వ్యక్తుల యొక్క ప్రవర్తనను, సాధనలను ప్రస్తుత సమాజంలోని సమస్యలకు అన్వయం చేస్తూ విశ్లేషిస్తూ చెప్పినట్లయితే విద్యార్థులయందు జిజ్ఞాస పెరుగుతుంది. ప్రతి విద్యార్థి 'ఎందుకు' అని ప్రశ్నించగలిగే మనస్తత్వాన్ని రేకెత్తించగల్గినది సమగ్రమైన బోధన.

**6. అణుశక్తి విశ్వమానవ కళ్యాణానికి ఏ విధంగా ఉపయోగపడగలదు?**

ఎస్. కృష్ణ, విజయనగరం

జ. శాస్త్ర విజ్ఞానం సాంకేతికము (టెక్నాలజీ) మానవ కళ్యాణానికి, వినాశనానికి కూడా తోడ్పడుతుంది. దుష్టులు, దుర్మార్గులు, ఉద్దండులు, ఈ రెండింటినీ విధ్వంసం కొరకు ఉపయోగిస్తారు. సుశిక్షితులు, ధర్మనిరతులు వీటిని లోకకళ్యాణం కోసం ఉపయోగిస్తారు. అణుశక్తిని, విద్యుదుత్పాదనకు మన దేశంతో సహా ఎన్నో దేశాలు ఉపయోగిస్తున్నాయి. సంబంధిత విజ్ఞానం సాంకేతిక సదుపాయాలను, క్యాన్సర్ వంటి రోగనివారణకు ఉపయోగిస్తున్నాం. మున్ముందు వ్యోమ శకటాలకు ఇంధనంగా ఉపయోగిస్తాం.

**7. నేడు విద్యార్థి మానసికంగానూ, శారీరకంగానూ వృద్ధి చెందలేకపోతున్నాడు. అందుకు కారణం ఏమిటి?**

పి. విష్ణు

జ. దీనికి చాలా పద్ధతులున్నాయి. ముఖ్యమైనవి : రేడియో వింటూ, టి.వి., సినిమాలుచూస్తూ కాలం వృథా చేయకుండా ఉండటం, విద్యయందు మాత్రమే ఆసక్తి చూపడం, రాజకీయ పార్టీలు పెట్టి, నీ విద్యార్థి సంఘాలలో చేరి నినాదాలతో సమ్మెలు, ప్రదర్శనలతో కాలం వృథాచేసి విధ్వంస ప్రవృత్తులను పెంచుకోకుండా వుండటం; ప్రతిరోజు వ్యాయామం చేయడం సుమతీ, వేమన , మొదలైన శతకాల్లోని పద్యాలను కంఠస్థం చేసుకొని అవి చాటుతున్న బుద్ధిని వివేకాన్ని అలవరచుకోవడం, ధర్మ నీతి నియమ ప్రభోదకమైన సాహిత్యాన్ని చదవటం డా. అంబేద్కర్, సర్దార్ పటేల్, సుభాష్ చంద్రబోస్, సి.వి రామన్, స్వామి వివేకానంద, అరవింద్‌ఘోష్, మహనీయుల జీవిత చరిత్రలు చదివి స్ఫూర్తి పొందటం మొదలగు ప్రక్రియల ద్వారా విద్యార్థి సర్వతోముఖ వికాసాన్ని సాధించగలడు.



## ఏప్రియల్ 2005

**1. విద్యాసంస్థల్లో విద్యార్థులు, అధ్యాపకులు సెల్‌ఫోన్ ఉపయోగించటాన్ని నిషేధిస్తామని ప్రభుత్వం వారు అంటున్నారు కదా! అది సాధ్యమేనా?**

పి. నాగలక్ష్మి, విశాఖపట్నం

జ. విద్యా సంస్థలు విశేషించి తరగతి గదుల్లోనూ, పరీక్షా ప్రదేశాల్లోనూ సెల్‌ఫోన్ ఉపయోగాన్ని నిషేధించడం చాలా అవసరం. ఎందుకు సాధ్యం కాదు, ఉపాధ్యాయులు నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. ఎవరైనా నిషేధాన్ని ధిక్కరిస్తే వారి సెల్‌ఫోన్ తీసేసుకోవాలి.

**2. గవర్నర్ వ్యవస్థ అవసరమా?**

బి. రాజు, గన్నవరం

జ. గవర్నర్ వ్యవస్థ అవసరమే కాని, చరిత్ర హీనులను, విద్యా విహీనులను, వయసు మళ్ళినవాళ్ళను, నిన్న మొన్నటిదాకా పార్టీ రాజకీయాల్లో మునిగి వున్న వాళ్ళను గవర్నర్‌లుగా వేయరాదు. ప్రముఖ న్యాయమూర్తులను, వృత్తినిపుణులను, మేధావులను మాత్రమే గవర్నర్‌లుగా నియమించాలి.

**3. గాట్ నుంచి "విద్య"ను మినహాయించాలని కొందరు సూచిస్తున్నారు అది వీలుపడుతుందా? గాట్ పరిధిలో ఉండటం వలన నష్టమా?**

ఎన్. పద్మనాభయ్య, నూజావిదు

జ. విద్య కూడా ఒక సర్వీస్ అంటే సేవ అని వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజింగ్ (W.T.O) సభ్యులైన ప్రతిదేశం, భారతదేశంలో కూడి ఒప్పుకున్నాయి. దీనివల్ల నష్టంకన్నా లాభమే ఎక్కువ ఉంటుంది. ఎందుకంటే విద్యా సంస్థలు, విద్యార్థులకోసం పోటీపడవలసిన అవసరం ఒక స్వదేశీయస్థాయిలోనేకాక, అంతర్జాతీయ స్థాయిలో

జరుగుతుంది. ఏ విధంగా అయితే పోటీ వల్ల టెలిఫోన్ అందుబాటులో, అన్నిచోట్ల దొరుకుతుందో అదే విధంగా ప్రపంచస్థాయిలో విద్యా సంస్థలు పోటీపడితే విద్యార్థులకు దేశానికీ లాభం, కాని ఒక నిబంధన మాత్రం ఉండాలి. భారతదేశం యొక్క చరిత్రను, సంస్కృతీ, పరంపరలను తప్పనిసరిగా పాఠ్యాంశంగా ఉండాలని ప్లాన్ ఉండాలి. ఈ విద్యా సంస్థలు మన విద్యార్థుల యొక్క దేశభక్తిని, నశింపచేయకుండా చూసేటటువంటి బాధ్యతను ప్రభుత్వం స్వీకరించాలి.

**4. పి.జి. మెడికల్ అడ్మిషన్‌లో మొదటి ర్యాంకర్‌కి కోరుకున్న కోర్సులో సీటు దొరక్కపోవడం న్యాయమా? దీనివలన విద్యార్థులలో నిరాశనిస్పృహలు కలగవా? నిబంధనలు అలా ఎందుకు ఉన్నాయి?**

జ. 'ఇది అన్యాయం' అనిస్వయంగా ఆలోచించగలిగిన దేశ శ్రేయస్సును కోరే వ్యక్తులు ఒప్పుకుంటారు. కాని మన దేశంలో ఓట్లకోసం వివిధ వర్గాలను సంతుష్టీకరించే క్షుద్రరాజకీయాలు ఒక అలవాటేకాదు. అనివార్యం కూడా అయినట్లయింది. దాన్ని నిరసించి దానికి వ్యతిరేకంగా ప్రజానీకాన్ని ఉత్తేజపరచాలి. ఇది ఒక బృహత్పథకమే.

**5. బ్యూరోక్రసీ అని దేనిని అంటారు?**

కె.వెంకటేశ్వర్లు, తుని

ప్రభుత్వంలో పనిచేసే వర్గాలన్నింటిని కలుపుకుని బ్యూరోక్రసీ అంటారు. మనదేశంలో ఇది ఎలా పరిణమించిందటే ప్రభుత్యోద్యోగులు పర్మనెంట్, వారిని నడిపే మంత్రులు టెంపరరీ; నడిపే మంత్రులు ప్రజా ప్రతినిధుల్లో నిజాయితీ, ధర్మం లేకపోవడం మూలాన బ్యూరోక్రసీ కూడా విచ్చలవిడిగా తయారయి, ప్రజలయొక్క సేవకులుగా కాకుండా, ప్రజల యొక్క నిరంకుశ యజమానులుగా తయారయ్యారు. మంత్రులకు సంతృప్తి పరిచేకొన్ని పనులుచేసి, ఇతర విషయాల్లో తమ ఇష్టారాజ్యం, స్వప్రయోజనాలకోసం చేస్తున్నారు.



**6. మానవుడు ఏ యుగ జీవనంలో రాజ్యవ్యవస్థ ఏర్పరుచుకున్నారు?**

జ. వ్యవసాయం చేయడానికి మానవులు ఒకచోట స్థిరపడినప్పటి నుంచి వారి ఆస్థిపాస్థులను రక్షించడంకోసం ఒక ఆథారిటీ కావాలసి వచ్చింది. అదే కాలక్రమేణా పరిణమించి ప్రభుత్వంగా తయారయింది. సమాజంలో అరాచకతను అణచడానికి దేశాన్ని పరాయివారి ఆక్రమణల నుండి రక్షించడానికి, చట్టాలను చేసి అందరికీ న్యాయం సమకూర్చడానికి దేశంలోని సహజ వనరులను ఉపయోగించి సంపదను సృష్టించడానికి, ప్రభుత్వ వ్యవస్థ ఏర్పడుతూ, పెరుగుతూ వస్తోంది. ఇది అతిగా పెరిగితే ప్రభుత్వోద్యోగులచే ప్రజలు పురుగులుగా తొక్కబడతారు. అందుకని ప్రభుత్వాన్ని పరిమితం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

**7. చిన్న రాష్ట్రాల వలన ప్రయోజనం కలుగుతుందా?**

సి. ప్రవీణ్ కుమార్, నెల్లూరు

జ. చిన్న రాష్ట్రాలవల్ల కొన్ని ప్రయోజనాలున్నాయి. కొన్ని అనర్థాలున్నాయి. చిన్న రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న భ్రష్టు రాజకీయం వల్ల కులవ్యవస్థ వైషమ్యాలు పెరిగే అవకాశం ఉన్నాయి. పెద్దరాష్ట్రంలో ఏ ఒక్క కులంకూడా ఆధిపత్యాన్ని సాధించుకోలేదు. గోవా అటువంటి చిన్న రాష్ట్రంలో ఎక్కువ పార్టీలున్నప్పుడు, కులం ప్రాతిపదిక మీద అవి ఏర్పడిసమాజాన్ని, రాష్ట్రాన్ని నాశనం చేసే అవకాశం ఉంటుంది. ఉత్తరప్రదేశ్ అటువంటి పెద్ద రాష్ట్రాలలో ఏ భాగానికైనా బాధ్యతాయుతమైన పరిపాలన ఉండడం కష్టంగా ఉంటుంది. అందుకని, సమతుల్యత ఉండాలి. మరీ చిన్న రాష్ట్రంకాదు, మరీ పెద్ద రాష్ట్రంకాదు. అమెరికాలో 28కోట్ల జనాభాకి 50 రాష్ట్రాలున్నాయి. మరి ఆ దామాషాలో 100 కోట్లున్న జనాభాకి 100 రాష్ట్రాలు కూడా ఉండొచ్చు కాని ప్రభుత్వంపై వ్యయం ఎక్కువైపోవచ్చు.

**8. ప్రస్తుత పరిస్థితుల్లో బీహార్‌లో ప్రజా ప్రభుత్వం ఏర్పాటయ్యే అవకాశం ఉందా?**

జ. ప్రజాప్రభుత్వం ఏర్పడి, అది మనగలిగిన పరిస్థితి లేదు. ఎలక్షన్ రద్దుచేసి తిరిగి ఎలక్షన్ పెట్టడం మంచిది.

**9. విశ్వవిద్యాలయాల ప్రధాన ఆశయాలు ఏమిటి?**

జ. విద్యార్థులను ఆలోచనా పరులుగా, సంపద నిర్మాతలుగా, మేధావులుగా సంతులిత జ్ఞానాన్ని సముపార్జన చేసే శక్తిని ప్రతివారిలో కల్గించడం విశ్వవిద్యాలయం యొక్క ఆశయాలు.

**10. మారుతున్న సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర ఎలా ఉండాలి?**

యు. ఉమాకాంత్, ఖమ్మం

జ. తల్లితండ్రులకన్నా, భావితరాన్ని తీర్చిదిద్దవలసిన, అలా చేయగల్గిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉన్నది. భగవద్గీతలో చెప్పినట్లు పిల్లలకు తండ్రిగా, స్నేహితునిగా, సహచరుడుగా, ప్రియురాలికి ప్రియుడిగా ఉపాధ్యాయలు విద్యార్థులతో ఉండాలి. విద్యార్థులలో జిజ్ఞాసను కల్పించాలి. ఉత్కృష్ఠ వ్యక్తుల కథలను చెప్పి ఆ విధంగా ధర్మనిష్ఠులై, మేధావులై బాధ్యత గలిగిన నాగరికులుగా ఉండేట్లు ఉపాధ్యాయులు విద్యార్థులను తయారు చేయాలి.

**11. నేడు కొన్ని పాఠశాలలో విద్యార్థులను ఉదయం 8-00 నుంచి రాత్రి 8-00 వరకు భోదిస్తూ, వారిని ఆటలకు దూరం చేస్తున్నారు అది మంచిదా?**

డి. ఇందిర, తెనాలి

జ. ఈ బోధనా పద్ధతి మంచిదికాదు. కోడిపెట్టలను బోనులోపెట్టి మూతిలో నుండి మేతని సంగ్రహింపచేసి వెనకనుండి గుడ్డు పొందడం ఎంత అస్వాభివికమో ఇది కూడా అంతే, ఒక మెదడే కాదు పెరగవలసింది, శరీర అంగసౌష్టవం దారుఢ్యత కూడా వుండాలి. ఇతరులతో కలిసి ఆడటం అనేది విద్యలో ఒక అవినావభావ భాగమే.



**12. విద్యావిధానంలో ప్రొఫెసర్ "యశపాల్" కమిటీ చేసిన సూచనలు ఏమిటి? వాటిని మన ప్రభుత్వాలు ఎందుకు అమలు పర్చటం లేదు?**

జ. ఒక యశ్పాల్ కమిటీయే కాదు. ఎన్నో కమిటీలు ఎన్నో సూచనలు చేశాయి. అసలు చిత్తశుద్ధిలేని మంత్రివర్గాలు ఉన్నంతకాలం దేశమంటే ఓట్లనే, దేశమంటే కోట్లనే రాజకీయాలు నడుపుతున్నంత వరకు అందరికీ విద్య, గుణం, ఉన్నతవిద్య ఉండవు. మనదేశంలో బాధ్యత, సంపద, చొరవ ఉన్న ఉత్తమపౌరులు ప్రైవేటు రంగంలో విద్యాలయాలు స్థాపించి విద్యార్థులకోసం పోటీ పడినప్పుడు గుణం కలిగిన, పాటవం ఉన్న విద్యావంతులు తయారు అవుతారు.

**13. విద్యాలయాలలో ప్రవేశానికి "ప్రవేశపరీక్ష"లు జరపటం సముచితమా?**

యల్. రాజరావ్, వరంగల్

జ. ప్రవేశ పరీక్షలు జరపడం ఉచితంకాదు. కనీస అర్హతలకోసం ఏ డిగ్రీకాని, సర్టిఫికెట్ కావాలో వాటిని ఆధారంగా చేసుకొని అందులోని ఉత్తమశ్రేణి వారికి ప్రవేశం ఇవ్వాలి. ఈ డిగ్రీతో సర్టిఫికెట్ కోసం నిర్వహించే పరీక్షలు సవ్యంగా జరపాలి. అంతేకాని, కోచింగ్ క్లాస్‌లకి తీసుకోవడానికి కూడా ప్రవేశపరీక్ష దాని, తర్వాత విద్యాలయంలో ప్రవేశానికి మరో ప్రవేశపరీక్ష ఇదంతా వక్రీకరింపబడిన విధానం.

**14. ప్రజలు ఎంతో ఆశతో తమవాణిని వినిపించాలని చట్ట సభలకు సభ్యులను పంపితే వారు నేడు చట్టసభల సమావేశాల్లో సరైన రీతిలో వ్యవహరిస్తున్నారా?**

కె. ఆర్, హైద్రాబాద్

జ. నేరస్థులు, చరిత్ర హీనులు, లంచగొండులని, హంతకులని, వంచకులని, ప్రజలకు తెలిసిన వారు కూడా చట్ట సభల్లో సభ్యత్వం పొందుతుంటే అక్కడ వ్యవహారం వేరే విధంగా ఎలా ఉండగలదు.

**15. గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్రమోడీకి అమెరికా వీసా నిరాకరణ ఎందువలన?**

జ. క్రిస్టియన్ మిషనరీలు, భారతదేశంలో సెక్యులరిస్టులని ధూషించేవారు, వారివల్ల లాభాలు పొందుతున్న సంఘాలు, అమెరికాలో కొన్ని విశ్వ విద్యాలయాలల్లో స్థానం చేసుకున్న మార్క్సిస్టులు, అంతాకలిపి అమెరికాదేశాన్ని పెడదారి పట్టించి, నరేంద్రమోడి గారికి వీసా నిరాకరించేటట్లు చేశారు. కాని, దీనివల్ల భారతదేశ గౌరవానికి వచ్చే ముప్పేమీలేదు. ఈ ఘటనతో అమెరికా తన సంకుచితత్వాన్ని మాత్రమే చాటుకుంది.

## మే 2005

**1. విప్లవం అంటే ఏమిటి? అది రావడానికి కారణాలేమిటి?**

ఎ. రాము, నంద్యాల

జ. ప్రస్తుతం ఉన్న రాజ్యాంగ లేక ఆర్థిక వ్యవస్థను సంపూర్ణంగా మార్చడాన్ని, విప్లవాత్మకమైన మార్పు అంటారు. ఉదాహరణకు రాచరికాన్ని తుడిచిపెట్టి ప్రజాస్వామ్యాన్ని ప్రవేశపెట్టడం, ప్రతి పరిశ్రమ అభివృద్ధిపరంగానే ఉండకుండా, ప్రైవేటు రంగంలో ఉంచడం విప్లవాత్మకమైన మార్పు, ప్రస్తుత వ్యవస్థ ప్రజల ఆకాంక్షలను తీర్చలేకపోవడం, వారి సహనం సరిహద్దు దాటడం మూలాన విప్లవాలు వస్తాయి.

**2. మేడే ఎలా ఏర్పాటు అయింది?**

జ. అమెరికాలోని చికాగో పట్టణంలో కార్మికులు తమ వేతనాల్లో, పనిచేసే నిబంధనల్లో, మార్పుకోసం 1886 సంవత్సరంలో మే 1న పోరాడినందువలన వారిమీద కాల్పులు జరిగాయి. ప్రపంచం అంతటా కార్మికులలో సంఘీభావాన్ని ఉత్తేజ పరచటం కోసం 1887 నుంచి మే 1 ప్రపంచ వ్యాప్తంగా కార్మికులు తమ



స్పృహను పెంపొందించటం కోసం అప్పటినుంచి మేడేను ప్రపంచకార్మిక దినంగా పాటిస్తున్నారు.

**3. ఎటు చూచినా దేశ సమగ్రతకు జాతీయ సమైక్యతకు, సెక్యులరిజానికి ముప్పువాటిల్లే పరిస్థితులే కన్పిస్తున్నాయి. ఈ తరుణంలో మనకర్తవ్యంఏమిటి?**

**ఎస్. నగేష్, నందిగామ**

జ. మన దేశ సమగ్రతను జాతీయతను విచ్ఛిన్నం చేసే శక్తులు మనకు తెలుసు. మత మార్పిడి ఉధృతంగా జరిగిన ఈశాన్య రాష్ట్రాల్లో (నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, ఇటీవలే అరుణాచల్ ప్రదేశ్....) ఏర్పాటు వాదం కోసం సాయుధపోరాటం మొదలయ్యాయి. అదే విధంగా 'మేము భారత సంతతి వారముకాదు', మా మతాన్ననుసరించి మాది భారతజాతి కాదు, మాది ముస్లింజాతి అని వాదించి అంతర్యుద్ధాన్ని ప్రారంభించి, దేశాన్ని విభజింపచేసి పాకిస్తాన్‌ను సృష్టించారు. ఆ సంతతివారు కూడా తిరిగి 1947కు ముందున్న వేర్పాటు వాదాన్ని, మనస్తత్వాన్ని వదలక జిల్లాలను, పట్టణాలను కూడా విభజించాలంటున్నారు. మాకు హిందువులకు లేని ప్రత్యేక హక్కులు, ప్రత్యేక చట్టాలు ఉండాలంటున్నారు. ఇటువంటి విభాజక మనస్తత్త్వానికి, శక్తులకు, సైద్ధాంతిక బలాన్ని లౌకికవాదులు, మార్క్సిస్టులు ఇస్తున్నారు. కామ్రేడ్ సీతారం ఏచూరి భారతదేశం వివిధ జాతుల కూటమి, కాని ఒకే జాతి కల్గిన రాష్ట్రం కాదని పదే పదే చెపుతున్నారు. వీరందరూ తలపెట్టుతున్న ముప్పును నివారించాలంటే మతాంతరీకరణ, వివిధజాతీయత, కులాన్ని, ప్రాంతీయతను ఆధారంగా పార్టీలు పెట్టేవారిని మనం వ్యతిరేకించాలి. దేశభక్తిని, మాతృభక్తిని, భారతీయతను మనం పెంపొందించుకోవాలి. ఇటీవలి శతాబ్దాల్లో విశేషించి గత 80 ఏళ్ళలో నాయకులు చేసిన, చేస్తున్న పనులవల్ల దేశానికి ఎటువంటిహాని కల్గిందో, కలుగుతుందో గుర్తించి, విజయ నగరరాజులు, మరాఠాలు, సిఖ్ఖులు ఏవిధంగా మన శత్రువులను ఎదుర్కొన్నారో ఆ విధంగా, వారి దీక్షతో, దక్షతతో మనం ఈ దుష్ట శక్తులను అణచివేయాలి.

**4. ఆచార్య నరేంద్రదేవ్, జయప్రకాష్ నారాయణ్ వంటి నైతిక విలువలు కలిగిన నాయకులు రాజకీయ సన్యాసం చేయకుండా ఉంటే దేశగమనం ఏ విధంగా ఉండేదంటారు?**

ఎం. కల్పన, రేపల్లె

జ. జయప్రకాష్ నారాయణ్ గారు రాజకీయ సన్యాసం చేయడం వల్ల జరిగిన దుష్పరిణామాన్ని ఎదుర్కొంటానికి తిరిగి రాజకీయ సశస్త్రులయ్యారు. ప్రజాస్వామ్యాన్ని హరించి ఫాసిస్టుపాలనను ప్రవేశపెట్టిన ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా ప్రజలనందరను సమీకరించి ఇందిరగాంధీకి గుణపాఠం నేర్పారు. ఇలా శృతి మించిన తరువాతగాక స్వాతంత్ర్యం రాగానే నీతి నియమాలను వదులుతున్న, కుటుంబ పరిపాలన ప్రవేశపెడుతున్న వారికి వ్యతిరేకంగా జయప్రకాశ్‌గారు, రాజాజీ, రంగా,ఆచార్య కృపలానీ వంటి వారితో కలసి కాంగ్రెస్‌కు ప్రత్యామ్నయమైన పార్టీని పెట్టినట్లయితే ఒకకుటుంబపు ఆధిపత్యాన్ని తొలగించగలిగేవారు.

**5. మొన్నటివరకు మన మధ్యనే నేతాజీ సుభాష్‌చంద్రబోసు ఉన్నమాట నిజమేనా?**

జ. దేవుడు ఉన్నాడా? లేడా? ఎక్కడ ఉన్నాడు? ఏ రూపంలో ఉన్నాడు? అని తేల్చుకోవడం ఎంత కష్టమో, నేతాజీసుభాష్ చంద్రబోస్ మొన్నటివరకు మనమధ్య వున్నదీ లేనిదీ తేల్చుకోవడం అంత కష్టం. అంతటి కార్యశీలి, ధైర్యశాలి, దేశభక్తుడు, ద్రష్ట మనదేశంలో దేనికో భయపడి ఎవరికి భయపడి ఇన్ని దశాబ్దాలవరకు అజ్ఞాతంలో ఏ సన్యాసి వేషంలోనో ఉండటం నమ్మశక్యమేనా!

**6. విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఎంపిక ఎలా ఉంటే బాగుంటుంది? వావిలాల గోపాలకృష్ణయ్యగారు సూచించిన విధంగా సెనెట్ ద్వారా ఎన్నిక కావడం వాంఛనీయ మంటారా?**

కె. గణేష్, మచిలీపట్టణం



జ. ప్రస్తుతం విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు రాజ్యం చేస్తున్న రాజకీయ నాయకులచేత కులం, మతం,ప్రాంతం, ప్రాతిపదికగా ఎంపిక చేయబడుతున్నారు. నీతి, నిజాయితీ, ప్రజాహితం, దృష్టిలో లేనివారు రాజ్యం చేస్తుంటే ప్రతి సంస్థ దుష్టుల పాలవుతుంది. సెనెట్‌ని ఉపకులపతిని ఎన్నుకోమంటే, శాసనసభలకు జరిగే ఎన్నికలు ఎంత అవినీతితో అక్రమాలతో జరుగుతున్నాయో ఆవిధంగానే సెనెట్ సభ్యుల ద్వారా ఉపకులపతి ఎన్నిక జరుగుతుంది. స్వరాష్ట్రులు కాని, పెరెన్నికగన్న విద్యావేత్తలను ఉపకులపతులుగా నియమిస్తే కులమత ప్రాంతీయ ప్రభావాలు కొంచెం తక్కువగా ఉండవచ్చు.

**7. నేడు విద్యార్థులకు నిర్బంధ జాతీయ సేవ అవసరమా?**

సి. రమ్య, అనకాపల్లి

జ. విద్యార్థులకు నిర్బంధంగా యన్.సి.సి. ఉండటం చాలా వాంఛనీయం. జాతీయసేవ ప్రవేశపెడితే విద్యార్థుల టైమ్ వేస్ట్ చేసిన వాళ్ళమవుతాం. సంవత్సరానికి రూ. 60 వేల కోట్ల సబ్సిడీ పొందుతున్న వారిచేత ప్రతిఫలంగా జాతీయసేవను చేయించాలి. విద్యార్థి దశలో కావలసింది శ్రమ అంటే గౌరవం, దీక్ష, సంఘీభావం, క్రమశిక్షణ కష్టపడడం, సాహసకృత్యాలు చేయడం ఇవన్నీ కూడా నేషనల్ కెడెట్ కోర్ ద్వారా విద్యార్థులకు అలవాటవుతాయి.

**8. ముషారఫ్ భారత్ పర్యటన వలన ఉపయోగము ఉందా?**

ఆర్. సుబ్బారెడ్డి, కర్నూల్

జ. ముషరఫ్ భారత పర్యటన వల్ల ఉపయోగం నాస్తి. మహ్మద్ ఘోరి అనేకసార్లు వచ్చాడు. పాకిస్తాన్ యొక్క అధ్యక్షుడు సైనికాధ్యక్షుడు, ప్రధానమంత్రులు మన దేశానికి చాలా సార్లు వచ్చారు. 1948లో,65లో,71లో,98లో ప్రత్యక్షంగానూ, ఇంకా అసంఖ్యాకమైన సందర్భాల్లో మన భారతావని మీద పాకిస్తాన్ ఆక్రమణలు చేస్తూనే ఉంది. పుర్రెలో పుట్టిన బుద్ధి పుల్లాకులతో (చితిలో) మాత్రమే పోతుంది.

**9. క్రిమీ లేయర్ అంటే ఏమిటి?**

జ. రిజర్వేషన్ల ద్వారా ఉద్యోగాలను పొంది సంపన్నులైనవారు తరతరాలుగా వారి సంతానమే ప్రభుత్వపు పెద్ద పదవులు పొందటం పారిశ్రామికవేత్తలుగా, వ్యాపారస్తులుగా సంపత్తిని సమకూర్చుకున్నవారు, అనుసూచిత వెనుకబడిన కులాల, జాతులు వారు 'క్రిమీలేయర్' అనబడతారు.

**10. యువతరాన్ని పక్కదారి పట్టించే కథలతో సినిమాలుతీసే డైరెక్టర్లని, హీరోలని, గొప్పమేధావులు, మీడియా ఉన్నతమైన వ్యక్తులుగా చూపుతూ, వాళ్లని స్ఫూర్తిగా చూపుతుంటారు ఇది ఎంత వరకు సమంజసం?**

మద్దెల ఉమారాణి, బికుమళ్ళ

జ. ఇటువంటి వారిని ఉన్నతమైన వ్యక్తులుగా చూపుతూ వారికి గొప్పదనాన్ని ఆపాదించడం సమంజసంకాదు. ఇది ధర్మానికి, నిజాయితీకి, మేధస్సుకు తీరని అపచారం చేసినట్లే.

**11. నక్సల్స్ హింసాకాండ విప్లవ సిద్ధాంతాలకి ఎంత మాత్రం ఉపయోగకరమైనది?**

జ. విద్య ద్వారా, ప్రచారం ద్వారా, ప్రభోదం ద్వారా శాంతియుతంగా ప్రజలను సమీకరించు వారి ఓట్ల ద్వారా శాశ్వతమైన ప్రజానుకూలమైన, ప్రజామోదం పొందిన, శాశ్వత సంక్షేమాన్ని ప్రసాదించగల్గిన, సామాజిక ప్రభుత్వ వ్యవస్థ ఏర్పడగలదు. కాని హింసాకాండ వల్ల ప్రజా బాహుళ్యము యొక్క ఆమోదాన్ని పొందని అల్పసంఖ్యాకులు బలవంతంగా పాలించడం జరుగుతుంది. హింసాకాండతో, ఆయుధాలుపయోగించడం వల్ల ఏర్పరుచుకొన్న ప్రభుత్వాలు శాశ్వతమైన సమానత్వాన్ని, న్యాయాన్ని గాని ఏర్పరచలేవని కుప్పకూలిపోయిన కమ్యూనిస్టు రష్యా, దాని ఉపగ్రహ రాజ్యాలు దానికి నిదర్శనం.

**12. తమిళనాడు రాష్ట్రంలోని కొన్ని తరహా కేసులు ఇతర రాష్ట్రాలకు తరలించి అక్కడ విచారణ కోరుకుంటున్నారు ఎందుకు? ఇతర రాష్ట్రాలలో మాకు న్యాయం జరుగుతుంది అంటున్నారు? దీనిలోని మర్మం ఏమిటి?**

టి. సత్యనారయణరావు, ఖమ్మం

జ. 1969వ సంవత్సరం నించి మన దేశపు రాజకీయాల్లో తీవ్రమైన అవినీతి



పెరుగుతూ వచ్చింది. ఏలినవారి పంథాకు మద్ధతిచ్చే వారినికీలకమైన పోలీసు న్యాయ వ్యవస్థ పాలనా వ్యవస్థ పదవుల్లో నియమించడం జరుగుతోంది. అందువల్ల న్యాయవ్యవస్థ రానురానూ నిష్పాక్షికతను కోల్పోతుంది. కొంతమంది పోలీసు అధికారులు న్యాయమూర్తులు, ముఖ్యమంత్రి, ఇతర పాలక వర్గాన్ని సంతోషపరిచే విధంగా వ్యవహరిస్తున్నారు. అందుకనే తమకు న్యాయం జరగదనే భయంతో తమని ఇరికించిన కేసులను ఇతర రాష్ట్రపు న్యాయస్థానాలకు తరలించమంటున్నారు.

**13. ఆనాడు అధికారములు ఉన్నప్పుడు "విద్యారంగం"లో మార్పులు తేలేకపోయాం అని నేడు మాజీ ప్రధాని వాజపేయి అనటం నేడు అవసరమా?**

పి. లక్ష్మణ్‌రావు, ఏలూరు

జ. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు విద్యారంగంలో విశేషించి వక్రీకరింపబడిన చరిత్ర పాఠ్యాంశాల్లోమార్పు తేవడానికి వాజ్‌పేయి ప్రభుత్వం కొంత కృషి చేసింది. కాని దశాబ్ధాలుగా కొన్ని విశ్వవిద్యాలయాల్లో విద్యామంత్రిత్వ శాఖలోనూ, కొన్ని ఇతర శాఖల్లో పాతుకుపోయిన విజాతీ, విదేశీ మనస్తత్వమున్న వ్యక్తులు వ్యతిరేకించుట వలన జాప్యం చేయడం వలన అనుకున్న మార్పులను తేలేకపోయారు. అలా ఒప్పుకోవడంలో తప్పేముంది.

**13. మేమే హైకోర్టు, సుప్రీంకోర్టులలో కొన్ని సామాజిక అంశాల మీద ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను (PIL) వేయాలనుకుంటున్నాం. ఏ విధంగా వేయాలి? ఉత్తరాల ద్వారా కూడా వేయవచ్చా? తెలుగులో విషయాన్ని వివరించవచ్చా? (సుప్రీంకోర్టు హైకోర్టు చిరునామాలను అందించండి)?**

పలుకూరు వెంకటప్రసాద్, కడప

జ. ప్రజాప్రయోజన వ్యాజ్యాలను వేయవలసిన అవసరం ఎంతో ఉంది. కొంతమందిబాధితులు పోస్ట్‌కార్ట్ ద్వారా హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు ఫిర్యాదు చేస్తే, కాని అటువంటి న్యాయమూర్తులు అరుదు. ఏ భాషలోనైనా వ్రాయవచ్చుకాని, ఇంగ్లీషులో వ్రాయిస్తే త్వరగా స్వీకరింపబడటానికి ఎక్కువ అవకాశం ఉంది. మీ పట్టణంలో ఉన్న ప్రతి న్యాయవాదికి హైకోర్టు-సుప్రీంకోర్టుల చిరునామా తెలుసు. న్యాయవాదులు ద్వారానే PIL వేయిస్తే మంచిది.

## జూన్ 2005

**1. "వందేమాతరం" గీతాన్ని మొదటిసారిగా ఆలపించి వందేళ్ళు పూర్తి కావస్తుంది కదా! వందేమాతర స్ఫూర్తిని నేటి యువతకు గుర్తుచేసేందుకు ఎలాంటి కృషి చేయాలి?**

కె.బి.కె. విజయవాడ

జ. పెరుగుతున్న జాతీయ చైతన్యాన్ని బలహీన పరచడం కోసం, ముస్లిం వేర్పాటు వాదాన్ని పెంపొందించడంకోసం బ్రిటీష్ పాలకులు బెంగాల్‌ను ముస్లిం, హిందూ రాష్ట్రాలుగా 1905లో విభజించారు. దీనికి వ్యతిరేకంగా భారత జాతీయ కాంగ్రెస్ ఒక ఉద్యమాన్ని ప్రారంభించింది. ఆ ఉద్యమంలో పాల్గొన్న వాళ్ళు బకించంద్ర ఛటర్జీ 1875లో వ్రాసిన "వందేమాతరం" అని నినదిస్తూ లక్షలాది భారతీయులు, స్వాతంత్ర్యోద్యమాల్లో పాల్గొని, ఎన్నో కష్టాలనూ, నష్టాలనూ అధిగమించారు. "వందేమాతరం" అంటూ ఉరికంబాలెక్కారు.

కాని, ముస్లిం విభాజక, వేర్పేటు మనస్తత్వం పెరిగినకొద్దీ, వందేమాతరం ముస్లిం మతానికి, సిద్ధాంతానికి వ్యతిరేకం అని వందేమాతరాన్ని జాతీయ గీతంగా ఒప్పుకోమన్నారు. దేశాన్ని మతప్రాతిపదికన అంటూ విభజింపజేయించి, పాకిస్తాన్‌ను నిర్మించుకున్న తర్వాత కూడా, భారతదేశంలో ఉంటూ, వందేమాతరాన్ని వ్యతిరేకించడం, దానికి తల ఒగ్గి మహోజ్జ్వల చరిత్ర కలిగిన, వందేమాతరాన్ని జాతీయ గీతంగా చేయకుండా ఉండటం, అది పాడినప్పుడు అగౌరవం ప్రకటిస్తూ నిలబడకుండా ఉండటం, మనకు సిగ్గుచేటు. వేర్పాటు వాదులకు, విభాజక శక్తులకు ప్రోత్సాహం.

కనుక వందేమాతరం ఉద్యమ శతజయంతి సందర్భంగా ఆ ఉద్యమచరిత్రనూ అందరికీ తెలియజేయాలి. ఆ గేయం మన జాతీయతకు, భారతీయ అఖండతకు,



దేశభక్తికి చిహ్నమని, దాన్ని వ్యతిరేకించే విభాజకులకు మనం తలవంచకూడదని, మన ప్రజలకు తెలపాలి. వందేమాతరానికి వ్యతిరేకత ఒక విఘటక మనస్తత్వం అని చెప్పాలి.

**2. ఎంసెట్‌లో ఇంటర్‌కు వెయిటేజ్ ఇవ్వటం అవసరమా?**

సి. బిందు, అనకాపల్లి

జ. అసలు ఎంసెట్ పరీక్ష నిరర్థకం; కోచింగ్, ట్యూటోరియల్ సంస్థలకు మాత్రమే ఎంసెట్ లాభదాయకం. రాష్ట్రానికంతటికీ ఒకే ఇంటర్ బోర్డు ఉంది. ఇంటర్ విద్య ప్రమాణాన్ని పెంచడానికి, ఆ పరీక్షలు సక్రమంగా నిర్వహించడానికి కృషిచేసి, ఇంటర్ మార్కుల ఆధారంగానే ఇంజనీరింగ్ తదితర కోర్సులకు ప్రవేశం ఇవ్వాలి.

**3. రాష్ట్రాల మధ్య జలవివాదాలకు పరిష్కారమేమిటి?**

జ. నదీ జలాలను పూర్తిగా వినియోగించుకోకుండా, రాష్ట్రాలు పరస్పరం పెనుగులాడటం శోచనీయం. అన్ని నదులూ జాతి సొత్తుగా పరిగణింపబడి, కేంద్రప్రభుత్వం ఆధీనంలో, నదీజల వినియోగ కమీషన్‌ను నెలకొల్పటమే ఉచితమైన పరిష్కారం.

**4. గాంధీగారి వార్ధా విద్యావిధానం, రవీంద్రనాథ్ ఠాగూర్ గారి శాంతినికేతన్ విద్యావిధానంతో ఏవిధంగా విభేధిస్తుంది?**

వై. డేవిడ్, తిరుపతి

జ. మనం గాంధీగారిదిగాని, ఠాగూర్‌గారిది గాని విద్యా విధానాన్ని ఎప్పుడూ అంగీకరించలా; వాళ్ళకాలంలో, అక్కడక్కడ ప్రయోగాత్మకం వారి విద్యా విధానాలు కొనసాగాయి. మనం అవలంబిస్తున్న విద్య, చాలా వరకు పరీక్షల కోసం, సర్టిఫికేట్లకోసం మాత్రమే.

**5. పూర్వం చదువు ఇప్పటి చదువు కన్నా బాగా ఉండేదని అనేకులు అంటారు? కాని ఇప్పటి చదువుకే ప్రభుత్వం ఎంతో**

**ఖర్చుపెట్టి ఎన్నో సౌకర్యాలను కల్గించినా నేటి చదువు ఎందుకు బాగోలేదు?**

జ. పైన చెప్పినట్లు, పఠన, బోధన కేవలం పరీక్షల్లో మార్కులు తెచ్చుకోవడం కోసమే అవటం మూలాన, నేటి చదువులు నాణ్యత లేనివిగా ఉన్నాయి. విద్య జిజ్ఞాసను పెంచాలి. విశ్లేషణ, రచనాత్మకతను రేకెత్తించాలి. సదాసద్వివేక చతురతను కలిగించాలి. జీవితాతంతం ఇంకా నేర్చుకోవాలనే వాంఛను పెంపొందించాలి. ఈ సద్గుణాలను విద్యార్థులకు అలవరచకపోవడం మూలాన మన చదువులు బాగాలేవు.

**6. ప్రస్తుతం ప్రైవేట్ విద్యాసంస్థలు స్టేట్ ర్యాంకులు సాధిస్తున్నామని చెప్పుకుంటున్నారేకాని, వేము మహాత్మాగాంధీని, మదర్‌థెరిసాలను తయారుచేస్తున్నామని మాత్రం చెప్పుకోరు. వ్యక్తిత్వ వికాసం నేర్పని ఈ ర్యాంకులు ఎందుకోసం?**

మండాది గోపీనాథ్, ముక్కుదుదేవులపల్లి

జ. పరీక్షల్లో ర్యాంకులు సంపాదించటంవేరు. జీవితంలో సంపత్తిని సమాజ శ్రేయస్సును కలిగించటం వేరు., కేవలం నౌకరీ చేయటానికి మాత్రం పనికివచ్చే చదువులు సమాజ కళ్యాణానికి, సౌభ్రాతృత్వానికి, దేశం యొక్క సంపన్నతకు పనికి వచ్చేవికావు. అందరూ మొద్దులనుకోకూడదు. కనీసం 10% విద్యార్థులు తమ తల్లితండ్రులయొక్క , గురువులయొక్క స్ఫూర్తితో, ఆదేశ, ఉపదేశాలతో, సుశిక్షితులై, దీక్షితులై భారతదేశానికి వన్నె తీసుకువస్తున్నారు. ఈ స్ఫూర్తి పెంచడానికి తల్లితండ్రులు, గురువులు, దేశభక్తులు ప్రయత్నించాలి.

**7. బరితెగించిన సినిమాలను ఉరితీయలేమా?**

జ. ఉరితీయలేము కాని, బహిష్కరించగలం. పనికిమాలిన సినిమాలను, టి.విలో చూపించే నిరర్థక సీరియల్స్‌ను, బహిష్కరించగలిగిన ఐచ్ఛికశక్తిని, మనో విగ్రహాన్ని మనం అలవరచుకోవాలి.



**8. సెల్‌ఫోన్ టవర్‌తో కలిగే నష్టాలు తెలుపగలరు. రేడియేషన్ ప్రభావం ఎంతదూరం వరకు ఉంటుంది? ఇంటి మధ్యలో టవర్ ఉండవచ్చా? తెలుపగలరు?**

ఎస్. రాధిక, గుంటూరు

జ. సెల్‌ఫోన్ టవర్స్‌తో నష్టాలు ఉన్నాయని ఏ శాస్త్రీయ పరిశోధన తెల్పడం లేదు. సెల్‌ఫోన్ టవర్ నుంచి వచ్చే ప్రసారశక్తి మనకు ఏ మాత్రం హాని కలిగించదు. కనుక ఇళ్ళ మధ్యలో టవర్ ఉన్నా హానిలేదు.

**9. మొన్నటిదాకా ఏ.సి రూమ్‌లో ఉండి లక్షలు సంపాయించి, ఇవాళ రాజకీయాల్లోకి వచ్చి చిలకపలుకులు పలుకుతూ ఉంటే తలపండిన రాజకీయ నాయకులు కూడా తలలు ఊపటం సిగ్గుచేటు కాదా?**

కె. రామారావు, హైద్రాబాద్

జ. నిజమే, సిగ్గుచేటే. ఏనాడో కౌరవసభలో తన పుట్టములను వలుస్తున్నప్పుడు మెదలకుండా కూర్చున్న పెద్దలందరినీ చూసి, ద్రౌపది ఈ విధంగా అన్నది.

సారవుధర్మమున్ విమల సత్యము పాపముచేత బొంకుచే.

పారము పొందలేక, చడబారినదైన అవస్థ

దక్షులెవ్వారలు పేక్ష చేసిరది, వారికి చేటగు.....

కనుక సిగ్గులేకుండా తలలు ఊపుతున్న తలపండిన రాజకీయ నాయకులు నిష్ప్రయోజకులై అధర్మప్రవర్తనను ఆపలేకుండా వున్నారు.

**10. "Deemed University" అనగా అర్థమేమి? వారు యిచ్చు డిగ్రీలు ఏ.స్త్రప్ర. వారిచే గుర్తింపబడినవా?**

పి. సుబ్రహ్మణ్యం, నరరావుపేట

జ. ప్రభుత్వాల చేతకాక, ప్రైవేటు వ్యక్తులు, సంస్థలచేత స్థాపించబడి, ప్రవేశపెట్టిన కోర్సులకు, కావలసిన అన్ని హంగులను, సమకూర్చుకుని, తగినంత

ఆర్థిక స్థోమతను కలిగిన విద్యా సంస్థలను Deemed Universities అంటారు. వాటిని University Grants Commission గుర్తిస్తుంది. కనుక ఆ సంస్థలిచ్చే డిగ్రీలు యు.జి.సి మాన్యతను పొందినవే.

**11. నాటి గురుకులాలు నేడువుంటే ఎలా ఉంటుందంటారు?**

ఆర్. లక్ష్మణరావు, నెల్లూరు

జ. నాటి గురుకులాలు ప్రస్తుతం ఉండే అవకాశాలులేవు కనుక ప్రశ్నేలేదు. గురువులు లేరు. బోధకులు, అధ్యాపకులు, ట్యూటర్‌లు, కోచ్‌లు, జవాబులు ఎంచుకోవడానికి తర్ఫీదు ఇచ్చే వ్యక్తులు విద్యాలయాల్లో ఉంటున్నారు. మానవతా వికాసం కోసం పిల్లలను చదివించాలనే తల్లితండ్రులు లేరు కాని, మనం ఒక విషయం గమనించాలి. మన రాష్ట్ర ప్రభుత్వం కొన్ని తథాకథిత (So Called) గురుకుల పాఠశాలలను స్థాపించింది. అక్కడ బోధకులు, విద్యార్థులూ కూడా తప్పక ఆ పాఠశాల ఆవరణలోనే నివసిస్తున్నారు. అటువంటి పాఠశాలల్లో బోధనయందు విద్యార్థుల ఉత్తీర్ణత యందు నాణ్యత కనిపిస్తోంది.

**12. మన సంస్కృతి విద్యావిధానాన్ని ఏమైనా దెబ్బతీస్తుందా?**

జ. పరంపరాగతమైన భారతీయ సంస్కృతిని విస్మరించి, మెకాలే గారు, భారతీయతను అంతమొందించుటకు ప్రవేశపెట్టిన పాశ్చాత్య విద్యావిధానమును మనము అమలు చేయుచుండడం మూలానా, మన విద్య దెబ్బతింటోంది. పాశ్చాత్య వ్యామోహం పెరుగుతోంది. ఆ సంస్కృతిలోని మంచి కన్నా, చెడును మనం శీఘ్రంగా గ్రహిస్తున్నాం. ఉదా : Valentines Day అని ఆడ, మగ పిల్లలు విచక్షణా రహితంగా ప్రేమాయణం జరపడం, అనుదినం తల్లితండ్రులను గౌరవించడానికి బదులు కేవలం Mother's Day న తల్లిని గుర్తు తెచ్చుకోవడం.

**13. సంవత్సరకాలములో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ అభివృద్ధికి ఏ మేరకు కృషి చేశాయి?**

ఎన్. విష్ణు, అనంతపురం



జ. ఇంతింతలు చేస్తామని చెప్పడం, చేశామని వ్యాఖ్యానించడం మహా ఉధృతంగా మన చదువుతున్నాం, వింటున్నాం. ఏ మార్పూ లేకుండా పాత విధానం సాగుతూనే వుంది. ఈ ఏటి బడ్జెట్‌లో చిదంబరం గారు (IIS) Indian Institute of Science, Bangalore కు 100 కోట్ల రూపాయల గ్రాంట్‌గా ఇచ్చారు. ఇది ఎంతో శ్లాఘనీయమైన చర్య. ఈ విధంగా మంచి పని చేస్తున్న విద్యా సంస్థలకు అన్వేషణ, అనుసంధానాలను, ఆవిష్కరణలను, ఎక్కువ చేయడం కోసం, ప్రతి ప్రభుత్వం ముందుకు రావాలి.

**14. విద్యాబోధన మాతృభాషలోనే జరగడం సబబు అంటారా?**

కె. భవాని, మచిలీపట్నం

జ. నదికి నీరు ఎలాగో, వ్యక్తిత్వానికి చేవ్రాలు ఎలాగో, మన సంస్కృతికి మాతృభాష వాహిని, మాతృభాషలో చదువుకుని ప్రావీణ్యతను సంపాదించగలగాలి. మన జాతియొక్క విలువలన్నీ మన మాతృభాషా సాహిత్యంలో వున్నాయి. సంస్కృతితోపాటు శాస్త్రజ్ఞానం, సాంకేతిక నిపుణత కూడా అవసరం.

కనుక, కనీసం SSLC వరకు నిర్బంధంగా మాతృభాషా మాధ్యమం ద్వారానే విద్యాబోధన జరగడం మంచిది. ఇంగ్లీష్ భాషను కూడా కనీసం ఐదవ తరగతి నుండి ముఖ్య పాఠ్యాంశంగా ఉంచాలి. విశ్వవిద్యాలయ స్థాయిలో ఇంగ్లీష్‌ను విద్యా మాధ్యమంగా వాడుకోవాలి. అప్పుడు మన సంస్కృతిని నిలబెట్టుకోవడంతోపాటు ప్రపంచ స్థాయిలో సంపత్తిని సృష్టించగలిగిన భారతీయులుగా తయారవుతాము.

## జులై 2005

**1. పురపాలక, నగరపాలక ఎన్నికలను పరోక్ష పద్ధతిలో నిర్వహించడం ఎంత వరకు సమంజసం? దేశమంతా ఒకే విధానం అమలు చెయ్యరా?**

సి. శ్రీరాములు, ఒంగోల్

జ. నగరపాలక ఎన్నికలను పరోక్ష పద్ధతిలో నిర్వహించడం వాంఛనీయం కాదు. అసలు ప్రతి వయోజనునికి ఏ ఇతర అర్హతలు లేకుండా, అనగా కనీస విద్య ఉండాలని కాని, ఇంత పన్ను చెల్లించిన వ్యక్తిగా ఉండాలని కాని అనకుండా ఓటు హక్కు ఇవ్వటం మంచిదా! కాదా! అనే చర్చ మన రాజ్యాంగ చట్టాన్ని ఏర్పరచుకుంటున్నప్పుడు జరిగింది. ఓట్లు వేసేవారు విచక్షణతో అన్ని విషయాలు కూలంకషంగా తెలుసుకుని ఓట్లు వేయాలా? లేక ఆశ చూపిన వారికి తాత్కాలిక ప్రయోజనాలు చేకూర్చినవారికి, ఓటును అమ్ముకోవాలా? అనే విషయాలు చర్చించిన తర్వాత ప్రతి వయోజనునికి ఓటు ఉండాలని, శాసన సభలకు, మరి ఇతర ప్రజా ప్రతినిధుల సభలకు డైరెక్ట్‌గా ఓటింగ్ జరగాలి అని నిర్ణయించారు. నిరక్షరాస్యత, పేదరికం ఉన్నప్పుడు ఇది మంచిదికాదు. పరోక్ష ఎన్నికల వలన ఎక్కువ మేలు జరుగుతుందనే వాదన తిరస్కరింపబడింది. ఇప్పటి వరకు ప్రత్యక్ష ఎన్నికలు జరుపుతూ మున్సిపాలిటీలకు మాత్రమే పరోక్ష ఎన్నికలు పెడదాం అనడం ఒక సదుద్దేశంతో చేసిన నిర్ణయంగా తోచదు. ప్రత్యక్ష ఎన్నికలలో ఓట్లు కొనడానికి కోట్లు ఖర్చుపెట్టవలసి ఉంటుంది. పరోక్ష ఎన్నికలలో తక్కువ ఖర్చు అవ్వచ్చు. ప్రతినిధులు Cross Voting చేసి లక్ష్యాలను తల్లక్రిందులు చేయవచ్చు. దేశమంతా ఒకే విధానాన్ని అమలు చేస్తే మంచిది కాని, ఇప్పుడు ఏలుతున్నవారిలో అంత విజ్ఞత, దూరదృష్టి కనిపించడంలేదు.

**2. త్వరలో దేశమంతా "జాతీయ విద్యా విధానం" ప్రవేశపెడతామంటున్నారు కదా! దాని వలన కలిగే ప్రయోజం ఏమిటి?**

ఆర్. లక్ష్మీనారయణ, విజయవాడ

జ. జాతికి, వ్యక్తికీ కూడా ఉపయోగించని విద్యా విధానాన్ని బ్రిటీష్ పాలకులు ప్రవేశపెట్టారు. దాన్ని మార్చాలని మహాత్మా గాంధీగారు, జాకీర్ హుస్సేన్‌గారు కొన్ని దేశీయ విధానాలను స్వాతంత్ర్యం రాకముందే సూచించారు. దాని తర్వాత రాధాకృష్ణన్ కమీషన్, కొఠారి కమీషన్ అని, ఛవాన్ కమీషన్ అని ఎన్నో కమీషన్‌లు వేశారు. వారందరూ తమ సలహాలను, సూచనలను నివేదికలలో సమర్పించారు.



ఇవన్నీ ప్రభుత్వ కార్యాలయాల్లో పేరుకుపోయి వున్నాయి. కొంతమంది ప్రభుద్ధులు భారతీయులందరూ ఒక జాతివారు కాదని వివిధ జాతుల కూటమి అని అంటారు. కొంతమంది మతం వేరేది కాబట్టి మేము వేరే జాతి వారిమని, మన విద్య మతం ప్రకారం ఉండాలని అంటారు. మూకుమ్మడి ఓట్లకోసం పాట్లుపడే రాజకీయ పక్షాలు అందరినీ తృప్తి పరచలేక సమైక్యజాతికి సంపత్తిని సృష్టించే, దేశభక్తిని కల్పించే, జాతీయ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టే దృఢ సంకల్పంకాని, శక్తిగాని లేకపోవడం మూలానా, జాతీయ విద్యా విధాన ప్రవేశం చర్చనీయాంశమే. జాతీయ విద్య ఉన్నట్లైతే ఏర్పాటు వాదులు, వర్గ కలహ సిద్ధాంతాల ప్రాంతీయ తత్త్వాలు ఉండక మనది ఒక దేశం, మనం ఒక ప్రజలం, మనమందరం సహకరించి ఆర్థిక, నైతిక, అభ్యుదయాన్ని పొందుదాం, మన దేశాన్ని ఒక మహాశక్తివంతమైన దేశంగా నిర్మిద్దాం అనే భావనలు కలుగుతాయి.

**3. రాజకీయాల ప్రక్షాళన అవసరమనే లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాశ్ నారాయణగారి వాదన కరక్టేనా? జాతీయ ఎన్నికలకు దామాషా పద్ధతి మేలని సూచిస్తున్నారు. దామాషా పద్ధతి అంటే ఏమిటి?**

పి. సాయికుమార్, ఆంచంట

జ. లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణ గారు కోరుతున్న రాజకీయాల ప్రక్షాళన చాలా అవసరం. ప్రస్తుతం నేరగాళ్ళు, ధనవంతులు, కులాన్ని మతాన్ని చూపించి, ఎన్నికౌతున్న వాళ్ళు ఎక్కువౌతున్నారు. ఇంతవరకు లేని కుల విభేదాలను సృష్టించి, కులస్తులకు సహకరించి, పరస్పర విద్వేషాన్ని పెంచి, కులకూటములను ఏర్పరచి ప్రజాతంత్రంలో ఎన్నికల ప్రక్రియని అపహాస్యం చేస్తున్నారు. అందుకే దీనికి ప్రక్షాళన అవసరం అని, పెద్ద మార్పులు తీసుకురావాలని లోక్‌సత్తా అంటుంది.

ప్రస్తుతం పోటీచేస్తున్న అభ్యర్థులు అందరిలో ఎవరికి ఎక్కువ ఓట్లు వస్తే అతనే గెలుస్తున్నాడు.కాని అతనికి మాత్రం ఓట్లలో ఆధిక్యత రావాలి. అనే నియమం లేదు. ఉదా : ఒక నియోజక వర్గంలో 5 పార్టీల అభ్యర్థులు పోటీ చేస్తే ఒకరికి 22% ఓట్లు వస్తే మిగిలిన 4కి 19% వస్తుంటే, కేవలం 22%వచ్చినతను

ఎన్నికౌతున్నాడు. ఆయనకు 78 మంది వ్యతిరేకులు ఉన్నప్పటికీ. దామాషా పద్ధతి అంటే ఉదా:ఆంధ్రప్రదేశ్‌ని తీసుకోండి. మనకి 42 మంది లోక్ సభ సభ్యులున్నారు. కాంగ్రెస్‌కి 35%, తెలుగుదేశానికి 30% బి.జె.పికి 15% మిగతావి ఇతర పార్టీలకు మన రాష్ట్రంలోని పోలైన ఓట్ల మొత్తంలో వచ్చినవనుకోండి.అప్పుడు 14 సీట్లు కాంగ్రెస్‌కి 12 సీట్లు టి.డి.పికి 7 సీట్లు బి.జె.పికి మిగతావి ఇతర పార్టీలకు వచ్చిన దామాషాలో వస్తారు. పోలైన ఓట్లలో 5% తక్కువ వచ్చిన పార్టీకి ఒక్కసీటు రాకూడదని నియమం ఉండచ్చు. ఇలా జరిగినట్లైతే తక్కువ ఓట్లతో అన్ని సీట్లు సంపాదించుకోవడం జరగదు. రాష్ట్రంలో పోలైన ఓట్లన్నిటినీ లెక్కవేసి ఏ పార్టీకి ఏ నిష్పత్తిలో ఓట్లు వచ్చినాయి. ఆ నిష్పత్తిలో సీట్లని పంచుకోవచ్చు.

**4. రాష్ట్రాల విభజనకు ఆ రాష్ట్ర ప్రజల మనోభావాలకంటే ఇతర రాష్ట్రాల నాయకుల, పార్టీల మద్ధతు ముఖ్యమా?**

కె. జమరామ్, హైద్రాబాద్

జ. భారతదేశం యొక్క విభజన ఈ దేశపు పార్టీల మధ్యఏర్పడిన అవగాహన వలన కాక, పరదేశీయులైన బ్రిటీష్ వారి యొక్క నిర్ణయం ప్రకారం జరిగింది. మనలో మనం అవగాహన కుదుర్చుకోనప్పుడు ఇతరులను ఆశ్రయించడం పరిపాటి అయింది. పృథ్వీరాజ్, జయచంద్ర వైరం పరదేశీయుడైన మహమ్మద్ ఘోరి తీర్చాడు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ విభజించాలో లేదో అనే నిర్ణయం పర రాష్ట్రాలదే కాదు, విదేశీ సంతతి వ్యక్తి నిర్ణయానికే వదిలివేద్దామనే 'త్యాగ' మూర్తులు నాయకులుగా వున్న మన పుణ్యభూమి ఆంధ్రప్రదేశ్.

**5. మావోయిస్టు ఆత్మాహుతి దళాలని ఏర్పాటు చేసామని చెప్తున్నారు. ఇలాంటి ఉన్మాద చర్యల ద్వారా "విప్లవం" ప్రగతి సాధిస్తుందా?**

మండాది గోపినాథ్, ముక్కుడుదెవులపల్లి



జ. ఇటువంటి ఆత్మాహుతి దళాల చర్యలవల్ల చరిత్రలో ఎక్కడా కూడా విప్లవం రాలేదు. ప్రాణనష్టం జరుగుతోంది. సంపత్తి నష్టం జరుగుతుంది. అభద్రత పెరుగుతుంది. వ్యక్తిగతమైన కక్షల సాధింపుకోసం చేసే హత్యలను కూడా విప్లవం కోసం అని చెప్పవచ్చు. అందుకని కమ్యూనిస్టు పార్టీలు కూడా ఆత్మాహుతి దళాల చేత ప్రజా శత్రువుల వధ అనే చర్యలను గర్హిస్తున్నారు. ప్రతిహింస కూడా పెరిగి అరాచకం ఎక్కువవచ్చు.

**6. చైనాలో జరిగిన బాక్సర్ ఉద్యమం లక్ష్యం ఏమిటి?**

ఆకునూరి విద్యాధర్, సికింద్రాబాద్

జ. 19వ శతాబ్ధం అంత్య దశకంలో చైనామీద దాదాపు 10 పాశ్చాత్య దేశాలు ఆధిపత్యం నెలకొల్పి, బలవంతంగా వాళ్ళకి నల్లమందు అమ్మి, దానికి ప్రతిఫలంగా చైనాలో ఉత్పత్తి చేయబడుతున్న సామానును, అతి తక్కువధరకు కొంటూ, ఆ దేశ సంపత్తి కొల్లగొట్టడం ప్రారంభించారు. వాళ్ళకు తొత్తులుగా కొంతమంది చైనీయులను మతం మార్చిడి చేసి, వారికి వారి దేశం అంటే అసహ్యతను కల్పించి, ఒక పంచమాంగ దళాన్ని సృష్టించడం మొదలుపెట్టారు. చైనా ప్రభుత్వం బలహీనత వల్ల పాశ్చాత్యుల దురాక్రమణని ఎదుర్కోలేకపోయింది. దాంతో దేశభక్తి ప్రేరితులైన చైనీయులు, రహస్యంగా కొన్ని దళాలను ఏర్పరచి, పెద్ద నెట్‌వర్క్‌ని నిర్మించి క్రిస్టియన్ మిషనరీలను, మతం మార్చుకుని పరదేశస్థులకు తాబేదారుగా పనిచేస్తున్న పాశ్చాత్య వ్యామోహిత చైనీయులను, దోపిడీ చేస్తున్న పరదేశస్థులను, పథకం ప్రకారం సంహరించిన ఉద్యమాన్ని బాక్సర్ విప్లవం అంటారు. సంపూర్ణ విజయం సాధించలేకపోయినా, పరదేశీయుల, వారి తాబేదారులైన చైనీయుల ఆగడాలకు అడ్డుకట్ట వేశారు. తత్ఫలితంగా చైనా పరదేశస్థుల పాలనలోకి వెళ్ళలేదు. కేవలం Hong Kong, Makar పట్నాలలో మాత్రమే పాశ్చాత్యులు తమ ప్రభుత్వాన్ని అదికూడా 100 సం॥ల లీజుగా మాత్రమే నెలకొల్పవలసి వచ్చింది. ఇప్పటికీ చైనాలో క్రిస్టియన్‌లు పరదేశీ చర్చి ఆధిపత్యాన్ని అంగీకరించరు. ప్రాధేయపడినా పోప్‌ను చైనాకు రానీయలేదు.

**7. జాతీయస్థాయి పరీక్షలలో "తెలుగు విద్యార్థులు" అత్యుత్తమ స్థాయి ర్యాంకులను సాధిస్తున్నారు. అంటే విద్యాపరంగా మనం ఇతర రాష్ట్రాలవారి కంటే ముందంజలో ఉన్నామనుకోవచ్చా?**

పి.రాజశేఖర్, వేములవాడ

జ. కాదు, కేవలం ర్యాంక్‌లను సంపాదించినంత మాత్రాన వారు విద్యావంతులు, వివేకం ఉన్నవారని, విశ్లేషణాత్మకత, రచనాత్మకత ఉన్నవని అనుకోలేం. వీరిలో అత్యధికులు తమ తరగతుల్లో తమంతట తాము చదువుకుని ర్యాంకులు సంపాదించుకోలేదు. ట్యూషన్‌ల ద్వారా కోచింగ్ క్లాసుల్లో ప్రశ్నలకు సమాధానం ఎన్నుకొనే చతురతను సంపాదించుకోవడం మూలాన పరీక్షల్లో ర్యాంక్‌ను సంపాదించే శక్తిని పొందినవారే కాని, వారు నిజమైన విద్యాధికులని చెప్పలేం. టుటోరియల్ కోచింగ్ కార్పొరేట్ విద్యా సంస్థల్లో పరీక్షా ప్రశ్నలకు జవాబులు ఎన్నుకోవడం నేర్పుతున్నారు కాని, మేధస్సును, జిజ్ఞాసను పెంచే స్వయం కృషితో సాధించే శక్తిని మాత్రం పెంచే విద్యని ప్రసాదించడం లేదు.

## ఆగస్టు 2005

**1. మన ప్రధాని మన్మోహన్‌సింగ్ అమెరికా పర్యటన వలన మనకు ఎటువంటి లాభము కలగవచ్చు?**

ఎ. కృష్ణప్రసాద్, గూడూరు

జ. భారతదేశంలో అంతర్గతమైన ఎన్ని విచ్ఛిన్నకర శక్తులు వున్నప్పటికీ ఇటీవల మన మేధాసంపత్తి ప్రపంచ ఖ్యాతిని అర్జించింది. నెహ్రూ మార్కు సోషలిజం విసర్జించబడిన తరువాత మన ఆర్థిక ప్రగతి గణనీయంగా పెరుగుతోంది. మనమొక శక్తివంతమైన సుసంపన్నమైన దేశంగా పెరగవచ్చు. ఈ సత్యాన్ని అమెరికా గుర్తిస్తోంది. ప్రపంచమంతటా ఇస్లామిక్ మత మౌఢ్యప్రేరితమైన ఉగ్రవాదం అమెరికాని, యూరప్‌ని కూడా భయభ్రాంతులను చేస్తోంది. తాత్కాలికంగా పాకిస్థాన్



కొన్ని చారిత్రక కారణాలవల్ల కొన్ని ప్రయోజనాలకోసం అమెరికాకు మిత్రదేశంగా వున్నప్పటికీ ఇది చాలా కాలం కొనసాగేది కాదు. చైనా కూడా శక్తివంతమవుతూ అమెరికాకు ధీటైన ప్రతిద్వంద్విగా ఎదుగుతోంది. ఈ పరిస్థితులను సమీక్షించి అమెరికా భారత్ స్నేహాన్ని తన లాభం కోసం కోరుకుంటోంది. ఈ స్నేహం వల్ల మనకేమీ నష్టం లేదు. వామపక్షాలు ఏ అవాస్తవాలను, ఏ పారంపరిక శత్రుత్వాన్ని ప్రచారం చేసినా లెక్కచేయకుండా మన్మోహన్‌సింగ్ అమెరికా అధ్యక్షునితో కలిసి కొన్ని ఒడంబడికలు చేసుకోవడం మనకు ప్రయోజనకారిగా వుంటుందని భావిస్తున్నాను. అమెరికా శాస్త్రసాంకేతిక రంగాలలో అగ్రగామి అనేది నిర్వివాదాంశము. వారు హితోధిక ప్రగతిని సాధించాలంటే భారతీయ మేధాసంపత్తివారికి అవసరం. వారి సాంకేతిక పరిజ్ఞానాన్ని మనం ఉపయోగించుకుని తక్కువ కాలంలో శక్తివంతమైన ఆర్థిక పుష్టికల్గిన దేశంగా వెలగడానికి, ప్రధానమంత్రి పర్యటన, వారి మంతనాలు ఉపయోగపడతాయి.

**2. నిన్నటి తరానికున్న ఉత్సాహం నేటి తరంలో కనిపించటం లేదు ఎందుకని?**

పి. రాజశేఖర్, వేములవాడ

జ. దీనికి కారణం పూర్తిగా మన రాజకీయ నాయకులే. విద్యలేనివారు. సంస్కృతిలేనివారు, సాంప్రదాయం లేనివారు, అన్యాయార్జితమైన విత్త బలంతో కులతత్వాన్ని ఉసిగొలిపి, బూచిని చూపించి ఒక మతం వారి ఓట్లను సంపాదించటానికి ప్రయత్నం చేస్తూ, దారిద్ర్యాన్ని నారాయణుడితో సమానంగాపోల్చి, బీదవారికి అన్ని ఊరికనే ఇస్తామని, హామీ ఇస్తూ, ప్రజలను ఉత్తమ విద్యను అలవరచుకోమని చెప్పకుండా, పరిమిత కుటుంబం అవసరమని ఉద్బోధించకుండా, కేవలం MLA లుగా అవడం కోసం, మంత్రిపదవులను సంపాదించడం ధ్యేయంగా పెట్టుకుని, అరాచకతను, లంచగొండితనాన్ని ఉపేక్షిస్తూ వుండడం మూలానా, యువకులలో కూడా, నీతి నియమముల యందు నమ్మకం పోతోంది. మనం ఎంత కష్టపడి సంపన్నతను సమకూర్చుకుందామన్నా, రాజకీయ నాయకులు, వారికి భాగస్వాములుగా తయారవుతున్న ప్రభుత్వోద్యోగులు, మన

దేశాన్ని భ్రష్టుపట్టిస్తున్నారు. అయినా , మనం నిరాశపడకూడదు. ఎంతోమంది విద్యాసక్తి కలిగిన యువకులు ముందుకు వచ్చి, క్రొత్త రంగాల్లో ప్రపంచంలో ఉన్న పెద్ద కంపెనీలకు ధీటుగా భారత దేశంలో కంపెనీలను స్థాపించినటువంటి ధీరుభాయ్ అంబాని, నారాయణమూర్తి, అజీమ్ ప్రేమ్‌జీ, రామలింగరాజు, శ్రీనివాసరాజు, డా॥ అంజిరెడ్డి, వరప్రసాదరెడ్డి లాంటి వ్యక్తులు మనలో ఉన్నారు. వీరందరూ ముందుకు వచ్చి యువతరాన్ని ఉత్తేజ పరచినట్లైతే మన దేశానికి ఉజ్జ్వలమైన భవిష్యత్తు వుంది.

**3. గోబెల్స్ ప్రచారం అంటే ఏమిటి?**

టి. భాస్కర్‌రావు, ఏలూరు

జ. గోబెల్స్ జర్మనీ యొక్క నాజీ నియంత. హిట్లర్ కాలంలో ఆయన ప్రసార, ప్రచారమంత్రిగా పనిచేశాడు. అబద్దాలను పదేపదే అన్ని మాధ్యమాలద్వారా ఆకట్టుకునే రీతిలో ప్రచారం చేయించేవాడు. సత్యాలను మఱుగు చేయించి, అబద్దాలను అదేపనిగా వినిపించి, చదివించి, వాటినే ప్రజలచేత సత్యాలుగా నమ్మింప చేసే ఆ పద్ధతిని కొంతకాలం విజయవంతంగా కొనసాగించాడు. గోబెల్స్ తర్వాత కాలంలో, నియంతృత్వపాలకులూ, మూఢవిశ్వాసబద్దులైన పార్టీలు, మతాలూ గొబెల్స్ ప్రచార పద్ధతిని అనుసరిస్తున్నాయి.

**4. ప్రపంచంలో ఉగ్రవాదం ఎందువలన పెచ్చుమీరుతుంది?**

జ. "నా మతమే, నా రాజకీయ సిద్ధాంతమే ఉత్కృష్టమయింది, మిగతావన్నీ అబద్దాల. నా దేవుడు, నా ప్రవక్త, నా మతాన్ని, నా సిద్ధాంతాన్ని, నా ఆచార, పూజావిధానాలను, నా కార్యప్రణాళికనూ ఇతరులందరిచేతా ఒప్పించమనే బాధ్యతనూ, విధిని నా యందు శాసించాడు. నా విధి నిర్వహణయందు, ఇతరులు నన్ను బాధిస్తున్నారు, వేధిస్తున్నారు. అటువంటి శత్రువులను శిక్షించడం తప్పుకాదు. అహింసయందు, మాకు విశ్వాసం లేదు. శత్రుసమాజంలో మేమంటే భయంపుట్టించడానికి, మా కార్యాచరణకు ఎవరూ కూడా విఘ్నములు





కలిగించడానికి సాహసించకుండా చేయడానికి ఎవరినయినా ఎంతమందినయినా, ఎక్కడయినా చంపేయడానికి వెనుకాడం." ఇలా చెప్పడాన్నీ చేయడాన్నీ ఉగ్రవాదం అంటారు. ఉగ్రవాదులు మాత్రం మేము దేవుని కార్యాన్ని మా సైద్ధాంతికుని బోధననూ అమలు చేస్తున్నామని, మేం నిర్దోషులమని, మాది ఉగ్రవాదంకాదు, ధర్మయుద్ధమనీ అంటారు.

**5. ఎస్మా అంటే ఏమిటి? దాన్ని ప్రయోగిస్తే కట్టుబడి ఉండాలా?**

ఎన్. ప్రమీల, నంద్యాల

జ. అత్యవసర సేవలను నిర్విరామంగా కొనసాగించుట కొరకు ఉద్దేశించబడిన చట్టాన్ని (ఎస్మా Essential Services Maintainance Act) అంటారు. ఏ సేవకైనా ఆటంకం కల్పించడానికి అందులో పనిచేసేవారు సమ్మె చేయదలుచుకొంటే ఈ చట్టాన్ని ప్రయోగించి సమ్మెదారులను అరెస్టు చేయవచ్చు. వారిని ఉద్యోగము నుండి తొలగించవచ్చు. ఈ చట్టాన్ని ధిక్కరించి సమ్మె చేస్తే వారందరూ శిక్షార్హులౌతారు. దమ్మున్న ప్రభుత్వం శిక్షించవచ్చు. కాని అవినీతి ఊబిలో దిగబడినవారు అందరి ఓట్లకోసం అన్ని విధాలాపాట్లు పడేవారు. చట్టాలను అమలు పరచినా శిక్షను మాత్రం ఇవ్వరు.

**6. నేడు మనదేశం ఎదుర్కొనే సమస్యలలో మీ దృష్టిలో ఏది మిక్కిలి సులభమైనది?**

జ. మనదేశాన్ని బాధించే అతిక్లిష్ట సమస్య బీదవారిలో, చదువురాని వారిలో విశేషించి కొన్ని తెగలలో అపరిమితమైన జనాభివృద్ధి, ప్రతి సంవత్సరం మనదేశ జనాభా ఒకకోటి ఎనభైలక్షల దాకా పెరుగుతుంటే కోటి మందికి పైగా మనం పనిచేకూర్చలేకపోతున్నాం. నిరుద్యోగులు, నిరక్షరాస్యులు, నిరుపేదలు పెరిగిపోతుండడం మూలానా సంవత్సరానికి అరవై వేలకోట్ల రూపాయలు వీరందరికి సబ్సిడీల క్రితం వ్యయం చేస్తున్నాం. చదువుమీద, ఆరోగ్యం మీద, మానవాభివృద్ధి మీద కాదు. అన్ని రాజకీయ పార్టీలు ఈ జనాభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తున్నాయి.

ఇటువంటి వారిలో కొన్ని తెగలకు చెందినవారు సంతానోత్పత్తి ద్వారా ఆధిక్యతను సంపాదించతలచుకొంటున్నారు. కొన్ని పంథాలవారు ఉగ్రవాదం ద్వారా అధికారాన్ని చేజిక్కించుకోవాలంటున్నారు. అధిక జనాభా, పేదరికం, అవిద్య, మతమౌఢ్యం, సైద్ధాంతిక ఛాందసం, పరస్పరం బలాన్ని పెంచుకుంటూ దేశానికి క్లిష్ట సమస్యగా తయారయ్యారు.

**7. ఇప్పటివరకు మీరు నిర్వహించిన పదవులలో మీకు బాగా సంతృప్తినిచ్చిన పదవి ఏది?**

బి.ఎస్.రావు, విశాఖపట్టణం

జ. నేను నిర్వహించిన ప్రతి పదవి నాకు పరమ సంతోషాన్ని ఇచ్చింది. అత్యధిక సంతృప్తిని కల్గించిన పదవి ఆంధ్రప్రదేశ్ యొక్క జనరల్ మేనేజర్ Telecom (1978-83). ఆ కాలంలో ఉద్యోగులను, ప్రజలను సమీకరించి ఉద్బోధించి గ్రామగ్రామానికి టెలిఫోను వ్యవస్థను విస్తరింపజేయడం జరిగింది. నిధుల కొరతగాని, సామాగ్రి కొరతగాని, పదవీ పరిమితులుగానీ నన్ను ఆపలేదు. గ్రామస్థులనుంచి ఎంతో భాగస్వామ్యము, స్ఫూర్తి లభించాయి. దూర సంచార్ వ్యవస్థ యొక్క ఉద్దేశ్యము.

"బహుజన హితాయ"

"బహుజన సుఖాయ" అని చాటి చెప్పాము.

తదుపరి విదేశ్ సంచార్ నిగమ్ యొక్క చైర్మన్ మేనేజింగ్ డైరక్టరుగా నా హోదాను, స్వాతంత్ర్యాన్ని ఉపయోగించి దేశవ్యాప్తంగా టెలికాంలో ప్రభుత్వం యొక్క గుత్తాధిపత్యం తొలగాలని ప్రజాహిత ఉద్యమాన్ని ప్రారంభించి కృతకృత్యుడనైనాను.

**8. జాతి భవిష్యత్తును తీర్చి దిద్దటంలో విద్యార్థుల పాత్ర ఎలా ఉండాలంటారు?**

ఎ. జయప్రద, తిరుపతి



జ. విద్యార్థులు దేశభక్తిని, మానవ ప్రేమ, దైవభక్తి- ధర్మనిరతిని, విద్య యందు ఉత్తమ పాండిత్యాన్ని గడించాలి. కలిసి పని చేయగల్గిన మనస్తత్వాన్ని అలవరచుకోవాలి. మన సాహిత్యంలో, మన పరంపరలో దేశంలోని ప్రతి భాగమందు ప్రేమను, గౌరవాన్ని పెంచుకోవాలి. ప్రకృతి ప్రసాదించిన వనరులను మన మేధస్సును, బుద్ధిని, విద్యను, చతురతను ఉపయోగించి సంపత్తిని సృష్టించి, పనిచేస్తున్న, మనందరికి, కష్టపడి పనిచేయటానికి ఇష్టపడిన వారందరికీ పని అవకాశాన్ని తద్వారా ఆజీవికను పొందే అవకాశాన్ని సృష్టించడం విద్య పరమావధి. ఒక్క ఆర్థిక సంపుష్టియే కాక, ఆధ్యాత్మికతను కూడా పెంచుకొనే సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని, సంక్షేమాన్ని కోరుతూ పరిశ్రమ చేయాలి. ఈ భావనలన్నీ విద్యార్థి దశలోనే ఉత్పన్నం అవ్వాలి.

## సెప్టెంబర్ 2005

**1. ప్రైవేట్ అన్‌ఎయిడెడ్, మైనార్టీ సంస్థలలో రాష్ట్రాల రిజర్వేషన్లు, కోటాలను రద్దుచేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వలన విద్యార్థులకు అన్యాయం జరగదా?**

జి. నాగరత్నం, చీరాల

జ. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ, ప్రభుత్వేతర, మెజారిటీ, మైనారిటీ విద్యాసంస్థల్లో రిజర్వేషన్‌ల వల్ల చాలా మంది విద్యార్థులకు అన్యాయం జరుగుతూనే ఉంది. రిజర్వేషన్‌ల వలన 30%, 40% మార్కులు వచ్చిన వారికి వృత్తి కళాశాలల్లో ప్రవేశం దొరకడం, 90%మార్కులు వచ్చిన తథాకథిత అగ్రకులస్థులైన బీదవారితో సహా ప్రవేశం దొరకకపోవడం అన్యాయం కాదా? అనువంశికంగా ఒకే కులానికి చెందటం ఎంత తప్పని అనుకుంటున్నామో అదే విధంగా అనువంశికంగా లాభం పొందిన కొన్ని కుటుంబీకులకు తరతరాలుగా రిజర్వేషన్ ప్రయోజనాన్నివ్వడం కూడా ఇతరులకు అన్యాయమే కదా? అన్ని ప్రభుత్వ కళాశాలలు, ప్రభుత్వం నుండి సహాయం పొందే అన్ని కళాశాలల్లో, ప్రభుత్వం ఎవరికి సామాజిక న్యాయాన్ని

సమకూర్చాలని అనుకుంటుందో వారికి 100% రిజర్వు చేసి, ఇతర వర్గాలకు కళాశాలలను విశ్వవిద్యాలయాలను స్థాపించుకునే హక్కునివ్వడం మంచిది. ప్రభుత్వం విద్యాలయాల ప్రమాణాలను నిర్వచించి వాటి సాధనకు మాత్రం తన నియంత్రణను పరిమితం చేయాలి.

**2. నక్సలిజం అంటే ఏమిటి? ఎందుకు ఆవిర్భవించింది? నక్సలైట్లను ప్రజాజీవనంలోకి రమ్మని ఆహ్వానిస్తున్నారు కదా! వారెందువల్ల రావటం లేదు?**

సి. రంగారావు, అనకాపల్లి

జ. సమాజంలో కొన్నివర్గాలు అసమానతకు దారిద్ర్యానికి శక్తివంతమైన సంపన్న వర్గాల ద్వారా బలి అవుతున్నాయి. వాటిని రక్షించడం కోసం వారి విముక్తి కోసం తుపాకుల ద్వారా ప్రభుత్వాన్ని కూలద్రోసి, కమ్యూనిష్టు దేశాల్లో వలె శ్రమజీవుల నియంతృత్వ పాలనను తమపార్టీ ఆధ్వర్యంలో, మరే ఇతర పార్టీ లేకుండా నడపడం నక్సలిజం యొక్క ధ్యేయం. వారికి బహుపక్షీయ ప్రజాస్వామిక ఎన్నికల్లో నమ్మకంలేదు. చైనా కమ్యూనిష్టు చేత మావో చెప్పినట్లు, ప్రభుత్వం తుపాకీ గొట్టం ద్వారానే వస్తుందని నమ్ముతారు. తుపాకులు, హింస లేకపోయినట్లయితే ఎన్నికల ద్వారా వారు ప్రభుత్వంలోకి రాలేరని వారి నమ్మకం. ప్రస్తుత పాలక వర్గాలు, బూటకపు ఎన్నికలు జరుపుతున్నారని వారి నమ్మకం. అందుకని ఇతర పార్టీల వలె తుపాకులు వదలి ప్రచారం చేసి ప్రజల విశ్వాసాన్ని పొంది ఎన్నికల్లో గెలవగలమని వారనుకోరు.

**3. పోలిట్ బ్యూరో అంటే ఏమిటి? సి.పి.యస్.లో ఉన్న దీని స్థానం ఏమిటి? దీనిలాగా ఇతర పార్టీల్లో ఉన్న సమాన స్థాయిలేమిటి?**

జి. అశోక్, గోదూర్

జ. సి.పి.యం.,సి.పి.ఐ., తెలుగుదేశంలో పొలిట్ బ్యూరోలు ఉన్నాయి, ఆ పార్టీల్లో అత్యున్నత స్థాయి అధికారం గల సమితి, పార్టీపరంగా ఎన్నికల ప్రణాళికలను, విజయవ్యూహాన్ని ప్రజా ఉద్యమాలను నిర్వహించే అధికారం



పోలిట్‌బ్యూరోలో ఉంటుంది. తెలుగుదేశంలో పోలిట్‌బ్యూరో నామమాత్రమే, కాంగ్రెస్,సమతా, బహుజనసమాజ్, తెలుగుదేశం, DMK, AIDMK, RJD బిజౌలోక్‌దళ్, ఇవన్నీ కూడా "I" ఐ కమాండ్ పార్టీలు, ఒక వ్యక్తి యొక్క ఆస్థిలాగా, నామమాత్రపు ప్రజాస్వామ్యంతో నడుపబడుతున్న పార్టీలే.

**4. కేంద్ర జలసంఘం అభ్యంతరం చేసినా మహారాష్ట్ర బాబ్లీ ప్రాజెక్టును నిర్మించడానికి కారణమేమి? ఈ విషయంలో రాష్ట్రాలకున్న హక్కేమిటి?**

జ. రానురానూ కేంద్ర ప్రభుత్వం డజన్ల కొద్దీ పార్టీల కూటమి అవడం మూలాన కొన్ని రాష్ట్రాల్లో పాలించే పార్టీలు కేంద్రంలో భాగస్వాములు అవడం మూలానా, రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వం నియంత్రణలో లేకుండా పోతున్నాయి. ఏ నదీ కూడా ఒకే ఒక్క రాష్ట్రం యొక్క సొత్తుకాదు. ప్రతి నది పరీవాహక ప్రాంతం వివిధ రాష్ట్రాల్లో ఉంది. ఆ నీటి వినియోగాన్ని ఇంటర్ స్టేట్ రివర్ వాటర్స్ ట్రిబ్యూనల్ ద్వారా వివిధ రాష్ట్రాలకు కేటాయింపబడుతుంది.

**5. మారుతున్న కాలంలో ఉపాధ్యాయులు విద్యార్థులను ఏ విధంగా తీర్చదిద్దాలి? తాను ఏ విధంగా బోధించాలి?**

ఎస్. రామచంద్రారెడ్డి, ఎర్రగుంట్ల

జ. విద్యార్థులను కేవలం మేధావంతులుగానే కాక, దేశభక్తులుగా, హక్కుల కన్నా బాధ్యతలకు ఎక్కువ ప్రాముఖ్యాన్నిచ్చే వారిగా, క్రమశిక్షణ కల్గిన వారుగా, నిరంతరం నేర్చుకునే వారిగా, ఇతరులతో సహకరించి లక్ష్యాలను సాధించేవారుగా, అసహిష్ణత లేనివారిగా సంగీతసాహిత్యాలయందు అభిరుచి కల్గేవారిగా, లోకసంగ్రహం కోసం పాటుపడేవారిగా, ధర్మమునందు ఆసక్తి ఉన్న వారిగా విద్యార్థులను ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలి. భారత, రామాయణ, భాగవత, ఉపనిషత్తులు, ఇత్యాది భారతీయ గ్రంథాల్లోని వ్యక్తుల యొక్క చరిత్ర ద్వారా, అదే విధంగా ప్రపంచ సాహిత్యంలో కూడా, విశిష్టవ్యక్తులయొక్క జీవిత గాథల ద్వారా జ్ఞాన విజ్ఞానాన్ని ఆధ్యాత్మికతను బోధించాలి.

**5. నేటి మన రాజకీయ రంగంలో ఆధిక్యం దేనికి ఎక్కువ? వ్యక్తిత్వానికా? పార్టీతత్వానికా?**

జ. ఒకటి రెండు పార్టీలను మినహాయించి అన్ని పార్టీల్లో ఒక అధినేత ఉంటున్నారు. కొన్ని పార్టీల్లో వంశపారపర్యంగా నాయకత్వం ఉంటోంది. మరికొన్ని పార్టీల్లో డబ్బును కూడ గట్టుకున్న కుటుంబమూ, వారి దగ్గర చుట్టాల ఆధిపత్యం ఉంటోంది. కమ్యూనిష్టు పార్టీల్లో వారి యొక్క ప్రతి పంథా వ్యూహం ఒక సిద్ధాంతసాధనకు ఉపయోగపడేదిగా ఉంటోందని వారంటున్నారు. అందుకే వ్యూహాత్మకంగా ఏదో ఒక మిషతో ఏదో ఒక పార్టీకి, ఒకప్పుడు మిత్రపక్షంలా, మరొకపుడు శత్రుపక్షాలలా ఉంటాయి. అన్ని పార్టీల ధ్యేయం మాత్రం వారి నాయకుల ప్రభుత్వం మీద ఆధిపత్యం, ప్రభుత్వం వల్ల లాభం పొంది, తమను పటిష్టం చేసుకోవడం,

**6. గాంధీ మహాత్ముడు సోషలిస్టు సిద్ధాంతానికి అనుకూలురా? లేక వ్యతిరేకులా?**

పి. దుర్గాప్రసాద్, రామన్నపెట

జ. గాంధీ మహాత్ముడు సోషలిజాన్ని ఎప్పుడూ సమర్థించలేదు. కమ్యూనిష్టు పార్టీల హింసను అవలంబించడం, సోషలిస్టు, సమానత్వాన్ని స్థాపించాలనుకోవడం, ఆచరణీయం కాదని గాంధీగారి విశ్వాసం. గాంధీజీ ధ్యేయం రామరాజ్యం, అంటే అన్యాయంలేని, వర్గ కలహం లేని, ధర్మపాలన ఉన్న సమాజం. ప్రభుత్వం అని వారు చెప్తుండేవారు, ఆధునికులు ప్రసంగిస్తున్నవే "ఇజం"ను వారు బలపరచలేదు. ప్రతి వ్యక్తి ధర్మబద్ధుడై ఉంటే సమాజం కూడా ధర్మయుతంగా ఉంటుందని విశ్వసించేవారు.

**7. ఆయా రంగాలలో నిష్ణాతులైన మీబోటి సీనియర్ సిటిజన్స్ యొక్క సలహాలు పాటించకపోయినా, కనీసం పరిశీలించే ఓపిక కూడా ఈనాటి మన నాయకులకు లేకపోవటానికి కారణం ఏమిటి? దీనికి విరుగుడు లేదా?**

కె. రామారావు, హైద్రాబాద్



జ. చాలా మంది నాయకులకు నిస్వార్థ ప్రజాసేవ లక్ష్యం కాదు. ఈ ప్రజాసేవ అనే "వృత్తి"తో అధికారాన్ని చేబట్టి తద్వారా సంపత్తిని సమకూర్చుకోవడం, తిరిగి ఎన్నికల్లో నెగ్గటం కోసం అక్రమ పద్ధతుల్లో ధనార్జన చేయడం పరిపాటి అయిపోయింది. దీనికి విరుగుడు ప్రజల్లో విద్య, నైతికత, ధర్మ నిరతి పెరగలి. అన్యాయాన్ని, అక్రమాల్ని అడ్డుకోవడం కోసం ఉద్యమంలో పాల్గొనాలి. ఈ సందర్భంలో ధర్మరాజు కృష్ణునిచేత కౌరవులకు పంపిన సందేశం మనందరికి సర్వదా హెచ్చరిక.

సారపు ధర్మమున్ విమలసత్యము బాపముచేత బొంకుచే
బారము బొంద లేకచెడ బారినదైనయైన యవస్థ దక్షులై
వ్యారలుపేక్ష సేసిరది వారల చేటగు గాని ధర్మని
స్తారకమయ్యు సత్యశుభ దాయకమయ్యును దైవముండెడున్

(ఉ.తృ.భీష్మపర్వము మహాభారతము)

దక్షులైనటువంటి ప్రజలు ప్రస్తుతం నాయకులలోని అధర్మ ప్రవర్తనను ఉపేక్ష చేయకతుదముట్టించడానికి ఉద్యమించాలి. ఇది ప్రతి ఒక్క భారతీయుని విధి.

**8. "ఇండియా" అనే పదం ఎలా వచ్చింది?**

పి. రామశాస్త్రి, కాకినాడ

జ. ఏ భారతీయ భాషల్లో కూడా ఇండియా అనే పదం లేదు. 14వ శతాబ్దం వరకూ హిందూ అనే శబ్దం కూడా లేదు. మనది భారతదేశమని, మనం భారతీయులమని మన సాంస్కృతిక విశ్వాస సంహిత సనాతన ధర్మమని, మన పూర్వులు వక్కాణించారు. విదేశీయులు మన దేశం మీద ఆక్రమణ చేసినవారు విశేషించి బ్రిటీష్ వారు మన దేశాన్నీ, పేరునూ మార్చారు. కాని స్వాతంత్ర్యం పొందిన పిదప ఆత్మ గౌరవమున్న దేశాలన్నీ తమ ఐతిహాసిక నామాన్ని తిరిగి పెట్టుకున్నారు. ఉదా॥సిలోన్.శ్రీలంక, గోల్డ్‌కోస్ట్–ఘనా, బర్మా–మయిన్మార్, రోడేషియా–జింబాబ్వేగా పునః నామకరణం చేసుకున్నాయి. మనం భారత అనే పదంవాడితే "లౌకిక వాదానికి" ముప్పు వస్తుందని భయపడుతున్నాం.

**9. కెబినెట్‌లో పోర్టు ఫోలియో లేని మంత్రిగా కొనసాగటము న్యాయమా?**

ఎ. కృష్ణప్రసాద్, గూడూరు

జ. బ్రిటిష్ పరంపరలో పోర్టుఫోలియోలేని కాబినెట్ మంత్రి ప్రధాని తలలోని నాలుక, ప్రతిక్లిష్లసమస్యను, అది ఏ శాఖకు సంబంధించినదైనా పోర్టుఫోలియో లేని మంత్రి గారిచే పరిష్కరింపబడుతుంది. అటువంటి మంత్రి యొక్క స్థానం కాబినెట్‌లో రెండవది. కాని మనదేశంలో అనుమానిత, వివాదభరిత, మంత్రి వర్గంలో లేకపోతే కలవరం తెచ్చే వ్యక్తులు పోర్టుఫోలియో లేని మంత్రులుగా ఉంటున్నారు. మంత్రిపదవి దొరికితే చాలు ఆ అవకాశాన్ని ఉపయోగించుకుని స్వప్రయోజనం పొందాలని, ఆత్మాభిమానం అంతంగా లేని వ్యక్తులు కూడా ఉన్నారు.

## అక్టోబర్ 2005

**1. 1857 విప్లవం విఫలం కావడానికి కారణాలేమిటి?**

జి. సునీత, కోదాడ

జ. 1857లో దేశములో అన్ని చోట్లా సైనికులు తిరుగుబాటు చేయలేదు. సిఖ్ఖు సైన్యాలు బ్రిటిష్ ప్రభుత్వానికి అండగా నిలిచాయి. దక్షిణాది సైనిక స్థావరాల్లో తిరుగుబాటులేదు. తిరుగుబాటు ముమ్మరంగా ఉత్తరప్రదేశ్, బీహార్ కొంత వరకు మాత్రం బెంగాల్‌లోనే జరిగినాయి. మరో ముఖ్యమైన కారణం సామాన్య ప్రజలు చైతన్యవంతులై తిరుగుబాటు చేస్తున్న సైనికులకు జోడుగా సహకరించి, ఉద్యమాన్ని బలపరచలేదు. కొంతమంది మహారాజులు, నవాబులు, ఉద్యమంలో అలీనంగా ఉన్నారు. ఈ కారణాల వల్ల సైనికుల చేత ప్రారంభింపబడ్డ విప్లవం బ్రిటిష్ వారిచే అణచి వేయబడింది.



**2. అహింసను ప్రబోధించే గాంధీజీకి హింసనుబోధించే 'భగవద్గీత' అభిమాన గ్రంథం. దీనిపై మీ అభిప్రాయమేమిటి?**

జ. భగవద్గీత హింసను బోధించలేదు. ధర్మ సంరక్షణ అధర్మ శిక్షణ అనేటుటవంటి విధులను బోధించింది. ధర్మ రక్షణ కోసం అవసరమైనప్పుడు ధర్మ ధిక్కారం చేస్తున్న వారిని తుద ముట్టించడం కోసం యుద్ధం చేయవచ్చు. ధర్మద్రోహులను యుద్ధంలో హతమార్చవచ్చు అని చెప్పింది. స్వప్రయోజనం కోసం కాక, వారి విద్యుక్త ధర్మం, సమాజ కళ్యాణం కోసం నిర్వహించడంలో వారు స్వలాభాపేక్ష లేకుండా తమ కర్తవ్యాన్ని నిర్వహించాలి, అని చెప్పింది. భగవద్గీత యొక్క సందేశం అహింస అని గాంధీగారు చెప్పడం సబబు కాదు. లోకమాన్య బాలగంగాధరు తిలక్‌గారు ఎంతో ఆలోచించి, తర్కించి, గీత యొక్క వాస్తవమైన సందేశం స్వలాభాపేక్ష లేకుండా ధర్మాన్ని రక్షించడం, ఆ రక్షణలో హింస అవసరమైతే చేయడంఅని తన ఉత్కృష్టమైన గ్రంథం, "గీతా రహస్యం" లో వ్రాశారు. విజ్ఞులు లోకమాన్యుని భాష్యాన్నే అంగీకరిస్తారుకాని, గాంధీగారు చెప్పినట్టుగా ఏ పరిస్థితులోనైనా సరే అహింసనే వరించమని ఒప్పుకోరు. గాంధీగారి అహింసావాదం భారతీయులను నిర్వీర్యం చేసి మత కలహాల్లో హిందువుల్ని బలిపశువులుగా చేసింది. గాంధీగారి అహింస వాదాన్ని సుభాష్‌చంద్రబోస్‌గారు ఒప్పుకోలేదు. చివరకు నెహ్రూ పటేల్ గార్లు కూడావారి వాదాన్ని సమర్థించలేదు. గౌరవం చేత మిన్నకుండా మాత్రమే ఉన్నారు.

**3. మన ముఖ్యమంత్రి వై.ఎస్.గారు ముఖ్యమంత్రి పదవికి 'ప్రత్యక్షం'మేలు అన్నారు అది ఆచరణ సాధ్యమా?**

ఆర్. నాగమ్మ, వికారాబాద్

జ. అమెరికా, ఫ్రాన్స్,రష్యా వంటి కొన్ని దేశాల్లో దేశ అధ్యక్షులను ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకుంటున్నారు. మన దేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి అపారమైన అధికారం, బాధ్యత ఉన్నవారు, ఇటువంటివారు మెజారిటీ ఉన్న పార్టీగాని, పార్టీల కూటమి యొక్కగాని క్రమశహ ఆ పార్టీ శాసన సభ్యుల చేత

ఎన్నుకోబడినట్లైతే, వారు రాష్ట్రప్రజల, దేశ ప్రజల ఇష్టాన్నే అభివ్యక్తం చేయకపోవచ్చు. ఉదా॥543 సభ్యులున్న లోక్‌సభలో కాంగ్రెస్‌కు కేవలం 145 సీట్లు మాత్రమే ఉన్నాయి. అందులో 73 మంది MP ల మద్దతు పొందిన వారి ఆ పార్టీకి పార్లమెంటరీ నాయకుడై దాని నాయకత్వంలో ఉన్న కూటమి ద్వారా ప్రధానమంత్రి అవ్వవచ్చు. ఇది మెజారిటీ ఓటర్ల తీర్పు మాత్రం కాదు. దీనికి ప్రత్నామ్నాయంగా ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి పదవులకు ప్రత్యక్ష ఎన్నికలుంటె మెజారిటీ ప్రజాభిప్రాయం ప్రకారం మాత్రమే ముఖ్యమంత్రిగా కాని, ప్రధానమంత్రిగా కాని అవ్వగలుగుతారు. అప్పుడే వారి అధికారానికి సమర్థనీయమైన ప్రజాబలం ఉన్న అర్హత ఉంటుంది. ప్రత్యక్ష ఎన్నికలు ఉన్నట్లైతే దేవగౌడ, ఐ.కె.గుజ్రాల్, చంద్రశేఖర్, వి.పి. సింగ్ వంటి వారు ప్రధానమంత్రులయ్యే వారు కాదు కదా. దేశమంతటా పలుకుబడి ఉన్నవారే బలం కలిగిన ప్రధానమంత్రిగా ఎన్నుకోబడేవారు, అలాగే ముఖ్యమంత్రికూడా రాజ్యాంగాన్ని సవరించి, ఇటువంటి ప్రత్యక్ష ఎన్నికలను పెట్టినట్లైతే చాలా మంచిది.

**4. రిఫెరెండం అంటే ఏమిటండి?**

జ. వివాదాంశమైన ప్రతిపాదననూ, పాలసీని శాసనసభలో బహుమతంతో కాక, సూటిగా ప్రజలచేత నిర్ణయింపబడడాన్ని రిఫరెండమ్ అంటారు. శాసనసభలో ప్రభుత్వ పక్షం ప్రవేశపెట్టిన చట్టంగాని, తీర్మానంగాని వీగిపోతే, ప్రభుత్వం రాజీనామా చేయాల్సి ఉంటుంది. కాని, రిఫరెండమ్‌లో ప్రజల తీర్పు ప్రభుత్వం ప్రతిపాదించిన నిర్ణయానికి వ్యతిరేకంగా ఉంటే, ప్రభుత్వం రాజీనామా చేయనక్కరలేదు. కేవలం, ఆ ప్రతిపాదనను ప్రభుత్వం ఉపసంహరించుకుటుంది. రిఫరెండమ్ అనేది ప్రజల యొక్క సూటి తీర్పు. ఇది బహువాంఛనీయమైన పద్ధతి. ఉదా॥ ఇటీవల యూరోపియన్ యూనియన్ రాజ్యాంగాన్ని ఫ్రాన్స్ ఆమోదించాలా లేదా అనే విషయం ప్రాన్స్‌లోని ఓటర్లకు రిఫరెండమ్ ద్వారా ప్రతిపాదించారు. ప్రజలు దాన్ని తిరస్కరించారు. కాబట్టి ఫ్రాన్స్ ప్రభుత్వం యూరోపియన్ యూనియన్ రాజ్యాంగాన్ని ఒప్పుకోలేదు. ప్రభుత్వం రాజీనామా చేయలేదు. ప్రజాభిప్రాయం మన్నింపబడింది.



**5. బి.ఎస్.ఎన్.ఎల్ సిబ్బంది ల్యాండ్ ఫోన్ల బాగు చేయడంలో చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫిర్యాదు చేసి నెలలు గడిచినా స్పందించడం లేదు. ఇట్టి సందర్భాలలో ఫోన్ వినియోగదారులకు దారేది? కనీసం రెంటల్ ఛార్జీలో మాఫీ కూడా ఉండటం లేదు. కనుక బి.ఎస్.ఎన్.ఎల్ కిందిస్థాయి సిబ్బందిపై చర్యలు ఏవిధంగా తీసుకోవాలి. నెలల తరబడి మూగవోయిన ఫోన్ల విషయంలో రెంటల్ మాఫీ కోసం ఎవరిని ఆశ్రయించాలి?**

జి. అశోక్ గోధూర్, కరీంనగర్

జ. ప్రతి జిల్లాలోనూ భారత్ సంచార్ నిగమ్ BSNL కి జనరల్ మేనేజర్ ఉన్నారు. ఆ నిగమ్ నియమాల ప్రకారం టెలిఫోన్ సేవకు కొన్ని రోజులకు మించి అంతరాయం జరిగితే ఫోన్ అద్దెను రద్దు చేయాలి. కాబట్టి జనరల్ మేనేజర్‌గార్ని ఆశ్రయించాలి. అక్కడ ప్రతిస్పందన లేకపోతే బి.యస్.యన్.ఎల్. నిర్వహిస్తున్న టెలిఫోన్ అదాలత్‌లోకి తీసుకువెళ్ళవచ్చు.

**6. పాఠశాలల్లో స్కూల్ అసెంబ్లీ సమయంలో పాడిస్తున్న గీతాలతో పాటు ప్రతిజ్ఞ కూడా చేయిస్తున్నాము. అయితే ఈ ప్రతిజ్ఞను ఎవరు రచించారు? తెలియజేయగలరు?**

జ. సభా సమయంలో అన్ని స్కూళ్ళల్లోనూ ఒకే పాట ఉండడంలేదు. కాబట్టి ఏది, ఎవరు వ్రాశారో చెప్పడంకష్టం. అదే విధంగా అన్ని స్కూళ్ళు ప్రతిజ్ఞ చేయించడం లేదు! పాటల వల్ల కొంత అవగాహన కొంత స్ఫూర్తి రావచ్చుగాని, ప్రతి దినం, ప్రతిజ్ఞ చేయించడం మూలాన, దాని యొక్క విలువ తగ్గిపోతుందనుకుంటాను. మంత్రులు, గవర్నర్‌లు శాసన సభ్యులు ప్రతిజ్ఞలు తీసుకుంటున్నారు. వాటిని ఇసుమంతైనా పాటించడం లేదాయె. ఇటువంటి సందర్భంలో ప్రతిజ్ఞ చేయించడం వంచనను సామాన్యం చేయడం అవుతుంది.

**7. జాతీయ పతాకాన్ని ఎవరూ అవమాన పరచరాదు, అట్లా చేస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటారా? అట్లా చర్యలు చేపట్టితే ఆగస్టు మొదటి వారంలో జరిగిన ఇండియా – శ్రీలంక క్రికెట్ మ్యాచ్‌లో తలక్రిందులుగా జాతీయ పతాకం కట్టారు. ఇది అవమాన పరచినట్లు కదా! దీనిపై మీ స్పందన ఏమిటి?**

పి. సురేష్‌బాబు, మంగమ్మపల్లి

జ. జాతీయ పతాకాన్ని కావాలని అవమానించే వాళ్ళు చాలా తక్కువ మంది ఉంటారు. తెలియక తల క్రిందులుగా ఎగరవేసినట్లైతే తప్పేకాని, నేరమని మనం అనుకోకూడదు. కొన్ని కొన్ని సందర్భాల్లో మనదేశంలోని కొన్ని సముదాయాలు మన జాతీయ పతాకాన్ని కావాలని అవమాన పరుస్తారు. అటువంటి వారిని మాత్రం కఠినంగా శిక్షించాల్సిందే.

**8. నేటి రాజకియాలను చూస్తే మీకు ఏమనిపిస్తుంది?**

ఆర్. రామరాజు భీమవరం

జ. రాజకీయం యొక్క పరమావధి ప్రజా శ్రేయస్సు, రాజకీయ నాయకులు ప్రజలకు ప్రతి విషయంలో సరైన అవగాహన కల్పించాలి. వారికి ప్రతి సమస్య పూర్వాపరాలు పరిష్కారానికి సాధక బాధకాలు, దీర్ఘకాలిక ప్రయోజనాలు, తాత్కాలిక కష్టాలు ఇవన్నీ బోధించాలి. అలా ప్రజల్ని విద్యావంతులుగా, వివేకవంతులుగా, విచక్షణా వంతులుగా చేయకుండా, శుష్కవాగ్దానాలతో మోహింపచేసి, ఓట్లు పొంది, మరే పనికి అర్హత గాని, సామర్థ్యంలేని వారందరూ కూడా రాజకీయాల్లో దిగి, దాన్నే వృత్తిగా చేసుకుని తద్వారా సంపన్నులవడం అధికాధికంగా మనం చూస్తున్నాం. నాలుగైదు దశకాలకు ముందు రాజకీయం ద్వారా తమ సంపత్తిని పోగొట్టుకున్న వారు ఎక్కువ. ఈ కాలంలో రాజకీయ వృత్తి ద్వారా ప్రభుత్వాంగాన్ని ఉపయోగించుకొని, తమ పేదతనాన్ని వీడి, కోటీశ్వరులవడం చూస్తున్నాం.

**9. "ఇండియా" అనే పదం ఎలా వచ్చింది?**

**పి. రామశాస్త్రి, కాకినాడ**



జ. ఏ భారతీయ భాషల్లోకూడా ఇండియా అనే పదం లేదు. 14వ శతాబ్దం వరకూ హిందు అనే శబ్దం మనదేశస్థులు వాడలేదు. మనది భారతదేశమని మనం భారతీయులమని మన సాంస్కృతిక విశ్వాస సంహిత సనాతన ధర్మమని, మన పూర్వులు వక్కాణించారు. విదేశీయులు మన దేశం మీద ఆక్రమణ చేసినవారు విశేషించి బ్రిటీష్‌వారు మన దేశాన్ని ఇండియా అన్నారు. ఈ విధంగా పరదేశీయులు, పాలిత దేశాల పేర్లు మార్చారు. కాని స్వాతంత్ర్యం పొందిన పిదప ఆత్మగౌరవమున్న దేశాలన్నీ తమ ఐతిహాసిక నామాన్ని తిరిగి పెట్టుకున్నారు. ఉదా॥ సీలోన్‌॥ శ్రీలంక, గోల్డ్‌కోస్ట్– ఘనా, బర్మా– మయిన్మార్, రాదేషియా– జింబాబ్వేగా పునః నామకరణం చేసుకున్నాయి. మనం భారత అనే పదం వాడితే "లౌకిక వాదానికి" ముప్పు వస్తుందని భయపడుతున్నాం.

**10. నేడు చదువుకునే పిల్లలకు 'సిలబస్' పెంచి, అధికభారము పిల్లలపై రుద్దడం మంచిదా?**

యన్. నళిని కుమురి, ఎలూరు

జ. చదువుకునే పిల్లలకు, సిలబస్, పుస్తకాలు భారమైపోతున్నాయనేది ఒక నినాదం. కాలక్రమేణా తెలుసుకోవలసిన విషయాలు, ఎక్కువౌతున్నాయి. అలాగే ఎలా తెలుసుకోవాలి అనే స్వయంశక్తిని కూడా పెంపొందించవలసిన అవసరం, ఇందుమూలాన పాఠ్యాంశాలు ఎక్కువగా ఉండటం సహజమే. ఇలా కాదనడం కేవలం పాప్యులిజం మాత్రం అవుతుంది. అంటే తాత్కాలిక ప్రీతిని ఇచ్చే చేష్ట. చిరకాల శ్రేయస్సుకు ఇది వ్యతిరేకం. ఎక్కువ చదివి నష్టపడ్డవారు లేరు. తక్కువ చదివి సర్టిఫికెట్లు, డిగ్రీలు సంపాదించుకోవచ్చుకాని, సమర్ధతను, అర్హతలను మాత్రం పొందలేం.

**11. చాలామంది ప్రతిభావంతమైన విద్యార్థులలో కూడా సమాజ అవసరాలపట్ల అవగాహనలేదు ఎందువలన?**

జ. తల్లితండ్రులు గాని, గురువులు గాని, సామాజిక స్పృహను వ్యక్తి యొక్క బాధ్యతలను సంస్కృతిని శిష్ట ఆచార వ్యవహారాలను బోధించడం లేదు. శ్రీరాముడు,

ధర్మరాజు, హరిశ్చంద్రుడు, శ్రవణకుమారుడు, ఏకలవ్యుడు, రాణా ప్రతాప్, శివాజీ, గురుగోవింద్, లోకమాన్యతిలక్, స్వామి వివేకానంద, ఇటువంటి మహాపురుషుల చరిత్రను చెప్పకుండా ఉండటం మూలాన మనలో సరియైన మానవత్వం, వ్యక్తిత్వం సామాజిక స్పృహ లేకుండా పోతున్నాయి. ధన దాహం మాత్రమే ఎక్కువౌవుతుంది. చివరకు తల్లితండ్రులపట్ల, సోదరుల పట్ల తమ విధులను విస్మరించే వారిగా తయారౌతున్నారు. ఇంకా సమాజ కళ్యాణం గురించి ఎలా అవగాహన వుంటుంది.

**12. సోమరి సంఘద్రోహి అనుటలో అతిశయోక్తి లేదనుకుంటాను? మీ అభిప్రాయమేమి?**

సి. శ్రీశైలం, కాజ

జ. సోమరి, సంఘద్రోహి అనేది నూటికి నూరుపాళ్ళు సత్యం. సోమరుల ఓటుకోసం, వారి హక్కులను గురించి మాత్రమే చెప్పేవారు, వారి విధులను గురించి చెప్పనివారు సోమరులతో పాటు వారూ సంఘద్రోహులే.

## నవంబర్ 2005

**1. విషయానికే ప్రాధాన్యం. ఒక వేళ స్పెల్లింగ్ తప్పులు వచ్చినా విషయంలో ఖచ్చితత్వం ఉంటే తప్పులకూ మార్కులు తగ్గించరు. ఇది సిబిఎస్ నిర్ణయము. ఇది సరైన నిర్ణయమా? చిన్నతనంలో పిల్లలు వ్రాసే తప్పులు సరిచేయకపోతే ఎట్లా?**

కె.బి.కె, హైదరాబాద్

జ. ఏ వ్యక్తి అయినా తన ఆలోచనను జ్ఞానాన్ని ఇతరులకు చెప్పవలసి వచ్చినప్పుడు వ్రాతను గానీ, భాషను గానీ, ఉపయోగిస్తాడు. అక్షర శుద్ధి, ఉచ్ఛారణ, వాళ్ళకివి చాలా అవసరం. ధ్వని ఒక్కటైనా ఇంగ్లీషులో స్పెల్లింగ్‌ను బట్టి అర్థం వేరుగా వుంటుంది.



ఉదా : Site - అంటే స్థలము, Sight అంటే దృష్టి Cite అంటే ఉదహరించడం.

ఈ శబ్దాలకు స్పెల్లింగ్ అర్థం వేరు. ఒకే ధ్వనిలో ఉన్న శబ్దాలకు స్పెల్లింగ్ ప్రాధాన్యత ఎంతో వుంది. అలాగే తెలుగులో వత్తులు, గుడింతాలు చాలా ముఖ్యం. వీటిని సరిగా నేర్చుకోవటం కూడా విద్యలోని అంశమే. రాసే తప్పులను సరిచేయవలసిన వారు మార్కులు వేసే వారు కాదు. చదువు చెప్పేవారు, నేర్చుకునేవారు బాధ్యులు.

**2. ఇంటర్ విద్యలో సంస్కరణలు అవసరమా?**

జ. ఒక ఇంటర్ విద్యలోనే కాదు, ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత విద్యల్లో కూడా కాలానుగుణంగా పెరుగుతున్న జ్ఞాన విజ్ఞానాల దృష్ట్యా, పరిరక్షింప వలసిన విలువల దృష్ట్యా సంస్కరణలు అవసరమే. కాని ఎటువంటి సంస్కరణలు కావాలి. ఇందులో ఏకాభిప్రాయం లేదు. ఎన్నో సంస్కరణ సమితులను ప్రభుత్వాలు ఏర్పరచాయి. వారు రిపోర్టులు ఇచ్చారు. కొన్ని అంశాలు ఆమోదింపబడి అమలు చేయబడ్డాయి. అన్నింటికన్నా ముఖ్యంగా తల్లితండ్రుల శ్రద్ధ, ఉపాధ్యాయులు విద్యార్థులను గుణవంతులుగా, జిజ్ఞాసులుగా తీర్చిదిద్దటానికి అంకితమవడం; విద్యార్థులు, ఇతర వ్యాసంగాలయందు చిక్కుబడక దీక్షతో చదవటం అవసరం.

**3. జాతీయ వాదమంటే ఏమిటి? జాతీయ వాదులపై మీ అభిప్రాయమేమిటి?**

ఆర్. లక్ష్మినారాయణ, కదిరి

జ. జాతీయ వాదం అంటే తమదేశంలో వున్న ప్రజలందరి యందు సౌభ్రాతృత్వం చూపడం, దేశ అఖండతను, ప్రజల ఐక్యతను కాపాడటం, ప్రకృతి సిద్ధమైన దేశములోని వనరులను సమీకరించి సంపదను పెంపొందించి మన చరిత్రను, మన వారసత్వాన్ని, మన సాహిత్యాన్నీ, మన సంస్కృతినీ పెంపొందించుకోటం, మన దేశం మీద ఆక్రమణ చేసేవారిని, మన సంపదను

హరించదలుచుకున్న వారిని గుర్తించి ప్రతిఘటించటం, మన మేధాశక్తిని ఉపయోగించి దేశ భద్రతా శక్తులను పటిష్టం చేయటం.... ఇవన్నీ జాతీయవాదం యొక్క అంగాలు.

మన జాతిని మేల్కొలిపిన స్వామి దయానంద, స్వామి వివేకానంద, లోకమాన్య తిలక్, నేతాజీ సుభాష్ చంద్రబోస్, సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి వ్యక్తులను స్మరించి, వారి జీవితాల నుంచి స్ఫూర్తిపొందితే మనజాతీయత పెరుగుతుంది.

**4. ఓటు విలువ తెలియని ఓటర్లు అధికంగా గల దేశంలో ప్రజాస్వామ్యానికి అర్థం కలదా?**

ఎస్. రాజారావు, గుడివాడ

జ. వయోజన ఓటింగ్‌ను గురించి మన రాజ్యాంగ సభలో ఎంతో చర్చ జరిగింది. దూరదృష్టి కలిగిన నాయకులు వయోజన ఓటింగ్ హక్కును గూర్చి చాలా అనుమానాలు తెలిపారు. స్వాతంత్ర్యం రాకముందు కొంత విద్యార్హత సంపత్తి అర్హత, పన్ను చెల్లింపును బట్టి పరిమితమైన వ్యక్తులకే ఓట్లు ఉండేవి. చివరకు చాలా చర్చ తరువాత రాజ్యాంగాన్ని వ్రాసినవారు, వయోజన ఓటు హక్కువైపు మొగ్గారు. నిరక్షరాస్యులకు, బాధ్యత, పరిశ్రమల విలువ తెలియనివారికి వయసును బట్టి ఓటు హక్కు ఇవ్వడం మూలాన మన ప్రజాస్వామ్యం మోసగాళ్ళు, నేరచరితులు, శుష్కవాగ్దానాలు చేసి, పేదలను మభ్యపెట్టి, అధికారం చేజిక్కించుకుని, మన సంపదను కొల్లగొట్టే వారి చేతుల్లోకి పోతోంది. దేశం విచ్ఛిన్నమయ్యే పరిస్థితి వస్తోంది. కులపోరాటాలూ, వర్గపోరాటాలూ, మతవైషమ్యాలూ ప్రవర్థితమై, మన అభివృద్ధి కుంటుపడుతోంది. మన ప్రజా ప్రతినిధులు, చట్టం చేసేవారు కొంతమంది నిరక్షరాస్యులు; 25 శాతంపైన కొన్ని రాష్ట్రాల్లో నేరచరితులే యం.యల్.ఏలు.

**5. మన రాష్ట్రం ఏర్పడి 5 పదులు దాటినది కదూ? మనం ఎలాంటి ప్రగతిని సాధించాము? రతనాల సీమగా పేరు పొందిన రాయలసీమ నేడు రాళ్ళసీమగా మారటానికి కారణమేమిటంటారు?**

ఎల్.కె. రావు, అనంతపురం



జ. ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావం తరువాత మనం చాలా అభివృద్ధిని సాధించాం. ఎన్నో విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, ఏర్పడ్డాయి. ఎన్నో నీటి పారుదల పథకాలు పూర్తి అయ్యాయి. మనకు కావలిసినదాని కన్నా ఎక్కువ ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేస్తున్నాం. ఎన్నో పరిశ్రమలు వచ్చాయి. ప్రజల సంక్షేమం కోసం, విశేషించి బడుగు వర్గాలకై ఎన్నో ప్రణాళికలు అమలు చేస్తున్నాం. అయినా చేయవలసింది ఇంకా ఎంతో ఉంది. అభివృద్ధికి వెనుకబడిన తెలంగాణా, రాయలసీమల్లో ప్రత్యేక శ్రద్ధను తీసుకుని పేరుకుపోయిన వెనుకబడిన తనాన్ని నిర్మూలించడం కోసం చాలా కృషి చేయవలసి వుంది. ఆ ప్రాంతపు ప్రజా ప్రతినిధులు చిత్తశుద్ధితో ప్రజలను సమీకరించి వారికి విద్య అపరిమిత ప్రయోజనాలను చెప్పి, దీర్ఘకాలిక ప్రజోపయోగకర ప్రణాళికలను అమలు చేసినట్లయితే, తెలంగాణా మాగాణిగా, రాయలసీమ రతనాల సీమగా మారుతూ వుండేది.

**6. మంత్రులకు కూడా ఒక నిర్ణీతమైన క్వాలిఫికేషన్, వయోపరిమిత వుండాల్సిన అవసరం లేదంటారా?**

వి.ప్రభాకర్ విశాఖపట్నం.

జ. ఒక్క మంత్రులకే కాదు, ప్రజా ప్రాతినిధ్యం వహిస్తున్న మునిసిపల్ కార్పొరేటర్లకు, మండల జిల్లా పరిషత్ సభ్యులకు, యం.ఎల్.ఎ, యం.పిలకు కూడా కనీస విద్యార్హత లుండవలసిందే. కాని ప్రజాస్వామ్యానికి కొలతలు ప్రమాణాలు లేకపోవడం మూలాన, కుల, ధన, బలాలు, అనువంశికం, కండబలం వున్నవారు ఎన్నికవుతున్నారు. చచ్చే వరకు పదవుల్లో కొనసాగాలనుకుంటున్నారు. మొన్నటి మునిసిపల్ ఎన్నికల్లో 30 కౌన్సిలర్లలో 11 మంది నిరక్షరాస్యులు, వీరు ఏమీ చదివి ఏ విధంగా నియమాల్ని చట్టాల్ని చేస్తారో మనకు ఊహాతీతం.

**7. జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ దీని భావమేమిటి?**

జ. స్వర్గం రమణీయంగా వుంటుందని, సుఖ సౌఖ్యాలు తప్ప కష్టాలు వుండవని, కోరుకున్నదల్లా దొరుకుతుందని అందుచేత అందరూ దాన్ని కాంక్షిస్తారు

అని విశ్వాసము. కాని స్వర్గ నరకాలు వున్నాయో లేవో చూసినవారు, అనుభవించి వచ్చి మనకు చెప్పిన వారు లేరు. తల్లి ప్రేమ, తల్లి త్యాగం, తల్లి ఆలనా పాలనా అనుపమానమైంది. అమూల్యమైనది. అదే విధంగా జన్మభూమి మన మనుగడకు, మన సిరి సంపదలకు, మన ఆరోగ్య ఆజీవికలకు ఆధారము, తల్లి ఏ విధంగా మనల్ని పోషించి, రక్షిస్తుందో, మనకోసం ఎన్ని కష్టాలైనా ఓర్చుకుంటుందో, అలాగే మన జన్మభూమికూడా. మన జన్మభూమిలోని నదీనదాలు, సరస్సులు, పశుపక్ష్యాదులు అన్నీ మన జీవితంతో మన ఆరోగ్యంతో, మన భుక్తితో అవినావభావ సంబంధం కల్గినవి. అందుకనే మన తల్లి, మన జన్మభూమి స్వర్గం కంటే మిన్న, గౌరవనీయమైనవి, ఆదరణీయమైనవి ప్రియతమమైనవి. తల్లినెలా ప్రేమించి, గౌరవించాలో, అలాగే జన్మభూమిని కూడా ప్రేమించాలి, కాపాడాలి.

ఈ అమూల్యమైన సూక్తి శ్రీరామ చంద్రుడు, లక్ష్మణునితో చెప్పారు. రావణ వధానంతరం లక్ష్మణుడు విభీషణుడు కలిసి లంకలో అక్కడి భోగభాగ్యాలను అనుభవిస్తూ కాలం గడుపుతుంటే శ్రీరాముడు లక్ష్మణుడిని చేరదీసి ఇలా అన్నారు.

"అపి స్వర్ణమ యి లంక, నమే రోచతే లక్ష్మణా"

జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి,

అంటే లంకలో సకలసౌభాగ్యాలు, సౌందర్యము తదితర ఆహ్లాదాన్నిచ్చే సంపదవున్నప్పటికీ, తల్లి, జన్మభూమి కంటే ఇవేమీ గొప్పకాదు. స్వర్గాన్నే మించిన వారు, తల్లి, జన్మభూమి. కనుక మనం వెంటనే అయోధ్యకు వెళ్ళాలి అని అన్నారు. ఇటువంటి స్ఫూర్తితోనే పూర్వం కచుడు శుక్రాచార్యుల వద్ద (నేటి అమెరికన్ విశ్వవిద్యాలయాల్లో వలె) తను కోరుకున్న మృతసంజీవని విద్యను నేర్చుకొన్న తరువాత (బయోటెక్నాలజీలో Ph.D ని పొందిన తరువాత) అక్కడున్న ప్రలోభాలకు అనగా త్రిలోక సుందరి అయిన దేవయాని ప్రేమవలయంలో చిక్కుకోక, తిరిగి తన జన్మభూమికై, దేవలోకానికి, తన ప్రజలయొక్క సేవ కోసం తిరిగి వచ్చాడు.



## డిసెంబర్ 2005

**1. ప్రస్తుతం ఉన్నవారు చదివించే జూనియర్ కాలేజీలను కార్పోరేట్ కాలేజీలు అంటున్నారు కదా! అసలు కార్పోరేట్ కాలేజీలు అంటే ఏమిటి? 'కార్పొరేట్' పదానికి అర్థమేమి?**

జనార్ధన్, భీమగల్, నిజామాబాద్

జ. ప్రభుత్వం కాక, ప్రైవేట్ వ్యక్తులు, వారు పెట్టుకున్న కంపెనీలు, విద్యా సంస్థలను నడుపుచున్నారు. అవి జూనియర్ కాలేజీలు, ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలు కావచ్చు. వాటన్నిటిని కార్పొరేట్ కాలేజెస్ అంటారు. కొంతమంది ట్రస్టులుగా, కొంతమంది సొసైటీలుగా, కొంతమంది ప్రొప్రైటరీ కంపెనీలుగా వాటిని రిజిస్టర్ చేస్తున్నారు. కంపెనీల్లో కూడా నాట్‌ఫర్ ప్రాఫిట్ అంటే లాభానికి కాని కంపెనీలు కూడా చట్ట ప్రకారం ఉన్నాయ్. కార్పోరేట్ అనే పదం ప్రభుత్వేతర విద్యా సంస్థలకు వాడుతున్నాం.

**2. ప్రస్తుతం రాజ్యాంగం ప్రకారం మనకున్న ప్రాథమిక హక్కులెన్ని? అవి ఏవి? ఇటీవల సమాచార హక్కును చట్టపరం చేశారు. గతంలో ప్రాథమిక హక్కుల నుండి ఆస్తిహక్కును తొలగించారు. తాజాగా ఉన్నటువంటి ప్రాథమిక హక్కులు ఎన్ని? అవి ఏవి?**

జ. మన రాజ్యాంగానికి దాదాపు 100 సవరణలు ఇంత వరకు చేసారు. అధునాతక ముద్రణ, 'లా' పుస్తకాలు అమ్మే దుకాణంలో కనుక్కొని సమగ్రమైన జ్ఞానాన్ని పొందవచ్చు. ఒక హక్కులే కాదు. మన రాజ్యాంగంలో పౌరుల బాధ్యతలను కూడా చేర్చారు. రాజకీయ పార్టీలు మాత్రం వాటిలో ముఖ్యంగా వామపక్షీయులు, ఒక హక్కుల గురించి మాత్రమే ప్రజలను ఉద్రేక పరుస్తారుగాని, తమ బాధ్యతలను విధులను గూర్చి మాత్రం చెప్పరు. అందుకే అరాజకత, వర్గవైషమ్యాలు పెరుగుతున్నాయి.

**3. ప్రభుత్వం వారు ఎండోమెంట్ డిపార్ట్‌మెంటును ఏర్పాటు చేయడానికి గల కారణం ఏమిటి? ఆలయ భూములన్నీ అన్యాక్రాంతమయినా, కొన్ని దేవాలయాలు మూతపడే స్థితికి వచ్చినా వారు ఎందుకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు? ఏ ఇతర మత ఆలయాలకు లేని ప్రభుత్వ ఆధిపత్యం ఒక్క హిందూ సంస్థలపై మాత్రం ఎందుకు? వివరింపగలరు?**

పి. అశోక్ కుమార్, ఒంగోలు

జ. దాదాపు వంద సంవత్సరాల క్రితం మన దేవాలయాల నిర్వహణ అవుతుందనీ, యాజమాన్యం పారంపర్యంగా వ్యక్తుల ద్వారా మతపరమైన మఠాల ద్వారా జరుగుతుండేవి. వాటి సంపత్తి దుర్వినియోగం అలా జరక్కుండా చూడడటం కోసం, ఆ నిర్వహణ యాజమాన్యాన్ని ప్రభుత్వమే తమ ఆధీనంలోకి తీసుకుని ఎండోమెంట్ డిపార్టుమెంటు ద్వారా యజమాన్యాన్ని నిర్వహిస్తోంది. ఇది బ్రిటీష్‌వారి కాలంలో ఒక దురుద్దేశంతో జరిగినా, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత సనాతన ధర్మమునందు విశ్వాసం భక్తి శ్రద్ధలు లేనివారు పాలకులుగా ప్రభుత్వ ఉద్యోగులుగా హిందూ దేవాలయాల ఆస్తులను ఇతర సంపత్తిని దుర్వినియోగం చేస్తున్నారు. ఈ ఎండోమెంట్ డిపార్టుమెంటులో మతం మార్చుకొని, ఆ విషయాన్ని కప్పిపుచ్చిన వారందరూ పని చేస్తున్నారు. దేవాలయాలకొచ్చే ఆదాయాన్ని ఇతర మతాల ప్రార్థనాలయాల కోసం ఉపయోగిస్తున్నారు. ఎన్ని అవకతవకలున్నా, ఆస్తులు దిగమింగబడుతున్నా, ఎన్ని దురుపయోగాలు, దుర్వ్యవహారాలు జరుగుతున్నా, క్రిస్టియన్ల చర్చిల మీద వాటి ఆస్తులమీద, వాటి నిర్వహణ మీద, అలాగే ముస్లిముల మసీదులు వక్ఫ్ విషయాల్లో కూడా ప్రభుత్వం పట్టించుకోదు. వీరి యొక్క సెక్యులరిజం హిందూ దేవాలయాలను నష్టపరిచే విధంగా వుంది. ఇతర మతస్థుల ప్రార్థనాలయాల విషయాలలో ప్రభుత్వం నిర్లిప్తత వుంది. మనదేశంలో సాగుతున్న సెక్యులరిజం అర్థం హిందూ వ్యతిరేకత, ఇతరుల సంతుష్టీకరణ అనేది ఎండోమెంటు డిపార్ట్‌మెంట్‌ల ద్వారా వ్యక్తమవుతోంది. అందుకనే చైతన్య వంతులైన ప్రజలు హిందూదేవాలయాల పరిరక్షణకై ఉద్యమిస్తున్నారు.



**4. ఈ రోజుల్లో సెల్‌ఫోన్ వినియోగంతో ల్యాండ్ ఫోన్ల వాడకం బాగా తగ్గింది. సెల్‌ఫోన్ల సేవలు చాలా తక్కువకు లభిస్తుంటే ల్యాండ్‌ఫోన్ చార్జీలు, బిల్లులు తగ్గించరెందుకు? ల్యాండ్ ఫోన్లు చిన్న తరగతులవారందరికీ అందుబాటులోకి రావాలంటే బి.యస్.యన్.ఎల్ ల్యాండ్ ఫోన్ సేవలను విస్తృతపరిచి, ఛార్జీలను తగ్గించాల్సివుంది. మీరు నాతో ఏకీభవిస్తారా?**

జి. అశోక్ గోదేర్

జ. సెల్‌ఫోన్ల నెట్‌వర్క్ స్థాపించడానికి కావలసిన పెట్టుబడి నిర్వహణ వ్యయం ల్యాండ్ ఫోన్ సిస్టంలో పదోవంతు మాత్రమే. అందుకనే సెల్‌ఫోన్ ధరలూ, కాల్ చార్జీలు నానాటికీ తగ్గిపోతూ అధికాధిక ప్రజల అందుబాటులోకి వస్తున్నాయి. ప్రతి వారి చేతిలోను సెల్‌ఫోను వుండగలిగితే ల్యాండ్‌ఫోన్ అవసరం తగ్గిపోతుంది. ప్రపంచంలో ఇతర దేశాల్లో వలే భారతదేశంలో కూడా చాలా మంది ల్యాండ్‌పోన్ వదిలేసి సెల్‌ఫోన్ తీసుకుంటున్నారు. భారత్ సంచార్ నిగమ్ తన ఉత్పాదకతను పెంచి నిజాయితీగా ప్రైవేట్ కంపెనీలతో పోటీ చేసినట్లయితే ధరలు వాటంతట అవే తగ్గిపోతాయి.

**5. ఇటీవల రాష్ట్ర ట్రిబ్యునల్ 2004 జూనియర్ లెక్చరర్ రిక్రూట్‌మెంట్ గూర్చి తీర్పు ఇస్తూ.... ప్రకటించిన నోటిఫికేషన్ సమయానికి మొత్తం ఖాళీలను 2004 జూనియర్ లెక్చరర్ రిక్రూట్‌మెంట్ ద్వారానే భర్తీ చేయాలని తీర్పు ఇచ్చింది. కానీ.... ఒకసారి రిక్రూట్‌మెంట్ పూర్తయిన తరువాత అదే రిక్రూట్‌మెంట్‌లో పరీక్షరాసిన అభ్యర్థులను మెరిట్ ఆపరేట్ చేయరాదని ప్రభుత్వం జివో(81) జారీ చేస్తూ వెయిటింగ్ లిస్టును రద్దు చేసిందని తెలింది. మరి ఇంటర్వ్యూలకి వెళ్ళిఉద్యోగం రానివారి సంగతి ఏమిటి?**

వి.సి.హెచ్. శేఖర్, మందాడ

జ. ప్రభుత్వం ఇచ్చే ఆర్డర్‌లు చాలాసార్లు కొంతమంది ప్రయోజనాలకోసం వున్నట్లుగా వ్యక్తమవుతోంది. నీతి, నిజాయితీ, పారదర్శకత, నిష్పక్షపాతం వంటివి లేకపోవడం, తమను బలపరిచే వర్గాలకు లాభం చేయటం అనే విషయాలు

ప్రభుత్వం ఇచ్చే ఆదేశాలను అధర్మభూయిష్టంగా చేస్తున్నాయి. ఉద్యోగం రానివారు తమ అర్హతను పెంచుకుని తిరిగి ప్రయత్నించాలి. తమకు అన్యాయం జరిగిందనుకుంటే కోర్టుకెక్కాలి.

**6. ప్రస్తుతం ఉద్యోగులకు సమ్మెహక్కు ఉన్నట్టా? లేనట్టా? గతంలో ఒకసారి సుప్రీంకోర్టు తమిళనాడు కేసులో ఉద్యోగులకు సమ్మె చేసే హక్కు లేదని తీర్పిచ్చింది. ఇటీవల మన రాష్ట్రంలో ఆర్టీసీ ఉద్యోగులు 2 రోజులు సమ్మెచేసి తమ డిమాండ్లను నెరవేర్చుకున్నారు కదా. ఈ విషయంలో మీ అభిప్రాయమేమి?**

పసునూరి మొహన్, మెట్‌పల్లి, కరీంనగర్

జ. ప్రభుత్వోద్యోగులకు సమ్మె చేసే హక్కు లేదనేది నిర్వివాదాంశం. ఇటువంటి తీర్పును హైకోర్టు, సుప్రీంకోర్టులు ఇచ్చాయి. కాని నైతిక సంపద, సత్యనిబద్ధత లేని ప్రభుత్వాలు, మంత్రులూ, ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలకు జడిసి, ప్రభుత్వ ఉద్యోగులు తలచుకుంటే ఎన్నికల్లో తమను ఓడించేయగలరనే భయంతో, కోర్టులు తీర్పునిచ్చినప్పటికీ, ప్రభుత్వ ఆజ్ఞలను కోర్టు తీర్పులను ఉల్లంఘించి సమ్మె చేసినవారికి శిక్షించే ధైర్యం ఏ ప్రభుత్వానికీ లేదు. సమ్మెకు లొంగలేదని చెప్పుకోవడానికి సమ్మె కాలాన్ని సెలవుగా పరిగణిస్తామని చెప్పి ఒక విధమైన ఆత్మ వంచనను చేసుకుంటున్నాయి. ఎన్నో టి.వి ఛానల్స్ మీద జరిగిన చర్చల వల్ల ఇటీవల ఆర్.టి.సి ఉద్యోగులు తమ సమ్మె ద్వారా ఏమీ సాధించుకోలేక పోయారని కేవలం రాజకీయ లబ్ధి కోసమే కొన్ని పార్టీలచేత ఈ సమ్మె చేయించబడిందని తెలుస్తోంది.

**7. మన సమాజంలో నీతి, నిజాయితీలకు స్థానం లేకుండా పోయింది. ఎక్కడ చూసినా పక్షపాతం, అవినీతి, బంధుప్రీతి, లంచగొండితనం రాజ్యమేలుతున్నాయి. ఈ తరుణంలో ఒక ఆదర్శపౌరుడు స్వచ్ఛంగా, నీతివంతంగా, స్వార్థరహితంగా, ఇతరులను మోసపుచ్చకుండా బ్రతకటం సాధ్యమేనంటారా? అలాంటి పౌరులకు మీరిచ్చే సూచనలు ఏమిటి? నీతివంతులకు సమాజం నుండి ఎలాంటి స్ఫూర్తి లభించాలి?**



జ. కేవలం చట్టాల ద్వారా నీతి, ఆదర్శ పౌరసత్వాన్ని స్వార్థరాహిత్యాన్ని, ఇతరులను వంచించకుండా వుండటాన్ని సాధించలేము. ప్రతి వ్యక్తి సచ్ఛీలతను పెంపొందించుకోవాలి. పాపపుణ్యాలను తెలుసుకోవాలి. చట్టానికి పట్టుపడకపోయినా వారి వారి పాపపుణ్యాల ఫలితాలను తప్పక అనుభవిస్తామనే స్పృహతో ప్రవర్తించాలి. లంచం పుచ్చుకోకుండా తమ భాద్యతలను ప్రభుత్వ ఆధిపత్యాన్ని నిర్వహించే వ్యక్తులు ఇంకా వున్నారు. అదే విధంగా వంచన చేయని వ్యాపారస్థులు కూడా వున్నారు. వారు మనకు స్ఫూర్తి ప్రదాతలు, వారిని గౌరవించటం, పురస్కరించటం నేర్చుకోవాలి. అదేవిధంగా భ్రష్టాచారులను సామూహికంగా ఈసడించడం కూడా నేర్చుకోవాలి.

**8. సర్కార్ వైద్యులు ప్రైవేటు ప్రాక్టీస్‌కి ప్రభుత్వం అనుమతి ఇవ్వడం కరక్టేనా?**

ఎన్. మహేష్, నిజామాబాద్

జ. ఇది సబబా కాదా అని నిశ్చయించటం చాలా కష్టం. ఎంతో మంది వృత్తి విద్య కోసమే లక్షలు ఖర్చు చేస్తున్నారు. విశేషించి ప్రైవేట్ కళాశాల విద్యకోసం, మరి వారికి ఖర్చుకు తగిన రాబడి వుండాలి కదా! కాని ప్రభుత్వం ప్రైవేటు డాక్టర్లు సంపాదించుకొన్నంత జీతాన్ని ఇవ్వలేదు. అందుకని కొంతమంది ప్రభుత్వ డాక్టర్లు అసంతుష్టులై సరియైన చికిత్సను చేయక పోవచ్చు.

మరికొంతమంది, విశేషించి నిపుణులు ప్రభుత్వ ఉద్యోగం కోసం రాకపోవచ్చు. వీటన్నిటి దృష్ట్యా ఎవరయితే మెడికల్ కాలేజీల్లో ఫ్రీ మెరిట్ సీట్ పొందారో వారు నిర్భంధంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీసం పదేళ్ళు పని చేయాలని కానిచో వారి రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని నియమం వుంటే బాగుంటుంది.

**9.** పది చదివితేనే పంచాయితీ పదవీ అని కొత్త నిబంధన తేవాలి అని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది మరి అది సమంజసమా?

పి.వి. రావు, నెల్లూరు

జ. చదువులేని వాళ్ళు, ఏ జ్ఞానంతో దేశ, సమాజం హితం కోసం చట్టాన్ని ఎలా చేయగలుగుతారు. ఏ పథకాలను రచించగలుగుతారు. ప్రభుత్వంలో

పనిచేసే ప్యూనులక్కూడా కనీస అర్హతలను నిర్ణయించారు. చట్టాలు వేసే ప్రజా ప్రతినిధులకు కనీస విద్యార్హతలు ఉండాలనే నియమాన్ని మాత్రం చేయలేదు. అందుకనే బందిపోటు దొంగ అయిన పూలన్‌దేవి, అరకొర చదువులున్న కొంతమంది స్త్రీలు, పురుషులు ముఖ్యమంత్రులుగా, దేశానికే అధినాయకులుగా చలామణి అవగల్గుతున్నారు. ఈసురోమని మనుషులుంటే, వెలిముద్రకులు పాలకులైతే దేశమేగతి బాగుపడునోయి అని మనం ఆలోచించుకోవాలి.

**10. విదురనీతి అంటే ఏమిటి?**

జ. మహాభారత కథను వినండి, ఇంకా మంచిది చదవండి. అందులో బడుద్దాయి పుత్రులతో బాధపడుతూ, ధర్మనిష్టులైన పాండవులకు అన్యాయం చేస్తున్నాననే బాధతో, నిద్రలేమితో, వ్యధ చెందుతున్న వృద్ధ ధృతరాష్ట్రునకు, మంత్రియైన విదురుడు బోధించిన నీతిని 'విదురనీతి' అంటారు. మనం అందరం ఆ విదురనీతిని చదవాలి. మన పాలకులు ప్రభుత్వ ఉద్యోగులు మరీ మరీ చదివి, అర్థం చేసుకోవాలి. తమ కార్యాచరణ ఆ నీతిని అనుసరించి ఉండాలనే దీక్షతో పనిచేయాలి.

## జనవరి 2006

**1. ముడుపులిస్తే గాని చట్టసభలలో ప్రశ్నలు వేయని పరిస్థితికి మన ప్రజాప్రతినిధులు వచ్చారు గదా! ఇక దేశ భవిష్యత్ ఏమిటి?**

కె.బి.కె. హైద్రాబాద్

జ. "గొంగట్లో అన్నం తింటూ వెంట్రుకలు ఏరుకోవడం" ఎంత విజ్ఞతను చూపిస్తుందో, లంచగొండితనంతో ఎన్నికలతో సహా అన్ని పనులు జరుగుతున్నప్పుడు, ముడుపులను తీసుకుని ప్రజాప్రతినిధులు ప్రశ్నలు వేయడం వింతకాదు. తమ ఎన్నికకై కోట్లు ఖర్చు పెడుతున్నప్పుడు ఆ పెట్టుబడిని వడ్డీతో సహా వచ్చే ఎన్నికలకు కూడా కావలసిన డబ్బును సమకూర్చుకోవడం, దాంతోబాటు తమ పేదరికాన్ని



కొన్ని తరాల వరకు అధిగమించడానికి సంపాయించటం పరిపాటి అయింది. ముడుపులే లేకపోతే ఏ పనులు జరుగుతున్నాయి? దీనికంతటికీ కారణం పనిచేయకుండా ఆర్జించడం, నీతి నియమాలకు దూరమైపోవడం, ఏలినవారే లంచగొండితనంతో ధనం సంపాదించినా శిక్ష పొందకుండా వుండడం, హత్యలు, ఆత్యాచారాలు, స్మగ్లింగు ఇటువంటి నేర చరిత ఉన్న వాళ్ళు మంత్రులవడం ముఖ్యమైన కారణాలు. విద్యార్థులు, యువత సరియైన విద్యను పొంది, మంచి గుణాలు నేర్చుకుని, దేశభక్తితో, నీతితో కృషి చేసి దుశ్చర్యలను నిర్భయంగా ఖండించి ఎండగట్టగిలిగినప్పుడే మన దేశ భవిష్యత్తు, వ్యక్తుల భవిష్యత్తు, ఉజ్జ్వలంగా ఉండగలదు.

**2. మన దేశములో చదువుకుని తన మేధోసంపత్తిని విదేశాల అభివృద్ధికి ఉపయోగించటమూ న్యాయమా?**

జ. మేధావంతులకు ఒక దేశమే కార్యక్షేత్రం కాదు. ప్రపంచమంతా, ప్రజలంతా వారి మేధోసంపత్తితో లాభం పొందవలసిందే, మన దేశంలో మేధావంతులు అనాదరణకు గురియైనప్పుడు, వ్యాపారాలు, పరిశ్రమలు, స్థాపించడానికి ప్రభుత్వ అంగీకారాన్ని పొందవలసి వచ్చినప్పుడు, ఆ అంగీకారాలు అస్మదీయులకూ ముడుపులిచ్చిన వారికే పరిమితమైనప్పుడు, మేధావంతులు, ఔత్సాహిక వ్యాపారస్థులు ఇతర దేశాల్లో తమ మేధస్సు ద్వారా సొంతంగా సంపాదించుకుంటూ ఆ దేశ అభివృద్ధికి దోహదం చేయడం అన్యాయం కాదు. ఇటీవల మన ఆర్థిక వ్యవస్థ సరళీకృతం చేయబడడం మూలానా ప్రభుత్వ ప్రమేయం తగ్గుతూ ఉండడం మూలానా, విదేశాల్లో గడించి, రాణించిన మేధావులు మన దేశంలో వాణిజ్య సంస్థలను, పరిశ్రమలను, స్థాపించడానికి ముందుకు వస్తున్నారు. మరో విశేషం, ఇతర దేశాల్లో వారు సంపాదించి, గత సం॥లో లక్ష కోట్ల రూపాయలు మనదేశంలోని వారి బంధువులకు, పరిశ్రమల స్థాపనకు పంపించారు. ఇంత మొత్తాన్ని మరే దేశస్థులూ కూడా ఇతర దేశాల్లో సంపాదించి మాతృభూమికి పంపినవారు లేరు.

**3. నిందితుడికి మరణశిక్ష విధించడం పై మీ అభిప్రాయం ఏమిటండీ?**

కె.శ్రీకాంత్, విశాఖపట్టణం

జ. ఘోరమైన నేరాలను చేసిన వారికి మరణశిక్ష విధించవలసిందే. స్త్రీలపై అత్యాచారం, డబ్బుకోసం, కక్షసాధింపుకోసం ఇతరులను చంపడం, దేశద్రోహం, ఉగ్రవాదులకు ఆశ్రయ మిచ్చి మన పార్లమెంటును, మన భవనాలను, అమాయకులను చంపి ప్రజలను భయ భ్రాంతులను చేసే వారికీ, రైళ్ళు, విమానాలను పడగొట్టి సామాన్య ప్రజలను చంపడానికి సహాయ పడేవారికి మరణ శిక్ష ఉండవలసిందే. నేరాలు చేయడానికి పేదరికం, కులవివక్షత, నిరుద్యోగం కారణాలని, కొందరు వాదించి క్షమాభిక్షను ఇమ్మంటున్నారు. ఇది సరికాదు.

**4. జనవరి 1వ తేదీన మనం విషెస్ చెప్పుకొనే సంప్రదాయం ఎప్పటి నుండి ప్రారంభమైనది?**

ఆర్. లలిత, తిరుపతి

జ. జనవరి ఒకటి భారతీయులకు సంబంధించినది కాదు. క్రీస్తు శకాన్ని అనుసరించి రోమన్ రాజులు నెలలకు పేర్లు పెట్టారు. జనవరి ప్రథమ తేదీన, క్రీస్తుశకం ప్రకారం నూతన సంవత్సరారంభం. మనదేశంలో ఎక్కువ ప్రాంతాల్లో దీపావళి రోజున నూతన సంవత్సరారంభం అంటారు. తెలుగు వారికి ఉగాది నూతన సంవత్సరారంభం. పాశ్చాత్యుల విశేషించి ఆంగ్లేయుల సంప్రదాయాలకు కట్టుబడిపోయి జనవరి ఒకటినే నూతన సంవత్సరారంభంగా కాన్వెంట్‌లలోను, ఇంగ్లీషు మాధ్యమంలో చదువుకున్నవారు జనవరి ఒకటికి మహత్తునిస్తారు. కాని, సామాన్య భారతీయులకు ఇటువంటి విషెస్‌తో సంబంధం లేదు.

**5 ఒక రాష్ట్రం లేదా దేశం త్వరగా అభివృద్ధి చెందాలంటే అంతర్గత శాంతి భద్రత విషయంలో మంచి ఫలితాలు సాధించాలి. అలాంటి శాంతి రక్షణ బాధ్యత పోలీసులపై ఉంది. అయితే పోలీసులపై ప్రజలకు నమ్మకంలేదు. కారణం పోలీసు డిపార్టుమెంటు లోపమా? లేక ప్రజలు పోలీసులపై అవగాహన లేకపోవడటమా తెలపండి.**

పి. లక్ష్మి, అమ్మక్కపేట



జ. ప్రభుత్వంలోకి వచ్చిన పార్టీలు తమకు సహాయం చేసిన మంది మార్బలాలను పోలీసులుగా ఎంపిక చేస్తున్నారు. కనుక వారు పక్షపాతులై వ్యవహరిస్తున్నారు. ఉద్యోగం కోసం, పోస్టింగ్‌కోసం, ప్రమోషన్ కోసం, ముడుపులు చెల్లించవలసివస్తోంది. మంత్రులు తమ ఇష్టారాజ్యంగా పోలీసులను, ఐఏఎస్ ఆఫీసర్లను బదిలీచేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఆరునెలలకు మించి ఒకే స్థానంలో పనిచేసే పోలీసులు లేరట. ఇటువంటి వ్యవస్థలో పోలీసులు ప్రజలకోసం ఏం న్యాయం చేయగలుగుతారు! ప్రతి సిఎం, ప్రతి పార్టీ అన్ని నేరాలకు, అన్ని అన్యాయాలకు పోలీసులే బాధ్యులు అంటూ చిత్రీకరిస్తుంటే, వారు మాత్రం సహించగలరా! మన ప్రభుత్వ, సమాజ, పార్టీ వ్యవస్థలలో ఇంతకుళ్ళు ఉన్నప్పటికీ చాలామంది పోలీసులు చట్టబద్ధతతో, శాంతి భద్రతల రక్షణకు ప్రయత్నం చేస్తుండటం మూలానే మనదేశం సమగ్రంగా ఉంటోంది. పోలీసుల్ని మన మిత్రులుగా చూడాలి. మన బంధువులుగా పరిగణించాలి. వారు కూడా ప్రజాసేవ కోసం, ప్రజారక్షణ కోసం పనిచేయాలనే దీక్షతో ఉండాలి.

**6. గాంధీజీ, మార్క్స్ సిద్ధాంతాలలో ప్రధాన వ్యత్యాసం ఏమిటి?**

సి.నళినీ కుమార్, కరీంనగర్

జ. గాంధీగారు, వర్గపోరాటంను, హింసను నిరసించారు. లక్ష్యమేకాదు, లక్ష్యసాధన మార్గం కూడా నీతియుతమై ఉండాలి అన్నారు. ఉన్నవారి సంపదను పంచిపెట్టడం కన్నా, లేనివారిని సంపాదించుకునే శక్తిని కల్పించాలని అన్నారు. రాజకీయ పక్షాలు, అబద్ధాలతో, సుష్క వాగ్ధానాలతో ప్రభుత్వాధిపత్యం చేపట్టకూడదు. అందరూ పని చేస్తేనే సంపద కలుగుతుందని, నీతి నియమాలకు కట్టుబడి వుంటే జాతి నిర్మాణం జరుగుతుందని చెప్పారు. మార్క్సువాదం ప్రకారం సమాజంలో వివిధ వర్గాలు ఉన్నాయని, కొన్ని వర్గాల ప్రభుత్వాధిపత్యాన్ని సంపాదించే ఇతర వర్గాల శ్రమ సంపదను దోచుకుంటున్నారని, హింసాయుత విప్లవం ద్వారా అటువంటి ప్రభుత్వాలు కూలద్రోచి, కార్మికుల నియంతృత్వ పరిపాలనను సాధించాలని, వర్గ పోరాటం సమ్మెలూ, హింస ప్రయోగాలతోనే

సమాజంలో మార్పు వస్తుందని అంటారు. మార్క్సు వాదులకు బహుపక్షీయ ఎన్నికలలో విశ్వాసంలేదు. మార్క్సిష్టులు ఏలిన, ఏలుతున్న రాజ్యాలలో ఒక కమ్యూనిస్టు పార్టీ తప్ప రెండో పార్టీ ఉండటానికి వీలులేదు. పరిశ్రమలు, ప్రసారసాధనాలు, రేడియో స్టేషనులు, వార్తాపత్రికలు, టివి. ఛానెళ్ళు చివరికి పచారీ కొట్టు గూడా అన్నీ ప్రభుత్వం చేతుల్లోనే ఉంటాయి. ఈ వ్యవస్థను వ్యతిరేకించిన వారిని ప్రజా శత్రువులని శిక్షిస్తారు. గాంధీగారి సిద్ధాంతంలో భావ ప్రకటనకు, వృత్తి ఎంపికకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయడానికి స్వాతంత్ర్యం ఉంటుంది.

**7. మన రాష్ట్రంలో అమరావతిలో జరగనున్న "కాలచక్ర" పూర్వాపరాలు వివరిస్తారా?**

ఎల్. రామకృష్ణ, నగరం

జ. బౌద్ధం ప్రకారం వారిలోని, మేధావులంతా, ఒక క్రమంగా కొన్ని సం॥ల తర్వాత సమావేశమై, సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను గురించి, జీవన పద్ధతిలో వస్తున్న మార్పులను గురించి, సమగ్రంగా ఆలోచించి, బుద్ధుని బోధనలను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతపు సమస్యలకు సరియైన పరిష్కార మార్గం చూపించడం కోసం ఇటువంటి సమావేశాలను ఏర్పరుస్తారు. చక్రం తిరుగుతున్నట్లు కాలం కూడా తిరుగుతోంది. దానితోపాటు క్రొత్త పరికరాలు, క్రొత్త జీవన పద్ధతులు, క్రొత్త సమస్యలు వస్తూవుంటాయి. వేల సం॥ల నాడు ప్రవేశపెట్టిన సాంప్రదాయాలు, ఆచారాలు, విలువలు కాలానుగుణంగా, ధర్మానికి, అనుగుణంగా మారాలి. కాలానికి తగిన మార్పును తీసుకురావడం కోసం కాలచక్రం అనే సమావేశం, గోష్ఠి జరుపుతారు. ఇది ఎంతో వాంఛనీయం, ఆచరణయోగ్యం.

**8. ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్ ఎక్కడ వుంది? ఎప్పుడు స్థాపించారు? దాని ఆశయాలు ఏమిటి?**

కె.వి.యన్. రావ్, హైద్రాబాద్



జ. దహేగ్, నెదర్లాండ్స్ యొక్క రాజధానిలో ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్ వుంది. రెండుదేశాల మధ్య వివాదాలను పరిష్కరించడం కోసం ఈ న్యాయాలయం స్థాపించబడింది. ఏదేశాలైతే ఈ సంస్థ స్థాపనకు ఒప్పుకున్నాయో, దాని అజమాయిషీకి కట్టుబడి వుంటామన్నాయో వారి వివాదాలను ఆ కోర్టుకు తీసుకువెళ్ళవచ్చు.

**9. ఉన్నత విద్యలో విదేశీ పెత్తనమా? దేశంలోకి విదేశీ విశ్వవిద్యాలయాలు ప్రవేశిస్తే మన విశ్వవిద్యాలయాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు సీతారాం ఏచూరి అంటున్నారు కదా? వారు అంటున్న మాటలు నిజమేనా?**

కె.వి.ఆర్, బందరు

జ. మన దేశంలోకి విదేశీ మతాలను, విదేశీ రాజకీయనీతులను, విదేశీయులను నాయకులుగా, అధినేతలుగా ఒప్పుకుని, వారికి ఒత్తాసు పలుకుతూ, వారిని అందలమెక్కిస్తున్నారు. విదేశీ విద్యాలయాలు మనదేశంలో ప్రవేశిస్తే మనం తీవ్రంగా నష్టపోతామనటం హాస్యాస్పదం కదా! ఏచూరి గారి పార్టీ నియంతృత్వ పాలన చేస్తున్న చైనాలో ఇంగ్లాండుకు చెందిన రెండు విశ్వవిద్యాలయాలు తమ సంస్థలకు స్థాపించి, చైనీయులకు ఇంగ్లీషు యూనివర్సిటీల సిలబస్ ప్రకారం బోధన చేస్తూ, ఇంగ్లండు డిగ్రీలిస్తున్నారు. మన దేశీయ విద్యాసంస్థలు NIIT, Jain College of Management మొదలగునవి ఎన్నో దేశాల్లో, ఎన్నో భాషల ద్వారా , మన డిగ్రీలను, సర్టిఫికెట్‌లను ఇస్తున్నాయి. విదేశీ విశ్వవిద్యాలయాలు మనదేశంలో వచ్చినట్లైతే, వాటితో పోటీపడి మన విద్యాలయాల స్థాయి పెరగగలదు. పోతే, మనం చూడవలసింది, మనదేశపు సంస్కృతికి మన విలువలకు వ్యతిరేకమైన బోధనలు వారు చేయకుండా ఉండడం.

# ఫిబ్రవరి 2006

## 1. మన తెలుగు భాష, సంస్కృత భాషాజన్యమా?

ఎల్. రామకృష్ణ, నెల్లూరు

జ. తెలుగుభాష సంస్కృత ప్రాకృత జన్యమని నా అభిప్రాయం. కొంతమంది ఇది ద్రవిడ భాషకు చెందిందని. తమిళానికి సోదరి అని అంటారు. కాని, ఒక విషయం నిర్వివాదమైన వాస్తవం. 90%పదాలు సంస్కృత జన్యమే. మన వ్యాకరణం మాత్రం సంస్కృతం నుండి కొంత వేరుగా వుంది. డు,ము,వు,లు,లలో ఏ ఒక అక్షరము సంస్కృత పదానికి చేర్చినా అది తెలుగుపదం అవుతుంది. ఉదా : విశ్వాసం ఇది సంస్కృతం విశ్వాసము ఇది తెలుగు.

## 2. 'వాటికన్' అంటే ఏమిటి? దీని ప్రాశస్త్యమేమి?

ఆర్. రాజయ్య, వరంగల్

జ. రోమన్ కాథలిక్‌ల అత్యున్నత పదాధికారి, గొఱ్ఱెలకు కాపరి. రోమన్ క్రైస్తవులకు భగవంతుని తరపున భాష్యం చేసే రోమన్ క్రైస్తవ ప్రార్థనాలయాలను యజమానించే వ్యక్తి పోప్. ఇతను రోమ్ నగరంలోకొన్ని భవనాల సముదాయపు స్థలానికి భూస్వామి, యజమాని. ఈ భూమి యొక్క విస్తీర్ణం అర్ధచదరపు కిలోమీటర్ కన్నా కొంచెం తక్కువ (0.44 Sq.km) ఈ ప్రదేశాన్ని 'వాటికన్' దేశం అంటారు. దీని జనాభా 824. 91.1% వారందరూ మతాధికారులే. ఈ పోప్ ఆధీనంలో వున్న ఈ చిన్ని స్థలానికి, జనాభాకు ఐక్యరాజ్యసమితిలో ఒక సారభౌమత్వం గల దేశంగా మాన్యత ఉంది. ఈ పోప్ రోమన్ క్రైస్తవ ప్రచారానికి అధికృత భాష్యానికి భగవంతుడు చెబుతున్న సందేశకర్తగా వ్యవహరిస్తుంటాడు. ఈయనే క్రిస్టియన్ మతంలోని రోమన్ శాఖకు కార్డినల్స్‌లను, బిషప్‌లను నియమిస్తాడు. ఈ Vatican Pope కి అపారమైన నిధులు వున్నవి. మతమార్పిడికి, ప్రపంచ వ్యాప్తంగా ఈయన ప్రయత్నిస్తున్నారు. 1999లో మనదేశానికి వచ్చి, మొదటి సహస్రాబ్దంలో



"మనం యూరప్‌లో క్రైస్తవాన్ని స్థాపించాము. రెండవ సహస్రాబ్దంలో అమెరికాల్లో, ఆస్ట్రేలియాలో, ఆఫ్రికాలో క్రైస్తవాన్ని స్థాపించాం. ఇప్పుడే ఆరంభమైన మూడవ సహస్రాబ్దంలో ఆసియాఖండంలోని హిందువులను, బౌద్ధులను, క్రైస్తవులుగా మార్చాలి" అని సందేశాన్ని ఇచ్చిపోయారు. మత మార్పిడి దారులకు అన్ని రకాలైన వనరులను సమకూరుస్తున్నారు. మధ్యయుగంలో ఒక వేయి ఏళ్ళపాటు దేవునిపేర పోప్‌లు చేయని పాపాలు లేవు. వీరిని ఖండిస్తూ ఈ Vatican ఆధిపత్యాన్ని, పోప్‌ను తిరస్కరించిన క్రిస్టియన్‌లను Protestants అంటారు. రష్యాలో వున్న క్రిస్టియన్ చర్చిలో పోప్ పదవిని, అధికారత్వాన్ని గుర్తించరు, చైనాలో ఉన్న కేథలిక్స్ బిషప్‌లు పోప్ చేత నియమించబడడానికి చైనా ప్రభుత్వం సాగనీయదు. పోప్ ప్రమేయం లేకుండానే ఆ దేశంలోని కేథలిక్‌లు వారి మతాధికారులను నియమించుకోవాలి. ప్రపంచంలోని ఇతర దేశాల్లోని కేథలిక్కులందరూ పోప్ గారి భాష్యాన్ని, ఆధిపత్యాన్ని శిరసావహిస్తారు.

## 3. "విద్యార్థి"గా మీ జీవితంలో మరపురాని సంఘటన ఏమిటో వివరిస్తారా?

సి. సత్యనారాయణ, విజయవాడ

జ. నేను చెన్నైలోని గిండి ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతున్నప్పుడు కమ్యూనిస్టు భావాలు కలిగి ఆ పార్టీయొక్క విద్యార్థిరంగంలో ఉద్యమకారుడిగా ఉండేవాణ్ణి. విద్యార్థుల సమాజానికి అధ్యక్షుడిగా పోటీ చేసినప్పుడు (1) తెలుగువాడిగా మైనారిటీలో ఉండే వాళ్ళం. (2) మా ప్రిన్సిపాల్‌గారికి కమ్యూనిస్టులంటే ఇష్టం లేదు. వ్యతిరేకి కూడా. అయినప్పటికీ తమిళునితో పోటీ చేసి గెలుపొందాను. దీనికి కారణం కమ్యూనిస్టు భావాలకు వ్యతిరేకులైన తమిళులు, తెలుగులు కూడా "హనుమాన్‌చౌదరి' బుద్ధిమంతుడు, క్లాసులో ప్రథముడు, క్రమశిక్షణ, వాగ్ధాటి కలిగి బహు విషయ పరిజ్ఞానమున్నవాడు. అందుకని ఆయన రాజకీయాన్ని ఒదిలిపెట్టేసి అతని విశిష్టతకు ఓటేద్దాం" అని అనుకొని ఓటువేసి గెలిపించారు. మా ప్రిన్సిపాల్ గారు ముందు వ్యతిరేకించినా, తరువాత నన్ను పుత్రవాత్సల్యంతో చూసికొని పెరగనిచ్చారు. భారత ప్రభుత్వం నేను కమ్యూనిస్టు

నని ఉద్యోగం ఇవ్వకుండా జాప్యం చేస్తుంటే, "మీ వైఖరి తప్పు, యువకునిగా ఉన్నప్పుడు ప్రతివాడూ కమ్యూనిస్టుగా ఉండవచ్చు. కాని, బుద్ధిమంతుడైన వ్యక్తి అటువంటి వాటికి తొందరగానే స్వస్థి చెబుతారు" అని ప్రిన్సిపాల్ గారు వ్రాసి ప్రభుత్వానికి బుద్ధి చెప్పారు.

**4. రాజకీయాలలో కాలుష్యం పెరిగిపోయింది. నివారణోపాయం చెప్పగలరా?**

జ. చిత్తశుద్ధిలేని, సచ్ఛీలత లేని, భ్రష్టాచారులైన, భజనపరులైన నాయకులను ధైర్యంగా ఖండించి వారికి ఓట్లు వేయకూడదని ప్రజలకు ప్రభోధించినట్లైతే రాజకీయ కాలుష్యం పెరగకుండా తగ్గే అవకాశం ఉంది.

**5. రాష్ట్రపతి పదవి " బంగారు పంజరంలోని చిలుక" లాంటిదని అలనాడు లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణగారు అన్నారు మరి దానితో మీరు ఏకీభవిస్తారా? రాజ్యాంగ పరంగా రాష్ట్రపతికి నేడున్న అధికారమేమిటి?**

ఎస్. నగేష్, చిత్తూరు

జ. దాదాపు ఏకీభవిస్తున్నాను,. ప్రభుత్వానికి బుద్ధిచెప్పడం కోసం వారు చెప్పేది తప్పని సూచించడంకోసం, రాష్ట్రపతిగారు మంత్రి మండలి పంపిన శాసనాన్ని కాని, ఒక ఆజ్ఞను కాని పార్లమెంటు చేత తిరిగి పరిశీలింపమని పంపే అధికారం ఉన్నది. అలా పంపిన తర్వాత కూడా మంత్రిమండలి యథాతథంగా పంపిన చట్టానికి, ఆజ్ఞకి ఆయన సంతకం పెట్టవలసిందే. ఇంతకన్నా రాష్ట్రపతిగారికి వారే స్వీయమైన అధికారం లేదు,

**6. తెలుగు విశ్వవిద్యాలయంలో విలీనం చేయబడిన సంగీత సాహిత్య అకాడమీలు తిరిగి పునరుద్ధరించడం అవసరమంటారా? ఈ అకాడమీలు ప్రభుత్వం వారి ఆధ్వర్యాన నిర్వహించడం వాంఛనీయమంటారా?**

కె. ఫణికుమార్, అనంతపురం

జ. సంగీత, సాహిత్య, నృత్య అకాడమీలు ఉండవలసిందే. కాని, వీటికి స్వయం ప్రతిపత్తి కావాలి. ప్రభుత్వ ప్రమేయం మూలానా, చాలామంది పాలకులు



'రాజులు' అవడం మూలానా, తమ బంధుమిత్రజన పరులను ఏలినవారు ఈ ఎకాడమీలో సభ్యులుగాను, పదాధికారులు గాను నియమిస్తున్నారు. అందువల్ల వీటికి అధికార మాన్యతేగాని, పాండిత్యానికి ఉండవలసిన మాన్యత, గౌరవం, సద్భావం చాలా వరకు ఉండడంలేదు. ప్రభుత్వాధికారులు, మంత్రులు కాక పండితులను, కళాకారులను మాత్రమే ఎకాడమీ సభ్యులుగా అధికారులుగా నియమించడం జరిగింది.

**8. పాఠశాలలో జాతీయ గీతం తప్పనిసరిగా పాడాలని మన రాజ్యాంగంలో ఉందా?ప్రభుత్వం చట్టం చేసిందా?**

జ. అటువంటి నియమం మన రాజ్యాంగంలో లేదు. ఏ ప్రభుత్వం చట్టం చేయలేదు. కాని ఇది సాంప్రదాయంగా బహుజన అంగీకారమైంది.

**9. ప్రైవేటు వ్యక్తులుగానీ, సంస్థలుగానీ ఖర్చు భరించితే ఐఐటీలు ఏర్పాటును పరిశీలించగలమని మానవ వనరుల శాఖామంత్రి అర్జున్‌సింగ్ అనటం న్యాయమా?**

కె. వెంకటేశ్వర్ హైదరాబాద్

జ. అర్జున్‌సింగ్ గారు ఈ మధ్య చేస్తున్న నిర్ణయాలు, ప్రకటిస్తున్న అభిప్రాయాలు చాలా వింతగా వుంటున్నాయి. ఒక స్వంత ప్రయోజనం కోసం రాజ్యాంగేతర శక్తుల యొక్క యుక్తులకు కార్యనిర్వహణాధికారిగాఉన్నట్లు కనిపిస్తున్నారు. ప్రైవేటు వ్యక్తులు డబ్బులివ్వాలి. ప్రభుత్వం అధికారం చలాయించాలి? సొమ్ము ఒకరిది, సోకు మరొకరిదనా?

**10. ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందరికీ అందించాలి కదా తమ గురుకుల విద్యాలయాల్లో చదివి ర్యాంక్ సాధించిన ర్యాంకర్లకు బహుమతులు ఇస్తామంటున్నారు? ప్రైవేటు విద్యా సంస్థలతో పోటీకా?**

జ. ప్రైవేటు విద్యాసంస్థలతో పోటీ అని ఎందుకనుకోవాలి. తమ సంస్థల విద్యాస్థాయిని పెంచడానికి ర్యాంకర్‌లకు బహుమతులు ఇవ్వడం మంచిపనే.

**11. మెజారిటీ శాసనసభ్యులు అధికారములో ఉన్న ప్రభుత్వానికి తమ మద్ధతు ఉపసంహరించుకొంటూ గవర్నర్‌కి లేఖ సమర్పిస్తే వెంటనే గవర్నర్ ప్రభుత్వాన్ని రద్దుచేయవలసిన అవసరము ఉందా?**

ఎన్. శ్రీలక్ష్మి, విశాఖపట్టణం

జ. లేఖను చూడగానే ప్రభుత్వాన్ని రద్దుచేవలసిన అవసరం గవర్నరుకులేదు. ప్రభుత్వానికి మెజారిటీ ఉందో లేదో అనేది అసెంబ్లీలో విశ్వాస తీర్మానం ద్వారా నిర్ణయింపబడడం శిష్ట ఆచారము. అలా చేయకుండా ఉండడం మూలానా, గవర్నర్లు కేంద్ర ప్రభుత్వపు పాలేళ్ళుగా వ్యవహరించడం మూలానా (ఉదా: మొన్న బీహార్‌లో జరిగిన ఉదంతం, ఆంధ్రప్రదేశ్‌లో రామ్‌లాల్ గారు ఎన్.టి. రామారావుగారి ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయడం) రాజ్యాంగం యొక్క అవహేళన జరుగుతోంది. శకునివంటి గారడీవాళ్ళు ప్రబలుతున్నారు.

**12. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీషు అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ అంటారు. ఇంగ్లీషు ఫారిన్ లాంగ్వేజ్ కాదా?**

కె. రామారావు, హైద్రాబాద్

జ. ఇంగ్లీషు పుట్టుకతోనే విదేశీయమైనా మనదేశంలో దాన్ని ఒక దేశీయ భాషగానే గుర్తిస్తున్నాం. ఇది పాలనకు, విజ్ఞాన సముపార్జనకు, వ్యాపారానికి ప్రపంచ స్థాయిలో మనకు బాగా ఉపయోగపడుతోంది. కాని ఈ భాషకు మాత్రమే మహత్యం ఉందనుకోవడం, ఇదే అన్ని భాషలకన్నా మిన్న అనుకోవడం, ఇంగ్లీషు తెలియని వారు మాన్యులుగా ఉండకుండా ఉండడం ఇది విదేశీయ భావదాస్యానికి, ఆత్మన్యూనతకు లక్షణాలు, నా దృష్టిలో ఆంగ్లభాష భుక్తికి, సంపద సముపార్జనకు ఎక్కువగా సహాయపడుతుంది. కాని బౌద్ధిక వికాసానికి, దేశభక్తికి, ప్రజలయొక్క ఐక్యతకు, సౌభ్రాతృత్వానికి మన సంస్కృతి యొక్క అవిచ్ఛిన్నతకు మాతృభాషయే మాధ్యమం.



## మార్చి 2006

**1. మన ప్రాచీన ఆర్య విజ్ఞానం కన్నా, ఆధునిక శాస్త్ర విజ్ఞానం మిన్న అయినదా?**

జి. జనార్ధనరావు, రాజమండ్రి

జ. కాలగమనంలో ఎన్నెన్నో యాంత్రికపరికరాలు పెంపొందించబడుతున్నాయి. వాటిలోని ప్రసారసాధనాలను ఉపయోగించి మనం విజ్ఞానాన్ని విస్తరింపజేసుకుంటున్నాం. కాబట్టి భవిష్యత్‌లోనూ, ప్రస్తుతంలోనూ ఉన్న విజ్ఞానం పాతకాలపు నాటి దానికన్నా ఎక్కువ. అందుకని పాతదాన్ని నిరసించలేము. నిరశించకూడదు. ప్రతిజాతికూడా తమ దేశంలో విజ్ఞాన సంపత్తిని సృష్టించడానికి ప్రయత్నించాలి. ఈ ప్రక్రియలో ప్రాచీన కాలంలో భారతదేశం సమకాలీన దేశాలకన్నా, శాస్త్రవిజ్ఞానంలో ఎంతో అగ్రగామిగా ఉండేది. ఇస్లాందాడుల ప్రారంభంనుంచి, నిరంతరం జరిగిన యుద్ధాల వల్ల మన విజ్ఞాన ప్రగతి కుంటుబడింది. శాస్త్ర విజ్ఞానం పెరుగుతూనే ఉంటుంది. కాబట్టి, ఆధునిక విజ్ఞానం మిన్న. ఏ సృష్టి, స్థితి, లయముల గురించి మన ప్రాచీనులకున్న అవగాహన అద్వితీయమైనది.

**2. మన హిందువుల ఇంటిపేర్లు ఏవిధంగా ఏర్పడింది తెలియపరుస్తారా?**

జ. భారతదేశంలో ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క కులంలో ఇంటి పేర్ల యునికిగాని, తేడాకాని కన్పిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో చాలామంది ఇంటిపేర్లు బహుతరాల క్రిందటి పెద్దలు ఏ వూరికి చెందినవారో, ఆ ఊరుపేరున ఇంటిపేర్లు ఉన్నాయి. అటువంటి ఒకే ఇంటిపేరు ఎన్నో కులాల్లో కూడా కన్పిస్తుంది. ఉత్తర హిందుస్థాన్‌లో ఇంటిపేరంటూ లేదు. తండ్రిపేరు, వృత్తిపేరు, తనపేరు వుంటాయి. ఆంధ్రలో, బ్రాహ్మణ, క్షత్రియ కులాల్లో ఋషులపేర్లు, ఇంటిపేరుగా కొందరికి ఉంటున్నాయి.

**3. తెలుగును కనీసం ప్రైమరీ స్థాయి వరకు బోధనా మాధ్యమము చేయటానికి ప్రభుత్వం ఎందుకు జంకుతున్నది?**

కె. రామారావు, హైద్రాబాద్

జ. ప్రభుత్వంలో పాశ్చాత్య విద్యావిధానంవల్ల లాభం పొందిన వారు అందులో ఇంగ్లీషు భాషా మాధ్యమం ద్వారా చదువుకొని ఉద్యోగం పొందినవారు ఉన్నత పదవుల్లో ఉండడం మూలాన వారిలో మాతృభాషల యందు గౌరవం లేకుండా ఉండడం మనం చూస్తున్నాం. సామాన్య ప్రజల చేత చప్పట్లు కొట్టించుకోవడానికి మాతృభాష అని, తెలుగు అని, దేశభక్తి అని ప్రసంగాలు చేస్తారు. కాని, తమ వలె, తమ పిల్లలు కూడా లాభం పొందాలని, వీలైతే బహుళజాతి సంస్థల ఉద్యోగం సంపాదించుకోవాలని, అమెరికాలో స్థిరనివాసం ఏర్పరచుకోవాలని భావనలు ఉండడం మూలాన కనీసం ప్రైమరీ స్థాయి వరకు అయినా తెలుగును బోధనా మాధ్యమంగా నిర్బంధంగా ప్రవేశపెట్టడంలేదు. ఒకవేళ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ వాటిని అమలు చేయడంలేదు. దాన్ని బట్టి ప్రభుత్వము, పాలకులూ మాతృభాషను సంవర్ధింపచేయడానికి చిత్తశుద్ధితో పనిచేయడం లేదని సువిదితము. మీరు మీ MP గారిని MLA గారిని విచారించి తెలుసుకోండి. వారి పిల్లలు ఏ స్కూళ్ళకు వెళుతున్నారో, ఏ మాధ్యమం ద్వారా విద్యను అభ్యసిస్తున్నారు అని. నిజానిజాలు మీకేతెలుస్తాయి.

**4. జాతీయవాదం అంటే ఏమిటి? జాతీయ వాదులపై మీ అభిప్రాయమేమిటి?**

ఎన్. దినకర్, కనిగిరి

జ. తను పుట్టిన దేశం యొక్క, ఆ దేశస్థుల యొక్క, ఆ దేశం యొక్క భద్రత, అఖండత, సంపద, సంస్కృతిని, సాహిత్యాన్ని, సంఘీభావాన్ని దృష్టిలో వుంచుకొని ఆలోచించడం, పనిచేయడం జాతీయవాదం అంటారు. జాతీయ వాదానికి దేశభక్తికి ఒక సున్నితమైన బేధం ఉంది. ఏ దేశంలో పుట్టినవారైనా



మరొక దేశపు పౌరులు కావచ్చును. ఉదా॥ ఇటలీలో పుట్టిన సోనియా ఎన్నో ఏళ్ళ నివాసం తర్వాత మన దేశపు పౌరసత్వాన్ని పొందారు. దేశభక్తి అంటే కేవలం ఓటుకు, కూటికి, భద్రతకు, నివాసానికి, హోదాలు పొందటానికి పరిమితం కాక, ఆ దేశ చరిత్ర యందు, సంస్కృతియందు, భాషల యందు, నదుల యందు, అరణ్యాలయందు, పర్వతాలయందు, తీర్థస్థలాలయందు, ఆ దేశం యొక్క ప్రతిభూభాగమందు ప్రేమ, భక్తి, గౌరవం ఉండడాన్ని ఆ దేశాన్ని స్వర్గం కన్నా మిన్నగా, కన్న తల్లిగా భావించుకోవడం, ఆ దేశపు ప్రయోజనాలకోసం ప్రాణాన్ని స్వచ్ఛందంగా ఇవ్వటానికి సిద్ధంగా ఉండడం. ఇవి దేశభక్తి లక్షణాలు. ప్రతి దేశభక్తుడు తప్పనిసరిగా జాతీయవాది అవుతాడు. కాని ప్రతి జాతీయవాది దేశభక్తుడు అని చెప్పలేము. ఒక వ్యక్తికి మాతృభూమి యందు భక్తి కలిగి ఆ దేశవాసుల యందు మమత కలిగి ఉండవచ్చును. ఈ బంధాలు నివాసం వల్ల సంపాదించుకున్న జాతీయత (Nationality) కన్నా బలంగా వుండవచ్చును. ప్రస్తుతం వార్తా పత్రికలు చదివితే దేశభక్తికి (Patriotism) Nationality (జాతీయతకు)కు బేధం తెలుస్తుంది.

**5. విద్య మానవునికి మూడవ కన్ను అని ప్రముఖులెవరో సెలవిచ్చారు. మరి ప్రస్తుత సమాజంలో ఈ విద్య మానవునికి ఏ రంగంలో, ఏ రకమైన అభివృద్ధికి తోడ్పడేది మూడవకన్ను?**

జ. ప్రస్తుతం మనదేశంలో, విశేషించి మనరాష్ట్రంలో అసలైన నిర్వచనాన్ని అనుసరించిన విద్య చాలా తక్కువగా ఉంటోంది. పరీక్షలు పాసవడం కోసం పాఠ్యాంశాలున్నాయి కాని పఠనం విద్య కాదు. ఇటువంటి చదువులు పొట్టకూటికోసం పనికి రావచ్చు కాని, మానవుని యందున్న దివ్యశక్తిని ఉత్తేజితం చేయలేవు, విద్య బహుముఖమైనది. వ్యక్తికి పరిపూర్ణత్వాన్ని ఇవ్వగలిగింది విద్య. అటువంటి విద్యయే ముక్కంటికి ఉన్న అపార శక్తివంతమైన మూడవ కన్ను కాగలదు. సరియైన విద్య పొందిన వానికి ప్రతి లక్ష్యమూ సాధ్యమే.

**6. తెలుగును ప్రాచీన భాష హోదా కల్పించడం వల్ల ఎవరికి లాభం? పల్లె పల్లెలో విస్తరించిన కాన్వెంట్లను ఏం చేస్తారు? సామాన్య తెలుగు జనానికి ఏమిటి ఉపయోగం?**

ధనాల చంద్రహాస్, పామర్రు

జ. ప్రతిపార్టీ నాయకులు, ధనవంతులు, వ్యాపారస్థులు, ప్రభుత్వోద్యోగులు, చివరకు తెలుగు ఉపాధ్యాయులు కూడా తమ పిల్లలను 'ప్రైవేట్ ఇంగ్లీష్ మీడియం, 'కాన్వెంట్ స్కూల్స్'లో చదివిస్తూ విదేశాలకు పంపడానికి ప్రయత్నిస్తుంటే తెలుగుకు ప్రాచీన భాషా హోదా కల్పించడం అనేది ఒక జనాకర్షణ నినాదం. ప్రజలకు సుంతైనా లాభం ఉండదు. నాయకులకు, వ్యాపారస్థులకు ప్రయోజనం కల్పించడానికి విస్తరించిన కాన్వెంట్స్ నిరుపేదలకు ప్రభుత్వపు తెలుగు పాఠశాలలు ఇది ప్రస్తుతపు పరిస్థితి.

**7. మన రాష్ట్రంలో కాని ఇతర రాష్ట్రాలలో కాని రాజ్యాంగ విరుద్ధంగా రిజర్వేషన్ల కల్పన జరుగుతుంటే న్యాయస్థానాలలో పోరాడాలే కానీ, వీధి పోరాటాలకు దిగడం సబబేనా?**

జ. ఒక మతస్థులకు సంబంధించిన విషయాలలో భారతదేశంలోని న్యాయస్థానాలు ఏ తీర్పునిచ్చినా, ఆ తీర్పు ఆ మతస్థులకు సమ్మతం కానప్పుడు రాజ్యాంగాన్ని, చట్టాలను మార్చడం ఆ మతస్థుల వెనుక ఓట్లకోసం ప్రాకులాడే పార్టీలకు ఆచారంగా మారింది. వీధి పోరాటాలకు దిగి, ధన, మాన, ప్రాణ నష్టాన్ని కల్పించి, ప్రభుత్వాన్ని లొంగదీసే శక్తి ఆ మతస్థుల యొక్క మాటకూ, ప్రవర్తనకు రాను రానూ అధికాధికం అవుతోంది. ఈ వ్యవహారాన్ని లౌకిక వాదమనే ముద్రవేసి కొనసాగించడం అన్ని పార్టీలు చేస్తున్న రిజర్వేషన్లు కావాలని ఒక మత సముదాయం, వీధిపోరాటాలు, జరపడమేకాదు, రాజ్యాంగంలోని కొన్ని అధికరణలను మాకువర్తింపచేయకూడదు; మా, మత నియమాలనే మాకు వర్తింప చేసుకుంటాం అనిహుంకరిస్తున్నారు. లౌకికవాదులు, వారికి మద్దతిస్తున్నారు. మా మతానికి చెందిన న్యాయమూర్తులులేని, కోర్టు నిర్ణయాన్ని మేం ఒప్పుకోం అని కూడా అంటున్నారు. ఈ మనస్తత్వం, వీరి చర్యలు దేశ విచ్ఛిత్తికి దారితీస్తాయి.



**8. జాతీయ స్థాయి గౌరవ పురస్కారాలు నిజమైన ప్రతిభావంతులకు మాత్రమే వస్తున్నాయని మీరు భావిస్తున్నారా? అలాగే సాహిత్యానికి సంబంధించి, జ్ఞానపీఠ్‌కు అర్హులైన రచయితులన్నప్పటికి మనకు మరో జ్ఞానపీఠ్ ఎందుకు రావడం లేదు?**

మండాది గోపినాథ్, మక్కుడుదేవుని పల్లి

జ. పురస్కారాల సంఖ్య పరిమితమైనప్పుడు, కోరుకునే వారు అపరిమితంగా ఉన్నప్పుడు, మేం ప్రతిభావంతులైనప్పటికీ మాకు గౌరవ పురస్కారం దక్కలేదు. బంధుప్రీతియో, మిత్రలాభమో, ధన ప్రభావమో అని ఆరోపించడం అసమాన్యం కాదు. కొంత వరకు ఈ ఆరోపణలో నిజము ఉంది. ఇటీవల పురస్కార ప్రదానం చేసే సంస్థలు ఎన్నో ఏర్పడి పురస్కార ఆర్జితులకు కొంత ఊరటను కలిగిస్తున్నాయి.

**9. ఫ్యాబ్‌సిటీ అంటే ఏమిటి? ఫ్యాబ్‌సిటీ వలన మనకు కలిగే లాభాలు ఏమిటి?**

బి.వి.శ్రీనివాస్, మెదక్

జ. లక్షలాది ట్రాన్సిస్టర్లను గోరంత చిప్‌లో అమర్చి ఒక లక్ష్యం సాధించే పరికర సృష్టిని (Fabrication ) ఫాబ్ అంటాము. ఎక్కడైతే అటువంటి పరిశ్రమ స్థాపించబడుతుందో దాన్ని Fab city అనవచ్చు. అటువంటి Fabs ఉండడం వల్ల ఉత్తమ శ్రేణికి చెందిన Technology లో పట్టభద్రులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. పేపర్లు వ్రాసినట్లు, రాజకీయవేత్తలు చాటుతున్నట్లు లక్షల్లోకాదు వేలల్లోనే ఉద్యోగావకాశాలుంటాయి. మనదేశ స్వయం నిర్భరతకు Fabs చాలా అవసరం.

**10. ఆర్థిక సమానత్వం లేనిదే వ్యక్తి స్వాతంత్ర్యం వుండదనుట ఎంతవరకు నిజం?**

ఎస్. ప్రభావతి, తెనాలి

జ. మనదేశంలో అందరి మధ్య ఆర్థిక సమానత్వం లేదు, అయినప్పటికి ఎవరిష్టం వచ్చినట్లు మాట్లాడడానికి, వ్రాయడానికి స్వాతంత్ర్యం ఉంది. కాని మాటల్ని, వ్రాతల్ని ప్రచురించే, ప్రసారం చేసే అవకాశాలు బహుస్వల్పం.

## ఏప్రియల్ 2006

**1. అమెరికాతో అణు ఒప్పందం వల్ల యురేనియం సరఫరా, టెక్నాలజీ మార్పిడి జరుగుతాయి. అది మనకు లాభదాయకమే కదా, కమ్యూనిస్టులతో పాటు మరికొందరు దీన్ని ఎందుకు వ్యతిరేకిస్తున్నారు?**

కె. రామకృష్ణ, కాకినాడ

జ. మనదేశానికి ఏది లాభదాయకం అవుతుందో, ఏది నిజమైన సంపదను సృష్టించగలదో, ఏది శ్రమను ఎక్కువ చేసి వ్యయాన్ని తగ్గించుకుని, విద్యనభ్యసించి అధిక సంతానాన్ని తగ్గించుకుని బీదతనం నుండి త్వరలో బయటపడగల పథకాలున్నవో, ఏ దేశాలతో మైత్రి చేసుకుంటే మనదేశానికి లాభమో, వాటన్నిటినీ ఎదిరించడం కమ్యూనిస్టు పార్టీలకు దశాబ్దాలనుండి వస్తున్న ఆచారం. భారతదేశ విభజనను, పాకిస్తాన్ దేశాన్ని ఏర్పరచడం కమ్యూనిస్టులు బలపరచారు. గాంధీగారు స్వాతంత్ర్యం కోసం క్విట్ఇండియా పోరాటాన్ని ప్రారంభిస్తే దాన్ని వ్యతిరేకించి బ్రిటీష్ వాళ్ళకు మద్ధతుగా వ్యవహరించారు. మనకు వచ్చిన స్వాతంత్ర్యం బూటకపుస్వాతంత్ర్యం అని నెహ్రూ ప్రభుత్వం బ్రిటీష్ అమెరికన్ సామ్రాజ్యవాదాల తొత్తు అని మూడేళ్ళపాటు స్వాతంత్ర్య భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధపోరాటం చేశారు. 1962లో చైనా ఇండియా మీద దురాక్రమణ చేసినప్పుడు అది వారి తప్పుకాదని నెహ్రూగారి దుందుడుకుతనం మూలాన చైనా ఆ చర్య చేసిందని కమ్యూనిష్టులలో అధికభాగం అన్నారు.

1975లో ఇందిరాగాంధీ ఫాసిస్ట్ ఎమర్జెన్సీ పెట్టి ప్రతిపక్ష నాయకులందరినీ జైల్‌లోపెట్టడం సబబేననీ మరికొంతమంది కమ్యూనిస్టులు ఆవిడను బలపరిచారు. ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థని సరళీకృతం చేసి స్థూల ఉత్పత్తిని పెంచడానికి తీసుకుంటున్న ప్రతి చర్యనూ వాళ్ళు వ్యతిరేకిస్తున్నారు. ఇటువంటి ఘన చరిత్ర కలిగిన కమ్యూనిస్టులు అమెరికాతో ఒప్పందం చేసుకుని అణు విద్యుదుత్పాదన ద్వారా మనకున్న ఊర్జాభావమును తొలగించుకోవడం వారికి ఇష్టం లేనట్లున్నది. ఇరాన్‌దేశంలో చాలా ఆయిల్ ఉంది, ప్రపంచంలో అత్యధికంగా ఆయిల్‌ని ఎగుమతి చేసే దేశాల్లో ఒకటి. ఇరాన్ వాళ్ళు యూరేనియమ్ ఎన్‌రిచ్‌మెంట్‌ని చేస్తామంటున్నారు. దాని ద్వారా అణు విద్యుదుత్పత్తి చేస్తామంటున్నారు. ఆయిల్ ఎక్కువగా ఉండి, ఎగుమతి చేస్తూ వున్న దేశానికి న్యూక్లియర్ పవర్ అవసరం ఏమిటి? ఆటంబాంబులు తయారు చేయడానికే. ఆ ఆటంబాంబులని పాకిస్తాన్ చెప్పినట్లుగా ఇస్లామిక్ బాంబ్ అంటున్నారు. వాటిని ప్రయోగించి ఇజ్రాయిల్ దేశాన్ని భస్మం చేయాలని వారి వ్యూహం. అలా ఇరాన్ ఆటంబాంబుని నిర్మించకుండా ఉండాలంటే వ్యూహం, అమెరికాతోపాటు చైనా, రష్యా, ఫ్రాన్స్, ఇంగ్లాండ్, ఇటలీ తదితర 30 దేశాలు నిర్ణయించుకుంటే ఇండియా కూడా వారితోపాటు ఆ నిర్ణయాన్ని సమర్థించింది. దాన్ని మనదేశంలోని ముస్లింలు, కమ్యూనిష్టులు కలిసి వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికీ మన సరిహద్దుల్లో మనల్ని శత్రువులుగా భావించే రెండు దేశాల్లో అణ్వస్త్రాలు క్షిపణిలు ఉన్నాయి. మూడోదేశం కూడా అలా తయారవడం మనదేశ భద్రతకు ఎంతో ముప్పు. మనదేశం వెనుకబడి ఉండడం. బలహీనంగా ఉండడం, దారిద్ర్యంతో ఉండడం కొంతమందికి ఇష్టం. ఎందుకంటే అలా ఉంటేనే కాని తమ పార్టీలకు ఓట్లువేసేవారు ఉండరు. అందుకనే పుట్టినప్పటి నుంచి ఏ విధంగా భారత వ్యతిరేక విధానాలను అనుసరించిందో ఆ విధంగా ఆనవాయితీగా ముస్లింలను సంతుష్టీకరణ చేస్తున్న కమ్యూనిష్టులు, ముస్లింల ఓట్లు కోసం ప్రాకులాడే లౌకికవాద పార్టీలు, అమెరికాతో మనదేశం చేసుకున్న, మనకు లాభపడే యురేనియం సరఫరా ఒప్పందాన్ని వ్యతిరేకిస్తున్నారు.

**2. బడ్జెట్ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి మాసం చివరిలోనే ఎందుకు ప్రవేశపెడతారు? మార్చి చివరిలో ప్రవేశపెట్టవచ్చు కదా. ఫిబ్రవరిలో ప్రవేశపెట్టినా అది ఆమోదం పొందేది ఏప్రిల్, మే మాసాలలోనే కదా?**

జ. మనదేశం ఆర్థిక సం॥ ఏప్రిల్ మొదటి తారీఖు నుండి తదుపరి సం॥ మార్చి 31న ముగుస్తుంది. అమెరికా వంటి కొన్ని దేశాల్లో జనవరి 1 నుండి

డిశెంబరు 31 వరకు ఆర్థిక సం॥గా పరిగణిస్తారు. ఆదాయ వ్యయాల అంచనాలను క్రొత్త ఆర్థిక సం॥ ముందే నిర్ణయించుకోవాలి. ప్రతిపాదనలు చేయడం, పార్లమెంట్‌లో చర్చించబడి ఆమోదింపబడడం, కనీసం నెలైనా పడుతుందికాబట్టి ఫిబ్రవరిలోనే బడ్జెట్ ప్రవేశపెట్టడం, తదుపరి చర్చలు సాగించి కొన్ని సవరణలు చేసి తరువాత ఫైనాన్స్ బిల్‌గా చట్టంగా చేయబడుతుంది.

**3. మహ్మద్ ప్రవక్త గురించి డెన్మార్క్ పత్రిక వేసిన కార్టూన్‌పై పెద్ద ఎత్తున వివాదం చెలరేగింది. దీనిని బట్టి మనదేశంలో ఎం.ఎఫ్, హెస్సేన్ దేవతా బొమ్మలను నగ్నంగా వేస్తే సంఘ్‌పరివార్ రెచ్చిపోవడం కూడా సరైనదేనన్న వాదన వుంది. ఈ రెంటి మధ్య సారూపత్య వుందా?**

జ. ఎక్కడో డెన్మార్క్‌లో మహమ్మద్ ప్రవక్తను కించపరిచే విధంగా వ్యంగ్య చిత్రాలు పత్రికలో ప్రకటించబడితే అలా ప్రకటించిన వారు హిందువులుగాక, క్రిస్టియన్‌లు అయినప్పటికీ, భారతదేశంలో ముస్లింలు రెచ్చిపోయి హింసాత్మకంగా ప్రదర్శనలుచేసి, హిందువులుమీద విరుచుకుపడం, వారి కొట్లను లూటీ చేయడం దగ్ధం చేయడం, వారిని చంపడం అమానుషం. అలా తమ ప్రవక్తను కించపరచకూడదనే ఇస్లాం మతస్థులు వారు అడగకుండానే వారికి మద్ధతునిచ్చే వామపక్షీయులు, లౌకికవాద పక్షీయులు, అభిప్రాయ ప్రకటనను, స్వాతంత్ర్యం ఉండాలనేవారు, ఒక ముస్లిం కళాకారులకు భావప్రకటనకు స్వాతంత్ర్యం ఉండాలనేవారు. ఒక ముస్లిం కళాకారుడు ఫిదాహుస్సేన్ పదే పదే హిందూ దేవతలను, దేవుళ్ళను, భారతమాతను అశ్లీలంగా, నగ్నంగా, వికృతంగా చిత్రిస్తే ఏమీ అభ్యంతరం పెట్టలేదు. బాధపడిన హిందువులు హుస్సేన్‌కి వ్యతిరేకంగా శాంతియుతంగా తమ నిరసనను ప్రకటిస్తే వాళ్లను ఫాసిస్ట్‌లని, అల్ప సంఖ్యాకుల, వ్యతిరేకులని మత ఛాందస వాదులని తిట్టారు. ఈ సత్యాల ద్వారా మీరే నిర్ణయించుకోవచ్చు. ఎవరు ఎటువంటి వారో అని.



**4. తెలుగు భాష పరిరక్షణకై ప్రస్తుతం కొనసాగుతున్న ఉద్యమంపై మీ అభిప్రాయాలుఏమిటి?**

జ. తెలుగుభాషా పరిరక్షణ ఒక ప్రభుత్వం వల్లనే అయ్యేపని కాదు. తల్లితండ్రులకు, పెద్దలకు, బాధ్యత గలవారికి, నాయకులకు తెలుగు భాషయందు అభిమానం లేనప్పుడు పుట్టినప్పటి నుండి తమ బిడ్డలను 'కాన్వెంట్' స్కూళ్ళలో పెట్టి A for Apple అంటూ విద్యాభ్యాసం చేయిస్తుంటే తెలుగుభాషకు గౌరవం ఎలా దక్కుతుంది? అలనాడు కృష్ణదేవరాయలు గారు "తెలుగ దేలయన్న దేశంబు తెలుగు, నే తెలుగు వల్ల భుండ..... దేశ బాషలయందు తెలుగు లెస్స" అని సగర్వంగా చెప్పి అష్టదిగ్గజాలయినటువంటి కవులను గౌరవించి, పోషించి, తెలుగు భాషయందు పాలకులకు, ప్రజలకు అభిమానాన్ని, గౌరవాన్ని, గర్వాన్ని పెంచారు. తరచి తరచి చూడండి. వెదికి వెదికి కనుక్కోండి ఏ మంత్రులు ఏ ప్రజా ప్రతినిధులు, ఏ ప్రభుత్వాధికారులు తమ పిల్లలను తెలుగు మాధ్యపు పాఠశాలలో చదివిస్తున్నారో, ఎంతమందికి సుమతీ శతకం, వేమన శతకాలయందు అభిమానం ఉందో కనుక్కోండి. తెలుగుభాషా పరిరక్షణకు కొనసాగుతున్న ఉద్యమం మంచిదే. కాని ప్రతి కటుంబంలో తెలుగు భాషయందు ప్రేమ లేకపోయినట్లైతే ఈ ఉద్యమం సఫలం అవదు.

**5. ప్రభుత్వోద్యోగుల గెజిటెడ్ ఆఫీసర్లకు, ఎన్జీవోలకు తేడా ఏమిటి?**

జ. ఎక్కువ బాధ్యతలున్న అధికారులను రాజపత్రిక అధికారులంటారు. ప్రస్తుతం ఒకే ఒక తేడా కన్పిస్తోంది. రాజపత్రి అధికారులు సమ్మె చేయరు. ఇతరులు తమ తమ సంఘాలచే ప్రేరేపింపబడి సమ్మె చేయడానికి ఉద్యమించుతారు. అది నిబంధనలకే విరుద్ధమైనా ప్రభుత్వంలో వున్న కొన్ని లొసుగులు, బలహీనతలను ఆధారంచేసుకొని NGO లకు సమ్మెచేసే హక్కు ఉందని కొంతమంది అనుకుంటున్నారు.

**6. అమెరికా అధ్యక్షుడు జార్జిబుష్ మనదేశ పర్యటన వలన దేశానికి, రాష్ట్రపర్యటన వలన మన రాష్ట్రానికి ఒనగురే మేలు ఏమిటి?**

ఎన్. సీత, రాజమండ్రి

జ. మన రాష్ట్రానికి ప్రత్యక్షంగా మేలు జరగకపోయినప్పటికీ మనదేశానికి మేలు జరగవచ్చు. దానిలో భాగంగా ఆ దేశాన్నుంచి పెట్టుబడులు మన రాష్ట్రంలో కూడా రావచ్చు.

**7. భారత కరెన్సీ నోట్లన్నీ ఆర్.బి.ఐ ముద్రిస్తుండగా ఒక రూపాయి నోటు మరియు నాణేలను భారత ఆర్థికశాఖ ముద్రిస్తుంది. ఎందుకు?**

కె. రంగయ్య, హైద్రాబాద్

జ. పెద్ద కారణాలేమీ లేవు. రిజర్వు బ్యాంకు ముద్రించే కరెన్సీ నోట్లన్నీ భారతప్రభుత్వం తరుపున రిజర్వు బ్యాంకు ఇచ్చే ప్రామిసరీనోట్లు, వాటికి సరిపడ సెక్యూరిటీ భారతప్రభుత్వం RBI కి ఇస్తోంది. నాణాలను ముద్రించడం ఒక కర్మాగారపు పని, బ్యాంకుకు బదులు ప్రభుత్వం యొక్క ఒక శాఖే దాన్ని నిర్వహిస్తోంది.

**8. ప్రభుత్వం ధరలు పెంచినప్పుడల్లా వామపక్షాల వారు ధర్నాలు– ర్యాలీలు నిర్వహిస్తారు. అనుకున్నది సాధించకుండానే మానేస్తారు. ఇలాంటి పనికిమాలిన పనులు చేస్తూ ప్రజలకి అసౌకర్యం కలిగించడం సిగ్గుచేటుకాదా? భర్తృహరి చెప్పిన రెండవరకం నాయకుల వల్ల కీడు తప్ప మేలు జరగటం లేదు. వీరికి బుద్ధి చెప్పటం ఎట్లా?**

కె.ఆర్. రావు ,హైద్రాబాద్

జ. వారు జరిపే సభలలో పాల్గొనకుండా వుండడం, వారి ప్రదర్శనలతో సహకరించకుండా ఉండడం, వారికి ఓట్లు వేయకుండా వుండడం. వారికి ఏ విధంగా డబ్బు చేరకుండా చూడడం, వారి అబద్ధపు ప్రచారాలను, 'ఘన' చరిత్రలను ప్రజలకు విపులంగా చెప్పటం, ఇలా చేస్తే బుద్ధి రావచ్చు.



## మే 2006

**1. ప్రఖ్యాత న్యాయవాదిగా (అసంబద్ధ ఆరోపణలకు, అర్థరహిత వివాదాలకు) రాంజెఠ్మలానీ పెట్టింది పేరు అని విన్నాను, మరి మన రాష్ట్రపతిగారు ఆయనను రాజ్యసభకు "నామినేట్" చేయటంలోఔన్నత్యం ఏమిటి?**

కె.శ్రీనివాస్, విజయవాడ

జ. రామ్‌జెట్ మలానీ గారు కుశాగ్ర బుద్ధి గలిగిన న్యాయవాది వృత్తిలో ఉత్తమ శ్రేణికి చెందిన వ్యక్తి. డాక్టర్లు తమను ఆశ్రయించిన రోగిని శాయ శక్తుల బ్రతికించడం కోసం ప్రయత్నం చేస్తామని శపథం చేసి గాని పట్టభద్రులవరు. అలాగే తన వకాలతాను పుచ్చుకున్న తరువాత ఆశ్రయించిన వ్యక్తిని శిక్షనుంచి కాపాడడానికి తమ బుద్ధిని, వృత్తి నైపుణ్యాన్ని ఉపయోగిస్తారు న్యాయవాదులు. జెఠ్మలానీ గారు కొన్ని విషయాల్లో ప్రజహితం కోసం, కొన్ని విషయాల్లో ప్రజల మన్ననకు వ్యతిరేకంగానూ భాషణలు, రచనలు, వాదనలు చేసారు. వారి ప్రతి వాదనతో, విమర్శతో, విశ్లేషణతో మనం ఏకీభవించలేక పోయినప్పటికీ, వారి అభిప్రాయంలో ఒక విధమైన హేతుబద్ధత ఉందని గుర్తించగలం. ప్రజాస్వామ్యం ప్రత్యేకత ఏమిటంటే మనం ఏకీభవించని వారికి వాక్ స్వాతంత్ర్యాన్ని, మాన్యతను ఇవ్వడం. దృష్ట్యా రాష్ట్రపతిగారు రామ్‌జెట్ మలానీ రాజ్యసభకు నామినేట్ చేయడంలో అనౌచిత్యం లేదని నా అభిప్రాయము.

**2. రూ.2కిలో "బియ్యం" ఇంటింటికి "టివి"లను మా అధికారంలో ఇస్తామనటం ఓటరులను ప్రభావితం చేయటం కదా! ఎన్నికల కమిషన్ చర్య ఎందుకు తీస్కోవట్లేదు?**

జ. ఒక్క రెండు రూపాయిలకు బియ్యం, ఇంటింటికి టీవీలే కాదు, ప్రతి ఇంటికి ఒక ఆవును, మహిళలకు పౌష్టికాహారభృతి, ప్రతి పురుషునకు పోస్టాఫీసులో రూ500/–లు జమ చేస్తామని కూడా మరోపార్టీ తమిళనాట వాగ్దానం చేస్తోంది.

మరొక పోటీదారు, ఉచితంగా సెల్‌ఫోన్స్‌తో పాటు తన నియోజక వర్గ ప్రజలకు 'ఫ్రీ టెలిఫోన్‌కాల్స్‌ను' కంప్యూటర్ శిక్షణ పొందుతున్న యువతకు ఉచితంగా లాప్‌టాప్‌లు,బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగాలు ఇస్తామని చెపుతున్నారు. లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు ఇవ్వందే ఎలక్షన్ కమీషన్‌గాని కోర్టులుగాని,ప్రభుత్వంగాని చర్య తీసుకోవు. కాబట్టి ఓపిక, ఒనరులు ఉన్న వ్యక్తులు, సంఘాలు, కోర్టుల్లో ప్రజాహిత వ్యాజ్యాలు (PIL) వెయ్యాలి. చెల్లని చెక్కులు ఇస్తే ఏ విధంగా చెక్కులు ఇస్తే ఏ విధంగా చెక్కులిచ్చిన వారు శిక్షార్హుల్లో, అదే విధంగా ఎవరైతే ఇటువంటి అక్రమ, అవినీతి కర, అసాధ్యమైన వాగ్దానాలు చేస్తారో ఆ పార్టీలకు, ఆ నాయకులను శిక్షార్హులను చేయాలి.

**3. ఐఐఎం, ఐఐటి, విద్యాసంస్థల్లో కూడా రిజర్వేషన్‌లు కల్పించాలని మానవ వనరుల శాఖామాత్యులు అర్జున్‌సింగ్ అంటున్నారు. అలా చేయడం ప్రతిభకల విద్యార్థులకు అన్యాయం చేయటమే. మరి దీనికి పరిష్కారం ఏమిటి?**

జి. కవిత, ఒంగోల్

జ. అర్జున్‌సింగ్‌గారు, వారి వంటి లౌకిక వాదులు, వామ పక్షీయులు ఓట్లకోసం భిక్షాటన చేసేవారు మన దేశం యొక్క అఖండతకు మేధాశక్తికి, సంపద సృష్టికి ఎంతో ద్రోహం చేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి అన్యాయాలకు, అక్రమాలకు, ద్రోహాలను, పార్టీలను, విమర్శించడం, ఎండ కట్టడం, బహిష్కరించడం, ఓడించడం కోసం విద్యార్థులు, దేశభక్తులు ఒక పద్ధతిగా దీర్ఘకాలిక ఉద్యమాన్ని చేపట్టాలి.

**4. సంపూర్ణ అక్షరాస్యతకు ప్రభుత్వమెలాంటి నిర్ణయాలు తీస్కోవాలి.**

జ. నిర్ణయాలు ఇంత వరకే ఎన్నో తీసుకోబడ్డాయి. ఎన్నో ప్రణాళికలు, సర్వశిక్ష అభియాన్, ప్రారంభించబడ్డాయి. ఎంతో డబ్బు ఖర్చుపెడుతున్నాం. కాని చిత్తశుద్ధి లోపించడం, పథకాలను అమలు చేసే ఉద్యోగస్తుల నిర్లిప్తత వల్ల మనం విఫలమవుతున్నాం. ప్రభుత్వ భాద్యత కన్నా, పిల్లలను చదివించడం,



వారికి విద్యాబుద్ధులు నేర్పడంలో తల్లిదండ్రులబాధ్యత ప్రధానమైనది. తమ బాధ్యత విడిచి ప్రభుత్వాన్ని తెగడటం సమంజసంకాదు.

**5. డిగ్రీస్థాయిలో భాషా బోధన అవసరమా?**

ఎన్. రామప్రసాద్, విజయనగరం

జ. డిగ్రీ స్థాయిలో భాషాబోధన ఉండాలి. భాషాధ్యయనం జీవితాంతం ఉండాలి. భాష ద్వారానే భావప్రకటన, సౌభ్రాతృత్వం, సహజీవనం సాధ్యమవుతుంది

**6. "సంస్కృతి" అనే దానికి నిర్వచనమేమిటో వివరిస్తారా?**

ఎన్. రామప్రసాద్, విజయనగరం

జ. ఋజువర్తనం, ఇతరులను నొప్పించకుండా ఉండటం, ఆర్థిక సంపదకే కాక ఆధ్యాత్మిక సంపదకు విలువనీయటం, అమలు చేయడానికి వీలుగాని నియమాలకు కట్టుబడి ఉండటం, ధర్మ రక్షణకు కృషిచేయడం, అధర్మాన్ని వ్యతిరేకించడం, అడ్డుకోవడం, వ్యర్థప్రలాపాలు, పరనింద చేయకుండా ఉండటం, లలిత కళల యందు అభిరుచి, క్రొత్త విషయాలు తెలుసుకోవాలనే జిజ్ఞాస, సత్సంగత్వంలో అభిరుచి, ఇవన్నీ సంస్కృతికి లక్షణాలు. ఇవి వ్యక్తిగతమైనవి. ప్రతి వ్యక్తిలో సంస్కృతి ఉంటే సమాజం కూడా ఉన్నత సంస్కృతి కలిగి ఉంటుంది. ఇన్ని లక్షణాలు కలిగి ఉన్నందుకు భారతీయ సంస్కృతికి ప్రపంచంలో మహా గౌరవం ఉంది. సుసంఘటిత కుటుంబ వ్యవస్థ, స్త్రీల యందు గౌరవం, భూతదయ..... ఇవన్నీ సంస్కృతి లక్షణాలు.

**7. ఓటు విలువ తెలియని ఓటర్లు ఎక్కువగాగల దేశంలో ప్రజాస్వామ్యానికి అర్థం ఉందా?**

జ. కోతికి కొబ్బరికాయ ఇచ్చినట్లు నిరక్షరాస్యులకు, ఏ పన్నులు కట్టకుండా, భాధ్యతా రహితంగా అధిక సంతానం ఉత్పత్తి చేస్తున్న వారికి, ఎందుకు ఓటేస్తున్నామో తెలియని వారికి, ఓటు హక్కునివ్వడం మొదటి పొరపాటు, అందుకనే ఏమి

అర్థం కాకుండా దేవుడి గుడిలో ఎవరో మంత్రాలు చదువుతుంటే తాము పూజచేసి, తమ పాపాలను పోగొట్టుకొని దైవానుగ్రహం పొందుతున్నామనుకున్న వ్యవహారంలో ఎంత అర్థం ఉందో మన దేశంలో ప్రజాస్వామ్యానికి అంత అర్థం ఉంది. అందుకనే విపరీతమైన అనర్థాలను  కూడా చవి చూస్తున్నాం.

**8. మాతృభూమికి 'భారతదేశం' అని నామకరణం మనం చేసుకున్నాం. కానీ బ్రిటీషు వారు 'ఇండియా' అన్నారు. ఏ దేశం పేరైనా అన్ని భాషలలో ఒకే విధంగా ఉండగా భారతదేశమును ఆంగ్లంలో భారతదేశమనలేమా?**

లోక జీవన్ రెడ్డి, తిమ్మాపుర్

జ. గత 50 సం॥లలో పరదేశీ పాలనను అంతమొందించి స్వతంత్ర్యం సంపాదించుకున్న ఎన్నో దేశాలు తమ దేశాలకు విదేశీపాలకులు పెట్టిన పేర్లను తీసేసి తమ ప్రాచీన దేశీయ నామాలను పెట్టారు. సిలోన్–శ్రీలంకగా,బర్మా–మయన్మార్‌గా, రొడేసియ – జింబాజ్వేగా, గోల్ట్‌కోస్ట్ – ఘనాగా, కంబోడియా – కంపూచియాగా తమ పరంపరాగత పేర్లను ఆత్మ గౌరవాన్ని ప్రకటిస్తూ దేశభక్తిని వ్యక్తం చేస్తూ మార్చాయి. మన దేశానికి లౌకికవాదమనే జాడ్యం పట్టుకుంటుంది. హిందువులను ద్వేషించే పరదేశాలను ప్రేమించే ఒక వంశం యొక్క ఆధిపత్యం ఉండడం మూలాన, మనదేశంపై దండెత్తి పాలించినవారు పెట్టిన పేర్లను ఇక్కడే స్థిరపడిపోయిన దురాక్రమణదారులు వారి సంతతి ఎక్కడ నొచ్చుకుంటారో అని యుగాలనాటి మన భారతదేశమనే పేరు మళ్ళీ పెట్టుకోకుండా, పరాధీన మనః స్థితితో దురాక్రమణదారులు పెట్టిన పేరును ఇండియా  అనే పదం ఏ భారతీయ భాషలో కూడా లేదు. ఇతరులు రుద్దిన పదం మాత్రమే. తెలుగుకు ప్రాచీన భాషగా మాన్యత కావాలనేవారు మహబూబ్‌నగర్‌ను పాలమూరుగా, నిజామాబాద్‌ను–ఇందూరుగా, మహబూబాబాద్‌ను– మానుకోటగా ఎందుకు పునః నామకరణం చేయాలని అడగరు? Peking ను Beijing గా Canton గ్వాంగ్ ఝూ గా చైనా వారు మార్చారు. అదే విధంగా కమ్యూనిస్టు నియంతృత్వం నుంచి బయటపడ్డ రష్యన్ ప్రజలు లెనిన్ గ్రాడ్, స్టాలిన్ గ్రాడ్‌లకు  నియంతల



పేర్లను తప్పించి, అనాదిగా ఉన్న పేర్లు St Peter's Berg, Olga Grand గా మార్చుకున్నారు. మన దేశంలో పర భావదాస్యం ఇంకా పోలేదు. ఇక తెల్లవారంటే లౌకిక వాదులు భయభ్రాంతులై, వారికి కోపం వస్తుందేమోనని వాళ్ళే వూహించి మనవికాని పేర్లను మార్చడానికి సాహసించడం లేదు.

**9. జాతీయ బ్యాంకులు అంటే ఏమిటి? భారతదేశంలో ఎన్నికలవు? అవి ఏవి?**

జ. ప్రభుత్వ పెట్టుబడితో ప్రభుత్వానికి చెంది, ప్రభుత్వం చేత యాజమాన్యం చేయబడుతున్న  బ్యాంకులను జాతీయ బ్యాంకులంటారు. వీటిల్లో ముఖ్యమైనవి రిజర్వుబ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ హైదారాబాద్, యూనియన్ ఆఫ్ హైదరాబాద్, కెనరా బ్యాంక్, ఆంధ్రాబ్యాంక్, పంజాబ్ బ్యాంక్, నేషనల్ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, సిండికేట్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యునైటెడ్ కమర్షియల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడ, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అలహాబాద్ బ్యాంక్ మొదలైనవి దాదాపు 30 వరకుఉన్నాయి.

**10. దేశ ఆర్థికాభివృద్ధిని స్టాక్ మార్కెట్లు ఏ విధంగా ప్రభావితం చేస్తాయి. స్టాక్ మార్కెట్లు లేకుంటే ఏమవుతుంది?**

లోక జీవన్ రెడ్డి, తిమ్మాపుం

జ. ప్రజల దగ్గర వ్యయానికి మించిన ఆదాయం ఉన్నప్పుడు ఆ ద్రవ్యాన్ని ఏ విధంగా వినియోగించుకోవాలి. ఇల్లు కట్టుకోవచ్చు/కొనుక్కోవచ్చు. వాటిమీద వచ్చే అద్దెలను అనుభవించవచ్చు. కాని ఇటువంటి పెట్టుబడుల మీద చాలా తక్కువపెట్టుబడి ఉంటుంది. వీటిని అమ్ముకోవాలంటే ఒక మార్కెట్ అంటూ లేదు.

వీటికి ప్రత్యామ్నాయంగా కంపెనీలలో షేర్లు కొనుక్కోవచ్చు. ఈ పేర్లను అమ్మకం/కొనుగోలు చేయడం కోసం ఉన్న వ్యవస్థ స్టాక్/ షేర్‌మార్కెట్ అంటారు.

ఏ కంపెనీ యొక్క షేర్‌నైనా నిమిషాల్లో కొనుక్కోవచ్చు. అమ్ముకోవచ్చు. ఇళ్ళ స్థలాలకు గాని, ఇళ్ళకు గాని మరే వస్తువుకు గాని ఇటువంటి మార్కెట్ లేదు. కంపెనీలు బాగా పనిచేసి లాభాలను గడిస్తుంటే షేర్ విలువ పెరుగుతూ ఉంటుంది.

ఉదా॥కొన్ని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కంపెనీల్లో 15 సంవత్సరాల క్రింత రు.10లకు కొనుకున్న షేర్ ఈనాటి మార్కెట్లో రూ॥ 50,000ల విలువలో ఉన్నది. అన్ని కంపెనీల షేర్లు ఇలా పెరగలేదు. కొన్ని కంపెనీలు పూర్తిగా మాయమైనాయి. ప్రజల మిగులుధనం పరిశ్రమలకు వ్యాపారాలకు పెట్టుబడిగా ఉపయోగపడటానికి పనిచేస్తున్న వ్యవస్థ స్టాక్ మార్కెట్లు, ఇవి లేకపోతే పరిశ్రమ వ్యాపారాభివృద్ధి కేవలం అప్పులమీదే ఆధారపడి త్వరగా అభివృద్ధి చెందదు.

## జూన్ 2006

**1. దేశంలో నేడు ఉన్నత విద్యాసంస్థల్లో రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ ఆందోళన జరుగుతుంది, కోటా పై కేంద్రం మంత్రుల కమిటీ నియమించింది, మరి దీనికి పరిష్కారమేమిటి?**

కె.వి. హైద్రాబాద్

జ. ఇంతవరకూ జరిగిన రిజర్వేషన్లు వల్ల ఎంత మందికి లాభం జరిగింది? ఉద్దేశించినంత విస్తృతంగా ఎందుకు జరగలేదు, అనేవి క్షుణ్ణంగా విచారించి అన్ని కోణాల నుంచి సమరస భావంతో దేశవ్యాప్తంగా చర్చించిన తరువాత ఒక పరిష్కార మార్గం మనం ఎంచుకోవాలి. ఏ పద్ధతిని మనం అంగీకరించినా అది సమాజాన్ని విచ్ఛిన్నం చేసేదిగా ఉండకూడదు, దేశాన్ని ముక్కలు చేసేదిగా ఉండకూడదు, ఒక నిర్దుష్టమైన కాలంలో రిజర్వేషన్ల అవసరం లేకుండా ఉండే విద్యా విధానాన్ని ప్రాథమిక స్థాయి నుంచి మనం ప్రవేశపెట్టాలి.



**2. పశ్చిమ బెంగాల్‌లో వామ పక్షాలు గత 3 దశాబ్దాలుగా విజయం సాధించటానికి గల కారణాలు ఏమిటి? వారి పాలన ప్రజా రంజకంగా ఉన్నదా?**

యం. సంయుక్త, కరీంనగర్

జ. వరుసగా 7 సార్లు పశ్చిమ బెంగాల్‌లో వామ పక్షాలు ఎన్నికలలో గెలిచాయంటే, వారి పాలన బహుజనులకు ఆమోద యోగ్యమైనదే అని విదితము. మరి బహుజనులలో ఎందరో భారతీయులు, ఎందరో బంగ్లాదేశ్ నుండి మన దేశంలోకి చొచ్చుకువచ్చి, కమ్యూనిష్టుల యొక్క అతిథ్యంలో మన దేశపు ఎన్నికల పట్టీలో చేర్చే అర్హత పొందిన వారు ఎంత మంది, పశ్చిమబెంగాల్ పట్టీలో చేర్చే అర్హత పొందిన వారు ఎంతోమంది,పశ్చిమబెంగాల్ యొక్క జనాభా, ఆంధ్ర ప్రదేశానికన్నా 1981 సం॥వరకూ తక్కువగా ఉండేది. కాని, అప్పటి నుంచీ శరవేగంతో పెరిగి మన జనాభాకన్నా ఎక్కువైపోయింది. దీనికి కారణం కూడా అందరికీ తెలిసిందే. హిందువులు ఒకరిద్దరు పిల్లలతో సరిపెట్టుకుంటున్నారు. ముస్లింలు ఎంత మంది నైనా కంటున్నారు. దానికి తోడుగా బంగ్లాదేశ్ నుంచి ముస్లింలు కోట్ల సంఖ్యలో పశ్చిమ బెంగాల్‌లో ప్రవేశించి, ఓటర్లు అయిపోయారు, ముస్లిం ఓటర్లు 15% నుంచి30%పైకి పెరిగారు. కొన్ని జిల్లాలలో వారు అధిక సంఖ్యాకులైపోయారు. దేశ విభజన కావాలని, ఇస్లామిక్ పాకిస్తాన్ నిర్మాణం ముస్లింల హక్కు అని, కమ్యూనిస్టు పార్టీ 1940 దశకంలోనే సిద్ధాంతీకరించి, ముస్లిం బంధువుగా తయారైంది. ఈ విధంగా ముస్లిం ఓట్ బ్యాంక్ తయారవడం కమ్యూనిస్టు విజయానికి ఒక పెద్ద కారణం. రెండోది గ్రామసీమల్లో భూసంస్కరణలను అమలుచేసి, పేదరికాన్ని అందరికీ సమానంగా పంచారు. ఇందువల్ల నిరుపేదలు కమ్యూనిష్టుల వైపే ముగ్గు చూపారు. సంపన్నత లేకపోయినా, సమానత్వం ఉంటే చాలు అనుకొని సంతోషపడే వారు అధిక సంఖ్యాకులైనప్పుడు కమ్యూనిష్టుల విజయం సులువవుతుంది.

**4. ఐఐఎం, ఐఐటి వంటి విద్యా సంస్థల్లో ఫీజులు చెల్లించలేని ప్రతిభ గల విద్యార్థులు చేరలేకపోవుచున్నారు. ఫీజులు చెల్లించగల ప్రతిభ లేని విద్యార్థులు చేరుచున్నారు. మరి దీనికి పరిష్కారం ఏమిటి?**

క్రాంతిశ్రీ– వీరవాసరం

జ. ప్రతిభ కల ప్రవేశార్హత పొందిన ప్రతివిద్యార్థికీ బ్యాంకుల నుంచే అప్పు వచ్చే సౌకర్యం ఉంది. కనుక ఫీజులు చెల్లించలేని, ప్రతిభ కల విద్యార్థులు IIM,IIT లలో చేరడం లేదనడం సంపూర్ణ సత్యంకాదు. IIM,IIT లలో కూడా SC/ST లను రిజర్వేషనుల ఉన్నవి. తద్వారా ఆ కులాల్లో ఫీజులు చెల్లించగల ప్రభుత్వోద్యోగుల పిల్లల కొంత మంది చేరుతుండవచ్చు. రిజర్వేషన్ల సమస్యకు ఒక పరిష్కారం ప్రభుత్వపు లేక ప్రభుత్వం చేత సహాయం పొందిన ప్రతి విద్యాలయం నూటికి నూరు పాళ్ళు రిజర్వేషన్లు ఉపయోగింపబడడం, ఇతరులకు మైనార్టీలకు ఉన్నట్లుగానే ప్రైవేటు విద్యా సంస్థలు స్థాపించుకునే విశేషాధికారాన్ని ఇవ్వడం, వీటికి కూడా ఓట్ల కోసం పాట్లుపడే పార్టీలు ఒప్పుకోక పోయినట్లైతే ఏదోవిధంగా డబ్బు సేకరించి, తమ పిల్లలను ఉన్నత విద్యకోసం విదేశాలకు పంపడమే. ఇది అవాంఛనీయమైనా ప్రస్తుతం మనదేశంలో దుష్టశక్తుల పాలనవల్ల అనివార్యమౌతోంది.

**5. ఈనాడు భారతావనిలో ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలేమిటి?**

బి. రాములు నల్గొండ

జ. ప్రతిభ, ప్రజ్ఞ, దేశభక్తి, ముందుచూపు, నిజాయితీ లోపించి సామాన్యంగా ఏ మంచి ఉద్యోగానికీ అర్హతలేనివారు ప్రజాసేవ అనే మిషతో రాజకీయాలను వృత్తిగా చేసుకుని శాసనసభ సభ్యత్వానికి పోటీ చేసి గెలిచి, మంత్రి పదవులను పొంది, అందుకు ఎన్నికలలో గెలవడం కోసం నానారకమైన ప్రజారంజకమైన సంపద సృష్టికి వ్యతిరేకమైన వాగ్దానాలు చేసి, ప్రజలను మభ్యపెట్టడం మన ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న భయంకరమైన సమస్య. ఉదా॥ ఇటీవల



తమిళనాడులో జరిగిన ఎన్నికలలో పార్టీలు చేసిన వాగ్దానాలే నిదర్శనం. ఇంటింటికీ కలర్‌టీవీలని, కుటుంబానికొక ఆవు అని, విదేశీ కంపెనీలలో ఉద్యోగమనీ, బియ్యం కేవలం కిలో రెండు రూ॥లకేనని వాగ్దానాలు చేయబడ్డాయి. అటువంటివి అమలు చేయడానికి 14,000 కోట్ల రూపాయలకు పైగా కావలసి వస్తుందని అంచనా. ఇది ఎవడబ్బసొమ్ము, ఎక్కడ నుంచి వస్తుంది. ఒకవేళ ఆ డబ్బువస్తే, అందరికీ మంచి చదువూ, ఆరోగ్యం వంటి పథకాల వల్ల ఎక్కువ మేలవుతుంది కదా!

**6. ఇంటర్మీడియట్,10వతరగతి పరీక్ష ఫలితాలు ప్రకటిస్తూ "ర్యాంకులు"రద్దు చేశారు. ఇది మంచి పద్ధతేనా? దీనివలన చేకూరే లాభం ఏమిటి?**

ఆర్. రాంబాబు, విజయవాడ

జ. ర్యాంకులు రద్దు చేయడం మంచిదీకాదు. చెడూకాదు. ప్రతీ మంత్రి ఏదో ఒక కొత్త పంథాని ప్రవేశపెట్టామనిచెప్పుకోవడం పరిపాటి అయిపోయింది. స్వతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ ఏ డిగ్రీలేని వాళ్ళు కూడా విద్యామంత్రులు, నాయకులు అయి, విద్యా సంస్కరణలను ప్రవేశపెడుతూనే ఉన్నారు. ఆ కోవకు చెందిన సంస్కరణయే ర్యాంకులను రద్దు చేయడం.

**7. ఉన్నత విద్య ఉపాధి కల్పనకు తోడ్పడుతూనే విద్యార్థి వ్యక్తిత్వ వికాసానికి, సామాజిక అవగాహనకు విద్యార్థి ఆత్మవిశ్వాసానికి ఉపయోగపడాలికదా! మరి నేటి మన ఉన్నత విద్య ఆ విషయాలలో ఎంతవరకు ఉపయోగపడుతుందంటారు. ఉన్నత విద్యలో మీరు వాంచిస్తున్న మార్పులేమిటండీ**

ఆర్. కృష్ణారావు, తిరుపతి

జ. ఉన్నత విద్య ప్రయోజనాలను మీరు చక్కగా నిర్వచించారు కాని, ఉన్నత విద్య మీ లక్ష్యసాధన ప్రస్తుత ఉన్నత విద్యకు విజ్ఞులు వాంఛించే లక్ష్యాలనుపొంతన లేదు. కారణం ప్రాథమిక విద్య దశ నుంచే ఈ లక్ష్య సాధనకు కావలసిన విద్యా బుద్ధులను మనం నేర్పడం లేదా కేవలం ప్రవేశ పరీక్షలలో మార్కులు పొందడం కోసమే తర్ఫీదు ఇవ్వబడుతోంది. విలువలన్నీ హైస్కూలు చదువులోనే నేర్పాలి.

**8. మనరాష్ట్రంలో అధికార భాషా సంఘం ఎప్పుడు ఏర్పడింది? దీని ఆశయాలు, ఆదర్శాలు ఏమిటి? ఇంత వరకు ఈ అధికార భాషా సంఘం సాధించిందేమిటో వివరిస్తారా?**

వి. సుబ్బారావు, సూర్యపేట

జ. మనరాష్ట్రంలో అధికార భాషా సంఘం 1966వసం॥లో ఏర్పడింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రాంతీయ భాషలైన తెలుగు, ఉర్దూల ప్రయోగం జరగాలని ప్రజలకు ప్రాంతీయభాషా ప్రయోగం వల్ల మేలు కలుగుతుందని ఆశయాలు. మనం ఏం సాధించామో కనుక్కోవడానికి తెలుగులో ప్రభుత్వానికి ఉత్తరం వ్రాస్తే, దాని పర్యవసానం ఏమిటో మనకు తెలుస్తుంది.

**9. అగ్రస్థానంలో గాంధీ-నెహ్రూ కుటుంబం లేకుండా కాంగ్రెస్ కొనసాగగలదా?**

సి. ఆంజనేయులు, విశాఖపట్టణం

జ. మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ కుటుంబీకులు కాంగ్రెస్‌లో లేరు. పార్శీ అయిన ఫిరోజ్‌గాంధీ, "కోరుకోకుండా హిందువుగా పుట్టిన" జవహర్‌లాల్ నెహ్రూ గారి కూతురు అయిన ఇందిర గారికి పుట్టిన వారు రాజీవ్, రాజీవ్‌గారు పెళ్ళి చేసుకున్నది ఇటలీకి చెందిన సోనియా, ఈ సత్యాల నుంచి కాంగ్రెస్‌లో మహాత్మాగాంధీ వంశస్థులు గాని, జవహర్‌లాల్ నెహ్రూ యొక్క అపత్యం కాంగ్రెస్‌లో ఎంతవరకు ఉందో మనం అంచనా వేసుకోవచ్చు. కాని, ఏదోవిధంగా ఆ పేర్లను సంగ్రహించడం మూలానా ఈ దేశంలోని వందకోట్లపై జనాభాలో ఆ పేర్లతో సంబంధం లేనివారు ఎవరూ కూడా కాంగ్రెస్ యొక్క అధినాయకత్వాన్ని చేపట్టలేక పోవడం మన జాతి నిర్వీర్యతకు చిహ్నం అని అనుకుంటున్నాం.

**10. అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతున్న మహిళలకు రిజర్వేషన్ అవసరమంటారా?**

డి.చంద్రహాస్, పామర్రు





జ. రిజర్వేషన్ ఉండటం మూలానే కొంతమంది మహిళలైనా, మరే ఇతర వర్గాల వారైనా ముందుకు వెళ్ళే అవకాశం ఉందని ఇందువల్ల రిజర్వేషన్లు ఇంకా ఎక్కువ మందికి ఇవ్వాలని కొంతమంది సిద్ధాంతీకరిస్తున్నారు. ఏ రిజర్వేషనైనా రెండు తరాలకు మాత్రమే పరిమితమైతే ఎక్కువ మంది దురదృష్టవంతులకు ప్రయోజనం చేకూరుతుంది.

**11. చిన్న రాష్ట్రాలు పాలనా సౌలభ్యానికి ఎంతవరకు దోహదకారి కాగలవు.**

జ. చిన్న రాష్ట్రాలలో పరిపాలన ప్రజలకు దగ్గరగా ఉండడానికి ఎక్కువ అవకాశం ఉంది. కానీ, ఎంత చిన్న రాష్ట్రం అయితే అంత ఎక్కువగా కులమతాల ప్రాముఖ్యం కూడా పెరగవచ్చు. ఎందుకంటే ప్రస్తుతం మన దేశంలో అందరూ రాజకీయ నాయకులు కులకూటములను తయారుచేసి వెనుకబాటు తనాన్ని ఆత్మీయం చేసుకుని, కుల ప్రాతిపదికన అభ్యర్థులను నిలబెట్టడం, ప్రభుత్వంలోని ప్రముఖ పదవులను కులం వారీగా పంచిపెట్టడం, ఇటువంటి దుష్ట పద్ధతుల వలన చిన్న రాష్ట్రాలలో కుల ఘర్షణలకు, కులపాలనకు ఎక్కువ తావు ఉండవచ్చు.

**12. సమాజంలో కులసంఘాల అవసరమా? కుల సంఘాలు నిర్మిస్తే కులం బలపడుతుందా?**

జ. ఎన్నికల్లో గెలవడం లక్ష్యం అనే రాజకీయ నాయకులు కోకొల్లలుగా ఉండడం మూలానా ఎప్పుడూ లేని కుల విద్వేషాలు, కుల సమీకరణలు, ఇప్పుడు జరుగుతున్నాయి. అంతకు ముందు కుల మనేది వారికి సామూహిక సంక్షేమం కల్పించేదిగా ఉండేవి. కమ్మ హాస్టళ్ళు, రెడ్డి హాస్టళ్ళు, వెలమ హాస్టళ్ళు వగైరాలు ఏ కుల విద్వేషానికి కారణం కాలేదా, ఎన్నో వృత్తిపరమైన సంస్థలు, క్లబ్బులు ఉంటున్నాయి కదా ఉదా: ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ అని,సికింద్రాబాద్, వాల్తేరు కంట్రీ క్లబ్బులు ఉన్నాయి. అందులోని సభ్యత్వం కోసం కొన్ని నియమాలున్నాయి. అదే విధంగా ఇతరులకు వ్యతిరేకంగా కాకుండా ద్వేషాన్ని పెంచకుండా పరస్పర సహకారం కోసం తమ పరంపరలనూ,సంస్కృతినీ ప్రాతిపదికగా చేసుకుని పనిచేసే సంఘాల వల్ల నష్టం లేదని నా అభిప్రాయం.

ఇది రాజకీయాల్లోకి దిగకుండా విద్యార్థుల సంక్షేమం అటువంటి మంచి పనులను పాటుపడితే కుల సంఘాల వల్ల నష్టం లేదు.

## జులై 2006

**1. ప్రపంచమంతా ఒకే రాజ్యాంగం ఏర్పడితే ఎలా ఉంటుందంటారు? వివరించగోరుచున్నాను?**

టి. రవికుమార్, వరంగల్

జ. మానవ సమాజాలు ఏర్పడిన వేలాది సంవత్సరాల చరిత్రలో ప్రపంచమంతటా ఒకే రాజ్యాంగాని, రాజ్యాంగం ఉండటం గాని జరుగలేదు. ప్రస్తుతం ఐక్యరాజ్య సమితిలో (ఐరాస) 191 దేశాలు ఉన్నాయి. ఐరాసను స్థాపించిన మహనీయులు క్రమక్రమంగా సభ్యరాజాలు ఒకే ఆశయాలు రూపురేఖలు ఉన్న రాజ్యాంగాలను ఏర్పరచుకొంటాయని ఆశించారు. కాని ప్రపంచస్థాయిలో అన్ని దేశాలకు వర్తించే రాజ్యాంగం ఎప్పుడూ కూడా రాదు. ఏసుక్రీస్తు ప్రపంచంలోని అన్నిదేశాల ప్రజలు ఇస్లాం మతాన్ని స్వీకరించిన తరువాత దేవుని రాజ్యం వస్తుందని చెప్పారు. సోవియట్ రష్యా ప్రపంచంలోని అన్ని దేశాలను కమ్యూనిస్టు రాజ్యాలుగా మార్చి ప్రపంచస్థాయిలో కమ్యూనిజాన్ని నెలకొల్పుదామనుకుంది. మత ప్రవక్తలు, రాజకీయ ప్రవక్తలు, ఐరాస సంస్థాపకులు ఆశించినది కలలుగా మాత్రం ఉంటాయి. మనదేశానికంతటికీ ఒకే రాజ్యాంగం ఉన్నప్పటికీ రాష్ట్రాల మధ్య, ఒకే రాష్ట్రంలోని ప్రజలమధ్య ఎటువంటి వివిధత ఉన్నదో గమనించండి.

**2. ఒక విశ్వవిద్యాలయానికి, మరొక విశ్వవిద్యాలయానికి సిలబస్ పరీక్షల నిర్వహణలో తేడాలు ఎక్కువగా ఉంటున్నాయి. అదేవిధంగా కాక కామన్ సిలబస్, కామన్ పరీక్ష నిర్వహించడానికి వీలుండదా?**

ఎ. నరసింహామూర్తి, గుంటూరు

జ. తలచుకుంటే అన్ని విశ్వవిద్యాలయాలకు ఒకే సిలబస్, ఒకే స్థాయిగల పరీక్షలు ఉండవచ్చు. కాని ఒక్కొక్క విశ్వవిద్యాలయం కొన్ని విషయాలలో అత్యధిక ప్రావీణ్యతను సంతరించుకుంటోంది. ప్రకృతిలోనే వివిధత సహజం. ఒకే



పాఠ్యాంశాలను అన్ని రాష్ట్రాలు అన్ని సమాజాలు ఒప్పుకోవు. కామన్ పరీక్ష నిర్వహించడం కష్టం కాదు. ప్రవేశం కోసం IIT లు, IIM లు దేశమంతటా కామన్ పరీక్షలను నిర్వహిస్తున్నాయి. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కూడా ప్రభుత్వోద్యోగుల కోసం దేశవ్యాప్తమైన పరీక్షలను వివిధ భాషల్లో జరుపుతోంది.

**3. ప్రధాని మన్‌మోహన్ సింగ్‌గారి పరిపాలన ఎలా ఉందంటారు?**

పి. నగేష్, ఖమ్మం

జ. పలికెడిది భాగవతమట పలికించెడి విభుదు రామభద్రుడట పలికిన భవహరముగనట

వెరొండుగాథ పలుకగనేల అన్నట్లుగా ఉంది. పలికించెడిది, చేయించెడిది (పాలించెడిది) మన్మోహన్ సింగ్‌గారు కాక, మరొక రాజ్యాంగేతర వ్యక్తి అని పదే పదే నిరూపితమౌతుంది. అలనాడు పోతన చెప్పుకున్నట్లుగా, మన్మోహన్ సింగ్‌గారు కూడా చేయించే వారిని సవినయంగా స్తుతిస్తూనే ఉన్నారు.

**4. ఎస్సీరిజర్వేషన్లు పెంచుతాం అని కేంద్ర సాంఘిక న్యాయం, సాధికారిత మంత్రి మీరాకుమార్ గారు అంటున్నారు కదా? అది న్యాయ సమ్మతమా?**

ఎస్. జాహ్నవి, కరీంనగర్

జ. ముస్లిములకు రిజర్వేషన్లు ఇవ్వడం, ప్రైవేటే కంపెనీల్లో ప్రైవేట్ కళాశాలల్లో రిజర్వేషన్లు కొంతమందికే కల్పించడం, రాజ్యాంగానికి విరుద్ధమా, కాదా అనే అంశం న్యాయస్థానాల్లో వాదించబడుతోంది.

**5. డాలరు రేటులో మార్పువస్తే బంగారం ధరల్లో తేడాలొస్తాయెందుకు?**

సి. సుజాత, తిరుపతి

జ. భారతదేశవాసులకు బంగారం అంటే మహాప్రీతి. ప్రతి సంవత్సరం కొన్ని వందల టన్నుల బంగారాన్ని మనం దిగుమతి చేసుకుంటున్నాం. ఈ దిగుమతులకు విదేశీ కరెన్సీతో, విశేషించి అమెరికన్ డాలర్స్‌లో చెల్లించవలసి ఉంటుంది. కాబట్టి డాలరు రేటు మారితే బంగారం ధరల్లో కూడా తేడాలు వస్తాయి.

**6. ప్రపంచ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి (IMF) ఈ రెండింటికి తేడాఏమిటి? విధులు బాధ్యతలు ఏమిటి?**

జ. ప్రపంచ బ్యాంక్ ఇంగ్లీషులో పూర్తి పేరు International Bank for Reconstruction & Development (IBRD) రెండవ ప్రపంచ యుద్ధం తరువాత బడుగుదేశాల అభివృద్ధికి పెట్టుబడులు కావలసివచ్చాయి. అటువంటి పెట్టుబడులు అన్నీ ఏ ఒక్క దేశం కూడా చేయలేదు. అందుకనే అన్ని దేశాలు కలసి International Monetary Fund (IMF) అంతర్జాతీయ ద్రవ్యనిధులను వాషింగ్టన్‌లో స్థాపించారు. IMF ఇచ్చే అప్పులు దీర్ఘకాలికమైనవి, అతి తక్కువ వడ్డీతో ఇవ్వబడుతాయి. అసలు తిరిగి చెల్లించడం ఏ ఇరవైఏళ్ళ తర్వాతగాని జరుగుతుంది. IMF ఇచ్చే అప్పులు మరీ బీద దేశాల కోసం ప్రపంచ బ్యాంకు ఇచ్చే అప్పులు తక్కువ కాల పరిమితి, ఎక్కువ వడ్డీతో కూడుకున్నది.

ఏ దేశమైనా ఆర్థిక సంక్షోభంలో ఉంటే, కావలసిన దిగుమతులకు డబ్బు లేకున్నట్లయితే ప్రభుత్వరంగ సంస్థలు దివాళా ముఖంగా ఉన్నట్లయితే, వీటన్నిటిని చక్కదిద్దటానికి కావాల్సిన అప్పులను ప్రపంచబ్యాంకు ఇస్తుంది. "అప్పిచ్చువాడు, వైద్యుడు" అన్నట్లుగా, అడిగినవానికల్లా వారిష్టం వచ్చిన వ్యయం కోసం ప్రపంచబ్యాంకు అప్పులు ఇవ్వక, కొన్ని షరతులను విధిస్తుంది.

## ఆగస్టు 2006

**1. 1993 నుండి నేటి వరకు టెర్రరిస్టులు తరచు ముంబయి పైనే దాడులు జరపడానికి కారణాలేమిటండీ?**

కె.వి.ఎన్. రావ్, హైద్రాబాద్

జ. ఒక ముంబైపేనే కాదు. టెర్రరిస్ట్‌లు కోయంబత్తూర్, చెన్నై, నాగపూర్, హైదరాబాద్, గాంధీనగర్, జమ్మూ కాశ్మీర్, వారణాసి, ఢిల్లీ, కాశ్మీర్‌లో మరెన్నో



ప్రదేశాలలో దాడులు జరిపారు. కలకత్తాలో మాత్రం దాడులు జరగలేదు. దానికి కారణం కలకత్తా ముస్లిం మెజార్టీ అయిపోయింది. బంగ్లాదేశ్ నుంచి ఎంతో మంది ముస్లింలను ఓట్లకోసం బిజెపి తప్ప అన్ని పార్టీలు విశేషించి కమ్యూనిష్టు పార్టీ ముస్లింలను దిగుమతిచేసుకుని ఓటర్లుగా నమోదు చేసి అజేయమైన పార్టీగా 30 ఏళ్ళ నుంచి పాటిస్తోంది. ఖురాన్‌ని అనుసరించి ప్రపంచం రెండు భాగాలుగా విభజించబడింది. దారుల్ అమన్ – అంటే ఇస్లాం ఆధిపత్యంలో ఉన్న భూభాగాలు అక్కడ ఇస్లామిక్ శాంతి ఉంటుంది. అది జిహాదీలకు యుద్ధభూమి కాదు. రెండవది దారుల్‌హర్బ్ అంటే ముస్లింల ఆధిపత్యంలేని దేశాల్లో ప్రాంతాలు అవి రణరంగంగా పరిగణించబడుతాయి. పశ్చిమ బెంగాల్‌నువదిలి బారతదేశం అంతా దారుల్‌హర్బ్ అంటే ఇస్లామియాలకు రణరంగం, భారతదేశంలో ముంబై అతి ప్రాముఖ్యమైన పట్టణం వాణిజ్య కేంద్రం భారత దేశంలోని ఆర్థిక, పారిశ్రామిక ప్రగతి అంతా కూడా ముంబైలో ప్రణాళికా బద్ధం చేయబడుతోంది. దేశంలో కల్లా పెద్ద షేర్ మార్కెట్, భారతదేశం యొక్క సంపద అతి పెద్ద భాగం ముంబైలోనే ఉత్పత్తి అవుతోంది. అందుకనే ఆ నగరాన్ని అస్తవ్యస్తం చేయడం జిహదీయుల లక్ష్యం. వారి కి అనుకూలంగా ఉత్తరప్రదేశ్, బీహార్‌ల నుంచి వచ్చిన స్థానికంగా ఉన్న ముస్లింలు అందరూ కలిసి సమాజ్‌వాద్ పార్టీ అనే ముసుగులో సెక్యులిజం అనే నినాదంతో జిహాదీయులకు ఆశ్రయం ఇస్తున్నారు. ముంబైలో కొన్ని ప్రాంతాలలో భారతీయ చట్టాలు వర్తించవు. ఆ ప్రదేశంలోకి పోలీసులను రానివ్వరు. అవి విదేశాల్లాగా తయారైపోతున్నాయి. అటువంటి స్థావరాలను హైదరాబాద్ వంటి నగరాల్లో కూడా జిహాదీయులు ఏర్పరచుకుంటున్నారు. పాకిస్తాన్ నుంచి పశ్చిమ ఆసియా గల్ఫ్ దేశాల నుండి ఆర్.డి.ఎక్స్ అనే విస్ఫోటక పదార్థాన్ని సముద్ర తీరపు మహారాష్ట్రలోని గ్రామాల్లోని తీసుకు రావడం బాగా సులువు, ఇన్ని కారణాల వల్ల ముంబై జిహాదీలకు లక్ష్యంగా తయారౌతుంది.

**2. జూన్ 29న కేరళ ప్రభుత్వం కొత్తగా "ప్రొఫెషన్ కళాశాలల నియంత్రణ చట్టం ప్రవేశ పెట్టింది అని విన్నాం దాని వలన ఎలాంటి ప్రయోజనం సామాన్య విద్యార్థికి కలుగుతుందో వివరిస్తారా? ఆ చట్టాన్ని దేశమంతటా అమలు చేయవచ్చా.**

కె.బి.కె. మచిలీపట్టణం

జ. కేరళలో ఉన్నన్ని మైనార్టీ కళాశాలలు మరే రాష్ట్రంలో కూడా లేవు. ముస్లింలు, క్రిష్టియలు కలపి 45% పైన ఉన్నా వారిని మైనార్టీలంటారు. అభాగ్యులైన హిందువుల యొక్క నిష్పత్తి 1947సం॥లో 65% ఉంటే ఇప్పుడు 52% – 53%కి దిగజారిపోయింది. ఇటీవల ప్రైవేట్ వృత్తి కళాశాలలు మైనారిటీల ద్వారా అసంఖ్యాకంగా స్థాపించబడుతున్నాయి. మన రాష్ట్రంలోనూ అంతే. కేరళలోని కమ్యూనిష్టు ప్రభుత్వం మైనార్టీలకు మిత్రులు. హిందువులకు శత్రువులు. ప్రైవేటు కళాశాలలు సమాజ న్యాయం కింద నాన్–మైనార్టీ కళాశాలలు బిసిలకు రిజర్వేషన్ కల్పించాలి. 45%పై నున్న మైనారిటీ కళాశాలల్లో సమాజ న్యాయానికి స్థానం లేదు. ఇది సెక్యులరిజం యొక్క హిందూ వ్యతిరేక ప్రత్యేకత. ప్రతీ కళాశాలలో ఫీజులను కూడా నియంత్రించడానికి ఈ చట్టం ప్రయత్నిస్తోంది. ఇది మంచిదే కాని దీన్ని కోర్టుల్లో అమలు చేసే ప్రయత్నం మైనార్టీలు మొదలుపెట్టారు. మైనార్టీ వృత్తి కళాశాలలను నిర్మూలించని ఏ చట్టమైనా భారతీయతకు అవహేలనే. ఇష్టం వచ్చినన్ని ప్రతివిధమైన కళాశాలలను హిందువులకు ఇవ్వనంతకాలం హిందువులు వివక్షతకు గురై ఎడ్మిషన్ల ప్రలోభంలో మత మార్పిడులకు సుముఖులౌతారు. కేరళలో ప్రవేశపెట్టబోయే చట్టం వల్ల సామాన్యులకు గలిగే పెద్ద ప్రయోజనం లేదు.

**3. స్వాతంత్ర్య భారతావనికి అప్పుడే 60 వసంతాలువచ్చాయి కదా? ఈ 60 ఏళ్ళ ప్రస్థానములోని చీకటి వెలుగులను వివరిస్తారా?**

జ. దేశం జనాభా అంతులేకుండా పెరిగిపోవడం అందులోను నిరక్షరాస్యులకు, బీదలకు ఎక్కువమంది సంతానం ఉండడం, ఇంకా దేశంలో 35% నిరక్షరాస్యులుగా



ఉండడం,ఓట్లకోసం దేశ సంపత్తికి బీదరిక నిర్మూలనం ఉండడం, ఓట్లకోసం దేశ సంపత్తికి బీదరిక నిర్మూలనం అనే నినాదం కింద వృథా చేయడం, బాధ్యతలను గురించి మాట్లాడకుండా హక్కులను గురించి మాట్లాడడం, ఓట్ల కోసం మైనారిటీలను బుజ్జగిస్తూ వారు వేరుగా ఉండడం కోసం, వారికి అన్ని ప్రయోజనాలు చేకూర్చుతూ హిందువులకు అన్యాయం చేయడం, మతమార్పిడులు ఎక్కువై పోవడం, చర్చి,మసీదు భూములనే కాక హిందూ దేవాలయాల భూములను కబళించడం ఇత్యాదులు భారతదేశాన్ని ఆవరించిన చీకట్లు, అన్నిటినీ మించిన చీకటి భారతదేశాన్ని ముక్కలు ముక్కలుగా చేయడం కోసం ముస్లింలు, క్రిష్టియన్ల, విభాజక ప్రయోజనాలను సెక్యులరిజం పేరుతో పరిరక్షించడం, ఇక వెలుగుల సంగతికి వస్తే మన ఆర్థికాభివృద్ధి చైనాతో దీటుగా జరుగుతోంది. బాగా చదువుకున్నవారు, పరిమిత కుటుంబం గలవారు తమ తెలివి తేటలను, చొరవను ఉపయోగించి ఎన్నో వ్యాపార సంస్థలను, పరిశ్రమలను ప్రపంచస్థాయిలో నెలకొల్పుతూ, ఎంతో ఉపాధి కల్పన చేస్తూ దేశ ప్రగతిని సాధిస్తున్నారు. దురదృష్టమేమంటే వాళ్ళకు సంకెళ్ళు వేయటానికి ఓట్లకోసం పాట్లుబడే రాజకీయ నాయకులు పక్షాలు, కుల,మత, విభేదాలను సృష్టించి మన మేధావి పారిశ్రామిక, వ్యాపార దక్షులను కృంగదీస్తున్నారు.

**4. ఔట్ సోర్సింగ్ అంటే ఏమిటి?**

కె.రాజారావు, విజయవాడ

జ. ఒక పరిశ్రమకాని, వ్యాపారం కాని చేస్తున్నప్పుడు దీనికి సంబంధించిన అన్ని పనులు కంపెనీలో పనివాళ్ళను పెట్టి చేయించుకోకుండా, వ్యాపారానికి, పరిశ్రమకు ఆ ఉద్యమానికి అతి ప్రాముఖ్యమైన పనులను మాత్రమే కంపెనీలచేత చేయించుకోవడం అవుట్ సోర్సింగ్ అంటారు. ఉదా॥ కార్యాలయం యొక్క పరిశుభ్రతా భద్రతలు కంపెనీ నియమించిన ఉద్యోగులచేత కాక, క్లీనింగ్, సెక్యూరిటీ సర్వీసెస్‌లకు ఒప్పగించడం అవుట్ సోర్సింగ్‌కు ఒక ఉదాహరణ. ఇది ఒక దేశంలో కాక మరొక దేశంలో ఉండే కంపెనీలకు అప్పజెప్పడాన్ని కూడా అవుట్

సోర్సింగ్ అంటారు. ఇది కూడా అవుట్ సోర్సింగ్‌కు ఉదా॥దీన్ని యొక్క సిద్ధాంతంభగవద్గీతలో చెప్పబడింది.

శ్రేయాన్ స్వధర్మో విగుణః ।
పరధర్మాత్ స్వనుష్ఠితాత్
స్వధర్మే నిధనం శ్రేయః
పరధర్మో భయావః

తమకు స్వభావ సిద్ధమైన చాతుర్యాన్ని ఉపయోగించుకోవడం తమకంటే సమర్థవంతంగా ఇతరులు చేసే పనులను వారిచేత చేయించుకోవడం, ఇవన్నీ కార్యకుశలతకు, అత్యధిక ఉత్పాదకత, లాభాలను పొందడం కోసం ఉపయోగించే పద్ధతులు.

**5. భారతదేశం ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి పదవికోసం ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ పదవికోసం కాక శాశ్వత సభ్య దేశాల సరసన చేరడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తే బాగుంటుంది కదా! ప్రధాన కార్యదర్శి పదవి వల్ల శాశ్వతహోదా పొందే అవకాశం పోగొట్టుకుంటామేమో? నా అభిప్రాయంతో మీరు ఏకీభవిస్తారా?**

రెగుల భాగ్య తిప్పాయపల్లి, కరీంనగర్

జ. భారతీయుడైన శశిథరూర్ ఐ.రా.స యొక్క సెక్రటరీ జనరల్‌గా ఎన్నుకోబడగలిగే అవకాశం బహు స్వల్పం. భారత ప్రభుత్వం థరూర్ గారి అభ్యర్థిత్వాన్ని బలపరచడం విజ్ఞతకు,విచక్షతకు తార్కాణం కాదు, దీనిబదులు భద్రతా సమితి యొక్క శాశ్వత సభ్యత్వం కోసం ప్రయత్నిస్తేనే మంచిది.

**6. బి.ఫారం అంటే ఏమిటి? ఇతర ఫారాల సంగతేమిటి?**

జ. బి–ఫారం అంటే ఒక పార్టీ ఫలానా వారికి తమ అభ్యర్థిగా ఖరారు చేసి ఇచ్చే ప్రమాణ పత్రం. ఈ బి–ఫారం పొందిన వారికే ఆ పార్టీ యొక్క ఎన్నికల



చిహ్నం ఇస్తారు. ఇతర ఫారాలు జన్మతిథి, నివాసం, కులం, ఇటువంటి వాటిని ధృవీకరించే పత్రాలు.

**7. కులం, మతం, జాతి జనాభా ప్రాతిపదికపై ఇంచుమించు అందరూ తమకు తాము పిల్లలకు రిజర్వేషన్లు కావాలనుకుంటారు? బాగా చదువుకున్నవారు రాష్ట్రస్థాయిలో మంచి మార్కులు తెచ్చుకున్నవారు ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉంటే వారిని ఎలా పైకి తీసుకురావాలన్న ఆలోచన ఎంత మందికి ఉంది?**

కర్రా వరప్రసాద్, యలమర్రు కంద్రీక, కృష్ణాజిల్లా

జ. విద్యలో రాణిస్తున్నవారు బీదవారైనా, వారు అగ్ర కులాలకు చెందిన వారని, వారికి సాయం చేయవలసిన అవసరం లేదని, సాంఘిక న్యాయం కోసం మైనారిటీల సంక్షేమం కోసం వాదించే రాజకీయశక్తులు బీద విద్యార్థుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయి. వారిని రక్షించే, వారి మొర ఆలకించే బాధ్యత ఆ కులం వారికే వదిలి వేయబడేటట్లున్నది. అలా చేద్దామని వారు ఏ కళాశాలనైనా స్థాపించితే, అందులో కూడా వారి ప్రవేశాన్ని నియమితం చేసే చర్యలు ముమ్మరం అవుతున్నాయి.

## సెప్టెంబరు 2006

**1. మన రాష్ట్రం ఏ ప్రాతిపదికన ఏర్పడింది? మరి నేడు ప్రాంతాలవారీగా విభజన కోరుకుంటున్నారు ఎందువలన? దీనికి పరిష్కారం ఏమిటి?**

సి. సుజాత, విజయవాడ

జ. కాకతీయ సామ్రాజ్యం విచ్ఛిత్తి అయ్యేవరకూ (1338) ఇప్పుడు తెలంగాణా, కోస్తా, రాయలసీమ అనబడే ప్రాంతాలలోని తెలుగు వారందరం ఒకే రాజ్యంలో ఉండేవాళ్ళం. నిజాం పాలన వచ్చిన తరువాత ముందు కోస్తా ప్రాంతాన్ని, తరువాత రాయలసీమను బ్రిటీష్ వాళ్ళకి తన్ను రక్షిస్తున్న ఖర్చుకోసం నిజాం ఇచ్చివేశారు. కోస్తా, రాయలసీమ ప్రాంతాలు, బ్రిటీష్ వాళ్ళు ఏర్పరచిన

ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో తమిళులలో కొంతమంది కర్ణాటకలతో, మళయాళీలతో ఉండేవారు, ఆ ఉమ్మడి రాష్ట్రంలో తమిళులకు ప్రాధాన్యత, ఆర్థికాభివృద్ధి జరుగుతూ తెలుగు వారికి అన్యాయం చేయబడుతోంది కాబట్టి మద్రాస్ రాష్ట్రంలోని తెలుగు మాట్లాడే జిల్లాలను వేరు చేసి ఆంధ్రరాష్ట్రంగా ఏర్పరచాలని మనం ఉద్యమిస్తూ ఉండేవాళ్ళం, ఒక భాష మాట్లాడే ప్రజలందరూ ఒకే రాష్ట్రంలో ఉండాలి అనే భాషా ప్రయుక్త రాష్ట్ర సిద్ధాంతాన్ని కాంగ్రెస్ చేత మనం ఒప్పించాం. ఎన్ని తీర్మానాలు చేసినా, మద్రాస్ రాష్ట్రంలోని తెలుగు జిల్లాలకు వేరే ఆంధ్రరాష్ట్రం రాలేదు. చివరకు అమరజీవి పొట్టి శ్రీరాములుగారి ఆమరణ నిరాహారదీక్ష, వారి ఆత్మాహుతి పరిణామంగా 1953 సం॥అక్టోబర్‌లో మనకు ఆంధ్రరాష్ట్రం వచ్చింది. 1940వ దశకంలో కమ్యూనిష్టు ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్యగారు విశాలాంధ్రలో ప్రజారాజ్యం అనే పుస్తకం ద్వారా మద్రాస్‌లోని తెలుగు జిల్లాలేకాదు, నైజాం పాలనలోని తెలుగు జిల్లాలన్నిటితో కలిపి విశాలాంధ్ర ఏర్పడాలిఅని యావత్ తెలుగు ప్రజానీకాన్ని ఉత్తేజపరిచారు. నైజాం పాలనలోని కాంగ్రెస్ నాయకులైన తెలుగువారిలో ప్రముఖులు బూర్గుల రామకృష్ణారావుగారు, పి.వి.నరసింహారావుగారు, రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి గార్లు కూడా విశాలాంధ్రనే కోరేవారు. కె.యం. మున్షీ, సర్దార్ పటేల్‌ల పుణ్యమా అని 1948 సెప్టెంబర్‌లో భారత ప్రభుత్వము పోలీస్ యాక్షన్ ద్వారా నైజాం పాలన అంత మొందింది. ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుతో నైజాం పాలనాంతంతో ఢిల్లీలోని భారత ప్రభుత్వం తన చిరకాల సిద్ధాంతమైన భాషా ప్రయుక్త రాష్ట్రాలను ఏర్పాటు చేయాలని జస్టిస్ ఫజల్ ఆలీ కమిషన్‌ను నియమించింది. ఆంధ్రనాయకులు, తెలంగాణాలోని కొంతమంది నాయకులు నైజాం, హైదరాబాద్ రాష్ట్రాన్ని తెలుగు, మరాఠీ, కన్నడ, భాషలవారీగా విభజించి, తెలంగాణాని, ఆంధ్రాని కలిపి ఆంధ్రప్రదేశ్‌గా కావాలని కోరారు. కొంతమంది తెలంగాణా నాయకులు తెలంగాణాయే ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని కోరారు. చివరకు విశాలాంధ్రాకే ఎక్కువ మద్దతుఉండడం మూలానా వెనుకబడిన తెలంగాణా ప్రాంత త్వరిత అభివృద్ధి కోసం ఇతర విషయాలలో సమతుల్యం ఉండడం కోసం



ఒక పెద్దల అంగీకారం కుదిరింది. తత్ఫలితంగా తెలుగువారందరినీ కలిపిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 1956 నవంబర్1న వచ్చింది. 50 సం॥లుగా కలిసి ఉంటున్నప్పటికీ 600 సం॥లుగా వేరు వేరుగా ఉండడం మూలానా తెలంగాణా, ఆంధ్రుల మధ్య, విద్య, ప్రజాస్వామ్య, సంపన్నత అభివృద్ధి విషయాలలో అసమానతలు వచ్చాయి. నాలుగు సార్లు తెలంగాణా వాళ్ళు ముఖ్యమంత్రులుగా ఉన్నప్పటికీ ఏర్పాటు కోసం రెండుసార్లు ఇక్కడ తెలంగాణాలో అక్కడ ఆంధ్రాలో ఉద్యమాలు వచ్చినప్పటికీ సమైక్యఆంధ్రాయే మంచిదనే కేంద్రప్రభుత్వ ఇందిరా కాంగ్రెస్ యొక్క నిర్ణయం మూలానా ఆంధ్రప్రదేశ్ ఇప్పటి వరకూ అవిచ్ఛిన్నంగా ఉన్నది. కాని, అప్పుడప్పుడు తెలంగాణా ప్రాంతపు నాయకులు వేర్పాటు ఉద్యమాలను లేవదీస్తూ అలజడి సృష్టిస్తున్నారు. ఏ విధంగా అయితే హిందూ ఆధిక్యం వల్ల తాము వెనుకబడి పోయామనే శాశ్వత భావంతో ఎంతమంచి చేసినా సంతృప్తి కలుగని ముస్లింలు ఉన్నారో, అదే విధంగా తెలంగాణా వెనుకబాటుతనం పోవాలంటే ప్రత్యేక రాష్ట్రమే శరణ్యం అనే ఉద్యమం అప్పుడప్పుడు తెలుగు తల్లికి కడుపు నొప్పిలాగా వస్తోంది. దీనికి శాశ్వత పరిష్కారం ఆంధ్రప్రదేశ్‌ని విభజించి, తెలంగాణా, ఆంధ్ర, రాయలసీమలుగా వేర్వేరు రాష్ట్రాలుగా చేయడమే.

**2. జన్మస్థానమైన మనదేశంలో బౌద్ధమతం క్షీణించడానికి కారణమేమి?**

ఎల్. రామారావు, నెల్లూరు.

జ. బౌద్ధం కూడా హైందవంలో నుంచి పుట్టినదే. కాలక్రమేణా హైందవ సమాజంలో తావు చేసుకున్న అసాంఘిక ధోరణులను సవరించడానికి బౌద్ధం శరణ్యమైంది. కానీ, హైందవ మతం తనలోని తప్పులను దిద్దుకోవడానికి సంస్కర్తలకు స్వేచ్ఛను ఇవ్వడం మూలానా శంకరాచార్యాది మహాపురుషుల కృషిచే బౌద్ధం వేరే సంఘటిత మతంగా కాక, హైందవ విశ్వాస, జీవన పద్ధతులలోనే మార్పు తేవడం మూలానా మనదేశంలో అది దాదాపు నశించింది. చైనా, మధ్య ఆసియా ప్రాంతం, కొరియా, జపాన్, బర్మా, సింహళం, థాయ్‌లాండ్ వంటి దేశాలలో అంతకు ముందున్న మతాలకన్నా సనాతన ధర్మోద్భవ బౌద్ధం మెరుగు

కాబట్టి అక్కడ నిలిచింది. మనదేశంలో బుద్ధుడు ఒక అవతారంగా మనం భావిస్తూ బౌద్ధం యొక్క విలువలను తిరిగి మనవిగా చేసుకున్నాం. అందుకే అది అంతమైనట్లు కనిపిస్తున్నా హైందవం యొక్క అంతర్భాగంగా ఉంటోంది.

**3. తరచు వరదలు సంభవిస్తున్నాయి. గదా? వీటిని నివారించే అవకాశం లేదా?**

బి. శేషగిరిరావు కర్నూలు

జ. అతివృష్టి, అనావృష్టి ప్రకృతిలో భాగం. అతివృష్టి వచ్చినప్పుడు నదులు పొంగడం వల్ల వరదలు వస్తాయి. వరదలు విస్తరించి పరిసర ప్రాంతాలలో మనుషులకు, జంతువులకు, ఆవాసాలకు, పంటలకు తదితర సంపత్తికి నష్టం రాకుండా ఉండాలంటే, కట్టలు దాటి ముప్పు చేసే పొడవునా నదికి ఇరువైపులా బలమైన ఎత్తైన గట్లు కట్టాలి. ప్రతి ఏడు వీటికి మరమ్మత్తులు చేయాలి. ఒక నదికి ఎన్నో ఉపనదులుంటాయి. పెద్ద నదియై సముద్రంలో కలిసే ముందు మహాప్రవాహంగా ప్రవహిస్తాయి. దీన్ని డెల్టా ప్రాంతం అంటాం. ఇక్కడ ఎక్కువ గ్రామాలు జనాభా ఉంటాయి. నదీ ఉపనది పరీవాహక ప్రాంతాల్లో ఆనకట్టలు కట్టుతూ జలాశయాలను ఏర్పరచినట్లైతే వరదనీరు సముద్రంలోకి వృధాగా పోతూ, పొంగినప్పుడు నష్టం చేయకుండా ఉండడం కోసం ఎన్నో ఆనకట్టలు నీటిపారుదల ప్రణాళికలను అమలు చేయాలి. మనది సువిశాలదేశం. కొన్నిచోట్ల వర్షాలు, వరదలు వస్తున్నాయి. కొన్ని చోట్ల వర్షాభావం వల్ల దుర్భిక్ష్యం ఏర్పడుతుంది. దేశంలోకి నదులన్నింటినీ అనుసంధింప జేసినచో దాదాపు సం॥పొడుగునా తగు మాత్రంలో దేశం అంతటా నీళ్ళుంటాయి. ఇటువంటి బృహత్పథకాలను, చైనాలో, రష్యాలో విజయవంతంగా నిర్వహించారు. మనదేశంలో ఎంతో మంది ఉపాధిలేని నిరక్షరాశ్యులు పనిలేక పేదరికంలో ఉంటున్నారు. వీరందరికీ ఓట్ల కోసం కేవలం డబ్బు పంచిపెట్టబడే ప్రణాళికలు కాక వీరి శ్రమశక్తిని నదుల అనుసంధానం, వృక్ష సంపద పెంచడం కోసం, రహదారి నిర్మాణం, నీటి పారుదలకోసం కాలువ ప్రణాళికలు వంటి పనులమీద నియంత్రించి పనిచేయిస్తే ఒక 20 సం॥లలో





దేశం సుభిక్షంగా తయారౌతుంది. ఒక్కొక్కప్పుడు కాలువలలో పూడికలు ఏర్పడడం మూలాన పెద్దకాలువల గట్లు తెగిపోవడం మూలానా, వరదనీళ్ళు గట్లనతిక్రమించి ఇళ్ళమీద, చేలమీద పడి అపార నష్టం కలిగిస్తోంది. పూడిక తీయడం, గట్ల మరమ్మత్తు అనేది ప్రతి సం॥నిరీక్షణా నిర్వహణ పద్ధతిద్వారా చేపట్టాలి.

**4. భారతీయ ప్రజాస్వామ్య గుణదోషాలు ఏమిటండీ?**

బి.నళినీ, బందురు

జ. నిరక్షరాస్యులకు, ఏ పన్నుకట్టని వారికీ, అర్హతలను గుర్తించకుండా అందరికీ ఓటు ఇవ్వడం మూలానా, తాత్కాలిక సంతుష్టిని డబ్బు ద్వారానో, కల్లు,సారాయి ద్వారానో కల్గిస్తున్న అభ్యర్థులు ఎన్నుకోబడం మూలానా మన ప్రజాస్వామ్యానికి అపారమైన నష్టం కలుగుతోంది. అభ్యర్థులకు చట్టాలు చేసే ఎం.ఎల్.ఏ, యం.పి.లకు ఏ కనీసార్హతలను విధించకుండా ఉండడం, నేరస్థులు ప్రజా ప్రతినిధులుగా ఉండకూడదనే నియమం లేకపోవడం మన ఎన్నికల వ్యవస్థలో పెద్దలోపాలు. ఆఫీస్‌లలో ప్యూన్‌గా చేయాలన్నా ఒక కనీస అర్హత నియమించబడింది. వారికి క్యారక్టర్ సర్టిఫికేట్ కావాలి. కాని మన ఎంఎల్.ఏలకు, ఎం.పిలకు ఇటువంటి నియమాలు లేవు. ఏడుగురు కలిస్తే ఒకపార్టీని రిజిష్టరు చేసుకోవచ్చు. వందలాది పార్టీలున్నాయి. వేలాది కులాలున్నాయి. ఒక్కొక్క నియోజక వర్గంలో డజన్ల మంది పోటీ చేయడం మూలాన 20% నుంచి 25% ఓట్లు వచ్చిన వాళ్ళు కూడా ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకోబడతున్నారు. అలా వచ్చే వరకు రెండు మూడు సార్లు ఎన్నికలు జరగాలనే నిబంధనలు కొన్ని దేశాల్లో ఉన్నాయి. అప్పుడే ఎక్కువగా ప్రజాభిమానం ఉన్న వ్యక్తులే ఎం.ఎల్.ఏలు, ఎంపిలుగా అవగలుగుతారు.

మన ప్రజాస్వామ్యంలో ఉన్న మంచి గుణం ఏమిటంటే హద్దుమీరి అక్రమాలను చేసిన మంత్రులను, నాయకులను, ఓడించగలిగే వివేకం చదువురాని వాళ్ళలో కూడా ఉంది. అందుకని ఇందిరాగాంధీ అంతటి వ్యక్తి కూడా ఓటమి చవి

చూసింది. ఈ పార్టీలను ఎవరూ ఓడించలేరని చాలా మంది అనుకుంటుంటే, రాజీవ్‌గాంధీ, ఎన్.టి.రామారావు, చంద్రబాబు పార్టీలను ప్రజలను అధికారం నుంచి దించేశారు.

## అక్టోబరు 2006

**1. దేశాభివృద్ధిలో విద్య పాత్ర ఎంత వరకు ఉన్నది?**

ఎల్. రాజరాజేశ్వరి, నెల్లూరు

జ. మనదేశంలో ఉన్నంత నిరక్షరాస్యులు, విద్యావిహీనుల శాతం ఉన్న ఏ దేశమూ కూడా ప్రపంచంలో అభివృద్ధి చెందలేదు. అభివృద్ధి చెందిన మలేషియా, కొరియా,తైవాన్,అభివృద్ధి చెందుతున్న చైనా, ఇండోనేషియా, థాయ్‌లాండ్‌లలో నూటికి 90 మందికి పైన అక్షరాస్యత, విద్య ఉంది. విద్యలేని వానికి సంపాదనా శక్తి ఉండదు. బీదతనంలో వుంటారు. విద్య వున్న అందరికీ ఉపాధి అవకాశం లేకుండా వున్నప్పుడు విద్యలేని వానికి ఏమి ఉపాధి కలుగుతుంది. దురదృష్ట వశాత్తు మనదేశంలో ప్రజాస్వామ్యం అని, ప్రజాక్షేమమని, సోషలిజం అని గొప్పలు చెప్పుకుంటున్న ఏ నాయకులు, ఏ పార్టీ కూడా అందరికీ విద్య లభించే చర్యను తీసుకోలేదు. మరొక విషయం, ప్రామాణికత కల్గిన విద్య ఉన్నవారు శరవేగంతో సంపన్నులౌతారు. లేనివారికి నత్తనడకతో మాత్రమే ఆదాయం పెరుగుతుంది. ఈ రెండు వర్గాల మధ్య అగాధం పెరుగుతోంది. దీనివల్ల సమాజంలో సంఘర్షణ పెరిగే అవకాశం ఎక్కువ అవుతోంది. దేశం యొక్క సమగ్రాభివృద్ధికి అసమానత తగ్గించడానికి సాంఘిక సామరస్యతకు విద్య ఎంతో అవసరం.

**2. టీ కప్పులో తుపాను అంటారు కదా! అంటే ఏమిటి?**

జ. బహుపరిమితమైన సభ్యులలో కాని, ప్రాంతంలోకాని, తీవ్రమైన సంక్షోభం వచ్చినా, దాని యొక్క ప్రభావం, ఇతరుల మీద మసు ఇంతైనా లేకపోయే స్థితిని



టీ కప్పులో తుఫాను అంటారు. ఎందుకంటే టీ కప్పులో ఎంత కలవరం వచ్చినా, ఇతరుల మీద ప్రభావం బహుస్వల్పం కదా. దాదాపు లేనట్లే.

**3. తమ సవాళ్ళు ప్రతిసవాళ్ళకోసం పార్లమెంట్, శాసన సభ సభ్యత్వాలకు రాజీనామా చేసి తిరిగి పోటీ చేసి గెలుపొందుతున్నారు. మరి ఆ ఖర్చంతా ప్రజల మీదే కదా! అది దుర్వినియోగం కాదా?**

ఆర్. రామ్, ఎలూరు

జ. తప్పకుండా అది దుర్వినియోగమే, దీనికి విరుగుడు ఉప ఎన్నికకు అయ్యే ఖర్చంతా రాజీనామా చేసి, తిరిగి ఎన్నికకు నిలబడ్డ వ్యక్తి చెల్లించిన తర్వాతనే అతడు పోటీకి అర్హుడనే నియమం పెట్టడమే.

**4. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాలను I.I.T స్థాయికి అప్‌గ్రేడ్ చేసే ప్రతిపాదనను సర్కారు విరమించుకోవాలని కొందరు డిమాండ్ చేస్తున్నారు కదా! దాని వలన మనకు కలిగే నష్టమేమిటి?**

పి. రంజని, కోదాడ

జ. IIT ల ఉత్తమ స్థాయికి ఎదగడం, పేరు ప్రతిష్ఠలు సంపాయించుకుని జరగడానికి వాటికున్న స్వయం ప్రతిపత్తి, ప్రభుత్వం యొక్క రాజకీయ నాయకుల యొక్క మంత్రుల ఎం.ఎల్.ఎ ల యొక్క హస్తక్షేపం ఉండకుండా ఉండడం మూలాన ఉస్మానియా యూనివర్సిటీలో బడ్జెట్ దగ్గర నుండి, పదవుల భర్తీలు, పదోన్నతిలు విద్యార్థుల ప్రవేశంలో, అన్నింటిలో ఎన్నో రాజకీయాలున్నాయి. రాజకీయం చేద్దాం అనుకునేవారు స్వంత లాభాలను, ఇసుమంతైనా వదులుకోరాదు అనుకునేవారు అందుకే IIT స్థాయికి అప్‌గ్రేడ్ చేసే ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నారు.

**5. ప్రాంతీయ బోర్డులను ఏర్పాటు చేయాలనే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం వుంది అని విన్నాం? ఈ బోర్డులు అవసరమా? గతంలో వున్న బోర్డులు ఎందుకు రద్దు అయినాయి?**

బి. సంపత్, విజయవాడ

జ. రాజ్యాంగం యొక్క 371 (2) అధికరణానుసారం ఏ రాష్ట్రంలోనైనా ప్రాంతీయ బోర్డులను ఏర్పరచుకోవచ్చు. రాష్ట్రాలలో కొన్ని ప్రాంతాలు వెనుకబడినవి. వాటి వెనుకబాటుతనాన్ని నిర్మూలించడం కోసం ప్రాంతీయ బోర్డులను ఏర్పాటు చేయవచ్చు. మన రాష్ట్రంలో కూడా ఇవి ఒకప్పుడు ఉండేవి. వీటిని రద్దు చేయడం కూడా తెలంగాణా యొక్క వేర్పాటు వాదానికి ఒక కారణం అయింది. రాష్ట్రాలను ఏలిన రాజకీయ నాయకులలో చిత్తశుద్ధి, విజ్ఞత లోపించడం వలన ఇవి రద్దుచేయబడ్డాయి.

**6. భారత భాగవత కృష్ణుల వైశిష్ట్యమేమి?**

ఎం. నగేష్, నూజివీడు

జ. భారత, భాగవతాలలో మానవజాతికి నీతి, నియమాలు, సత్ప్రవర్తన నేర్పడానికి ఎన్నో కథలు, ఎన్నో వ్యక్తుల జీవన చరిత్రలు వున్నాయి. వాటిలోని సందేశం ఏ దేశానికి, ఏ కాలానికీ, ఏ జాతికి పరిమితంగాక, సర్వమానవాళికి ఆదర్శంగా ఉన్నాయి. అందులో మతమనే ప్రసక్తే లేదు. ధర్మం, సత్యం, నీతి, సహిష్ణుత, దైవచింతన, ఆత్మనియంత్రణ, దీక్ష అనేటటువంటి అనేకానేక గుణాలను వివరించే, బోధించే పాఠ్యాంశాలు, వ్యక్తి చిత్రణలు వున్నాయి. భారత భాగవతాలతో పాటు రామాయణం కూడా విశిష్టమైన గ్రంథమే. రామాయణానికి ప్రపంచ వ్యాప్తంగా ఎంత ప్రశస్తి ఉందంటే, అంతర్జాతీయ స్థాయిలో రామాయణాన్ని గురించి సదస్సులు థాయ్‌లాండ్, ఇండోనేషియా, ఇంగ్లాండ్, అమెరికా, రష్యాలలో జరిగాయి. రాబోయే సదస్సు యూరప్ ఖండంలోని రొమేనియాలో జరగబోతోంది. ఇక శ్రీకృష్ణుని విశిష్ఠత ఏమిటంటే, ఆయన జగద్గురువు. పోతనగారు అన్నట్లు, "బలహీనాంగులకున్, బలాధికులకున్ ప్రత్యర్థి భావోద్వేమంబులు కల్పించి, వినాశమున్ నెరపి, భూభారమున్ బాపి కృతకృత్యుండై చనియె"

కురుక్షేత్ర యుద్ధ సమయంలో అర్జునునకు కర్తవ్య పాలన స్వధర్మ నిర్వహణను కర్మఫలమును అభిలషించక చేయవలెనని బోధించారు. ఈ దివ్య బోధనయే కాదు అతను ఒక మహానాయకుడుగా, నేర్పరిగా అందరిచేత కాంక్షించబడిన



వ్యక్తిగా మెలిగాడు. భారతీయ సంస్కృతి, భారతజాతి యొక్క సజీవత్వానికి, అన్ని నాగరికతలూ నశించినా, భారతీయ నాగరికత నశించకుండా ఉండటానికి, రామాయణ, భారత, భాగవత, భగవద్గీతలే కారణాలు. వేదాలు, పండితులకు మాత్రం పరిమితమైనవి కావు. భారత, భాగవత, రామాయణాలు అందరి యొక్క అవగాహనకు మనకు ధర్మాధర్మ విచక్షణా శక్తిని బోధించి మన సన్మార్గ ప్రవర్తనకు తోడ్పడుతున్నాయి.

**7. మనదేశంలో నదుల అనుసంధానం ఎందుకు చేయలేకపోతున్నారు?**

రాజకీయ నాయకుల యొక్క అవగాహన లోపం వలన నీటిపారుదల పథకాలు రాష్ట్రాల పరిధిలో ఉండడం మూలానా, అంతరాష్ట్ర వివాదాలు పెరగడం మూలానా, నదుల అనుసంధానం జరగడం లేదు. ఈ బృహత్పథకాన్ని చేపట్టినట్లైతే కోట్లాది ప్రజలకు కొన్ని దశాబ్దాల వరకూ ఉపాధి కల్గుతుంది. దేశమంతా సుభిక్షంగా ఉంటుంది. వరదల వల్ల అనావృష్టి వల్ల కలిగే నష్టాలు చాలా వరకూ తగ్గుతాయి. నదులన్నింటినీ రాష్ట్ర పరిధిలోకి కాక, కేంద్ర ప్రభుత్వం యొక్క పరిధిలోకి తీసుకువస్తే అనుసంధానం జరగడానికి అవకాశం వస్తుంది.

**8. వార్తాపత్రికల్లో చిన్న చిన్న సంఘటనలకు కూడా రాజకీయ నాయకులు C.B.I, CBCID విచారణ జరిపించాలని, ప్రభుత్వానికి విజ్ఞప్తి, డిమాండ్ చేస్తుంటారు. వీరి పరిధిలో ఎటువంటి కేసులు వస్తాయి?**

ఎన్.చంద్రబోస్, కందూకూరు

జ. రాజకీయ నాయకులు ప్రతి సంఘటనకు న్యాయమూర్తులచేతో, C.B.I, CBCID ల చేతో విచారణ జరిపించాలని కేకలు వేయడం ఆనవాయితీ అయిపోయింది. C.B.I., CBCID లు నేరపరిశోధనలో నిష్ణాతులైన వారితో కూడి వున్నాయి కానీ, చాలా కాలం నుంచీ ఈ సంస్థలు కూడా ఏలినవారి కోరిక ప్రకారమే వారికి అనుకూలించే నివేదికలను తయారు చేస్తున్నారు కాబట్టి విచారణ వారికి అప్పచెప్పి అలజడికి తాత్కాలికంగా తెరవేయడం మాత్రమే జరుగుతుంది.

ఈ సంస్థలు కూడా పాలకుల ఇష్ట ప్రకారం జాప్యం చేస్తూ ఉండడం మూలాన, ఇంతలో ప్రభుత్వం మారడం మూలాన ఆ పరిశోధనకు పర్యవసానం లేకుండా పోతుంది.

**9. లోక్‌సత్తాని రాజకీయ పార్టీగా రూపొందిస్తున్నట్లు జయప్రకాష్ నారాయణ్‌గారు ప్రకటించారు. మరి నేడు రాష్ట్రంలో మరో పార్టీ అవసరము ఉన్నదా?**

సి.కె. బాబు, విజయవాడ

జ. ప్రస్తుతం ఉన్న అన్ని పార్టీలు ఒక వ్యక్తి యొక్క ఒక కుటుంబం యొక్క ఆధీనంలోనే ఉంటున్నాయి. వందేళ్ళుగా పైగా చరిత్ర ఉన్న పార్టీ కూడా ఒక కుటుంబ కేంద్రీకృతమై యుంది. ప్రాంతీయ పార్టీలు కూడా, ఒక వ్యక్తి, ఆ కుటుంబం యొక్క అధీనంలో ఉన్నాయి. ఎన్ని సిద్ధాంతాలు, మంత్రులు వల్లించినా అధికారం, ఆర్జన, ఆధిపత్యం పెంచుకోవడానికి మాత్రమే పనిచేస్తున్నట్లు కనిపిస్తుంది. ఉత్తర్ ప్రదేశ్‌లో ఒక కులం వారు అప్నా పార్టీని పెట్టారు. కొన్ని రాష్ట్రాలలో కొన్ని కులాల కూటములు పార్టీలుగా వెలుగుతున్నాయి. రాజకీయంలో ప్రక్షాళన జరగందే ప్రజల చేతులలోకి నిర్ణయాధికారం చేరందే, లంచగొండితనం, వృధా ఖర్చులు, సాంఘిక వైషమ్యాలు, అసమానతలు, పెరిగిపోతాయి. ఇలా జరగకుండా చేయడం కోసం, ప్రజలలో చైతన్యం తీసుకువచ్చి, రాజకీయాన్ని ఆమూలాగ్రంగా ప్రక్షాళించి, సవరిస్తాము అనే మహోత్కృష్ట ధ్యేయంతో, అలనాడు లోక్‌నాయక్, జయప్రకాష్ నారాయణ్‌గారు నవ నిర్మాణ ఉద్యమాన్ని చేపట్టినట్లు, తెలుగు నాట జయప్రకాష్ గారు లోకసత్తా అనే రాజకీయ పార్టీని రూపొందించ తలుస్తున్నారు. కృతకృత్యులైతే సంతోషమే. వారు చేస్తున్న ప్రయత్నం చాలా అవసరం. రాజకీయాలు రొచ్చు గుంటలైపోయి, సామాన్య ప్రజలకు కూడా కంపు అందిస్తున్న సమయంలో, లోక్‌సత్తా ఒక్క విద్యాధికులకు మాత్రమే పరిమితమై ఉంటుందా, లేక సామాన్య ప్రజలచే పోషించబడి, పాలక పక్షంగా ఎదుగుతుందో వేచి చూడాలి.



**10. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఎటువంటి కృషి చెయ్యాలి?**

ఎస్. సీతా, హైదరాబాద్

జ. విద్యార్థులకు చిన్నతనంలోనే మచి నడవడినీ, సత్యకాముకతను, సేవాశక్తిని, సౌభ్రాతృత్వాన్ని అలవరచుకునే వారుగా తీర్చిదిద్దేందుకు గురువులు, తల్లిదండ్రులు కృషి చేయాలి. కేవలం పరీక్షలు పాసవ్వడానికి మాత్రమే పాఠ్యాంశాలను చెప్పక, రామాయణ, భారత, భాగవతాది గాథలను, అందులోని విశిష్ట వ్యక్తుల యొక్క చరిత్రను చెప్పినట్లైతే చిన్నారులు, యువకులై ప్రౌఢులై, ఉత్తమ పౌరులుగా రాణించగలరు.

## నవంబరు 2006

**1. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అవసరమేకాని, వారిని ఆదుకొని అందరికి చదువు చెప్పించటానికి అవకాశం మనకు ఉందంటారా?**

ఎం. శ్రీరామమూర్తి, వరంగల్

జ. రాజ్యాంగ చట్టం ప్రకారం 1960 నాటికి ప్రతీ ఒక్కరికీ ప్రాథమిక విద్య ఉండాలని నిర్దేశింప బడినప్పటికీ, అందులో మనం విఫలులం అయ్యాము. కార్మికులు గాని బాలికలకు కూడా మనం విద్య నివ్వలేకపోతున్నాం. బాల కార్మికులు ఏ వర్గాలలో నుండి వస్తున్నారు? విద్య, ఉద్యోగం, సంపత్తి ఉన్న కుటుంబాలలో బాలకార్మికులు లేరు. చాల బీదవారై యుండి, విద్యలేని కుటుంబాలలోనే ఎక్కువ మంది సంతానం, వారిని పోషించలేకపోవడం వలన వారికి విద్య చెప్పకుండా ఏదో పనిలో పెట్టేయడం జరుగుతోంది. ప్రభుత్వం యొక్క ప్రథమ కర్తవ్యం అధిక సంతానాన్ని అరికట్టడం. ఈ ప్రయత్నం చేయకుండా నిరక్షరాశ్యులైన పేదల ఓట్లకోసం పార్టీలు పోటీపడుతున్నాయి. ఎంతో మంది బాలకార్మికులు, వారి తల్లిదండ్రులు ఈ వ్యవస్థకు కారణం పొట్ట నింపుకోవలసిన

పరిస్థితి అంటున్నారు. అట్టడుగున ఉన్న బీద తల్లిదండ్రులు ఏ విధంగా 5–15 మంది పిల్లల్ని పోషించగల్గుతారు. ఒక్క బాల కార్మికులేంటి ముక్కుపచ్చలారని బాలికలకు విదేశీయులతో పెళ్ళిచేసి డబ్బు గడించే, దౌర్భాగ్యం కొన్ని వర్గాలలో ఉంది. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించకోరే వారి యొక్క ప్రథమ కర్తవ్యం పోషింపలేని బీదలకు ఒకరిద్దరి కన్నా ఎక్కువ బిడ్డలు ఉండకుండా చూడడం. అలా చేస్తే ప్రతి బాల, బాలిక కూడా విద్యనభ్యసించే అవకాశం ఉంటుంది.

**2. భారతీయ విశ్వవిద్యాలయాలు, IIT లలో పరిశోధనా ప్రమాణాలు పడిపోతుండటంపై మన ప్రధాని మన్‌మోహన్‌సింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. మరి ప్రధానిగా ఆయన పరిశోధనా ప్రమాణాలు పెంచటానికి చర్యలు తీసుకోలేరా?**

పి. శ్రీకాంత్, కరీంనగర్

జ. ఒక్క ప్రధాని గారికే కాదు ప్రతీ శాస్త్రజ్ఞుడికి, ప్రతి విద్యావేత్తకు, పత్రికలు చదివే ప్రతి పౌరునకూ పరిశోధనా ప్రమాణాలు అన్నీ విద్యాలయాలలో పడిపోతున్నాయని తెలుసు. అలా పడిపోవడానికి ప్రభుత్వం యొక్క రిజర్వేషన్ పాలసీ కూడా కొంత కారణం. వెనుకబడిన వారికి, ఉపేక్షితులైన వారికి, ఉన్నత విద్యా సంస్కృతులను నేర్పే ఏర్పాట్లు చేయకుండా, వారికి రిజర్వేషన్ ద్వారా ప్రవేశాలు, పదోన్నతులూ ఇవ్వడం, పరిశోధనా పాటవాన్ని పెంచదు. మరో కారణం విలువలు, విద్య అనేది ఉద్యోగం కోసం అధిక అర్జన కోసం కాక అన్వేషణకు, పరిశోధనకూ, సాధనం అనే విలువలను మనం ఎక్కువ మంది విద్యార్థులకు అలవరచలేకపోతున్నాం. ప్రభుత్వాలు కాని, ప్రధానులుకానీ, ప్రమాణాలు పెంచలేరు. మేధాసంపత్తికి సత్యాన్వేషణకు, పరిశోధనకు సమాజంలో గౌరవం ఉంటే, పరిశోధనా సంస్థకు ఒక లక్ష్యం ఉంటే అప్పుడు మన పాటవం పెరుగుతుంది. పరిశోధకులకు తగిన వేతనాన్ని, సదుపాయాలను, మర్యాదను, గౌరవాన్ని సమాజం, ప్రభుత్వం, ఇచ్చినప్పుడు పరిశోధనా పాటవం పెరుగుతుంది.



అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాలలో, జపాన్‌లో కంపెనీలు పరిశోధనలను చేబడుతున్నాయి. దానికోసం ఎంతైనా ఖర్చుపెడుతున్నాయి. ఐఐటి వంటి విద్యా సంస్థలకు కూడా వారి రీసెర్చిని out source చేస్తూ ఆ విద్యా సంస్థలయొక్క స్థాయిని, గౌరవాన్ని పెంచుతున్నారు. అలా జరిగేటట్లు గనక మన కంపెనీలు, ప్రభుత్వాలు, కలసిపనిచేస్తే మన పాటవం పెరుగుతుంది.

**3. రాజకీయాల్లోకి మేధావులు, విద్యావేత్తలు రావాలి అంటున్నారు కదా! ప్రస్తుత రాజకీయ పరిస్థితిలో మేధావులు, విద్యావంతులు నేటి రాజకీయాలలో ఇమడగలరా?**

ఆర్.శ్రీహరి, తుని

జ. మేధావులు, విద్యావేత్తలు, రాజకీయాల్లోకి వస్తే ఎంతో మేలు వుంటుంది. కానీ, ప్రస్తుతం రాజకీయాలు ఒక ధనార్జన శక్తిగా మారిపోయినప్పుడు, ధనలాలస లేక సమాజ సంక్షేమమే కోరుకునే మేధావులకు, విద్యావేత్తలకు, రాజకీయాలలో స్థానం లేదు. వారికి కూడా బాగా డబ్బుండి, డబ్బు సంపాయించుకునే ప్రవృత్తి ఉంటేనే రాజకీయాలల్లోకి రాగలుగుతారు. వచ్చి మనగల్గుతారు. ప్రస్తుతం ఏ మేధావికాని, ఏ విద్యావేత్తకాని రాజకీయాలలోకి ప్రవేశించాలంటే ఆయన ఏ కులంవాడు, ఎంత డబ్బు ఉంది, ఆయన (పార్టీ అధినేతకు) విశ్వాసపాత్రుడుగా ప్రశ్నించని బంటుగా ఉంటాడా? ఉండడా? అని తేలిన తరువాతే వారికి టిక్కెట్ ఇస్తున్నారు.

**4. ప్రతిపక్ష పార్టీల ప్రాముఖ్యత ఎంత ఉంది? మన దేశంలో ప్రతిపక్ష పార్టీలపై మీ అభిప్రాయమేమిటండీ?**

జ. మనదేశంలో పాలక పక్షానికి, ప్రతిపక్షానికి ఏమితేడా లేదు. ఏదోవిధంగా శాసన సభలో మెజారిటీ సంపాదించుకోవడమే వాళ్ళ యొక్క లక్ష్యం. మెజారిటీ వచ్చి ప్రభుత్వం పెట్టిన తరువాత రెండు పార్టీలవాళ్ళు చేసే పనులలో స్వల్పాతి

స్వల్పమైన బేధం ఉండచ్చు కాని పద్దతులూ, వేషాలూ, కార్యాచరణ పద్ధతి ఒకటి. ప్రస్తుతం ప్రతిపక్షాలు బూతులు తిట్టి, అభాండాలు వేసి, ప్రదర్శనలు జరిపి, ప్రతిరోజూ ప్రకటనలు చేస్తూ పేపర్లలో ప్రాముఖ్యతను సంపాదించుకుంటున్నాయి. ప్రతి పక్షం వారు అరుస్తున్నారు. పాలక పక్షంవారు అర్జిస్తున్నారు. అనేభావన కలుగుతోంది.

**5. అందరూ ఎంతో గొప్పగా "మన వివాహ వ్యవస్థ"ను గురించి చెప్పుకొంటారు కాని నేడు వివాహాలు విఫలము కావడానికి కారణాలు ఏమిటి?**

రామశాస్త్రి. ఆర్, రాజమండ్రి

జ. అన్నీ దిగజారిపోతున్నట్లు, మన వివాహ వ్యవస్థ కూడా దిగజారిపోతోంది. ఇప్పుడు తాత్కాలిక వివాహాలు, విశేషించి అమెరికాలో కాలు పెట్టిన వారికి మన అమ్మాయిల్ని ఇవ్వాలనే వ్యామోహం మూలానా, ఆ వ్యక్తి యొక్క కుటుంబాల్ని, సంస్కృతిని, పేరు ప్రతిష్టను గణించకుండా పెళ్ళిళ్ళు జరుపుతున్నాం. తల్లిదండ్రులు పిల్లల యొక్క పెంపును గురించి పట్టించుకోవడం లేదు. వివాహం యొక్క దీర్ఘకాలిక ప్రయోజనాన్ని గురించి పరమావధిని గురించి పెద్దవారు చెప్పడం లేదు. చిన్నవారు ఆలోచించడం లేదు. విద్యావంతులైన యువకులు, యువతులు వివాహానంతరం కూడా స్వతంత్ర్యం కావాలంటున్నారేకాని, పరస్పరం గౌరవించుకోవాలని, ఆధారపడి ఉండాలనీ, ప్రతి విషయం మీద భేదించనప్పుడల్లా కొట్టుకోకుండా ఉండాలని అనుకోవడం లేదు. అందుకని చాలా వివాహాలు అనతికాలంలోనే విడాకులకు దారితీస్తున్నాయి. మరో విచారకరమైన విష్మయం. కన్యత్వం అవసరం లేదని, అలాగే యువకులు వివాహం ముందు బ్రహ్మచారులుగా ఉండనవసరం లేదు అనే సిద్ధాంతాలను ప్రగతి శీలురు, స్త్రీవాదులు ప్రచారం చేస్తుండటం మూలానా పెరుగుతున్న సంఖ్యలో వివాహాలు విడాకులకు దారితీస్తున్నాయి.



**6. విశ్వవిద్యాలయ స్థాయిలో మాతృభాషలో విద్యాబోధన జరగటం వాంఛనీయ మంటారా?**

జ. కొరియా, చైనా, జపాన్ వంటి దేశాలలోని విశ్వవిద్యాలయాలలో మాతృభాష ద్వారా బోధన జరుగుతుంది. కాని ఇంగ్లీష్ తప్పనిసరిగా నేర్పుతారు. నేర్చుకుంటారు. ఉత్కృష్టస్థాయికి చెందిన ఇతర భాషలకు చెందిన రచనలను తమ భాషలోకి అనువదించి అందరికీ అందుబాటులోకి తీసుకువస్తారు. అందుకని ఆ దేశాలలో ఇంగ్లీష్‌లో కాకుండా మాతృభాషలో బోధన చేసినా నష్టం లేకపోతోంది. వారి సంస్కృతియందు గౌరవం పెరుగుతోంది కాని మన దేశంలో ఎన్నో భాషలున్నాయి. ఏ ఒక్క భాషా ప్రాంతంలో కూడా తగినంత స్థాయి కలిగిన బోధకులు లేరు. ఇతర భాషల నుంచి మన దేశం యొక్క అన్ని భాషలలోకి అనువదించే వ్యవస్థ మనం కల్పించుకోలేదు. కనుక ఇంటర్‌మీడియట్ వరకు మాతృభాషలో బోధన చేసినా ఇంగ్లీష్‌ను తప్పనిసరిగా బోధించడటం, ఆ భాషలో ఉత్తీర్ణత నిర్భంధంగా ఉంచడం చేసి, డిగ్రీస్థాయిలో ఇంగ్లీష్ మాధ్యమంలో బోధన చేస్తే బాగుంటుంది. దాంతో పాటు మన ఆత్మగౌరవం కోసం, మన సంస్కృతి కోసం మాతృభాష కూడా ఒక సబ్జెక్ట్‌గా చేసి, అందులో ఉత్తీర్ణతను కూడా తప్పనిసరిగా చేయడం మంచిది.

**7. చైతన్యం అంటే తిరస్కరించడమా! లేక సంస్కరించడమా?**

సి. శాంతికుమారి, నంద్యాల

జ. తిరస్కరించడం, సంస్కరించడం రెండూ కూడా చైతన్యానికి అంగాలే. ఏవైతే సమాజ సంక్షేమానికి వ్యక్తి యొక్క ఉన్నతికి దోహదం కాదో వాటిని తిరస్కరించాలి. వేటినైతే కొంచెం మార్పు చేసుకుని కాలానుగుణంగా చేయగలమో, సంస్కరించగలమో వాటికి మార్పులతో, కూర్పులతో ఉంచుకోవాలి. ఇది చైతన్యం యొక్క స్వభావం భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్ముడు.

"కాలః కలయతామహం" అంటే మార్పులు తెచ్చే శక్తులలో తెచ్చేటటువంటి కాలాన్ని నేనే. అంటే కాలాంతరంలో మార్పులు రావడం సహజము అంటారు.

## డిశంబర్ 2006

**1. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లకు ససేమిరా అన్న పరిశ్రమ వర్గాలకు కేంద్రమంత్రులు హెచ్చరికలు జారీ చేయటం న్యాయమా?**

ఆర్. రామమోహన్ రావు, వనపర్తి

జ. కేంద్రంలోని, రాష్ట్రాలోని మంత్రులు, దాదాపు అన్ని పార్టీలు మన దేశంలో అందరికీ విద్య గరపడంలో ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వ పాఠశాలలో చదువులు, వాటి యొక్క ప్రామాణికత దాదాపు శూన్యం. అట్టడుగున ఉన్న బీదలు మాత్రం వారి పిల్లలను గవర్నమెంట్ స్కూళ్ళకి పంపుతున్నారు. అక్కడి చాలామంది టీచర్లు తమ పిల్లలను ప్రైవేట్ కాలేజీల్లో చదివించుకుంటున్నారు. 90% నాయకులనబడే వారు ఎంఎల్ఎ,ఎంపి.లు తమ పిల్లలని ప్రైవేట్ స్కూల్స్‌లోనే చదివిస్తున్నారు. దేశంలో తక్కువ రాబడి ఉన్నవారు, బీదవారు ఎక్కువ. వారి పిల్లలు మంచి స్థాయి ఉన్న విద్యకు దూరం అవడం వల్ల మెరిట్ కావలసిన పోటీ ద్వారా దొరికే ఉద్యోగాలు వాళ్ళకు లభ్యమవడం లేదు. అటువంటి ఓటర్లను మభ్యపెట్టడానికి ఆ తరగతుల ప్రజలకు రిజర్వేషన్లు కల్పిస్తామని ఒకరికి ఒకరు పోటీపడుతూ హామీలిస్తున్నారు. గవర్నమెంటులో ఉద్యోగాలు పెరగడం లేదు. పెరిగేదల్లా ప్రైవేట్ కంపెనీల్లో అందుకని ప్రైవేట్ కంపెనీల్లో కూడా రిజర్వేషన్లు కల్పిస్తామని పార్టీలు పోటీ పడుతూ వాగ్దానాలు చేస్తున్నాయి. పార్టీలుగాని, మంత్రులుగాని, ప్రభుత్వంగాని ఇంతవరకూ అనుసరిస్తూ వస్తున్న ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు పెడతాననడం వారి విధానాల దివాళాకోరుతనాన్ని చూపిస్తోంది. తమ పిల్లలకు ఉన్నత విద్య, తరువాత అమెరికా పంపడం, తాము రాజకీయంచేసి సంపన్నులవడం, ఓట్లకోసం కంపెనీల మీద పడడం. ఇది దేశానికి మంచిది కాదు. అరిష్టం. అన్యాయం. ప్రభుత్వ విద్యాలయాలను బాగుపరచాలి. విద్యా ప్రమాణాల్ని పెంచాలి. వెనుకబడిన వారికి విద్యాబోధనకై ప్రాథమిక, ఉన్నత విద్యాలయాలలో మంచి ఏర్పాట్లు చేయాలి, వసతులు కల్పించాలి.



**2. సర్కారు బడుల్లో కంప్యూటర్ విద్యను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ఎన్ని హంగులు సమకూర్చినా ప్రజలలో సర్కారు బడులపై ఆసక్తి పెరగడం లేదు ఎందువలన?**

పి. మహేష్, తెనాలి

జ. పైన చెప్పినట్లుగా ప్రభుత్వ విద్యాలయాలలో బీదలు ఎక్కువగా ఉంటున్నారు. తల్లిదండ్రులకు వారిని విద్యావంతులుగా ఎలా చేయాలో తెలియడం లేదు. ప్రభుత్వ విద్యాలయాలలోని ఉపాధ్యాయులు గురువులు గాక, జీతం కోసం పనిచేసే వారిగా ఉండడం మూలానా, చాలా వరకు వారి పిల్లలను ప్రైవేట్ స్కూళ్ళలో చదివించడం మూలానా అధికారులు నిర్లిప్తంగా ఉండటం మూలానా విద్యార్థులలో ఆసక్తిని కలిగించలేకపోతున్నారు.

**3. W.T.O అంటే ఏమిటి? దానిలో ఎన్ని దేశాలు ఉన్నాయి? దాని వలన మనకు లాభమా? నష్టమా?**

జ. W.T.O అంటే అంతర్జాతీయ స్థాయిలో వ్యాపారం జరగడం. అంటే ఎగుమతులు, దిగుమతులు చాలా వరకూ స్వేచ్ఛగా ఉండేటట్లు వాటిమీద పన్నులు భారం లేకుండా ఉండేటట్లు అన్ని దేశాలకు ఒకే విధమైన నియమాలు వర్తించేటట్లు చూసే సంస్థ W.T.O 120 మందికి పైగా దేశాలు ఇందులో సభ్యులు. మన దేశంలో వామపక్షీయులు, మన సభ్యత్వాన్ని వ్యతిరేకించేవారు. కాని కమ్యూనిష్టు చైనా నానాపాట్లు పడి 10 సం॥లలో W.T.O పెట్టిన అన్ని షరతులు అంగీకరించి సభ్యత్వం పుచ్చుకుంది. తత్ఫలితంగా ప్రపంచంలో ఎగుమతులు దిగుమతుల వ్యాపారంలో మొదటి 4 స్థానాలలో ఉంది. అపారమైన (దాదాపు 45 లక్షల కోట్ల) విదేశీ ముద్రను పోగు చేసుకోగలిగింది, సం॥నికి 4 లక్షల 50 వేల కోట్ల రూ॥లు విదేశీ ముద్రను ప్రతి సం॥ సంపాదిస్తోంది. రష్యా, వియత్నాంలు కూడా W.T.O సభ్యతం కోసం తగు అంతర్జాతీయ వ్యాపార విధానాలను చట్టాలను కూడా మార్చుకుంటున్నాయి. మన దేశానికి కూడా చాలా లాభం చేకూరుతోంది. మన ఎగుమతులు సాలీనా 20%-30%పెరుగుతూ వస్తున్నాయి.

**4. రాజకీయ అవినీతికి చరమాంకం ఎప్పుడు?**

కె.దినేష్, ఏలూరు

జ. విమర్శలతో, ప్రార్థనలతో, సభలతో, ప్రసంగాలతో అవినీతి పోదు. పౌరుల యొక్క జీవితంతో, వ్యాపార, పరిశ్రమల్లో ప్రభుత్వం యొక్క జోక్యం, పాత్ర ఎంత తక్కువగా ఉంటే అంత తక్కువ అవినీతి యుంటుంది. సొంతలాభం కొంత మానుకుని పాలకులు ప్రజల కోసం పనిచేస్తే అవినీతి తగ్గుతుంది. అన్నిటికన్నా ముఖ్యంగా ఎన్నికకై, అభ్యర్థులూ, పార్టీలు కోట్లు ఖర్చుపెట్టే అవసరం లేకుండా చేయగలిగితే, అవినీతి చాలా తగ్గుతుంది. ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీని, టెలికమ్యూనికేషన్స్‌నూ ఉపయోగించి, అభ్యర్థులు ఏమీ ఖర్చుపెట్టకుండా ఎన్నికలు ఎలా జరుపవచ్చో అని, నేను ప్రభుత్వాలకూ, పార్టీ అధినేతలకూ సూచించారు. వ్రాశాను. ఇలా జరిగితే వారికే లాభమూ ఉండదని వారు సుముఖంగా లేరు. కుతూహలం ఉన్న వారు నాకు ఇ-మెయిల్ పంపితే ఆ వ్యాసాన్ని పంపుతా (thc@satyam.com)

**5. విద్యాశాఖాధికారులు పాఠశాలల ఉత్తీర్ణత శాతం పెంచాలనీ ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు ఇస్తారు మరి విద్యా ప్రమాణాల గురించి మాట్లాడరు ఎందువలన?**

సి.రామచంద్రం, ఖమ్మం

జ. విద్యా ప్రమాణాలు పెంచాలంటే ఉపాధ్యాయులు గురువులుగా ఉండాలి. వారి పిల్లలను వారు ఉద్యోగం చేస్తున్న పాఠశాలలో చదివించాలి. ఉద్యోగం చేస్తున్న ఊళ్ళోనే వారుండాలి. జీతాలు పెంచుకోడంలో పదోన్నతులు పొందడంలో వారికి ఎంత ఆసక్తి ఉన్నదో అంతకు మించిన ఆసక్తిని విద్యార్థులకు చదువు చెప్పడంలో, వారికి బుద్ధులు చెప్పి, గుణవంతులుగా తయారుచేయడంలో చూపించాలి. ఉపాధ్యాయులందర్నీ ఇలా చేయడం కష్టం కనుక. ఏదో విధంగా మార్కులు వేసి ఉత్తీర్ణత శాతాన్ని పెంచి చూపిస్తే మంత్రులు సంతోషపడతారని ప్రభుతోద్యోగుల ఆశ. ఇలా జరుగుతూ ఉండడం మూలానే ఉత్తీర్ణత శాతం పెరుగుతోంది. ప్రమాణాలు మాత్రం అంతగా పెరగడం లేదు.



**6. మళ్లీ కలామ్ రాష్ట్రపతిగా ఉండాలని దేశంలో అత్యధికులు వాంఛిస్తున్నారు. అయితే ఇది జరిగేపనా?**

కె.కె.ఆర్, కోడాలి

జ. దేశ సౌభాగ్యాన్ని కోరే ప్రజలందరూ కలాంగారే మరోమారు రాష్ట్రపతిగా ఉండాలని భావిస్తున్నారు. కాని రాష్ట్రపతిని ప్రజలు ఎన్నుకోరు. ప్రజా ప్రతినిధులు ఎన్నుకుంటారు. (ఎం.ఎల్.ఎ, ఎం.పి.లు) రాష్ట్రపతిని ఎన్నుకుంటారు. ఈ ఎం.ఎల్.ఎ, ఎం.పి,లు తమ తమ పార్టీ యొక్క అధినేతలనే వాంచిస్తారు. అందుకని కలాంగారు తిరిగి రాష్ట్రపతి అయ్యే అవకాశాలు బహు స్వల్పం.

**7. 'భారత-అమెరిక అణు సహకార ఒప్పందంలోని అంశాలు ఏమిటి?**

జి. రామకృష్ణ, హైదరాబాద్

జ. ముఖ్యమైన అంశం అణ్వింథనాన్ని విద్యుదుత్పత్తికి మనం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవచ్చు. ప్రస్తుతం మనం చేసే అణువిద్యుదుత్పత్తి బహు స్వల్పం. మనకు సం॥నికి 1,20,000 కోట్ల రూపాయలు విదేశీ ముద్రను వెచ్చించి, విద్యుదుత్పత్తి తదితర ఊర్జ (Energy) అవసరాలకు ఆయిల్‌ను దిగుమతి చేసుకుంటున్నాం. ఆయిల్‌ధర ఒక్క డాలర్ పెరిగితే, దేశం స్థూల ఉత్పత్తి 56,000 కోట్ల రూపాయలు తగ్గిపోతుంది. మనకు తగినంత ఆయిల్ లేదు. బొగ్గు వాడకం వల్ల కాలుష్యం పెరుగుతుంది. అణు విద్యుదుత్పత్తి వల్ల అమెరికా, భారతదేశాల మధ్య సంబంధాలు మెరుగుపడతాయి. సైన్స్ టెక్నాలజీల సహకారం పెరుగుతుంది. కాని దీంతో పాటు కొంత వరకు మనం ఇతరుల నియంత్రణలోకి వెళ్ళవలసి వస్తుంది కూడా. లాభాలు, నష్టాలు బేరీజు వేసుకుంటే, మనకు కలిగే లాభమే ఎక్కువ.

**8. సోనియాగాంధీ గారు భారత్ "అగ్రరాజ్యం" హోదాపై మోజు పెంచుకోరాదని అనటంలో అర్థము ఏమిటి?**

జ. ప్రతి అగ్ర రాజ్యం యొక్క కోరిక, వ్యూహం మరెవరూ అగ్రరాజ్యం కాకూడదని, భారతదేశం ప్రపంచ జనాభాలో ద్వితీయ స్థానం కల్గి ఉంది.

రెండొందల సంవత్సరాల పూర్వం వరకు కూడా ప్రపంచంలో అత్యధిక సంపన్నదేశం. అంతకు ముందు భారతదేశం యొక్క ప్రభావం తూర్పున చైనా వరకు పశ్చిమాన యూరప్ వరకూ ఉండేది. ఇటువంటి దేశం అగ్రరాజ్యంగా గాక అడుక్కునే దేశంలా ఉండాలా! దేశభక్తి, స్వాభిమానం, ఐతిహాసిక దృష్టి ఉన్న ప్రతి భారతీయ పౌరుడు మన దేశం అమెరికా, చైనాలవలె అగ్ర రాజ్యంగా ఉండాలని, కోరతాడు. విదేశీయులు మాత్రం మనం అగ్రరాజ్యం కాకూడదనే కోరుకుంటున్నారు. మన దేశంలో కొంతమంది కూడా దేశంలో బీదతనం ఉంటేనే వారు ఓట్లు, కోట్లు సంపాయించుకోగలరు. మరికొంతమంది కొన్ని రాజకీయ సిద్ధాంతాలకు దాసులైనవారు, వారు ఆరాధించే దేశం అగ్ర రాజ్యంగా ఉండాలని మనం వారికి సహాయకులుగా లేక వారి నాయకత్వంలో మెలిగేటట్లుగా ఉండాలనుకుంటారు. మరికొంత మందికి మతపరంగా మన దేశస్థులందరూ వారి మతస్థులుగా మార్పించుకోవాలని అలా జరగాలంటే ఈ దేశం పేద దేశంగా ఉండాలని, అగ్ర రాజ్యంగా కాక, బలహీన రాజ్యంగా ఉండాలని కోరుకుంటారు.

## జనవరి 2007

**1. స్వాతంత్ర్య దినోత్సవానికి, గణతంత్ర దినోత్సవానికి గల తేడా ఏమిటి.**

కె. రాధరాణి, ఒంగోలు

జ. విభాజిత భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చింది. అయినప్పటికి మనకు బ్రిటీష్ రాణి ఎలిజబెత్‌చే నియమింపబడిన వ్యక్తి గవర్నర్ జనరల్‌గా ఉండేవారు. మొట్టమొదట మౌంట్‌బాటన్ తరువాత రాజగోపాలచారిగారు. మనకొక రాజ్యాంగ చట్టం లేదప్పటికి. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా U.K. 1935, India Independence Act 1947 1935, 1947 రెండూ కూడా బ్రిటీష్ పార్లమెంట్ అమలు చేయబడ్డ చట్టాల ప్రకారం మనం స్వరాజ్యాన్ని నడుపుకున్నాం. అంతకు కొద్దినెలలపూర్వం నుంచి మనకు



మనం ఒక రాజ్యాంగపు చట్టాన్ని (Constitution) చేసుకోవడం మొదలుపెట్టి 1950 జనవరి 26న గణతంత్ర దేశంగా ప్రకటించుకున్నాం. బ్రిటిష్ రాణీచే నియమింపబడే గవర్నర్ జనరల్ బదులు భారతదేశపు రాష్ట్రాల శాసన సభ్యులు, పార్లమెంట్ సభ్యులు కలసి ఎన్నుకొన్న వ్యక్తి గవర్నర్ జనరల్ బదులు రాష్ట్రపతిగా మన దేశానికి రాజ్యాంగ బద్ధ అధిపతి అయ్యారు. ఆ తేదీ నుండి మన సుప్రీం కోర్టు, మన శాసనసభలు అన్నీ కూడా భారతీయుల చేతనే ఎన్నుకోబడ్డం, నియమింపబడ్డం జరుగుతోంది.

**2. విశ్వవిద్యాలయాల నుండి ప్రతిభావంతులను మంత్రులుగా తీసుకునే సంప్రదాయాన్ని అమెరికా పాటిస్తోంది. ఇది మన దేశంలో కూడా అమలు చేయవచ్చా?**

వి.నర్సింహారావు

జ. మన దురదృష్టవశాత్తు మనం రాజ్యాంగ చట్టాన్ని తయారుచేసుకున్నప్పుడుగాని, తరువాతగాని, ఓట్లు వేసే వారికి గాని, శాసన సభకు, పార్లమెంట్‌కు, రాష్ట్రపతిగా ఎన్నుకోబడే వారికి ఏ కనీస విద్యార్హతలను విధించలేదు. అందుకని నిరక్షరాస్యులు కూడా శాసనసభ సభ్యులుగా, పార్లమెంట్ సభ్యులుగా, మంత్రులుగా, ముఖ్యమంత్రులుగా కూడా చలామణీ అవుతున్నారు. వాస్తవానికి ఇందిరాగాంధీ గారికి గానీ, రాజీవ్‌గాంధీకిగానీ, సోనియా గాంధీకి కానీ ఏ డిగ్రీలు లేవు. అలాగే రబ్రిదేవి, కామరాజనాడార్ గారికి మరెంతో మంది మంత్రులకు ఏ విద్యార్హతలూ లేవు. ఇటువంటి పరిస్థితులలో ప్రతిభావంతులను మంత్రులుగా తీసుకునే సాంప్రదాయం ఎలా వస్తుంది.

అల్పబుద్ధివారికి అధికారమిచ్చిన
దొడ్డవారినెల్ల తొలగచేయు
చెప్పుతినెడి కుక్క చెరకు తీపెరుగునా
విశ్వదాభిరామ వినురవేమ!

అని మహా ప్రతిభాశాలి వేమనగారు ఎప్పుడో చెప్పారు. ఆ వాస్తవాన్ని మనం ఇప్పుడు కళ్ళతో చూస్తున్నాం.

## 3. సంస్కృతి వేరు నాగరికత వేరా?

ఎన్. లింగమ్మ, విజయవాడ

జ. ఔను సంస్కృతి వేరు, నాగరికత వేరు. సంస్కృతి వ్యక్తిగతమైనది. సైన్స్, టెక్నాలజీలు, డిగ్రీలు అవసరం లేకుండానే సంస్కృతి గల వ్యక్తులు ఎందరో ఉన్నారు. ధర్మ నిష్ఠత, సత్యవాక్ పరిపాలన, మంచిని పెంచడం, ఇతరులను నొప్పించకుండా ఉండటం, వినయ విధేయతలతో మెలగడం, పెద్దల యందు గౌరవం, పిన్నల యందు వాత్సల్యం, మృదువుగా భాషించడం, భిన్నాభిప్రాయాలున్న వారికి తెగడకుండా ఉండటం, సహిష్ణుతతో మెలగడం, ఎవరినీ ద్వేషించకుండా ఉండటం, ఇవి సంస్కృతిగల వ్యక్తుల లక్షణాలు. నాగరికత అనేది సామూహిక ప్రగతిని సూచించేది. ఉదా॥ నగర వాసానికి యోగ్యంగా రక్షిత నీటి పథకాలు, భూగర్భ మురుగు నీటి కాలువలు, వాతానుకూలిత గృహాలు, విశాలమైన రోడ్లు, రైల్వేలైన్లు, ఎరోప్లేన్స్, బాంబర్లు, మోటారుకార్లు, టెలిఫోన్లు ఈ విధంగా మానవ జీవితాన్ని సుఖప్రదం చేయగల్గిన పరికరాలు, పద్ధతులు కలిగి ఉండటం నాగరికత అంటారు. సంస్కృతి వ్యక్తికి సంబంధించినది. నాగరికత సమాజానికి సంబంధించినది.

## 4. విఫలమైనది భారత రాజ్యాంగమా? మనమా?

వై. కిరణ్, విశాఖపట్టణం

జ. మన రాజ్యాంగం ప్రపంచంలోని గొప్ప రాజ్యాంగాలలో ఒకటి. దీన్ని రచించిన వారు మహామేధావులు. ద్రష్టలు, అనుభవం కలిగినవారు. కాని రాను రాను విద్యావంతులు కానివారు, దేశభక్తి లేనివారు తమ దారిద్ర్యాన్ని మాత్రం వదిలించుకోవాలనుకునే వారు, ఎన్నికల్లో ఎలా గెలుస్తామా అని మాత్రమే



ఆలోచించేవారు. చివరికి నేరగాళ్ళు అందులోనూ హత్యలు చేసినవారు, హత్య చేయడానికి కుట్రపన్నినవారు, శాసనసభ్యులై, మంత్రులై ఉండటం మూలాన మన రాజ్యాంగం ఎంతో మంచిదైనా అమలులో దాన్ని ఖూనీ చేస్తున్నాం. ఎంత వరకు దిగజారిపోయాం అంటే 110 కోట్ల ప్రజలున్న, వేలాది సం॥ల చరిత్ర ఉన్న మన దేశంలో ఇక్కడ పుట్టి చదువుకున్న వాడొక్కడు కూడా 100 ఏళ్ళపైన చరిత్ర కలిగిన ఒక రాజకీయ పక్షానికి అధ్యక్షుడుగా ఉండటానికి సమర్థత లేక, విద్యాగంధం లేని, మరే విధమైన మేధాశక్తి లేని విదేశీయ వ్యక్తిని అధినేతగా నెత్తిమీద ఎక్కించుకోవలసి వచ్చింది.

## 5. నేటి వ్యక్తులలో కళాత్మక దృష్టి, సృజనాత్మక శక్తి కొరవడటానికి కారణమేమి?

జ. మన చదువులు, సారం లేనివి అవడం ప్రథమకారణం, పరీక్షలో పాసవడానికి చదువులు, ఉద్యోగం కోసం పరీక్షలు. పోటీ పరీక్షల్లో ఉత్తమ శ్రేణులు సంపాదించడమే చదువులైనప్పుడు ప్రతీ వ్యక్తిలోను దివ్యశక్తి ఎలా ప్రస్ఫుటమౌతోంది. ఉదాత్తమైన సాహిత్యం, ఆలోచనా శక్తినిపెంచే విధంగా అధ్యయనం చేయడం, నేర్చుకోవాలి. తెలుసుకోవాలి. అనే కుతూహలంతో చదవడం, గురుకులాలలో, ప్రస్తుతం హాస్టళ్ళలో ఉండి పదిమందితో కలిసి వైవిధ్యాన్ని చవిచూసి సామరస్యంగా మెలగడం నేర్చుకున్నట్లైతే జీవితాంతం జిజ్ఞాసతో క్రొత్త విషయాలను తెలుసుకునే కుతూహలంతో ఉన్నట్లైతే సృజనాత్మక వస్తుంది. అలాగే ప్రకృతి సౌందర్యాన్ని తిలకించడంలో ఆనందం పొందితే సృష్టిలోని ఇతర జీవుల ప్రవర్తనను, జీవన సరళిని చూసి, వాటిని గురించి ఆలోచిస్తే, పర్వతాలు, నదులు, వనాలు ఎటువంటి సౌందర్యాన్ని, సౌకర్యాలను మనకిస్తున్నాయో గమనిస్తే కళాత్మక దృష్టి అలవడుతుంది. ప్రస్తుతపు విద్యావిధానంలో ఇటువంటి భావాలకు తావులేదు. అందుకనే చాలా మంది వ్యక్తులలో కళాత్మక దృష్టికాని, సృజనాత్మక శక్తిగాని లేవు.

# ఫిబ్రవరి,2007

**1. భారతావనిలో పంచవర్ష ప్రణాళికలను రూపుకల్పన చేసిందెవరు? దీని వలన జాతికి ఏమైనా లాభం**

ఎస్. వరప్రసాద్

జ. ప్రగతికి సాధనంగా పంచవర్ష ప్రణాళికలనేవి ప్రప్రథమంగా (1991 సం॥లో మాయమైన) సోవియట్ రష్యాలో మొదలైనాయి. మన దేశంలో వీటిని ప్రవేశ పెట్టింది, పాశ్చాత్య మరియు సోవియట్ ప్రభావిత వ్యామోహిత జవహర్ లాల్ నెహ్రూగారు. ఒక ప్రణాళికా బద్ధంగా ప్రగతిని సాధించడం సరియైన ఆలోచనే. కాని, ఏ పథకాన్నైతే వ్యక్తులు, వ్యక్తి సముదాయాలు అంటే కంపెనీలు నిర్వహించగలవో వాటినన్నిటినీ కూడా ప్రభుత్వోద్యోగులు చేత నిర్వహింప చేయడం వలన దేశానికి కొంత మేలు జరిగినా, ఎక్కువ హానే జరిగింది. దీనికి సాక్ష్యం 1951 సం॥నుండి 1991 వరకు నెహ్రూవియన్ సోషలిజం అనే సిద్ధాంతం కింద ప్రభుత్వ పరంగా ప్రణాళికల ద్వారా ప్రగతిని సాధిద్దామనుకుంటే మన జాతీయ, వార్షిక స్థూల ఉత్పత్తి 3%, 5% మాత్రమే ఉండేది. 1991 సం॥లో శ్రీ పి.వి. నరసింహారావుగారి పుణ్యమా అంటూ సరళీకృత ఆర్థిక విధానాలు ప్రవేశ పెట్టడం మూలాన, సోషలిజం పెట్టిన పర్మిట్ లైసెన్స్ కోటా పద్ధతి ప్రభుత్వపు కంట్రోల్ చాలా వరకూ ఉపసంహరింపబడడం మూలానా, ప్రజల చొరవతో, సాహసంతో ఎన్నో క్రొత్త సంస్థలు ఒకరితో ఒకరు పోటీ పడుతూ, మన స్థూల ఉత్పత్తిని పెంచడానికి కారకులయ్యాయి, తత్ఫలితంగా ప్రపంచానికి మిరుమిట్లు కొలిపే మన జాతీయ స్థూల ఉత్పత్తి 8% పెరుగుతూ 10%కి కూడా పెరిగే సూచనలు కన్పిస్తున్నాయి. ప్రణాళికలు సూచిక ప్రాయంగా ఉండాలే కానీ, ప్రభుత్వ వ్యవహారితమై, నియంత్రితమై అమలు చేయబడకూడదు. వ్యక్తుల యొక్క సాహసోపేత, వ్యాపార పరిశ్రమ స్థాపన, నిర్వహణలను ప్రోత్సహించే విధంగా



ప్రభుత్వం వ్యవహరిస్తే ప్రజలే తమ లాభం కోసం ఎంతో ప్రగతిని సాధించగలదు. అభివృద్ధి చెందిన ఏ ప్రాచీన దేశాలలో పంచవర్ష ప్రణాళికలు లేవు. అయినా అవి అభివృద్ధి చెంది, చెందుతూ ప్రజలకు సంపదను కల్పిస్తూ ఉన్నాయి.

**2. ఉపగ్రహాన్ని విశ్వాంతరాళానికి పంపినందువల్ల మానవాళికి చేకూరే ప్రయోజనమేమిటి?**

సి.హనుమయ్య, తిరుపతి

జ. మనం భూమిపై కొద్ది ఎత్తున నుండు, విశ్వంలోకి చూడగలగడం బహుస్వల్పం, ఉపగ్రహాలు, వ్యోమ ప్రయోగశాలలు (Space Laboratories) సౌరమండలంలోని ఉపగ్రహాలను, సౌర మండలం దాటి నక్షత్ర మండలంలో ఉన్న సృష్ట్యద్భుతాలను తెలుసుకోవడానికి వ్యోమగాములైన ఉపగ్రహాలు పనికి వస్తాయి. ప్రపంచ వ్యాప్తంగా Telivision వ్యవస్థలు ఏర్పడడానికి ఉపగ్రహాలు 1965 సం॥ నుంచి ఎంతగానో తోడ్పడుతున్నాయి. ఉపగ్రహాలలోని ప్రయోగ సహకారులతో మనం భూగోళాన్ని తిలకించగలుగుతున్నాం. వాతావరణాన్ని అధ్యయనం చేయగలుగుతున్నాం. వేలాది సం॥ల నాడు ఎండిపోయిన సరస్వతీ నదిని, పరీవాహక ప్రాంతాన్ని కనుగొన్నాం. అలాగే శ్రీరామచంద్రుడు కట్టారనుకున్న రామేశ్వరం నుంచి సింహళ ద్వారానికి ఉన్న సేతువుని సముద్ర గర్భంలో చూస్తున్నాం. అదేవిధంగా సముద్రంలో పూడిపోయిన శ్రీకృష్ణుని ద్వారకానగరాన్ని చూస్తున్నాం. ఇంకెన్నో అద్భుత వాస్తవాలను మనం తెలుసుకుంటున్నాం.

**3. మూజువాణి ఓటంటే ఏమిటండి?**

జ. శాసన సభలో, పార్లమెంట్లో తీర్మానంగాని, చట్టంగాని పాస్ అవడానికి సభ్యుల యొక్క అభిమతాన్ని రహస్యపు ఓటు వేసే విధంగాగానీ, లేక నోటిమాటతో ఎవరూ దాన్ని సమర్థిస్తున్నారు. ఎవరుదాన్ని వ్యతిరేకిస్తున్నారు. Yes/No అనండి అని సభాధ్యక్షులు అడగడం వారు చూస్తూ వుండగా ఎవరు ఎక్కువమంది Y / N అన్నారో దాని ప్రకారం తీర్మానంగాని, చట్టంగాని పాస్ అయిందా, ఆగిపోయిందా అని నిర్ణయించడాన్ని మూజువాణి ఓటు అంటారు.

**4. "దేశభాషలందు తెలుగు లెస్స" అన్నారు మరి హిందీని ఎందుకు జాతీయ భాషగా చేశారు?**

పి.ఎల్.ఎన్.ప్రసాద్, విజయవాడ

జ. తెలుగు లెస్స అన్న వారు యావత్ భారత ప్రజలు కారు; విజయనగర సామ్రాజ్యానికి రాజైన కృష్ణదేవరాయలు అప్పుడు అన్నారు. ఏ ఒక్క భాషకాని, మరే భాషకన్నా న్యూనమైనదికాదు. తాను వలచింది రంభ, మునిగింది గంగ అన్నట్లుగా ఎవరి మాతృభాష వారికి లెస్సగానే వుంటుంది. భారతదేశంలో 40% మందికి హిందీ మాతృభాష, మరో 30% మంది దాన్ని అర్థం చేసుకోగలరు. సులువుగా నేర్చుకోగలరు. కాబట్టి దాన్ని పరిపాలనా మాధ్యమ భాషగా అందరూ నేర్చుకోవాలని చెప్పారు. దానితోపాటు ఇంగ్లీష్ భాషకు కూడా గౌరవం ఇస్తున్నాము, ఇవ్వవలసిందే. ఈ రెంటికన్నా అత్యంత గౌరవం సంస్కృతికి వాహిని అయిన మాతృభాషకు ఉండాలి.

**5. రాజకీయ పార్టీలకు అనుబంధంగా ఉపాధ్యాయ సంఘాలను ఏర్పాటు చేయటం సమంజసమేనా?**

కిలారు శ్రీనివాసరరావు, చితకాని, ఖమ్మం జిల్లా

జ. రాజకీయ పార్టీలకు ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి కార్మిక సంఘాలు అనుబంధంగా ఉండడం మూలానే ప్రతి రంగం కూడా రణరంగంగా మారిపోతుంది. తమ విధులను మరచి, రాజకీయపార్టీలు తమ ప్రాభవం కోసం చేయించే ఉద్యమాల్లో, సమ్మెల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులూ నిమగ్నులై యుంటున్నారు. పోటీపడుతున్నారు. తమ విధులకు సంబంధించిన విషయాలకు మాత్రమే పరిమితమైన సంఘాలు మంచివి.



## మార్చి 2007

**1. త్వరలో మన రాష్ట్రంలో ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపనకు ప్రభుత్వం అనుమతించనున్నట్లు వింటున్నాం. దీని వలన ప్రయోజనం ఉంటుందా?**

బి. సుమన్, గుంటూరు

జ. ప్రైవేటు విశ్వవిద్యాలయాలు మనరాష్ట్రంలో, మనదేశంలో ఉంటే చదువుకోడానికి ఆర్థిక స్థోమత కనీస ప్రవేశార్హతలున్నవారికి చాలా ఉపయోగపడతాయి. ఏ విధంగా అయితే ప్రైవేటు కంపెనీలు వచ్చిన తరువాత పోటీ ఉండటం మూలాన అందరికీ ఫోనులు ఎక్కువ సంఖ్యలో, తగ్గుతున్న ధరల్లో దొరుకుతున్నాయో అదే విధంగా యూనివర్శిటీ విద్యకూడా ప్రభావితమౌతుంది. ప్రతి సంవత్సరం లక్షకు పైగా భారతీయ విద్యార్థులు అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో చదువుతూ సాలీనా 90 వేల కోట్లదాకా ఖర్చు పెడుతున్నారు. మనదేశంలో నాలుగు వందలలోపే విశ్వవిద్యాలయాలున్నాయి. మనకు కనీసం 1500 విశ్వవిద్యాలయాలు కావాలి. ప్రభుత్వం దగ్గర కావలసిన ద్రవ్యం లేదు. ఉన్నది విద్యపైగాక, తాత్కాలికోపశమనం కల్గించే, ఓటర్లను రంజింప చేసే పథకాల మీద ఖర్చుపెడుతున్నారు. గత మూడు సంవత్సరాల్లో చైనా 1250 కొత్త విశ్వవిద్యాలయాలను స్థాపించింది. విదేశీ విద్యాలయాలను కూడా తన దేశానికి ఆహ్వానిస్తోంది. కాబట్టి ప్రైవేటు యూనివర్శిటీల వల్ల మనకు మేలే జరుగుతుందని నా ఉద్దేశ్యం. మన సంస్కృతికి, దేశ అఖండతకు దేశభక్తికి నష్టం వాటిల్లకుండా ఉండే నియమాలను పెట్టి కలుగ గల హాని నిరోధించాలి.

**2, మానవుని జీవితంలో హృదయం ప్రధానమా? మెదడు ప్రధానమా?**

డి. శ్రీనివాస్, అనంతపురం

జ. హృదయం మెదడు రెండూ ప్రధానాలే. మెదడు లేనిదే సంపత్తిని సమకూర్చుకోలేం. హృదయం లేనిదే మానవీయతను సౌభ్రాతృత్వాన్ని కాపాడుకోలేం.

**3. తెలుగు విద్యార్థులు అతి తెలివైనవారు. వారి మేధ ఎంతో పదునైనది. మంచి ర్యాంకులు సంపాదిస్తూ, చదువైపోగానే రెక్కలు కట్టుకుని విదేశాలకెందుకు ఎగిరిపోతున్నారు?.... "ఏం మనదేశంలో వారికి తగిన ఉద్యోగాలు కరువయ్యాయా? తగిన జీతాలు లభించటం లేదనా."**

వి.యస్. పారజాత, హైదరాబాద్

జ. మేధావంతులైన మన పట్టభద్రులు ఇతరదేశాలకు వెళ్ళడానికి కారణాల్లో ముఖ్యమైనవి కావలసిన సంఖ్యలో ఉద్యోగావకాశాలు లేకపోవడం, ఇతర దేశాల్లో ఎక్కువ జీతాలుండడం. ఇక ముందు మరో కారణం కూడా తలెత్తుంది. అది ప్రైవేటు కంపెనీల్లో రిజర్వేషన్‌లు పెట్టడం.

**4. మన రాష్ట్ర ప్రభుత్వం "కాన్‌సెప్ట్ స్కూల్స్"ను ఏర్పాటు చేయాలని సంకల్పించింది కదా! కాసెప్ట్ స్కూల్స్ అంటే ఏమిటి? వాటి అవసరం ఉందా?**

కె. కళ్యాణి, హైద్రాబాద్

జ. దూరటానికి కంతలేదు మెడకోక డోలన్నట్టుగా ఉంది మన ప్రభుత్వం యొక్క "కాన్‌సెప్ట్ స్కూల్స్"ను ప్రారంభించాలనే పథకం. వేల సంఖ్యలో ఉన్నా ప్రభుత్వపు పాఠశాలల్లో కనీస సౌకర్యాల్లేవు, ఉపాధ్యాయుల్లేరు. ప్రభుత్వ టీచర్లు తమ పిల్లలను ప్రైవేటు ఇంగ్లీషు మీడియం కాన్వెంట్‌లలో చదివిస్తున్నారు. ఈ స్కూళ్ళలో ఉత్తీర్ణత శాతం ప్రైవేటు వాళ్ళ భాగస్వామ్యంతో కొంత ప్రభుత్వ సంపత్తి వారి కిచ్చి స్కూళ్ళను పెట్టించడమా? ఇప్పుడు చేస్తున్న దానికన్నా ఇంకేమి చేయలేమనే నిర్ణయానికి ప్రభుత్వం వస్తే ప్రైవేటు భాగస్వామ్యంలో అయినా మంచి చదువులు చెప్పే పాఠశాలల స్థాపన హర్షనీయమైనదే. కాని వాటి నిర్వహణలో యాజమాన్యంలో ప్రభుత్వాధికారులు కలుగచేసుకుంటే అటువంటి స్కూళ్ళు కూడా నిరర్థకమవుతాయి.



**5. ఢిల్లీ కేంద్రపాలిత ప్రాంతమా, దేశరాజధాని హోదా కల్గినదా/ పూర్తిస్తాయి రాష్ట్రమా?**

యం. వెంకటేశ్వర్లు, తిరువూరు

జ. ఢిల్లీ సంపూర్ణ కేంద్రపాలితమూకాదు, పూర్తిస్థాయి రాష్ట్రమూ కాదు. అక్కడ ద్వంద్వ పరిపాలన సాగుతుంది. దేశానికి అది రాజధాని.

**6. తజికిస్తాన్ భారతదేశానికి సరిహద్దు దేశమా కాదా?**

వెంకటేశ్వర్లు, తిరువూరు

జ. తజకిస్తాన్ భారతదేశానికి సరిహద్దుదేశం కాదు. కాని మనకు అనతి దూరంలో ఉన్న దేశం. భారత, తజకిస్తాన్‌ల మధ్య తక్కువ వెడల్పు గల నిడివైన పాకిస్తాన్, అఫ్ఘనిస్తాన్‌ల భూభాగాలు ఉన్నాయి.

**7. మాగ్నా కార్టా అంటే ఏమిటి? దాని పూర్వాపరాలు వివరిస్తారా?**

జ. పూర్వం ఇంగ్లాండు రాజులు తమ ఇష్టానుసారంగా యుద్ధాలు చేస్తూ ఆ ఖర్చుల కోసం ప్రజల మీద (ఆరోజుల్లో భూస్వాములే ప్రజలు) ఇష్టం వచ్చినంత పన్నులు వసూలు చేస్తుండేవారు. ఈ భారాన్ని, పీడను పడలేక విసుగెత్తి భూస్వాములందరు కలసి రాజుకు వ్యతిరేక ప్రదర్శన చేసారు. రాజుగారు యుద్ధం చేయాలన్నా కొంత పన్నులు విధించాలన్నా, ఉన్న పన్నులను ఎక్కువగాని చేస్తే వారి యొక్క ఆమోదం పొందాలని రాజుగారి మీద ఎదురులేని వత్తిడి చేసి కొన్ని హక్కులను సంపాదించుకున్నారు.

ఈ హక్కులన్నీ వ్రాత పూర్వకముగా వ్రాసి రాజుగారి ముద్ర వేయబడిన పత్రాన్ని "మాగ్నా కార్టా" అంటారు. అంటే "మహత్తరమైన (రాజ) పత్రము". ఇది 1215 (జూన్5) సంవత్సరంలో ఇంగ్లాండు యొక్క రాజు "జాన్" గారి కాలంలో జరిగింది. అప్పటి నుంచి ఎవరికైనా ఏ హక్కులు సంక్రమించినా అవి ఉటంకింపబడిన పత్రాన్ని వారి యొక్క "మాగ్నా కార్టా" అంటారు.

# ఏప్రియల్ 2007

**1. దేశంలో ప్రత్యేక ఆర్థిక మండళ్ళు (SEZ) అనే మాట తరచుగా వినపడుతోంది. అసలు ప్రత్యేక ఆర్థిక మండళ్ళు అంటే ఏమిటి? వాటి ఆశయం ఏమిటి? ఆర్థిక మండళ్ళు అంటే ఏమిటి? వాటి ఆశయం ఏమిటి? ఆర్థిక మండళ్ళు అవసరము అని మన రాష్ట్రపతిగారు అంటుంటే ప్రముఖ పర్యావరణ వేత్త "మేధాపాట్కర్" అవి ప్రత్యేక ఆర్థిక మండళ్ళు కావని, దోపిడి మండళ్ళు అని అంటున్నారు. మరి వీదిలో ఎవరివాదన సరియైనది?**

కె. సాయి, బందరు

జ. భారతదేశం ప్రపంచ స్థాయిలో ఎగుమతులు చేసే శక్తివంతమైన దేశంగా ఎదగడం అత్యవసరం. ప్రపంచీకరణ జరుగుతున్న ఈ కాలంలో మన మానవ మరియు సహజ వనరులను ఉపయోగించుకుని కోట్లమందికి ఉపాధి కల్పించాలంటే, పెరుగుతున్న సంపదను సృష్టించాలంటే అంతర్జాతీయ వ్యాపారం అత్యవసరం, మనం ఎగుమతులు చేయాలంటే వాటి నాణ్యత, ధరలు ఇతర దేశాలకన్నా వాటి నాణ్యత ఎక్కువగా, ధరలు తక్కువగా ఉండాలి. కనిష్ఠ వ్యవధిలో ఏదేశంతోనైనా సంబంధాలు పెట్టుకోవడానికి, అక్కడకు పంపించడానికీ సౌకర్యాలుండాలి. దురదృష్టవశాత్తు 50 సంవత్సరాలుగా మనం సోషలిజం అనే మత్తులో పడి పోటీ తత్త్వాన్ని అలవరచుకోకుండా, కేవలం కార్మికుల హక్కులను కాపాడేందుకే చట్టాలను చేస్తూ పరిశ్రమలకు తగినంత ప్రోత్సాహాన్నిచ్చే నియమాలను చేయకుండా వచ్చాం. ఇటువంటి వ్యాపార, వ్యతిరేక చట్టాల కబంధ, హస్తాల నుండి బయటపడడానికి దాదాపు 70సం॥లకు ముందు ప్రథమంగా స్పెయిన్ దేశంలో ప్రత్యేక ఆర్థిక మండళ్ళను ఏర్పాటు చేశారు. తరువాత కమ్యూనిస్టు పాలిత చైనాలో దెంగ్ సియత్‌పింగ్, కమ్యూనిష్టు మూఢవాదాన్ని పక్కపెట్టి, బీదతనం నుండి బయటపడి అందరూ సంపన్నులవడం కోసం సరళీకృత ఆర్థిక వ్యవస్థ





ఉండాలని, పోటీతత్వం రావాలని, ఉత్పాదకతకు సంకెళ్ళు వేసే కార్మిక చట్టాలు వర్తించని ప్రత్యేక మండళ్ళలో ఉత్పత్తులు జరిపి, విదేశాలకి ఎగుమతులు చేసి, చైనీయుల ఆదాయాన్ని త్వరగా పెంచడం కోసం, వారి కంపెనీల నాణ్యతను అభివృద్ధి చెందిన దేశాలకన్నా మిన్నగా చేయడం కోసం, పెద్ద ఎత్తున ప్రత్యేక ఆర్థిక మండళ్ళనుఏర్పరచారు. ఉత్పత్తికి, ఎగుమతులకు మరి ఇతర అన్ని వసతులు ఈ మండళ్ళలో ప్రభుత్వం –ప్రైవేటు కంపెనీల యొక్క సమిష్టి పెట్టుబడులు, బాధ్యతలతో ఏర్పాటు చేయబడుతోంది. రోడ్లు, టెలికమ్యూనికేషన్లు, విద్యుత్, సరఫరా, వసతి గృహాలు, స్కూళ్ళు, ఆసుపత్రులు మార్కెట్‌లు, రైల్వే, విమానయాన సదుపాయాలు కలుగచేయబడుతున్నాయి. చైనాలో వలె కనీసం 10 ఏళ్ళ తర్వాతైనా మనం ఈ పనిచేయడాన్ని మన ప్రభుత్వాన్ని హర్షించాలి. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబుగారి హయాంలో హైటెక్ సిటి స్థాపన చేసి బహు స్వల్ప వ్యవధిలో హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయిగల విస్తృతమైన ఐ.టి. పరిశ్రమలను, వ్యాపారాలను ఎలా స్థాపించామో గమనించండి. లక్షల మందికి ఉపాధి కలిగింది. ఈ హైటెక్‌ను మించినటువంటి సదుపాయాలు గల వందలాది ప్రత్యేక ఆర్థిక మండళ్ళు రావాలనే మన ప్రభుత్వాల పథకాలు ప్రశంసనీయమైనవి.

మేధాపాట్కర్, అరుంధతీరాయ్ కొంత వామపక్షీయ "మేధావులు" ఈ పథకాలను మొండిగా వ్యతిరేకిస్తున్నారు. ఈ 'మహనీయులకు' బీదతనం శాశ్వతంగా పోగొట్టే పథకాలకన్నా, బీదవాళ్ళకు కేవలం తాత్కాలికోపశమనం, ప్రీతిని కలిగించే ప్రణాళికలే ముద్దు, బీదవారు లేకపోతే ఎవరి తరఫున వారు ఉద్యమాలను నడిపి, దేశీయమైనవే కాక, అంతర్జాతీయ కీర్తి కిరీటాలను సంపాదించుకోగలరు.

**2. నందిగ్రామ్ ఉదంతానికి కారణాలు వివరిస్తారా?**

జ. నందిగ్రామ్ ఉదంతం భారతీయ కమ్యూనిష్టుల ఒక మేథోమథనం. త్వరిత గతిలో పెద్ద ఎత్తున పారిశ్రామికీకరణం జరుగకపోయినట్లైతే వ్యవసాయాన్ని నమ్ముకొనే గ్రామ సీమలలో ఉండే ప్రజల యొక్క ఆదాయాలు పెరగవు, పరిశ్రమలలోనూ, సేవలలోనూ నిమగ్నమైన పట్న వాసుల యొక్క తలసరి

ఆదాయం బాగా పెరిగిపోతోంది. కాబట్టి వ్యవసాయం మీద ఆధారపడేవారి మధ్య, ఇతరుల మధ్య ఎంతో అసమానతలు వస్తాయి. దీనివల్ల సామాజిక సంక్షోభం రగులుకుంటుంది. కాబట్టి పారిశ్రామికీకరణం కోసం ఎక్కడినుంచైనా సరే పెట్టుబడులను రాబట్టి,పరిశ్రమలను స్థాపించి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పనకు పశ్చిమ బెంగాల్‌లో బుద్ధదేవ భట్టాచార్య ప్రభుత్వం పూనుకుంది. ఈ ప్రక్రియలో నందిగ్రాంలో ఒక ప్రత్యేక ఆర్థిక మండలిని స్థాపించతలపెట్టారు. దానికి కావలసిన భూ సేకరణకై 95% గ్రామస్థులు ఒప్పుకున్నారు. వారందరికీ సంతృప్తికరమైన కాంపెన్‌సేషన్ చర్యలు తీసుకున్నారు. కేవలం 5% గ్రామస్థులు భూసేకరణకు ఒప్పుకోలేదు. వారికి మేధా పాట్కర్ లాంటి ఉద్యమాలే వృత్తిగా ఉన్న వ్యక్తులు వత్తాసునిచ్చి, అగ్నిలో ఆజ్యం పోస్తున్నారు. వ్యతిరేకతయే నైజంగా అలవరచుకున్న కొందరు నిరుద్యోగ రాజకీయ వ్యక్తులు ఈ 5% వ్యతిరేకులను ఉద్రిక్తులను చేస్తున్నారు. ఇటువంటి ఉద్యమాలు మన ప్రగతికి అవరోధాలే. ఈ వ్యతిరేకోద్యమంలో పత్రికలు వ్రాయడానికి ఇష్టపడని మరో సున్నితమైన సత్యం ఉంది. ఇక్కడ S.E.Z కి వ్యతిరేకత ముస్లిం నివాసుల నుండి ఎక్కువగా వస్తోంది. దాదాపు 30% నివాసులుముస్లింలట. వారికి ఒక ముస్లింమత సంస్థ ప్రాతినిధ్యం వహిస్తూ వ్యతిరేకతను, ఆ మతస్థులపట్ల వివక్ష చర్యగా వర్ణించి, ఉద్యమాన్ని తీవ్రతరం చేసింది, ప్రతిఘటనను రక్తసిక్తం చేసింది. ఈ ఉదంతం ద్వారా ప్రథమంగా పశ్చిమబెంగాల్ కమ్యూనిష్టు మేధావులలోను, తదుపరి ఇతర మార్క్సిష్టు సైద్ధాంతికులలోనూ మేధోమథనం ప్రారంభమైనది. దీని ఫలితం మంచిదిగానే ఉండవచ్చు.

**3. భారతదేశం రోజు రోజుకి ప్రజాస్వామ్యానికి దూరమవుతోంది కదా! దీని పటిష్టతకు మీరు సూచించే మార్గమేమిటండీ?**

సి. నాగభూషణం, కర్నూల్

జ. ప్రజలు జాగరూకులై, ప్రభుత్వాధికారాలలో, రాజకీయ వేత్తలలో ఉన్న భ్రష్టాచార్యాన్ని పరిపరివిధాల ఎదుర్కోవడం Right to Information Act



ను ఉపయోగించి, Public Interest వ్యాజ్యాలు వేయడం, పత్రికలలో పేరు చెప్పి భ్రష్టాచారత్వాన్ని బహిర్గతం చేయడం ఇటువంటి పద్ధతుల ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరీ బలహీనంగాకుండా చూడగలం.

## మే 2007

**1. నేడు భారతావనిలో ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలేమిటి?**

సి. నాగభూషణం, కర్నూలు

జ. చదువులు లేనీ, బీదరికంలో ఉన్న కుటుంబాలలో ఎక్కువ పిల్లలుండడం మూలానా, పెరుగుతున్న జనాభా, ఉపాధికి ఉపయోగంలేని చదువులు కావలసిన నేర్పరితనం లేకపోవడం, ఇందువల్ల నిరుద్యోగుల, అసంతృప్తుల సంఖ్య పెరుగుతూ ఉండడం, వీరి యొక్క ఓట్ల కోసం దాదాపు ప్రతి సం॥ ఏదో ఒక ఎన్నికలు జరుగుతున్న సందర్భంలో బాధ్యతా రహితంగా రాజకీయనాయకులు, పార్టీలు, ఇదీ అది ఉచితంగా ఇస్తాం అంటూ, వాగ్దానాలు చేస్తూ, దరిద్ర నారాయణోపాసకులుగా వ్యవహరించడం, తీరా ఓట్లు వచ్చి గెలిచిన తరువాత వాగ్దానాలను నెరవేర్చలేకపోవడం వల్ల అశాంతి, అక్రమ మార్గాలు, నేరాలు ఎక్కువవుతూ ఉండడం, నేరం చేసిన వారిని, బాధితులనూ కూడా రాజకీయదృష్టితో చూడడం మూలానా న్యాయం జరగకుండా ఉండడం, ప్రభుత్వం చేజిక్కించుకున్న వారు అక్రమార్జనను చేసి, చట్టాన్ని పని చేయకుండా చేయడం, ప్రభుత్వ ధనాన్ని ప్రజా సంక్షేమం పేరుతో చాలా భాగం స్వాహాచేయడం, ఇలా చేసేవారు శిక్షింపబడకుండా ఉండడం, న్యాయ వ్యవస్థ నిర్వీర్యం అయిపోవడం, లంచగొండితనం హద్దు లేకుండా పెరగడం, ఇత్యాదులు మన ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న భయంకరమైన పరిస్థితులు.

**2. మనిషిని పతనం చేసేది ఏది?**

ఆర్.కె. రావు, విశాఖపట్నం

జ. శీలం (Character) లేకపోవడం. తత్ఫలితంగా అబద్ధాలాడడం, దొంగతనాలు చేయడం, ఏనేరం చేయడానికైననూ సంకోచించకుండా ఉండడం, తల్లిదండ్రులను గౌరవించకుండా ఉండడం, పిల్లలను ఉన్నత విలువలతో పెంచకుండా ఉండడం, ప్రతి పనినీ డబ్బు విరజిమ్మి సాధించుకోవచ్చు అని అనుకోవడం, ఇటువంటి దుశ్చర్యలకు సంకోచరహితంగా పాల్పడుతారు.

**3. అతి సామాన్య గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన మీరు జాతీయ స్థాయిలో కీలకమైన భారత్ సంచార్ నిగమ్ అధిపతిగా పనిచేశారు గదా. మీరు ఆ స్థాయికి చేరుకోవటంలోని విజయ రహస్యం ఏమిటి?**

ఎన్. సుబ్బరాజు, భీమవరం

జ. ఒక గ్రామంలో పుట్టినా, తెలుగు మాధ్యమంలో చదువుకున్నా సమగ్రంగా ఎదగడానికి విజ్ఞాన, బుద్ధి వికాసాలకు ఉత్కృష్ట ఆశయాలకు కారకులు, ప్రేరకులు, హైస్కూల్‌లో విద్య చెప్పిన నిడమర్తి సత్యనారాయణ మూర్తిగారు, ఇంటర్మీడియట్‌లో నీతులు చెప్పిన పాధర్ జెరోమ్ డిసౌజాగారూ, ఇంజనీరింగ్‌లో మనో వికాసాన్ని ప్రేరేపించిన కల్నల్ శామ్యూల్‌పాల్‌గారు, వీరు నా గురువులు. కేవలం ఉపాధ్యాయులు గాని, బోధకులుగా గాని కాదు. గురువులు. సత్సాంగత్యం, ఎన్నో విషయాలను గురించి చదవాలనే కుతూహలం, నిరంతర పరిశ్రమ, ఆత్మ విమర్శన, దేశమందు, భాషయందు అనురక్తి, వాటన్నిటితో పాటు భ్రష్టాచారానికి బానిసకాకుండా ఉండడం, నిజాయితీగా పనిచేసే వారందరినీ మెచ్చుకొని, కార్మికుల సంక్షేమం కోసం నిజమైన కృషి సల్పడం, ప్రభుత్వంలో పని చేస్తున్న వారు ప్రజల యొక్క సేవలకునే మనస్తత్వం ఉండడం, ప్రభుత్వ ధనానికి, వారి సేవలకు ధర్మకర్తలుగా ఉండడం, నే చేరిన స్థానానికి మెట్లుగా పనిచేశాయి.



**4. నిన్న ప్రత్యేక తెలంగాణ, నేడు ఆంధ్ర ప్రాంతం, రేపు రాయలసీమ ఆ తరువాత ఏమిటో? ఇలా మన రాష్ట్రం ముక్కలు ముక్కలుగా విడిపోవడం సముచితమా? ఇది దేశ సమగ్రతకు భంగం కదా?**

కె.శ్రీకాంత్, హైదరాబాదు

జ. తలపులో, వలపులో, మనస్సులో, భావనలో ఏకత్వం లేకపోతే కలసి ఉండడం చాలా కష్టం. అందులోనూ సహజవనరులు, ఆర్థిక స్థితులు భిన్నంగా ఉన్నప్పుడు, దుష్టులైన రాజకీయ నాయకులు మనుషులలోని నిమ్నతమ గుణాలను ఉద్దీపింపచేసి, విభజనకు, విఘటనకు సొంతలాభం కొరకు ప్రయత్నిస్తారు. ఈ విధంగా అప్పుడప్పుడు ఉద్యమాలకు తావివ్వకుండా, సమిష్టి కుటుంబంలో కలతలు వచ్చినప్పుడు, ఏవిధంగా పెద్దలు సంపత్తిని విభజించి నష్టాన్ని తగ్గించుతారో, ఆ విధంగా ఆంధ్ర, తెలంగాణా ప్రజల చైతన్యంలో, ప్రజాస్వామ్యపరిపక్వతలో కొంత మేరకు భాషలో కూడా కోస్తా, ఆంధ్ర రాయలసీమల మధ్య పతనం తరువాత కోస్తా, రాయలసీమల తెలుగువారు, తెలంగాణా తెలుగు వారి నుంచి వేర్వేరు పాలనలు ఉండడం మూలానా కొన్ని విషయాలలో అసమానతలు పెరిగాయి. మూడు రాష్ట్రాలు అవడం మూలానా పెద్ద నష్టం లేదని భావిస్తాను. పాకిస్తాన్ వలె ప్రత్యేక సార్వభౌమ రాజ్యంలో విడిపోతామని ఎవరూ కోరుకోవడం లేదు. కాబట్టి దేశ సమగ్రతకు, ఏముప్పు వాటిల్లదు. మన సంస్కృతి,మనభాష, నదీజలాలు, రోడ్డు, రవాణా, టెలికమ్యూనికేషన్ సౌకర్యాలు వీటన్నిటికి మన మూడు రాష్ట్రాల మధ్య సమన్వయం, సదుపయోగం కోసం విశిష్టాధికారాలున్న కమిషన్స్ ఉంటే బాగుంటుంది.

## జూన్ 2007

**1. తిరుమల తిరుపతి దేవస్థానం వారు 'సామూహిక వివాహాలు' దళిత గోవిందం' కార్యక్రమాలు హిందూజాతి సమైక్యతకు దోహదకారకాలు, కాని**

**దళితగోవిందం కార్యక్రమం గురించి కొన్ని రాజకీయ వర్గాలు విమర్శలు గుప్పించడం గురించి తమ అభిప్రాయం తెల్ప విన్నపం?**

డా॥ జానుమద్ది హనుచ్ఛాస్త్రి, కడప

జ. హిందూ సమాజంలో కొంత కాలం వరకు హరిజనులనీ ఇటీవల దళితులని వర్ణింపబడేవారు సామాజిక వివక్షతకు గురిఅయ్యారు. ఇది అమానుషమని సనాతన ధర్మానికి విరుద్ధమనే స్పృహ సంఘ సంస్కర్తల బోధనలు, ఉద్యమాల ద్వారా హిందూ సమాజం గుర్తించింది. సాంఘిక రాజకీయ పరంగా, అంటరాని తనాన్ని బహిష్కృతావస్థను చట్టం ద్వారా నిషేధించాం. త్వరగా వీరినిపైకి తీసుకురావడం కోసం రిజర్వేషన్లు కల్పించాం. హిందూమతానికి ఆయువు పట్టు దేవాలయాలు, దేవాలయల్లో దళితులు ప్రవేశాన్ని అడ్డుకోకూడదని గుర్తించాం. వీరు కూడా హిందువులేనని దేవుని దృష్టిలో వారు కూడా సమానులనే స్పృహను సమాజంలో ఉధృతంగా తీసుకురావడానికి తితిదే చేపట్టిన దళిత గోవిందం ప్రశంసనీయమైనది. హిందూమతంలో కుల విద్వేషాలను పెంచి, ఆ మతస్థులను, భారతదేశాన్ని బలహీన పరిచే శక్తులు కూటములు, సముదాయాలు, బహుళజాతి రాజకీయానికి మతాలకూ కట్టుబడిన వారు దళితగోవిందాన్ని వ్యతిరేకిస్తున్నారు. అంటరానితనం, వివక్షత, బీదరికం, దేవాలయాల నుండి దూరంగా ఉంచడం వల్ల బహుళజాతీయుల, మత పరివర్తక రాజకీయ ప్రయోజనాలు, సాగగలవు, అందుకే వాటి నిర్మూలనకు దోహద పడే ప్రతి కార్యక్రమాన్ని వారు వ్యతిరేకిస్తూ ఉంటారు.

**2. మనుషుల అక్రమ తరలింపు కేసులలో రాజకీయ నాయకులు ఒక్కరిదేనా పాత్ర.**

బి. సరోజ, మెదక్

జ. మనుషుల అక్రమ తరలింపును రాజకీయనాయకులు తమ కార్యక్రమంగా తలపెట్టలేదు. కాని సమాజంలో కొన్ని అవినీతి, అక్రమార్జన, వ్యక్తులు, వర్గాలున్నాయి. వారి కార్యక్రమాలు సులువుగా సాగటానికి పార్లమెంటు సభ్యుల,



ఇతర రాజకీయ నాయకుల యొక్క అండదండలు ఉపయోగపడతాయి. మన శాసన సభల్లో ఎంతో మంది, అవినీతి పరులు, విదేశీయులు, నేరచరితులు, ప్రవేశిస్తున్నారు. నల్లధనం లేనిదే ఎవరూ ఎన్నికవడం లేదు. ఏ పార్టీలు నడపబడలేవు. అందుచే వివేకం కోల్పోయిన చట్ట సభల్లోని ప్రజాప్రతినిధులు సమాజంలోని నేరగాళ్ళకు సహకరించి, అక్రమ ధనార్జనలో పాత్రధారులవుతున్నారు. కాబట్టి అక్రమ తరలింపులో ఎన్నో రకాల నీతి విహీనులు పాత్రధారులు.

**3. నదీ జలాల విషయంలో మీ అభిప్రాయమేమిటి?**

డి. రాజారావు, విజయనగరం

జ. నదుల మానవులు సృష్టించినవి కావు. ప్రకృతి యొక్క పరిణామ క్రమంలో నదులు ఉద్భవించాయి. వాటి పరివాహక ప్రాంతాల్లో వివిధ భాషలు మాట్లాడే ప్రజలు వారి రాష్ట్రాలు ఉన్నాయి. భగవంతుడిచ్చిన నదీజలాలు ఏ ఒక్క ప్రాంతపు ప్రత్యేక సంపత్తికాదు. హ్రస్వదృష్టితో నదీజలాల వినియోగాన్ని రాజకీయం చేయడం అమానుషం. పెరుగుతున్న జనాభా దృష్ట్యా నైసర్గికమైన జలవనరులు అందరికీ తృప్తికలిగే అన్ని అవసరాలకు సరిపడే మోతాదులో లేవు. అన్ని పరివాహక ప్రాంతాలకు సముచితమైన న్యాయం జరగాలంటే, నదీజలాలు యావద్భారతం యొక్క సమిష్టి సంపదగా పరిగణింపబడి, కేంద్ర ప్రభుత్వం ద్వారా ఉపయోగంలోకి తీసుకురావడం మనమందరం కాంక్షించి, సాధించాలి.

**4. విద్యారంగంలో 'ప్రైవేటీకరణ' అవసరమా?**

అ. గోపాల్, బాపట్ల

జ. ఎన్నెన్నో కారణాల వల్ల రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు రాజ్యాంగం ఉద్దేశించిన పదిసంవత్సరాల వ్యవధితో అందరికీ విద్య గరపటానికి నిధులు లేక విఫలమైన పరిస్థితులలో ఏ విధంగా పరిశ్రమలకై సేవలకై ప్రైవేటు పెట్టుబడులను, సంస్థలను ఆహ్వానిస్తున్నామో, అదే విధంగా, విద్యారంగంలో విశేషించి, ఉన్నత, వృత్తి విద్యా రంగాల్లో ప్రైవేటు సంస్థల ప్రవేశం అత్యవసరం. ప్రభుత్వ సంస్థలను,

విద్యాలయాలను ప్రైవేటు వారికి అప్పజెప్పటం ప్రైవేటీకరణ. కాని మనం కావాలను కుంటున్నది, ప్రభుత్వం చేయవలసిన, కానీ చేయలేని పనులను ప్రైవేటు సంస్థల ద్వారా చేయించుకోవడం ప్రైవేటీ కరణం కాదు. ప్రభుత్వం, ప్రభుత్వేతర సంస్థల సహభాగిత్వం అనటం వాస్తవికతను తెలుపుతుంది.

**5. ఈ-గవర్నెన్స్ అంటే ఏమిటి?**

ఎ. నళిని, నిజామాబాద్

జ. ప్రభుత్వం ప్రతి పనిని కంప్యూటర్లను, టెలికమ్యూనికేషన్లను ఉపయోగించి చేయటాన్ని "ఈ-గవర్నెన్స్" అంటాము. ప్రభుత్వానికి కావల్సిన సమాచారాన్ని సేకరించి, సంచయించి, వినియోగించడం, ఆ సమాచారాన్ని అందరికీ అందజేయడం, ప్రభుత్వం యొక్క ఆదాయాన్నీ ఖర్చునీ, రాబడులను, చెల్లింపులను ప్రభుత్వం సేకరించి, ప్రజలకు అందించే సేవలను కంప్యూటర్లను, టెలీ కమ్యూనికేషన్‌లను ఉపయోగించి కొనసాగించడం, "ఈ-గవర్నెన్స్" అంటాము.

దీని వలన ప్రభుత్వానికి అయ్యే ఖర్చులో, పనికి పట్టే సమయంలో, పారదర్శకతలో ఎంతో మేలు జరుగుతుంది. చిత్త శుద్ధితో "ఈ-గవర్నెన్స్" అమలు చేసినట్లయితే నిరర్థక వ్యయాన్ని, అప్రయోజకతను, ఆలస్యాన్ని చాల వరకు తగ్గించవచ్చును. 'ఈ-గవర్నెన్స్' వల్ల ఎప్పటికప్పుడు లభ్యమయ్యే ఇన్ఫర్మేషన్‌ను పరిశీలించి తగు చర్యలు తీసుకున్నట్లయితే, కుంభకోణాల సంఖ్య చాలా తగ్గగలదు.

**6. గుప్తుల ఆస్థాన కవులైన నవరత్నములెవరండి?**

పెరయ్య కంకిపాడు

జ. గుప్తుల కాలంలో సంస్కృత భాష, సాహిత్యం, ప్రజా రంజకమైన, శ్రేయస్కరమైన నీతి అత్యంత ఉచ్ఛస్థాయిలో విలసిల్లింది. కాళిదాసు, దండి, విశాఖదత్త, శూద్రక, భారవి, వీరంతా ఆ కాలానికి చెందిన మహా కవులు. తమరచనల ద్వారా, పాలకులను ప్రజలనూ ఉత్తేజ పరచారు, వివేకవంతులుగా చేశారు.



## జూలై 2007

**1. అబ్దుల్ కలాం గారు రాష్ట్రపతిగా ప్రజలకు ఎటువంటి ప్రయోజనకరమైన పనులు చేశారు?**

కె.బి.కె. హైదరాబాద్

జ. అబ్దుల్ కలామ్‌గారు విద్యార్థులను, యువకులను, దేశభక్తులను ఉత్తేజింపచేశారు. విద్యా,విజ్ఞాన, సాంకేతిక రంగాలలో ఉత్కృష్టమైన అభ్యాసం చేసి, ఆవిష్కరణకర్తలుగా, పారిశ్రామికవేత్తలుగా తయారై భారత దేశంలో సంపత్తిని సృష్టించి ఒక స్వాస్థ్య, స్వచ్ఛమైన సమాజాన్ని నిర్మిద్దామని 2020 సం॥నికి భారతదేశం అత్యంత అభివృద్ధి చెందిన దేశంగా నిర్మించాలని ఒక మహత్ లక్ష్యాన్ని అందరి ముందు ఉంచి చాలా మందిని కార్యోన్ముఖులను చేశారు.

**2. కలాంగారిని గౌరవంగా దిగిపోతే మంచిదని లాలు, మిగిలినవారు రకరకాలుగా రొంపిలోకి లాగారు. ఇది న్యాయమా?**

జ. మూడవ ఫ్రంట్ నేతలు చిత్తశుద్ధి కలిగిన వారైతే మూడు నెలల నుండి రాష్ట్రపతి ఎవరు అనే ఆలోచనలు, సూచనలు వస్తుంటే తుది ఘడియల వరకు పూరుకుని, అటు ప్రతిభా పాటిల్ కలిశాక, ఇటు షెకావత్‌కి గాక ముస్లింలకు తమ సెక్యులరిజాన్ని అమ్ముకోవడం కోసం ఇటీవలే ముందుగా ఫాతీమా బీబి పేరును తరువాత ఫరూక్ అబ్దుల్లా పేరును ముందుపెట్టి వారిద్దరు తమ అంగీకారం తెల్పకపోవడం మూలాన కలాంగార్ని ముస్లింగా ఉపయోగించడం కోసం కలాం గారి పేరును సూచించి ఆయన్నీ రొంపిలోకి దింపి కొంచెం బురద అంటుకున్న తరువాత వదిలిపెట్టేశారు. ఓట్ల కోసం పాటుపడే వారి చేష్టలు ఇలాగే ఉంటాయి.

**3. ఒకనాడు మాకొద్దు ఈ తెల్లదొరతనం అన్నాం. నేడు అంతకంటే మహాఘోరంగా ఉంది. ఇలాంటి ప్రజాస్వామ్యం కోసమేనా నాటి మహాపురుషులు త్యాగం చేసింది?**

టి. సత్యానాదయణ రావు, ఖమ్మం

జ. తెల్లదొరతనం వద్దని వంచకుల, ముష్కరుల అవినీతి పరుల దొరతనాన్నే మన రాజకీయ వేత్తలు సోషలిజం అనే పేరుతో మనపైన రుద్దుతున్నారు. భారతదేశానికి స్వాతంత్ర్య ప్రదాన చట్టం బ్రిటీష్ పార్లమెంటులో చర్చకు వచ్చినప్పుడు బ్రిటన్ మాజీ ప్రధానమంత్రి విన్స్టన్ చర్చిల్‌గారు ఇలా అన్నారు. "We are handing the brightest jeel in the crown over to a band of rogues, rascals and freebooters. Those who aspire to rule India are men of straw. They will sell their brethren into penury. The Congress will drive the rupee down to mingle with the dust" Winston Churchill speaking on the Indian Independence Act 1947 in the House of Commons నాటి మహా పురుషులు ప్రకారం నడుస్తున్న దోపిడీ నల్లదొరతనం వస్తుందని ఊహించి కూడా ఉండరు. మన కర్మ కాబోలు.

**4. వివిధ బాషలు, వివిధ సంస్కృతులు, వివిధ మతాలు, కులాలు గల మన భారతదేశంలో సమైక్యత సాధ్యమంటారా?**

జె. ప్రసాద్, ఒంగోల్

జ. సమైక్యత సాధ్యమే. ఓట్ల కోసం ప్రాముఖ్యం, ప్రాధాన్యత తగ్గిపోతున్న కులతత్వాన్ని రెచ్చగొడుతున్నారు. రాజకీయ నాయకులు, పార్టీలు ఓట్లు దండుకోవడం కోసం మైనార్టీ రక్షణ అని చెప్పి ముస్లింలను భారతీయ జనజీవన స్రవంతిలోకి రానీయకుండా వారికి వేరే కళాశాలలు, వేరే హక్కులు సంఘాలు, వేరే ప్రణాళికలు, వారికి గాను ముస్లిం ఆధిక్యత ఉన్న జిల్లాలను సృష్టించడం, వారిమతానురక్తిని పెంచడం కోసం మదరసాలకు ప్రభుత్వం గ్రాంట్ లివ్వడం, వారి ఇమామ్‌లకు వేతానలివ్వడం, వారి హజ్‌యాత్రకు రూ॥500 కోట్లకుపైగా ఇవ్వడం వల్ల వారు భారతీయులుగా కాక ముస్లింలుగా యుంటున్నారు. స్వాతంత్ర్యం



రాక పూర్వం వారు మేం భారతీయులం కాదని పాకిస్తాన్ సృష్టించుకున్నా కూడా తిరిగి వారిని భారతీయులుగా ఉండనీయకుండా "ముస్లింలలాగానే ఉండండి" అని ఓట్ల వేటగాళ్ళు ఉద్భోధిస్తున్నారు. అదే విధంగా ఇప్పుడు క్రైస్తవులను కూడా అభారతీయులుగా చేయడం కోసం, ముస్లింలు పోతున్న మార్గాన్నే వారిని కూడా నడిపించడానికి ఓట్ల వేటగాళ్ళు ప్రయత్నించడం మూలానా సమైక్యతకూ అఖండతకు హాని జరుగుతోంది. కాని దేశభక్తి ఉన్న ప్రతి భారతీయ పౌరుడు ఈ ప్రమాదాన్ని గుర్తించి కులాల మైనారిటీల ప్రసక్తిలేని విద్య, పరిపాలనను చేబడితే భారతీయ సమైక్యత సాధ్యం అవుతుంది. దీనికి పునాది యుగాయుగాల నాటి మన సంస్కృతి, మన ధర్మం, మన సాహిత్యం, మన విశ్వజనీనమైన దృష్టి.

**5. యువత ఎక్కువగా నక్సలైట్లుగా మారదానికి కారణాలేమిటండి?**

ఆర్. వాణి, కరీంనగర్

జ. భారతదేశంలో 17-22 సం॥ మధ్య ఉన్నవారి సంఖ్య 16 కోట్లు. అందరి అంచనా ప్రకారం నక్సలైట్ అనబడే వారు దాదాపు 3000 మాత్రమే. కాబట్టి యువతలో ఎక్కువ మంది నక్సలైట్‌లు అవుతున్నారనుకోవడం పొరపాటు. మతబోధ చేసి కొంత మందిని ఏ విధంగా ఛాందసులుగా, జిహాదీలుగా తయారు చేస్తున్నారో, అదే విధంగా కమ్యూనిజం అనే మత్తు కొంత మంది యువకులలో పోసి, వారిని నక్సలైట్‌లుగా, రాజకీయ సిద్ధాంత ఉన్మాదులుగా తయారు చేస్తున్నారు. జిహాదీలకు, నక్సలైట్లకు సైద్ధాంతిక సామ్యం ఉంది. ఆచరణ సారూప్యత ఉంది కాని లక్ష్యాలు భిన్నం.

## ఆగస్టు 2007

**1. విద్యాలయాలలో విద్యార్థి సంఘాల విలువ ఏమిటి? వాటి ఆవశ్యకత అవసరమంటారా?**

బి. నళినీ, విశాఖపట్టణం

జ. ఇంటర్మీడియట్ విద్యవరకు ఏ సంస్థలో కూడా విద్యార్థి సంఘాల యొక్క ఆవశ్యకత కించిత్ అయినా లేదు. గ్రాడ్యుయేట్ కోర్సుల విద్యా సంస్థలో వివిధ సబ్జెక్టుల విస్తృత అవగాహన కోసం, పాఠ్య పుస్తకాలలోని అంశాలను విస్తరించి తెలుసుకోవడం కోసం సమాజంలో, ప్రజల జీవితంలో వారు చదువుతున్న విద్య ఏ విధంగా ఉపయోగింపబడుతుందో తెలుసుకోవడం కోసం ఆయా సబ్జెక్టుల్లో విఖ్యాతిగాంచిన వ్యక్తుల నుంచి నేర్చుకోవడం కోసం సైన్సుకో సంఘం, హిస్టరీకో సంఘం, సాహిత్యానికో సంఘం, వృత్తి కళాశాలలో వ్యాపారాల గురించి వివిధ ఇంజనీరింగ్ శాఖలకు సంబంధించిన సొసైటీలు ఉండాలేగానీ, విద్యాసంస్థ యొక్క నిర్వహణను గురించి పాఠ్యాంశాల గురించి, ఫీజుల గురించి, ఉద్యమాలు నడిపే సంఘాలు ఉండకూడదు. ఇప్పటికే ప్రతి రాజకీయ పార్టీ తనకు అనుబంధితమైన విద్యార్థి సంఘాలను కళాశాలలో, విశ్వవిద్యాలయాలలో స్థాపించి అలజడిని సృష్టిస్తున్నాయి. అవన్నీ రాజకీయం చేస్తున్నాయి. విశేషించి కొన్ని ఇజాలకు కట్టుబడిన పార్టీలు ఆ ఇజంలోనే శాఖోపశాఖలైన విద్యార్థి సంఘాలను స్థాపించి, విద్యాలయాలను, రాజకీయ రణరంగంగా మార్చి, విద్యా ప్రమాణాలను, విద్యాభ్యాసానికి, గురుశిష్య సంబంధాలను హాని కలుగచేస్తున్నాయి. ఈ రకపు విద్యా సంఘాలు ఉండకూడదు. మన రాజకీయ రంగంలో ఎన్నికల దగ్గర నుంచి ఎటువంటి పార్టీలచేత, స్థాపించబడి, శాసించబడుతున్న విద్యార్థి సంఘాలలో మనం చూస్తున్నాం. ఇది దుస్సహమైన, హేయమైన పరిస్థితి.

**2. మంత్రులకు కూడా ఒక నిర్ణీతమైన క్వాలిఫికేషన్ ఉండవలసిన అవసరం లేదంటారా?**

ఎన్. రాము, మంగళగిరి

జ. మంత్రులకు కూడా కొన్ని కనీస విద్యార్హతలు, నీతినియమాలుండడం ఎంతో అవసరం. మనం రాజ్యాంగాన్ని నిర్మించుకుంటున్నప్పుడు (1947-51) ఓటు వేసేవాళ్ళకీ, ప్రజాప్రతినిధులుగా ఎన్నుకొనబడే వారికి కనీస విద్య, తదితర అర్హతలు ఉండాలనే ప్రస్తావన వచ్చింది. కానీ జవహర్‌లాల్ నెహ్రూ ఈ రెండింటిని ప్రక్కకు పెట్టేయమని చెప్పడం మూలాన ఈనాటి దుస్థితి మనకు ఏర్పడింది.



**3. మంచి రాజకీయాలు మళ్ళీ రావాలని లోక్‌సత్తా జె.పి. అంటున్నారు. అది సాధ్యమా?**

పి. సూర్యారావు, కాకినాడ

జ. మంచి రాజకీయాలు మళ్ళీ రావాలని చాలా మంది కోరుకుంటున్నారు. ప్రస్తుతం ఉన్న దుష్ట రాజకీయాలు కొంతమందిని మాత్రమే సంపన్నులుగా, శక్తివంతులుగా, చాలా మందిని పలు విధములైన నేరగాళ్ళుగా వ్యవహరించడానికి వీలు చేస్తున్నాయి. అబద్ధాలు చెప్పేవారు. మంత్రి పదవులనువాడుకొని, అప్పులను ఎగొట్టేవారు, శిక్షల నుండి తప్పించుకోడానికి యం.ఎల్.ఏ/ఎం.పీలుగా ఎన్నుకోబడే వారు రాజ్యం చేస్తున్న సమయంలో మంచి రాజకీయాలు రావడం కష్టమే కాని, దుష్ట ప్రవర్తనను అంతమొందించడం, శిష్ట ప్రవర్తనను పునరుద్ధరించడం, ధర్మాన్ని నీతిని పునః స్థాపించడం, అందరి యొక్క కర్తవ్యం. భర్తృహరిగారి ఈ క్రింది పద్యాన్ని గుర్తుకు తెచ్చుకోండి.

ఆరంభింపరు నీచ మానవులు విఘ్నాయాస సంత్రస్తులై
ఆరంభించి పరిత్యజింతురు విఘ్నాయత్తులై మధ్యముల్
ధీరుల్ విఘ్నని హన్యమానులగుచున్ ధృత్యున్నతోత్సాహులై
ప్రారబ్ధార్థములుజ్జగింపరుసుమీ ప్రజ్ఞానిధుల్ కావున

**4. ప్రపంచంలో ఏడు వింతల్లో మన తాజ్‌మహల్ ఒకటి కదా. మరల కొత్తగా ఓటింగ్ పెట్టడం ఎందుకు?**

జ. మానవాళి యొక్క ప్రగతి ఏదో ఒక దశలో స్తంభించిపోదు. ఎన్నో అద్భుతమైన కట్టడాలు, టెక్నాలజీ ద్వారా సాధ్యమౌతున్నాయి. ఉదా: ఒకప్పుడు పారిస్‌లోని ఈఫిల్‌టవర్ అత్యున్నతమైన మానవాకృతి. కాని ఈనాడు దానికన్నా ఎత్తైన ఎన్నో కట్టడాలు ఆసియాలోనే వచ్చినాయి. అదే విధంగా ఎన్నో భవనాలు, సముద్రాంతర్గత సొరంగ రహదారులు వెలుస్తున్నాయి. కాబట్టి ప్రవహిస్తున్న కాలక్రమంలో ప్రపంచంలోని వింతలను పునః ప్రామాణీకరణం చేయడం సబబే. కాని ఈ చర్యను తలపెట్టింది ఒక ప్రైవేట్ వ్యక్తి. ఈ చర్య ఒక వ్యాపార పద్ధతిలో ద్రవ్య సంపాదన కోసం మాత్రమే.

**5. మన వివాహవ్యవస్థకు విశిష్ట స్థానము ఉంది కాని నేడు విడాకులకోసం కోర్టులకు వెళ్ళేవారు ఎక్కువవుతున్నారు? ఎందువల్ల?**

ఎం. కళ్యాణి, రాజమండ్రి

జ. మన సంస్కృతిలో చరిత్రలో, సంప్రదాయంలో, సమాజంలో, వివాహం ఒక పవిత్రమైన ఘట్టం. కొన్ని మతాలలో లోగా వధూవరుల మధ్య కాంట్రాక్టు కాదు. వివాహితుల, వారి సంతానం, వారి బంధువులు, సమాజం యొక్క శ్రేయస్సు కోసం వివాహం ఉద్దేశింపబడింది. జీవితాంతం ఉండే అనుబంధం వివాహం. మన పెద్దలు ఎన్నో విషయాలు ఆలోచించి, వివాహాన్ని కుదిర్చేవారు. వివాహితుల మధ్య ఉన్న కలహాలన్నిటినీ కూడా కుటుంబం బంధుమిత్రులు కలుగచేసుకోవడంతో పరిష్కరింపబడేవి. ఇటీవల మూల్యాలు క్షీణిస్తూ ఉండడం మూలాన ధనార్జన, వ్యక్తి సుఖాలు, ప్రాధాన్యతను సంతరించుకోవడం మూలానా భార్యాభర్తలలో ఏ కొంచెం విభేదం వచ్చినా 'నువ్వెంత', 'నేనెంత' అని పోట్లాడుకుంటూ పిల్లలు, తల్లిదండ్రుల యొక్క శ్రేయస్సు, కుటుంబ మర్యాదను లెక్కచేయకుండా విడాకులు తీసుకోవడం మొదలుపెడుతున్నారు. సంస్కృతికి, కుటుంబ మర్యాదకి, పిల్లల భవిష్యత్తుకు సమాజ సుస్థిరతకు ప్రాధాన్యం ఇవ్వకుండా, తమ 'సుఖం' కోసం ప్రయత్నించడం విడాకులకు ముఖ్యకారణం. దీని వల్లచాలా అనర్థాలుంటాయి. దీనికి విరుగుడు తల్లిదండ్రుల యొక్క పెంపకం, గురువుల యొక్క బోధన, సమాజం యొక్క సామూహిక నియంత్రణ.

**6. ప్రపంచంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతున్న దేశమేది?**

కె. మురళీకృష్ణ

జ. ఇంగ్లాండు, ఫ్రాన్సు, స్వీడన్, నార్వే, డెన్మార్క్, ఫిన్‌లాండ్, జపాన్, ఆస్ట్రేలియా కొంత వరకు అమెరికా నిజమైన ప్రజాస్వామ్యాన్ని జీర్ణించుకుని ఆచరణలో పెడుతున్న దేశాలు.



## BOOKS BY Dr. T.H.CHOWDARY

- ✦ THE TALES THE TELEPHONES TELL
  *(Telephone Cheppina Kathalu in Telugu-First person's narration of Telecom persons while on duty) (1981)*
- ✦ FROM AMERICA TO ANDHRA
  *(Plays with telegraph & telephone services as themes) (Telugu) (1982)*
- ✦ WE THE TELEPHONE MEN IN YOUR SERVICE
  *(Delineation of the duties, functions and work of DoT's employees) (1982)*
- ✦ RIGHT NUMBER : CHEAP SERVICE, TELEPHONES UNLIMITED
  *(Play on how telephone services are administered by techno-bureaucrats and ministers) (1983)*
- ✦ TELEPHONING RURAL AREAS OF ANDHRA PRADESH *(1987)*
- ✦ ARE YOU LISTENING?
  *(The story of his struggles in the DoT to deliver service and not merely administer rules) (1990) Rs.60/-*
- ✦ ISSUES IN TELECOM DE-MONOPOLISATION IN INDIA *(1999) Rs.100/-*
- ✦ INFORMATION AND COMMUNICATION TECHNOLOGIES INTO THE NEW MILLENNIUM (2000) *Rs.10/-*
- ✦ THE DYNASTY AND CORRUPTION (1999) *Rs.5/-*
- ✦ P-TELCOS IN INDIA : WHY DID INDIA GET THEM SO WRONG? *(2000) Rs.350/-*
- ✦ INDIA UNDER STRAIN *(2002) Rs.100/-*
- ✦ INDIA! SPEAKUP! *(2003) Rs.125/-*
- ✦ INFORMATION AND COMMUNICATION TECHNOLOGIES FOR CLASSES & MASSES (2004) *Rs.150/-*
- ✦ INDIA EXPLORATIONS (2004) *Rs.150/-*
- ✦ IN TRUE CONSCIENCE (2006) *Rs.150/-*
- ✦ TESTING TIMES (2008)
- ✦ ఆలోచించండి (Telugu) (2007); Second Print, 2008. Rs. 60/-
- ✦ మేలుకొలుపు (REVEILLE) (Telugu) (2007) Rs. 10/-
- ✦ యథేచ్ఛసి తథాకురు (Telugu) (2008) Rs. 100/-
- ✦ తమసోమ జోతిర్గమయ (Telugu) (2008)

*Journals being Edited*

- ICTs & Society (since 1992)
- Bharatiya Pragna (since 1996)
- "Secularism" Combat (since 2003)